

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 253

బుధవారం 4-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



● మిల్లెట్ ఫ్యాక్టరీ



ఆమెకు ఆర్థిక బలం

'మిల్లెట్స్‌లో పోషకాలుంటాయి. అందుకే వాటిని పునర్వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నాం' అంటున్నారు మహిళా రైతులు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి నుంచి పాడేరు వెళ్లే దారిలో మామిడిపాలెంలో మహిళలే నిర్వహిస్తున్న 'మిల్లెట్ ఫ్యాక్టరీ' ఇప్పుడు ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి ఇస్తోంది. పాడేరు, అరకు ఏజెన్సీలో పండే చిరుధాన్యాలను ప్రాసెస్ చేసి దేశమంతా మార్కెట్ చేయడమేకాక, చిరుధాన్యాలతో వివిధ రకాల రుచికరమైన వంటకాల కోసం రెస్టారెంట్ కూడా నిర్వహిస్తున్నారు.

పంట పండిన వెంటనే కొనడానికి తమను వెదుక్కుంటూ ఎవరూ రారని ముందే గుర్తించారు మామిడిపాలెం మహిళా రైతులు. పంట వేయడానికి ముందే మిల్లెట్స్‌కి మార్కెట్ ఎక్కడ ఉంది అని ఆరా తీశారు. ఆ విషయంలో ఒక ఎన్జీఓ వీరికి సహాయపడింది. మిల్లెట్స్ పండించినంత మాత్రాన ఆదాయం రాదని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చినపుడే డిమాండ్ ఉంటుందని తెలుసుకున్నారు. దానికోసం వారి ఊరి మధ్యనే 'మన్యం గ్రెయిన్స్ ఫ్యాక్టరీ' పెట్టి చిరుధాన్యాలతో సేమియా, ఇడ్లీ, దోసె పిండి తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఆ ఫ్యాక్టరీ సమీపంలో ఒక మిల్లెట్ రెస్టారెంట్ ఏర్పాటు చేసి, సజ్జల జంతికలు, జొన్నల స్నాక్స్, అరికల అప్పడాల రుచి చూపిస్తున్నారు. ఇపుడు ఇతర రాష్ట్రాల నుండి మార్కెట్ వాళ్లను వెతుక్కుంటూ వస్తుంది!

'మన్యం గ్రెయిన్స్ ఫ్యాక్టరీ' వల్ల ఏజెన్సీ రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించింది. మామిడిపాలెం చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా చిరుధాన్యాలు పండించుకొని ఇక్కడే ప్రాసెస్ చేయించుకొని లాభాలు పొందుతున్నారు. ఈ మిల్లెట్స్ మిల్ వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా రెండొందలకు పైగా మహిళలకు ఉపాధి దొరికింది.

'ఒకప్పుడు పశువులను మేపుకునే దానిని.



ఫ్యాక్టరీ ప్రత్యేకతలు

ఈ ఫ్యాక్టరీలో తొమ్మిది రకాల చిరుధాన్యాలు ప్రాసెస్ చేస్తారు. బ్రాండెడ్ ప్యాకింగ్ చేసి దాని మీద ఏ మిల్లెట్‌లో ఎలాంటి పోషకాలు ఉంటాయో స్పష్టంగా వివరాలిస్తారు ● చిరు ధాన్యాలపై పోషకాలు ఎక్కువగా ఉండే లేయర్ తొలగించకుండా కేవలం పై పొట్టు మాత్రమే మరపట్టే యంత్రాలు వీరి దగ్గర ఉన్నాయి. అందుకే మార్కెట్‌లో దొరికే వాటికంటే వీరి మిల్లెట్స్‌లో పోషకాలు ఎక్కువ. అన్నిరకాల మిల్లెట్స్‌ని ఇక్కడ ప్రాసెస్ చేయడం వల్ల రైతులు కూడా అన్ని రకాలు పండించడం మొదలు పెట్టారు. దీనివల్ల క్రాప్‌డైవర్సిటీ పెరిగింది.

మాకు దగ్గరే ఈ మిల్లెట్ ఫ్యాక్టరీ పెట్టాక ఇక్కడ పని దొరికింది. స్థిరమైన ఆదాయం వస్తోంది. దాంతో పిల్లలను చదివించుకుంటున్నాను' అన్నారు మామిడిపాలేనికి చెందిన నూకరత్నం.

'మాకు కొంతపాలం ఉన్నా దాని మీద వచ్చే పంటతో ఏడాదంతా బతకడం కష్టం అయ్యేది. కొన్నిరోజులు కూలి పనులకు వెళ్లేదానిని. అది కూడా అన్నిసార్లూ దొరికేది కాదు. ఈ ఫ్యాక్టరీలో చేరాకే మిల్లెట్స్ గొప్పతనం తెలిసింది. కనీస మద్దతు ధర దొరుకుతోంది' అని సంతోషంగా చెప్పింది విజయ.

వర్షాధార భూముల్లో అరుదైన సంపదను సృష్టించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చారు. సుస్థిర జీవనోపాధి పొంది ఏడాదికి రూ.కోటికి పైగా బిజినెస్ చేస్తున్నారు. అంతకంటే ముఖ్యమైన ఆత్మవిశ్వాసం, నమ్మకం సంపాదించారు.

– శ్యాంమోహన్

ఒక అధ్యయనం తరువాత...

పాడేరు, అరకు ఏజెన్సీలో మిల్లెట్స్ ఉత్పత్తి పెరిగింది కానీ మార్కెటింగ్ సదుపాయాలు లేవు. ప్రాసెసింగ్ సదుపాయాలు లేవు. అపుడొక అధ్యయనం చేసింది 'వాసన్' స్వచ్ఛంద సంస్థ. సామలు, సజ్జలను ఇక్కడ చిన్న చిన్న వ్యాపారులు కొని నాసిక్‌లోని ప్రాసెసింగ్ మిల్స్‌కి పంపుతున్నారు. అక్కడ ప్రాసెస్ చేసి వాటినే ఇక్కడికి తెచ్చి మన మార్కెట్‌లోకి అమ్మకానికి పెడుతున్నారు. దీనివల్ల స్థానిక రైతులకు రేటు, తూకం దగ్గర మోసాలు జరుగుతున్నాయి. ఇదంతా గమనించాక సొంతంగా ప్రాసెసింగ్ యూనిట్ పెడితే స్థానికంగా రైతులకు మేలు జరుగుతుందని గుర్తించాం. మహిళలతో మిల్లెట్ ఫ్యాక్టరీ ప్రారంభించాం' అంటారు మార్కెటింగ్ నిపుణుడు శ్రీనివాస్. ఈయన ముడిధాన్యాలను నాణ్యమైన ధాన్యాలుగా మార్చడంలో మహిళలకు సాంకేతిక సహకారం అందించారు.

లీగల్

మీరు అక్కడికి వెళ్లనవసరం లేదు

నాకు పెళ్లి అయ్యి ఏడు సంవత్సరాలవుతోంది. నా భర్త అమెరికాలో ఉద్యోగి. పెళ్లి అయిన తర్వాత నేను కూడా అమెరికాకు వెళ్లాను. అమెరికాలోనే ఒక కొడుకు పుట్టాడు. తర్వాత మాకు మనస్పర్థలు వచ్చాయి. నన్ను నానారకాల హింసలు పెట్టి అత్తింటి వాళ్లు నన్ను ఇంట్లో నుంచి తరిమేశారు. అమెరికాలో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాను. తప్పని పరిస్థితులలో తిరిగి భారతదేశానికి వచ్చేశాను. నా భర్త అమెరికాలో డైవర్స్ కేసు వేశారు అని నాకు నోటీసు వచ్చింది. ఇప్పుడు నేను అక్కడికి వెళ్లి కేసు వాదించే ఆర్థిక పరిస్థితులలో లేను. నాకు డైవర్స్ వద్దు. తగిన సలహా ఇవ్వగలరు.

– సరళ, విజయవాడ

మీ పరిస్థితి నాకు అర్థం అయింది. మీరు అమెరికాకు వెళ్ళవలసిన అవసరం లేదు. మీ పెళ్లి భారతదేశంలో జరిగింది అని చెప్పారు. పెళ్లి తర్వాత కొంత కాలం అమెరికాలో ఉన్నారు కాబట్టి అమెరికాలో కూడా డైవర్స్ కేసు వేయవచ్చు అనేది సాధారణ చట్టం. కానీ ఆ డైవర్స్ ఇండియాలో చెల్లాలి అంటే అందుకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. మీ కేసులో మీరు అమెరికా పౌరసత్వం తీసుకోలేదు అని అనుకుంటున్నాను. మీరు ఇరువురు భారతీయ పౌరులు అయి ఉండి, భారతీయ చట్టాల ప్రకారం మీ వివాహం జరిగి ఉంటే, అదనంగా రిజిస్టర్ కూడా చేయబడి ఉంటే కనుక భారతదేశంలో తగిన చర్యలు తీసుకునే వీలు ఉంది. మీ దగ్గరలోని న్యాయవాదిని కలిసి 'యాంటీ సూట్ ఇంజక్షన్' వేయమని అడగండి. అయితే మీ కేసులో యాంటీ సూట్ ఇంజక్షన్ వేయవచ్చా లేదా అనేది కేసు పూర్వపరాలు చూసిన తర్వాత నిర్ణయించవలసి ఉంటుంది. ఆ కేసు ద్వారా, మీ భర్తపై భారతీయ ఫ్యామిలీ కోర్టు ఆదేశాలు జారీ చేయవచ్చు. అతను వేరే ఏ దేశంలో కూడా మీ వివాహానికి సంబంధించిన కేసులు వేయడానికి లేదు అని కూడా కోర్టు ఆదేశాలు ఇవ్వవచ్చు. అయితే, తాత్కాలికమైన ఆదేశాలు లభించినప్పటికీ, శాశ్వతంగా మీరు కేవలం భారతదేశ కోర్టులో మాత్రమే కేసులు వేయాలి అని అన్నివేళలా కోర్టులు చెప్పకపోవచ్చు. అందుకే మీ కేసు పూర్వాపరాలు క్షుణ్ణంగా చూడాలి. ఏది ఏమైనా ప్రస్తుతానికి మీరు మీ భర్తని డైవర్స్ కేసు వేయకుండా ఆపడానికి, యాంటీ సూట్ ఇంజక్షన్ కేసు వేయండి.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

మేతకు వెళ్లిన ఆవు తిరిగి రాలేదని ముగ్గురు స్త్రీలు అడవిలోకి వెళ్లారు.
గురువారం మధ్యాహ్నం వెళితే సాయంత్రానికి దారి తప్పారు.
సిగ్నల్ లేదు. ఎటు చూసినా ఏనుగులు. రాత్రంతా అడవిలోనే.
వారి కోసం అగ్నిమాపకదళం, పోలీసులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, గ్రామస్తులు తెగించి అడవిలోకి వెళ్లారు.
'ఒక్క ఆవు కోసమా ఇదంతా' అని దాని ఓనరమ్మను అడిగితే
'నాకున్న ఏకైక ఆస్తి అదేనయ్యా' అంది.
కేరళను ఊపేసిన ఈ ఘటన వివరాలు.

జీవన పోరాటం

వారు అడవిని జయించారు



ఆ ఆవు పేరు మాలూ. ఎర్నాకుళం జిల్లాలోని కొత్తమంగళం ప్రాంతంలోని అట్టికాలం అనే అడివంచు పల్లెలో మాయా అనే 46 ఏళ్ల స్త్రీ దాని యజమాని. దాని మీద వచ్చే రాబడే ఆ ఇంటికి ఆధారం. రోజూ అడవిలోకి మేతకు వెళ్లి సాయంత్రానికి ఇల్లు చేరడం మాలూ అలవాటు. మొన్న బుధవారం (నవంబర్ 27) అది అడవిలోకి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకూ చూసిన మాయా తన ఆవు అడవిలో తప్పిపోయిందని ఆందోళన చెందింది. గురువారం మధ్యాహ్నం వరకూ అటూ ఇటూ వెతికి అడవిలోకి వెళ్లడానికి ఇరుగూ పొరుగునూ తోడు అడిగింది.



పాపం మాయా ఆందోళన చూసిన పారుకుట్టి (64), డార్లీ (56) సరే మేమూ వస్తాం అన్నారు. వారికి అడవి కొట్టిన పిండి. మధ్యాహ్నం వాళ్ల ముగ్గురూ మాలూను వెతుకుతూ కొత్తమంగళం అడవిలోకి వెళ్లారు.

అడవి ఒక్కలాగా ఉండదు

అడవిలోపలికి వెళ్లిన ఆ ముగ్గురు స్త్రీలు చాలా దూరం వెళ్లారు. సాయంత్రం నాలుగు వరకూ వాళ్ల సిగ్నల్స్ దొరికేంత దూరం వెళ్లారు. ఆ తర్వాత ఆవు కనిపించక వెనక్కు తిరిగేసరికి ఏనుగుల మంద. కొత్తమంగళం అడవుల్లో ఏనుగులు జాస్తి. వాటి నుంచి తప్పించుకోవడానికి ఆ ముగ్గురూ రెండోదారి పట్టేసరికి అక్కడ కూడా ఏనుగుల మందే. దాంతో భయపడి మూడోదారిలోకి మళ్లారు. కాని ఈసారి ఒంటరి ఏనుగు కనిపించింది. ఏనుగుల మంద కంటే ఒంటరి ఏనుగు చాలా ప్రమాదం. వారు దారి మార్చుకుని నాలుగో దారి పట్టేసరికి దారి తప్పారు. అడవి లోపల తన రంగులు మార్చుకుంటూ ఉంటుందని అటవీ శాఖ వారు అంటారు. లోపల అడవంతా ఒక్కలాగే ఉంటూ కనికట్టు చేస్తుంది. అలా తెలిసిన దారే అనుకుని తెలియని దారిలో అడుగుపెట్టి వారు దారి తప్పారు.

మొదలైన అన్వేషణ

ఊళ్లోని ముగ్గురు స్త్రీలు అడవిలోకి వెళ్లి తప్పిపోయారనే సరికి అట్టికాలంలో గగ్గోలు రేగింది. వెంటనే కబురు మీడియాకు చేరేసరికి వార్తలు మొదలైపోయాయి. తక్షణం ఫైర్ అండ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, పోలీసులు రంగంలోకి దిగారు. ఫైర్ అండ సేఫ్టీ వాళ్లు 15 మంది ఒక టీమ్ చొప్పున నాలుగు బృందాలు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు 50 మంది, వీరితో కలిసి తోడుగా వెళ్లిన గ్రామస్తులు, డ్రోన్లు... ఒక సినిమాకు తక్కువ కాకుండా అన్వేషణ మొదలైంది. 'అడవిలో ఆ సమయంలో వెళ్లడం ప్రమాదం. ఏనుగులు చూశాయంటే అటాక్ చేసి చంపేస్తాయి. మా టీమ్‌లు రెండు వెనక్కు వచ్చేశాయి. ఒక టీమ్ ఒక షెల్టర్‌లో రాత్రి గడిపి తెల్లవారు జామున వెతకాల్సి వచ్చింది' అని ఫారెస్ట్ అధికారి తెలిపారు.

స్మగ్లర్లు అనుకుని

ఆ ముగ్గురు స్త్రీలు 15 గంటల అన్వేషణ తర్వాత శుక్రవారం ఉదయం 7.30 గంటలకు రెస్క్యూటీమ్‌కు కనిపించారు. కాని వాస్తవంగా వారు ఆ రాత్రే దొరకాల్సింది. 'మేము ఆ ముగ్గురు స్త్రీలను వెతుకుతూ మమ్మల్ని గుర్తించడానికి అక్కడక్కడా మంటలు వేశాం. ఏనుగులను చెల్లాచెదురు చేయడానికి టపాకాయలు కాల్చాం. టార్చ్‌లైట్ల వెలుతురు కూడా దూరం వరకూ వేశాం' అని అటవీ అధికారి చెప్పారు. 'అయితే మేము ఆ టార్చ్‌లైట్‌ను దూరం నుంచి చూశాం. అడవిలోకి వచ్చిన వారు పోలీసులో, స్మగ్లర్లో ఎలా తెలుస్తుంది. ఆ సమయంలో స్మగ్లర్లకు దొరికితే అంతే సంగతులు. అందుకే మేం లైట్ వెలుగులు చూసినా చప్పుడు చేయకుండా ఉండిపోయాం' అని ఆ ముగ్గురు స్త్రీలు చెప్పారు.

రాతిబండ మీద రాత్రంతా

'మేము ఏనుగుల మధ్య ఇరుక్కుపోయామని అర్థం చేసుకున్నాం. అప్పటికే చీకటి పడిపోయింది. అందుకని ఇక రాత్రి కదలకూడదని అనుకున్నాం. అదృష్టవశాత్తు ఒక పెద్ద బండరాయి కనిపించింది. ఏనుగులు అవి ఎక్కలేవు. ఒక వేళ తొండం విసిరినా ఎడంగా జరిగేంత వెడల్పుగా ఆ రాతి అంచు ఉంది. మేము దాని మీదకు చేరాం. అప్పటికే మాకు చాలా దాహంగా ఉంది. పారుకుట్టి వయసులో పెద్దది కనుక నడవలేకపోయింది. డార్లీ అలసిపోయింది. నేను వాళ్లతో ఉండిపోయాను. ఆ రాయి మీదకు ఏనుగులు రావుగాని చిరుతలు, అడవి పందులు రాగలవు. ఆ భయం ఉన్నా మేం రాయి మీదే ఉండిపోయాం. అడవిలో ఎంత చీకటిగా ఉంటుందంటే కేవలం స్పర్శ ద్వారానే మేము ముగ్గురం ఒకే దగ్గర ఉన్నామని ఒకరికొకరం చెప్పుకుంటూ వచ్చాం' అని తెలిపింది మాయా.

వారు అడవిని జయించారు

గతంలో తెలుగులో రచయిత కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు' అనే నవల రాశారు. ఆ నవలలో తన పంది తప్పిపోతే ఒక వృద్ధుడు అడవిలోకి వెళతాడు రాత్రిపూట. అనేక ప్రమాదాలు జయించి తిరిగి వస్తాడు. ఈ ఘటనలో కూడా ఈ ముగ్గురూ అనేక ప్రమాదాలు దాటి తిరిగి వచ్చారు. వారి కోసం అంబులెన్సులు, వైద్య సహాయం సిద్ధంగా ఉంచినా వాటి అవసరం రాలేదు.

మరి ఇంతకీ మాలూ అనే ఆ ఆవు?

వీరిని వెతకడానికి పెద్ద హడావిడి నడుస్తున్నప్పుడే అంటే గురువారం సాయంత్రం అది ఇంటి దగ్గరకు వచ్చి అంబా అంది. కొడుకు దానిని కట్టేసి తల్లి కోసం అడవిలోకి పరిగెత్తాడు. అదన్న మాట.

'ఆర్ఎమ్‌పి ఫ్లవర్స్' అధినేత 14 ఏళ్ల పూజిత. ఆర్‌డీవై ఫ్రేమర్స్ యజమాని యశస్వి. ఎకో ఫ్రెండ్లీ షాంపూ తయారీతో ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనే ఆలోచనలో ఉన్నాడు మహబూబ్. వీళ్లందరూ స్కూల్ విద్యార్థులే. వీళ్లలో ఎవరూ సంపన్నులు కాదు. పారిశ్రామిక వేత్త కావాలనే ఆలోచనే వారి మూలధనం. మరో విషయం... వీళ్లెవరూ తల్లిదండ్రుల సంరక్షణలో పెరుగుతున్న పిల్లలు కాదు. హైదరాబాద్‌లోని టచ్ ఫౌండేషన్ ఆర్ఫనేజ్‌లో పెరుగుతున్న అనాథ పిల్లలు.

టీన్‌ప్రెన్యూర్స్

పూజిత తొమ్మిదవ తరగతి. ఆమె తల్లిని, ఒక చెల్లిని తండ్రి పాశవికంగా హతమార్చాడు. ఆ సంఘటనతో పూజిత చెల్లితోపాటు టచ్ ఫౌండేషన్‌కు వచ్చింది. ఆర్ఫనేజ్‌కు వచ్చిన తర్వాత కూడా మిగిలిన పిల్లలతో కలవకుండా విచారంగా, కోపంగా ఉండేది. ఒంటరిగా గడిపేదని తెలియచేశారు నిర్వాహకులు విజయ్‌కుమార్. అలాంటి పూజిత ఈ రోజు 'నేను చాలా సంతోషంగా ఉన్నాను. నా కాళ్ల మీద నేను నిలబడగలననే



ఆత్మవిశ్వాసంతో ఉన్నాను' అని చెప్తోంది. ఆశ్రమం ఆవరణలో ఉన్న పూలు, ఆకులతో బొకేలు చేసి అమ్మవచ్చని స్నేహితులకు చెప్పి వారిని ప్రోత్సహించింది పూజిత. అలా ఓ చిన్నపాటి వ్యాపారవేత్తగా మారింది.

ఇక యశస్వి విషయానికి వస్తే... 'హైదరాబాద్‌లో జరిగిన 2024 స్టార్టప్ ఫెస్టివల్‌లో ఐదు ఫొటోఫ్రేములు అమ్మగలిగాను. ఈ నంబర్ చిన్నదే కావచ్చు. ఈ ఈవెంట్‌లో పాల్గొనడం వల్ల వచ్చిన ఆత్మవిశ్వాసం చాలా పెద్దది. నా ఉత్పత్తుల గురించి కస్టమర్‌కి ప్రెజెంటేషన్ ఇవ్వడం ద్వారా నేర్చుకున్న మెళకువలను అమలు చేయడం తెలుసుకున్నాను' అంటోంది.



ఆమె తల్లిదండ్రులను కోవిడ్ పొట్టన పెట్టుకుంది. బంధువులు యశస్విని, ఆమె సోదరుడిని ఆర్ఫనేజ్‌కు తీసుకు వచ్చారు. రీ యూజ్డ్ మెటీరియల్‌తో ఫొటోఫ్రేములను చేస్తోంది యశస్వి. స్నేహితులతో కలిసి పేపర్, కార్డ్‌బోర్డ్, రాళ్లు వంటి తమకు అందుబాటులో ఉన్న వస్తువులకు తమ క్రియేటివిటీ జోడించి ఫొటోఫ్రేములను తయారుచేస్తోంది. మహమ్మద్ మహబూబ్ పదవ తరగతి విద్యార్థి. అతడు తామున్న హోమ్ ఆవరణలో ఉన్న కుంకుడు కాయలతో ఎకో ఫ్రెండ్లీ షాంపూ తయారు చేసి సమీపంలో ఉన్న దుకాణాలకు సప్లయ్ చేయాలనుకుంటున్నాడు. పిల్లల్లో వ్యాపారవేత్త కావాలనే ఆలోచనను ప్రోత్సహించడానికి 'యంగ్ టింకర్ ఫౌండేషన్' ఒక్కో స్టూడెంట్‌కి వెయ్యి రూపాయలిస్తోంది. ఆ డబ్బుతో ఏం చేయాలి, ఆ డబ్బును పెట్టుబడిగా పెట్టి తిరిగి మరింత డబ్బు సంపాదించడం ఎలా? ఇందుకోసం వారి బుర్రల్లో ఎలాంటి ఆలోచనలు ఆవిష్కరిస్తాయనే అంశాలను పిల్లలకే వదిలేస్తారు. ఈ ప్రయత్నంలోనే పూజిత కు ఫ్లవర్ బొకే ఆలోచన వచ్చింది. యశస్వికి ఫొటో ఫ్రేములు చేయాలనిపించింది. మహబూబ్ షాంపూ తయారు చేయాలనుకున్నాడు. పిల్లలకు అవకాశం ఇస్తే వారి మెదళ్లు ఎంత చురుగ్గా ఆలోచిస్తాయో తెలియచేసే గొప్ప నిదర్శనం ఇది.

● గోవా మ్యూజియం

బీచ్‌ని బీట్ చేస్తోంది



శారదా కేర్కర్

గోవా కళాప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కించిన మహిళ శారదా కేర్కర్. ఆమె యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీలో పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ చేసింది. సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో స్పెషలైజేషన్ చేసింది. ఇండియాకి వచ్చి గోవాలో మ్యూజియం ఆఫ్ గోవా (ఎంఓజీ)కి చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. చిల్డ్రన్ ఆర్ట్ స్టూడియో స్థాపించి పిల్లలకు కళారంగం కోసం కొంత సమయాన్ని కేటాయించే అవకాశం కల్పించింది. కళారంగంలో ఉపాధి పొందడానికి అవసరమైన భరోసా కల్పిస్తూ కళాసాధనను లాభదాయకమైన వృత్తిగా మార్చింది.



గోవా రాష్ట్రాన్ని కళలు, కళారంగం, వాటికి మార్కెట్ కల్పిస్తూ సామాజిక వ్యవస్థాపనల దిశగా నడిపిస్తోంది శారదాకేర్కర్. సాహిత్యం, రంగస్థలం, విజువల్ ఆర్ట్స్, సంగీతం, నాట్యరీతులను సుసంపన్నం చేయడానికి ఆమె చేస్తున్న ప్రయత్నం మంచి ఫలితాలనిస్తోంది. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులను ఒక్కో విభాగాన్ని ఒక్కో కేటగిరీగా వర్గీకరించి వారి కళారూపాల ప్రదర్శనలను నిర్వహిస్తోందామె. అలాగే సాంకేతికత సహకారంతో సృజనాత్మక రంగంలో ఎన్ని ప్రయోగాలు చేయవచ్చనేది ఆచరణలో చూపిస్తోంది. గ్రాఫిక్ డిజైనింగ్, ఫ్యాషన్, ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, గేమింగ్, ఆర్ట్ డైరెక్షన్, సౌండ్ ఇంజనీరింగ్ వంటి సృజనాత్మకమైన ఉపాధి రంగాలను కళల విభాగంలోకి తీసుకువస్తూ కళారంగాన్ని విస్తరిస్తోంది శారద కేర్కర్.

గడచిన తొమ్మిదేళ్లలో 600 మంది హస్తకళాకారులు తమ ఉత్పత్తులతో ఎమ్ఓజీ నిర్వహించిన ఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నారు. దివ్యాంగులైన కళాకారుల చిత్రాలతో 'ఆర్ట్ ఇంక్', పిల్లల చిత్రాలతో 'ఏ వరల్డ్ ఆఫ్ మై ఓన్', మహిళా చిత్రకారులతో 'అన్ఎర్త్‌డ్' చిత్రకళా ప్రదర్శనలను నిర్వహించింది శారద. ఎమ్ఓజీని రోజుకు 200 మంది సందర్శిస్తారు.

సంస్కృతి ప్రతిబింబాలు

మ్యూజియం ఆఫ్ గోవా కోసం శారద పాతిక మంది గోవా ఆర్టిస్టులు చిత్రించిన గోవా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చిత్రాలను సేకరించింది వీటిని ఎమ్ఓజీ నిర్వహించే ప్రతి ఎగ్జిబిషన్‌లోనూ ప్రదర్శిస్తారు. ప్రస్తుతం 'హోమోలూడెన్స్: ద ఆర్ట్ ఆఫ్ ప్లే' ప్రదర్శన జరుగుతోంది. అందులో గోవా ఆర్టిస్టులతో పాటు అనేక రాష్ట్రాలు, నెదర్లాండ్ దేశం నుంచి కూడా ఆర్టిస్టులు మొత్తం వంద మంది చిత్రకారుల కళారూపాలున్నాయి. బీచ్ కంటే మ్యూజియం సందర్శనలోనే ఎక్కువ ఎంజాయ్ చేశాం అని ఫీడ్ బ్యాక్ బుక్‌లో రాస్తున్నారు. ఏడాదికి పదివేల మంది స్టూడెంట్స్ సందర్శిస్తున్నారు. వాళ్లు సమకాలీన కళలతోపాటు గోవా చరిత్రను తెలుసుకుంటున్నారు.

కళాకృతులకు మార్కెట్ వేదిక

గడచిన ఎనిమిదేళ్లుగా ప్రతి ఆదివారం ఎంఓజీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు వివిధ రంగాలకు చెందిన నాలుగు వందల మంది నిపుణులు హాజరై ప్రసంగించారు. ఆర్ట్, ఆర్కిటెక్చర్, సైన్స్, మేనేజ్‌మెంట్, బిజినెస్, ఎన్విరాన్‌మెంట్, పాలసీ మేకింగ్, యాక్టివిజమ్ అంశాల్లో కళాకారులకు సమగ్రమైన అవగాహన కల్పించారు. 'ఆమి గోవా' నాన్ ప్రాఫిట్ సోషల్ ఎంటర్‌ప్రైజ్ ద్వారా అల్పాదాయ వర్గాల మహిళలు తయారు చేసే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉత్పత్తులను విక్రయించడానికి ఒక వేదిక ఏర్పాటు చేసింది శారద. ఇందులో మహిళల స్వావలంబన సాధికారత, గోవా సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ అనే రెండు రకాల ప్రయోజనాలు నెరవేరుతున్నాయి. స్వయం సహాయక బృందాల మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. శారద కేర్కర్ చొరవతో గోవా హ్యాండీక్రాఫ్ట్స్ ఇండస్ట్రీ కొత్త రూపు సంతరించుకుంటోంది.

బ్యూటిప్స్

పాలు, పూలతో మేని నిగారింపు

కొంతమందికి చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. నేచురల్ ప్యాక్‌లు కూడా అన్ని రకాలు సరిపడవు. అలాంటి వారు ఒక టేబుల్ స్పూను తాజా గులాబి రెక్కల పేస్టును ముఖానికి అప్లయ్ చేసి, ఆరిన తర్వాత వేడి నీటితో కడగాలి. తాజా గులాబి రెక్కలు లేనప్పుడు ఎండు రెక్కలను వేడినీటిలో మరిగించి చల్లారిన తర్వాత ఆ



నీటిని ముఖానికి పట్టించవచ్చు లేదా నీటితో సహా రెక్కలను గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని ప్యాక్ వేయవచ్చు. ఇది చర్మానికి టోనర్‌గా పని చేస్తుంది. బలహీన పడి సాగి ముడతలు పడిన చర్మం తిరిగి యథాస్థితికి చేరుతుంది. ఈ ప్యాక్‌ను అన్ని కాలాల్లోనూ అన్ని రకాల చర్మతత్వాలకు వేసుకోవచ్చు.



● మెంతులను పాలలో నానబెట్టి గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేయడం వల్ల మొటిమల కారణంగా వ్యాపించే ఇన్‌ఫెక్షన్ తగ్గి క్రమంగా మొటిమలు రావడం మాని ముఖం



తాజాగా ఉంటుంది.

● ఎర్ర చందనం పేస్టును ముఖానికి అప్లై చేసి ఆరిన తర్వాత కడగాలి. ఇలా ప్రతిరోజూ చేస్తుంటే చర్మం మెరుస్తుంది. సహజ పద్ధతిలో గంధం చెక్కను అరగదీసి వాడుకోవచ్చు. అలా వీలుకానప్పుడు మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే చందనం పొడిలో నీటిని కలిపి వాడుకోవచ్చు. పొడిచర్మం అయితే నీటికి బదులుగా పాలను వాడుకోవచ్చు.


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 253
బుధవారం 4-12-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రూ. 2 కోట్ల 12 లక్షలకు...
వేలంలో అమ్ముడుపోయిన ఆస్ట్రేలియా దిగ్గజం బ్రాడ్‌మన్ క్యాప్ -12లో



ఫైనల్లో యువ భారత్
ఆసియా కప్ సెమీస్‌లో మలేసియాపై గెలుపు. నేడు పాక్‌తో టైటిల్ పోరు -12లో



దృష్టిలోపం ఉన్న వారికోసం..
అధునాతన కృత్రిమ మేధతో పనిచేసే స్మార్ట్ కళ్లద్దాలను 28 ఏళ్ల మునీర్ ఖాన్ 'ఏఐ విజన్ ప్రో' పేరిట రూపొందించాడు.
వివరాలు 6లో ▸



ఎట్టకేలకు 'మహా' స్పష్టత!
మహారాష్ట్ర సీఎం పీఠాన్ని దేవేంద్ర ఫడ్నవీస్‌కు అప్పగించి డిప్యూటీ సీఎం పదవి స్వీకరించేందుకు షిండే అంగీకరించినట్టు తెలుస్తోంది.
వివరాలు 6లో ▸



పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం
చైనాతో సరిహద్దు వివాదంపై న్యాయ, పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం భారత్ కట్టుబడి ఉందని జై శంకర్ చెప్పారు.
వివరాలు 6లో ▸

దక్షిణ కొరియాలో సంక్షోభం
తగ్గుతున్న ప్రజాదరణకు తోడు విపక్షాల దూకుడుతో సతమతమవుతున్న ద.కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఉన్నట్టుండి తీవ్ర చర్యలకు దిగారు. - వివరాలు 6లో



న్యూయార్క్‌తో పోటీ

హైదరాబాద్‌లో అభివృద్ధి పనులకు రూ. లక్షన్నర కోట్లు

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి: సీఎం రేవంత్

- చెన్నై, బెంగళూరు వంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దు
- ఆదిమానవుల్లా మారుదామా.. ఆధునికంగా బతుకుదామా?
- నగర అభివృద్ధి, మూసీ ప్రక్షాళన జరగాల్సి ఉంది
- రోజుకు 18 గంటలు పనిచేసే బాధ్యత తీసుకుంటా..
- మేమేం చేస్తున్నా ప్రతిపక్షాలు అడ్డుకుంటామంటే కుదరదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌కు ఏం తెచ్చారని నిలదీత
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.7 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్

దేశంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాలు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో నివాసయోగ్యం కాకుండా పోతున్నాయని.. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా ఉండాలంటే నగర అభివృద్ధితోపాటు మూసీ ప్రక్షాళన జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాలుష్యాన్ని తొలగించలేని పరిస్థితితో అడవుల్లోకి వెళ్లి మళ్లీ ఆది మానవుల్లా బతకాలా? ఆధునిక నగరంలో అధునాతనంగా జీవించాలా? అన్నది ఆలోచించుకోవాలని కోరారు. నాలుగున్నరేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తే... ప్రపంచ పెట్టుబడులకు వేదికగా అద్భుత నగరం రూపుదిద్దుకుంటుందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన టోక్యో, న్యూయార్క్, సింగపూర్ నగరాలతో పోటీపడతామని ప్రకటించారు. కాంగ్రెస్ ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ రైజింగ్' పేరిట హెచ్ఎండీఏ మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు రూ.7 వేల కోట్ల విలువైన పనులకు సీఎం రేవంత్ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడారు. సీఎం ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే...

"మూసీలో పారిశ్రామిక వ్యర్థాలు, మనుషులు, పశువుల కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. అలాంటి మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీలకు కనీస

మిగతా 3వ పేజీలో ▶

పెద్దపల్లికి సీఎం వరాలు
- వంద పడకలకు జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్
- నేడు జిల్లాలో 'యువ వికాసం' పేరిట బహిరంగ సభ - 2లో



5 నిమిషాల్లో భవన అనుమతులు!
- టీఎస్-బీపాస్ స్థానంలో కొత్తగా ఏకీకృత ఆన్‌లైన్ అనుమతుల వ్యవస్థ 'బిల్డ్ నౌ'
- డ్రాయింగ్ స్క్రూటినీ సాఫ్ట్‌వేర్‌తో బహుళ అంతస్తుల భవనాలకు సైతం నిమిషాల్లో పర్మిషన్లు
- ఫిబ్రవరి 1 నుంచి అందుబాటులోకి కొత్త విధానం: మంత్రి శ్రీధర్‌బాబు 16లో



యాజమాన్య కోటా.. ఇక ఆన్‌లైన్!
- వచ్చే ఏడాది ఇంజనీరింగ్‌లో కొత్త రూల్!
- కన్వీనర్ కోటాలాగే బీ, సీ కేటగిరీ సీట్ల భర్తీ
- మెరిట్ విద్యార్థులు నష్టపోవద్దనే మార్పులు.. కన్వీనర్ కోటాకన్నా మూడురెట్లు ఫీజులు
- ఉన్నత విద్యామండలి కసరత్తు.. త్వరలో ప్రభుత్వానికి నివేదిక 16లో

మేం డిస్టింక్షన్‌లో పాస్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఏడాది పాలన

'సాక్షి' ఇంటర్వ్యూలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కాంగ్రెస్ పార్టీలో గొడవలు ఉండవు. భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయి. వాటిపై పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటాం. అభిప్రాయ వ్యక్తీకరణ విభేదించడం కిందికి రాదు. రాజకీయ బాంబుల విషయంలో అధికార యంత్రాంగం తమ పని తాము చేసుకుంటూ వెళ్లిపోతుంది. అందులో రాజకీయ దురుద్దేశాలు ఉండవు. ఎప్పుడు ఏం జరగాలో అది జరుగుతుంది.



- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది.. అప్పుల లాభం వాళ్లకు... వాయిదాల కష్టం మాకు..
- హామీలన్నీ ఒకటొకటిగా నెరవేరుస్తున్నాం
- వైఎస్ ప్రారంభించిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, వడ్డీ లేని రుణాలు మా పేటెంట్లు
- ప్రతిపక్షాలు ఏడాది కూడా ఆగలేకపోతున్నాయి
- మా ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నాయి
- ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం

2లో

లక్ష తప్పుడు కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపను
మాజీమంత్రి హరీశ్‌రావు
- రేవంత్ నిజ స్వరూపాన్ని బయట పెడుతున్నందుకే కేసులు
- ప్రజాకోర్టులో సీఎంకు శిక్ష పడే వరకు ఆగేది లేదు

2లో



హరీశ్‌రావుపై కుట్ర కేసు
ఫోన్ ట్యాప్ చేసి బెదిరించారంటూ రియల్టర్ చేసిన ఫిర్యాదుతో నమోదు
- వివరాలు 2లో

క్లుప్తంగా...

మూసీ నది ప్రక్షాళనకు ఆర్థిక, సాంకేతిక మద్దతునివ్వండి

కేంద్రానికి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నది ప్రక్షాళనకు ఆర్థిక, సాంకేతిక మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం లోక్‌సభలో మూసీ పునరుజ్జీవంపై రూల్ 377 కింద ఈ అంశాన్ని లేవనెత్తారు. ఒకప్పుడు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాలకు కీలకమైన నీటి వనరుగా ఉన్న మూసీ నది ఇప్పుడు శుద్ధి చేయని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఆక్రమణల కారణంగా తీవ్రంగా కలుషితమైందని తెలిపారు. మూసీ నది ద్వారా నల్లగొండ జిల్లాలో 40 వేల ఎకరాల సాగుభూమి నేరుగా కలుషిత నీటికి గురవుతోందని, బోర్‌వెల్‌లు, చిన్న కుంటలు, కాల్వల ద్వారా అదనంగా మరో 60 వేల ఎకరాలు కలుషిత భూగర్భ జలాల కారణంగా నష్టపోతున్నాయని కేంద్రం దృష్టికి కిరణ్‌కుమార్ తీసుకెళ్లారు.

సమష్టి నిర్ణయాలతో రాష్ట్ర ప్రగతి

ప్రజలకు టీపీసీసీ అధ్యక్షుడి కృతజ్ఞతలు



సాక్షి, హైదరాబాద్: నియంత పాలనకు చరమగీతం పాడి ఏడాది క్రితం రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరించిన తెలంగాణ ప్రజానీకానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. గడీలు, ఫామ్‌హౌస్ పాలనతో విసిగి.. అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి పలికి.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు సహకరించారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల సమష్టి నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణ వెలుగుతోందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని స్పష్టం చేశారు.

అరాచక పాలనపై అసెంబ్లీలో నిలదీస్తాం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌పై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకే విశ్వాసం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సీఎంకు పార్టీపై పట్టు ఉంటే మంత్రివర్గ విస్తరణ జరిగి ఉండేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్లు చాలా మంది కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని, రాష్ట్ర రాజకీయాల్లో ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో వివేకానంద్ మీడియాతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసు అధికారులు గమనించాలన్నారు. కొత్త ప్రభుత్వానికి ఇప్పటికే కావాల్సినంత సమయం ఇచ్చామని, రేవంత్ అరాచక పాలనపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. బస్తీ దవాఖానాల్లో ఎనిమిది నెలలుగా మందులు లేవని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు.

మాలలను మనువాదులని అనడం సిగ్గుచేటు

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

సాక్షి, హైదరాబాద్: మాలలు మనువాదులని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించడం సిగ్గుచేటని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ పేర్కొన్నారు. మాలలు మనువాదులైతే.. మాదిగలు కమ్యూనిస్టులా? అని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మనువాద, మతవాద పార్టీల పంచన చేరి మాలలను మనువాదులు అనడం.. గొంగళిపై కూర్చొని వెంట్రుకలు ఏరుకున్నట్లుందని ఎద్దేవా చేశారు. వందల ఏళ్ల నుంచి కలిసిమెలిసి జీవిస్తున్న మాల మాదిగల మధ్య మందకృష్ణ చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వివేక్ మూడు పార్టీలు మారినా.. కులం మారదని తెలుసుకోవాలని హితవు పలికారు.



మేం.. డిస్టింక్షన్‌లో పాస్

గత ఏడాది పాలనలో తాము డిస్టింక్షన్‌లో పాస్ అయ్యామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని రెండు కళ్లుగా సమన్వయం చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని.. ఆ అప్పులు తీర్చుకుంటూ, ప్రజలపై భారాన్ని తగ్గించుకుంటూ వ్యవస్థను గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేర్చే దిశలో అడుగులు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా భట్టి విక్రమార్క మంగళవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

సాక్షి, హైదరాబాద్



"గత ప్రభుత్వ హయాంలో ఆదాయంతో పాటు తెచ్చిన అప్పులను కూడా విచ్చలవిడిగా ఖర్చు చేసేందుకే ప్రాధాన్యమిచ్చారు. ఆ అప్పులు కట్టాల్సిన సమయంలో రాష్ట్ర పగ్గాలు మా చేతికి వచ్చాయి. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు అప్పులు తెచ్చుకోగలగడం వల్ల వారికి లాభం కలిగింది. ఇప్పుడు అవన్నీ కట్టాల్సి రావడం మాకు భారంగా మారింది. మేం ఏడాదిలో రూ.52,118 కోట్లు అప్పులు తెచ్చి.. రూ. 64,516 కోట్ల అప్పులు తీర్చాల్సి వచ్చింది. అయినా అభివృద్ధి, సంక్షేమంలో వెనకబడకుండా జాగ్రత్త పడుతున్నాం. ప్రణాళిక వ్యయం కింద రూ. 24 వేల కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేశాం. అదే సమయంలో రూ. 61,194 కోట్లను వివిధ సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టాం. ప్రతి పైసా అర్థవంతంగా ప్రజలకు చేరాలన్నదే మా తపన.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఏడాది పాలన

'సాక్షి' ఇంటర్వ్యూలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్ మా పేటెంట్ పథకం. పకడ్బందీగా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ, మహిళలకు వడ్డీ లేని రుణాల పథకం పేటెంట్లు కూడా కాంగ్రెస్‌వే. వచ్చే ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్లు రుణాలు

ఆ మూడూ మా పేటెంట్లు..

ఇవ్వాలన్నది మా లక్ష్యం. అందులో ఈ ఏడాది రూ.20 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా... ఇప్పటికే రూ.18 వేల కోట్లు రుణాలిచ్చాం. కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించాం. తెలంగాణలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదన్నదే కాంగ్రెస్ లక్ష్యం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నాం. రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. పింఛన్లు పెంచుతాం. అన్ని హామీలను ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తాం. గత పదేళ్లలో బీఆర్‌ఎస్, బీజేపీ ఏమీ చేయలేకపోయాయి. కానీ మమ్మల్ని మాత్రం ఏడాదిలోనే అన్నీ చేసేయాలంటున్నాయి.

మేం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోవడంపై దృష్టి పెట్టలేదు. కానీ బీఆర్‌ఎస్ మాత్రం ప్రచారం మీదనే బతుకుతోంది. మేం రైతు రుణమాఫీ ప్రారంభించినప్పుడు ఏమీ కాలేదన్నారు. అక్కడితో ఆగిపోతామని అనుకున్నారు. కానీ మేం ఆగలేదు. నిజానికి రేషన్‌కార్డులు లేని రైతులకు రుణమాఫీ ఆలస్యం కావడానికి కారణం బీఆర్‌ఎస్ కాదా? గత పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు. ప్రజలకు ఏమేం చేయాలన్న దానిపై మా దృష్టి ఉంటే..

మేం ప్రచారంపై దృష్టి పెట్టలేదు..

వాళ్లు పదేళ్ల ప్రచార పటాటోపంతో నెట్టుకొచ్చారు. మేం బీఆర్‌ఎస్‌లా కాదు.. చెప్పినవన్నీ చేస్తున్నాం. దుబారా చేయకుండా కస్టోడియన్‌గా ప్రజల సంపదను ఖర్చు పెడతాం. రైతు భరోసా విషయంలో అదే చేస్తాం. ఒకదాని తర్వాత ఇంకోటి అమలు చేస్తూనే ఉంటాం. పాలనపై సంపూర్ణంగా పట్టు వచ్చింది. ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లు కూడా అధికారంలో ఉండేది మేమే. ప్రతిపక్షాలు నిరంతరం మా ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర చేస్తున్నాయి. ఎవరెన్ని కుట్రలు చేసినా ఏమీ చేయలేరు.

సంవత్సరం కూడా ఆగలేకపోతున్నారు

గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ జరగడం దురదృష్టకరం. అయితే పార్టీలు దీనిని రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదు. అడ్డగోలుగా అనుభవించిన అధికారం దూరం కావడంతో ఏడాది కూడా ఉండలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీలో గొడవలుండవు. భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయి. వాటిపై పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటాం. అభిప్రాయ వ్యక్తీకరణ విభేదించడం కిందికి రాదు. రాజకీయ బాంబుల విషయంలో అధికార యంత్రాంగం తమ పని తాము చేసుకుంటూ వెళ్లిపోతుంది. అందులో రాజకీయ దురుద్దేశాలు ఉండవు. ఎప్పుడు ఏం జరగాలో అది జరుగుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు.. ఇలా తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం. 'రైజింగ్ తెలంగాణ హాస్ టుబీ రైజ్ ఆల్ ద టైం'' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారు

మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు మొదటి నుంచీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కానీ ఈ విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉంది. మూసీ నీటిని శుద్ధి చేయడం, పెట్టుబడుల ద్వారా పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, ఆ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం మా ఉద్దేశం. ఇవన్నీ పూర్తయితే కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో... బీఆర్‌ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేశాయి. కానీ ప్రజలు వాస్తవాలు తెలుసుకున్నారు. మూసీ ప్రాజెక్టు కావాలంటున్నారు. ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలతో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దుతాం.



త్వరలో కొత్త విద్యుత్ విధానం..

త్వరలో జరిగే శాసనసభ సమావేశాల్లో కొత్త విద్యుత్ పాలసీని ప్రవేశపెట్టి చర్చిస్తాం. 2029–30 నాటికి 20 వేల మెగావాట్లు, 2035–36 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ విద్యుత్‌ను రాష్ట్రంలో వినియోగించడంతోపాటు ఇతర రాష్ట్రాలకు విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకుంటాం. పెరిగే సామర్థ్యానికి తగ్గట్టు సరఫరా, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తాం. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ మదన్ బి లోకూర్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను అసెంబ్లీలో పెడతాం. గత ప్రభుత్వ హయాంలో శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదానికి బాధ్యులైన డైరెక్టర్లను తొలగించాం. త్వరలోనే విద్యుత్ సంస్థలకు కొత్త డైరెక్టర్లను నియమిస్తాం.

ఊహాగానాలతో పోలీసుల దర్యాప్తు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావు వాదనలు
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుపై ప్రభుత్వం, అధికారులు ఊహాగానాలతో దర్యాప్తు చేస్తున్నారని, వారి సౌలభ్యం కోసం ఈ సమస్యను పొడిగించాలని భావిస్తున్నారని నిందితుడు(ఏ–5), రిటైర్డ్ పోలీస్ అధికారి పి.రాధాకిషన్‌రావు పేర్కొన్నారు. ఈ కేసుల్లో అధికారుల ప్రకటనలు, ప్రెస్ లీకేజీలు, దర్యాప్తు బృందం అఫిడవిట్‌లు ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం మేరకు తనను అరెస్టు చేశారని, సీనియర్ సిటిజన్ అయిన తాను మార్చి నుంచి జైలులో ఉంటున్నానని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. 'నిందితుల నుంచి ఎల్రక్టానిక్ గాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, నివేదికల కోసం ఎదురుచూస్తున్నామని విచారణ బృందం అఫిడవిట్‌లు ఒకవైపు చెబుతున్నాయి. మరోవైపు, ఈ ఎల్రక్టానిక్ గాడ్జెట్‌లను స్వాధీనం చేసుకునే ముందు ఫార్మాట్ చేశారని, వాటిలో కొన్ని ధ్వంసమయ్యాయని ఆరోపిస్తున్నారు. ఇది దర్యాప్తు బృందం అస్పష్టతను ప్రతిబింబిస్తుంది. నిందితులను జైలులో ఉంచాలనే ఉద్దేశంతో పోలీసులు సంఘటనల గురించి ఊహాగానాలు చేస్తూ కోర్టు ముందు వాదనలు సమర్పిస్తున్నారు. రాధాకిషన్‌రావు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశారు. అతను ఎస్ఐబీలో పని చేయలేదు. కానీ, అధికారులు ఎస్ఐబీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందంతో కలిసి పనిచేశారని ఆరోపిస్తున్నారు' అని పేర్కొన్నారు. అనంతరం న్యాయమూర్తి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కాంగ్రెస్ హయాంలోనే సమాఖ్య స్ఫూర్తికి ప్రమాదం

బ్యాంకింగ్ సవరణ బిల్లుపై చర్చలో కొండా



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ హయాంలోనే సమాఖ్య స్ఫూర్తి ప్రమాదంలో పడిందని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అయితే.. ఆ నిందను మాత్రం బీజేపీపై వేస్తోందని విమర్శించారు. 2011లో కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన 97 కార్పొరేటివ్ అమెండ్‌మెంట్ బిల్లు వాస్తవానికి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, అందుకే ఈ బిల్లును సుప్రీంకోర్టు స్ట్రక్ డౌన్ చేసిందని గుర్తుచేశారు. 'ది బ్యాంకింగ్ లాస్ అమెండ్‌మెంట్ బిల్– 2024'పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. ఈ ఏడాది ఆగస్టులో కేంద్రం ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందని, బ్యాంకింగ్ రంగంలో పలు సంస్కరణలు తెచ్చేందుకు ఈ బిల్లు దోహదపడుతుందని తెలిపారు. ఈ బిల్లుపై విపక్షాల పార్టీల సభ్యుల మధ్యే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయంటూ ఎద్దేవా చేశారు.



వైర్‌లెస్ టెక్నాలజీలో ఐఐటీహెచ్ ముందడుగు

న్యారోబ్రాండ్ ఐఓటీ సిస్టం–ఆన్–చిప్‌సెట్ సాంకేతిక అభివృద్ధి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వైర్‌లెస్ కమ్యూనికేషన్ సొల్యూషన్ టెక్నాలజీ పరిశోధనలో భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీ) హైదరాబాద్ కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన న్యారోబ్రాండ్ ఐఓటీ సిస్టం–ఆన్–చిప్‌సెట్ సాంకేతికతను అభివృద్ధి చేసింది. ఈ మేరకు ఐఐటీహెచ్ కమ్యూనికేషన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కూచి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది దేశంలోనే తొలి న్యారోబ్రాండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సిస్టం ఆన్ చిప్‌సెట్ అని.. 5జీ టెక్నాలజీతోపాటు భవిష్యత్తులో రానున్న 6జీ టెక్నాలజీకి కూడా దోహదపడేలా ఈ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. సెల్‌ఫోన్ టవర్లతోపాటు ఉపగ్రహాలతోనూ ఈ చిప్‌సెట్‌ను అనుసంధానించే విధంగా రూపొందించినట్లు వివరించారు. జీపీఎస్‌కు కూడా సపోర్ట్ చేస్తుందన్నారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో వచ్చే రెండు దశాబ్దాల్లో రానున్న మార్పులకు అనుగుణంగా దీనిని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. క్లిష్టమైన సాంకేతిక రంగాల్లో స్వావలంబన కోసం వేసిన ఈ ముందడుగు గర్వకారణమని కిరణ్ పేర్కొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుపై కుట్ర కేసు

- ఫోన్ ట్యాప్ చేసి బెదిరించారంటూ రియల్టర్ చేసిన ఫిర్యాదుతో నమోదు
- ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పంజగుట్ట పోలీసులు

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: బీఆర్‌ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. తన, కుటుంబసభ్యుల ఫోన్లను ట్యాప్ చేశారని, తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి కుట్రతో అక్రమ కేసులు పెట్టారని... రియల్ ఎస్టేట్ వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి, రిమాండ్‌లో ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావును సైతం నిందితుడిగా చేర్చారు. వివిధ సెక్షన్ల కింద ఆదివారమే ఎఫ్ఐఆర్ నమోదవగా.. ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం..

"సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. 2022 సెప్టెంబర్ 25న సిద్దిపేటలోని కొండ భూదేవి గార్డెన్స్‌లో చక్రధర్.. ఆత్మహత్యలకు పాల్పడ్డ వంద మంది కౌలురైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఆ తర్వాత మరో 150 మందికి రూ.లక్ష నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల నేపథ్యంలో భవిష్యత్తులో చక్రధర్‌గౌడ్ తనకు పోటీ అవుతారని హరీశ్‌రావు భావించారు. అనంతరం సిద్దిపేట జిల్లాలో 'అగ్గిపెట్టె మచ్చా' పేరిట మ్యాచ్‌బాక్స్ కంపెనీని ప్రారంభించనున్నట్టు చక్రధర్‌గౌడ్ ప్రకటించారు. దీనితో హరీశ్‌రావు చక్రధర్‌పై శామీర్‌పేట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు చేయించి, అరెస్టు చేయించారు. అయితే 2023 మార్చి 15న చక్రధర్ బీజేపీలో చేరారు. అదే ఏడాది ఏప్రిల్ 28న హైదరాబాద్‌లోని పంజగుట్ట నాగార్జున సర్కిల్‌లో చక్రధర్‌కు చెందిన 'ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్' ఆఫీసుకు మఫ్టీలో వచ్చిన పోలీసులు ఆయనను టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా ఉన్న పి.రాధాకిషన్‌రావు ముందు హాజరుపర్చారు. ఆయన చక్రధర్‌ను తీవ్రస్థాయిలో బెదిరించి, హరీశ్‌రావు అనుమతి లేకుండా సిద్దిపేట నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని హెచ్చరించారు. ఒకసారి పోలీసులు చక్రధర్ ఐఫోన్ తీసుకుని, తర్వాత తిరిగిచ్చారు. ఫోన్ ట్యాప్ చేయడం ద్వారా వివరాలన్నీ తెలుసుకుని చక్రధర్‌ను, అనుచరులను బెదిరించారు. గతంలో మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ చర్యలకు పాల్పడ్డారు'' అని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

హరీశ్‌రావును వెంటనే అరెస్టు చేయాలి: చక్రధర్‌గౌడ్

తన ఫోన్ ట్యాప్ చేయించి, అక్రమ కేసులతో వేధించిన హరీశ్‌రావును వెంటనే అరెస్టు చేయాలని చక్రధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. జైల్లోనే తనను చంపినా అడిగేవారే లేరని అప్పట్లో రాధాకిషన్‌రావు బెదిరించారన్నారు. హరీశ్‌ను వెంటనే అరెస్టు చేయకుంటే విదేశాలకు పారిపాయే అవకాశం ఉందన్నారు. హరీశ్‌రావు పీఏ హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని కోటి రూపాయల వరకు వసూలు చేశారని... తాను స్టింగ్ ఆపరేషన్ ద్వారా బయట పెట్టానని, హరీశ్‌రావుపై త్వరలో మరో కేసు నమోదు కానుందని పేర్కొన్నారు.

పెద్దపల్లికి సీఎం వరాలు

వంద పడకలకు జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్

- మంథని, గుంజపడుగులో ఆసుపత్రులకు అనుమతి
- నేడు జిల్లాలో 'యువ వికాసం' పేరిట బహిరంగ సభ
- గ్రూప్–4, సింగరేణి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్న సీఎం
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



సాక్షి, హైదరాబాద్/పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాలో 'యువ వికాసం' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభలో సీఎం పాల్గొంటారు. ఈ నేపథ్యంలో జిల్లాకు మంగళవారం సీఎం పలు అభివృద్ధి పథకాలు ప్రకటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 50 పడకల జిల్లా ఆసుపత్రిని 100 పడకల సామర్థ్యానికి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆసుపత్రిలో సివిల్ పనులకు, పరికరాల కొనుగోలు కోసం రూ.51 కోట్లను విడుదల చేసింది. మంథనిలో రూ.22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. మంథని మండలం గుంజపడుగులో రూ.2.45 కోట్లతో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కూడా జీవో జారీచేసింది.

గ్రూప్–4 ఉద్యోగ నియామక పత్రాలు

గ్రూప్–4, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 9,000 మందితోపాటు సింగరేణి సంస్థలో ఇటీవల ఉద్యోగాలకు ఎంపికైన 593 మందికి యువ వికాసం సభలోనే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియామక పత్రాలను అందజేయనున్నారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ (డీఈఈటీ), సీఎం కప్‌ను ఆవిష్కరిస్తారు. రూ.260 కోట్ల విలువైన ఆర్అండ్‌బీ పనులకు, రూ.66 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి, రూ. 26 కోట్లతో నర్సింగ్ కాలేజీ, రూ.10 కోట్లతో నిర్మించే శాతవాహన వర్సిటీ అడ్మిన్ బ్లాక్ తదితర పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం సభా ప్రాంగణంలో స్టాల్స్‌ను సీఎం సందర్శిస్తారు.

సభకు భారీగా ఏర్పాట్లు

యువ వికాసం సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. సభ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరిశీలించారు. సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక్క గింజ కూడా తరుగు తీయకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఏడాది కాలంలోనే సుమారు 52 వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో లౌకికత్వాన్ని కాపాడుకోవాలి

క్రిస్టియన్ సంఘాల నేతల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



కవితకు చేపలను బహూకరించిన గంగపుత్ర సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లౌకికత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. లౌకికత్వాన్ని పరిరక్షించేందుకు కేసీఆర్ బాటలో భవిష్యత్తులోనూ ముందుకు సాగుతామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో మత ఘర్షణలు జరిగి, ప్రశాంతత లోపించిందన్నారు. తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు సాల్మన్‌రాజ్ నేతృత్వంలో పలు క్రిస్టియన్ సంఘాల నాయకులు మంగళవారం కవితతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. కాగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ కవితను గంగపుత్ర సంఘం నేతలు కలిశారు. ఇటీవల తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు కులగణనపై నివేదిక ఇచ్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులను కాంగ్రెస్ మోసం చేసింది..

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కవిత ఆరోపించారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఏడాది దాటినా అమలు చేయకుండా మోసం చేస్తుందని ఆరోపించారు.

లక్ష తప్పుడు కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపను

మాజీమంత్రి హరీశ్‌రావు

రేవంత్ నిజ స్వరూపాన్ని బయటపెడుతున్నందుకే కేసులు.. ప్రజాకోర్టులో సీఎంకు శిక్ష పడే వరకు ఆగేది లేదు



సాక్షి, హైదరాబాద్: తనపై లక్ష తప్పుడు కేసులు పెట్టించినా ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపేది లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజాకోర్టులో ప్రజల తీర్పుతో సీఎంకు తగిన శిక్ష పడేంత వరకు తాను ఆగేది లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అన్యాయాలను అడుగడుగునా నిలదీస్తూ, ఆయన నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకే కేసులు పెడుతున్నారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజల పక్షాన ప్రశ్నలు సంధిస్తుంటే భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నారు. రేవంత్ ప్రభుత్వానికి తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం మాత్రమే చేతనవుతుంది. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసిన విషయాన్ని ప్రశ్నించినందుకు యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించాడు. హామీల ఎగవేతపై నిలదీసినందుకు బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో సంబంధం లేని కేసులు పెట్టారు. రేవంత్ రెండు నాలుకల వైఖరిని బట్ట బయలు చేసినందుకు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారు..' అని హరీశ్‌రావు తెలిపారు.

తెలంగాణలో ఇదే చివరి ఓసీ ప్రభుత్వం

రాబోయేది పక్కా బీసీ సర్కారే: తీన్మార్ మల్లన్న



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇదే చివరి ఓసీ ప్రభుత్వమని, రాష్ట్రంలో రాబోయేది పక్కా బీసీ సర్కారే అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) మరోసారి స్పష్టం చేశారు. భవిష్యత్తులో అన్ని పార్టీల నాయకులను కలుపుకొని బీసీ ఉద్యమాలతో ముందుకెళ్తామన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ హక్కుల సాధన కోసం రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తామన్నారు.

క్లుప్తంగా...

టీజీపీఎస్సీ ఉద్యోగాల అర్హుల జాబితా విడుదల



సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్, డ్రిల్లింగ్ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసింది. ఎలక్ట్రికల్ కేటగిరీలో 50 పోస్టులు, మెకానికల్ కేటగిరీలో 97 పోస్టులకు టీజీపీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ జాబితాలు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు కార్యదర్శి నవీన్‌నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి డీఈసెట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి రెండోదశ కౌన్సెలింగ్ ఈ నెల 5వ తేదీ నుంచి మొదలవుతుందని డీఈసెట్ కన్వీనర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన, 7 నుంచి 9 వరకూ వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చని తెలిపారు. 13వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని, 17వ తేదీలోగా సీట్లు పొందినవారు రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు ధర్నాచౌక్‌లో కౌలు రైతుల ప్రజాదర్బార్, ధర్నా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కౌలు రైతులను గుర్తించి న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కౌలు రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో రైతుల ప్రజాదర్బార్, ధర్నా నిర్వహిస్తున్నట్లు కార్మిక నాయకులు విస్సా కిరణ్, టి.సాగర్, పశ్య పద్మ తెలిపారు. ఈ ధర్నాలో వందలాది కౌలు రైతులు పలు జిల్లాల నుంచి పాల్గొంటారని వెల్లడించారు. మొదట 15 మంది కౌలు రైతులు వారి సమస్యలను ప్రొఫెసర్ హరగోపాల్, రుక్మిణీరావు, కె.శ్రీనివాస్‌తో కూడిన ప్రముఖుల జ్యూరీ ముందు వినిపిస్తారన్నారు. జ్యూరీ సభ్యుల స్పందన తర్వాత ముఖ్య రైతు సంఘాల, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడతారని తెలిపారు.

న్యూయార్క్‌తో పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

అవగాహన లేదా? హైదరాబాద్ ప్రపంచంతో పోటీపడాలంటే రీజనల్, రేడియల్ రోడ్లు, ఫ్లైఓవర్లు, ఎస్టీపీలు, కృష్ణా, గోదావరి జలాలు, మెట్రో విస్తరణ అవసరం. వాటికి రూ. లక్షన్నర కోట్లు కావాలి. ఆ నిధులు నాలుగున్నరేళ్లలో ఖర్చు చేస్తే అద్భుత నగరంగా, ప్రపంచ పెట్టుబడులకు వేదికగా అవుతుంది. ఇందుకు కేంద్రం సహకరించాలి.

నగర అభివృద్ధి అంతా కాంగ్రెస్‌తోనే..

హైదరాబాద్ అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగింది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హైటెక్‌సిటీకి శిలాఫలకం వేస్తే... టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నిర్మాణం పూర్తిచేసి ఐటీ కంపెనీలు తెచ్చారు. తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి ఐటీ కంపెనీలను కొనసాగించడమేకాక ఔటర్ రింగ్ రోడ్‌ను, అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్‌ను, ఫార్మా కంపెనీలను తెచ్చారు. దీనితో రియల్ ఎస్టేట్, పరిశ్రమలు పెరిగాయి. పి.జనార్దనరెడ్డి కృషితో నగరానికి తాగునీళ్లు వచ్చాయి. రాష్ట్ర ఖజానాకు 65శాతం ఆదాయం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే.. నాటి సీఎంల ముందుచూపుతోనే వస్తోంది. న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం. ఇందుకు అవసరమైన దాదాపు 40–50 వేల ఎకరాల భూమికిగాను దాదాపు 15 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సహకరించాలి. ఇబ్రహీంపట్నంలో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో వెజిటబుల్, ఫ్రూట్ మార్కెట్లు, డెయిరీ, పౌల్ట్రీ, మీట్.. ఇలా అన్ని ఉత్పత్తులు ఒకేచోటికి తెస్తాం. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తాం.

గప్పాలతోనే పదేళ్లు గడిపారు

గత ప్రభుత్వంలో సీఎం గప్పాలతోనే పదేళ్లు గడిపారు. హుస్సేన్‌సాగర్‌ను శుద్ధిచేస్తామని మురికికూపంగా మార్చారు. ఆ పార్టీ వాళ్లు సెల్ఫీలు తీసుకునే, ట్విట్టర్‌లో పెట్టుకునే శిల్పారామం, ట్యాంక్‌బండ్ కూడా కాంగ్రెస్ అభివృద్ధి చేసినవే. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని విష ప్రచారం చేశారు. గత ప్రభుత్వం ఉన్న 2023 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కంటే.. తమ ప్రభుత్వం వచ్చాక అదే సమయంలో 29శాతం అభివృద్ధిని రియల్ ఎస్టేట్ రంగం సాధించింది.

మంచి చెబితే అమలు చేస్తాం

బీఆర్ఎస్ గతంలో చేసింది అంతా అప్పులు, తప్పులే. అధికారం పోయాక జ్ఞానోదయమై ఏవైనా సూచనలు చేస్తామంటే అభ్యంతరం లేదు. మేం చేసేది నచ్చకపోతే... వారి విధానాలేమిటో, ఎన్ని నిధులు అవసరమో చెప్పాలి. అవి సహేతుకమైతే, ప్రజలకు ఉపయోగపడేవే అయితే భేషజాలు లేకుండా అమలుచేస్తాం. ఇందుకోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉప సంఘం వేస్తున్నాం. అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తాం. బీఆర్ఎస్, బీజేపీ వారి ప్రతిపాదనలు పంపాలి.



హైదరాబాద్ రైజింగ్' కార్యక్రమానికి వచ్చిన సీఎం రేవంత్.. వేదికపైకి వెళ్లే ముందు అక్కడున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడి భద్రత కిట్స్‌ను పంపిణీ చేశారు. ఒక కార్మికురాలితో కరచాలనం చేసి స్థితిగతులను తెలుసుకున్నారు. అక్కడికి వచ్చిన దివ్యాంగులను పలకరించారు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే దానం నాగేందర్

అడ్డుకుంటామంటే కుదరదు

మేం ఏది చేస్తామన్నా ప్రతిపక్షాలు అడ్డుకుంటామంటే కుదరదు. మా మీద కోపంతో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను శిక్షించవద్దు. హైదరాబాద్ నగరమే మన ఆదాయం, జీవన విధానం, ఆత్మగౌరవం. దీన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్టే. అందుకే ఏ రకంగానైనా కాపాడుకుంటాం. అందుకోసం విదేశీ పెట్టుబడులు ఆకర్షిస్తాం. టోక్యో, న్యూయార్క్, సింగపూర్ నగరాలతో పోటీపడతాం..''అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే దానం నాగేందర్, అధికారులు పాల్గొన్నారు.

నా ప్రశ్నలకు సమాధానం చెప్పు కిషన్‌రెడ్డీ...

''గుజరాత్‌లో సబర్మతి ఫ్రంట్‌కు చప్పట్లు కొట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. మూసీలో మునిగినా, అందులో ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోబోం. ప్రక్షాళన చేసి తీరుతాం. ప్రధాని మోదీ దగ్గర ఏటా రూ.40 వేల కోట్ల బడ్జెట్ ఉంటుంది. అందులోనుంచే సబర్మతి ఫ్రంట్‌తోపాటు గుజరాత్‌కు గిఫ్ట్ సిటీ, బుల్లెట్ రైలు తీసుకెళ్లారు. మరి నువ్వు తెలంగాణకు ఏం తెచ్చావు? మెట్రో విస్తరణకు రూ.35 వేల కోట్లు, ఆర్ఆర్ఆర్‌కు మరో రూ.35 వేల కోట్లు కావాలి. మోదీ గుజరాత్, బెంగళూరు, చెన్నైలకు ఇస్తారుగానీ.. హైదరాబాద్‌కు ఎందుకివ్వరు? నా ప్రశ్నలకు సమాధానం చెప్పు కిషన్‌రెడ్డీ... మీరు నిధులు తెస్తారా లేక గుజరాత్‌కు వలసపోతారా? సికింద్రాబాద్ ఎంపీగా ట్రాఫిక్ చిక్కులు తీర్చేందుకు, మెట్రో విస్తరణకు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి నీ యాక్షన్ ప్లాన్ ఏంటి? నీ ప్రతిపాదనలేవో, ఎన్ని నిధులు తెస్తావో చెప్పు. రాష్ట్రానికి రూ. లక్షన్నర కోట్లు తీసుకురా. 10 లక్షల మంది ప్రజలతో మోదీని, నిన్ను సన్మానించే జిమ్మేదారి నాది''

మూసీ వెంట గుడిసె వేసుకుని ఉండి చూడు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భట్టి సవాల్

''మూసీ పరీవాహక ప్రాంతంలో ఒకరోజు నిద్రపోవడం కాదు.. అక్కడే గుడిసె వేసుకుని కుటుంబంతో సహా నివసించి చూపించు..''అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. ప్రజలను మభ్యపెట్టడానికి ఒకరోజు మూసీ వద్ద నిద్రపోయి తర్వాత నుంచి విలాసవంతమైన ప్యాలెస్‌లో ఉండటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 'హైదరాబాద్ రైజింగ్'కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మూసీని జీవనదిగా మార్చాలని ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని భట్టి మండిపడ్డారు. బీఆర్ఎస్ మూసీ ప్రాజెక్టుపై సోషల్ మీడియా ద్వారా ప్రజలను రెచ్చగొడుతూ, కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ తరహా కాలుష్యం ముప్పు హైదరాబాద్‌కు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

సీఎం చేసిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలివే..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3,446 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. జల మండలి ఆధ్వర్యంలో రూ.669 కోట్లతో నిర్మించిన మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీల)ను, తాగునీటి సరఫరా కోసం రూ.45 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ నిర్మించిన 19 రిజర్వాయర్లను ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలు జంక్షన్ల సుందరీకరణ పనులను కూడా ప్రారంభించారు. ఇక హైదరాబాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో రూ.1,500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేశారు. కృత్రిమ మేధ అనుసంధానంతో కొత్త ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్‌వేర్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

అంకితభావంతో పనిచేయాలి

అగ్నివీరుల పాసింగ్‌ఔట్ పరేడ్‌లో బ్రిగేడియర్ ప్రశాంత్



అగ్నివీర్‌లకు పురస్కారాలు అందిస్తున్న బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్

సాక్షి, హైదరాబాద్: దేశ రక్షణ, సమగ్రతను నిలబెట్టేందుకు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని అగ్నివీర్‌లకు 1 ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ సూచించారు. అగ్నివీర్ నాలుగో బ్యాచ్‌కు చెందిన 592 మంది అగ్నివీరులు ఈఎంఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్) విభాగంలో ఆర్మ్‌డ్ ఫైటింగ్ వెహికల్స్, మిలిటరీ వెహికల్స్, టెలికమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్, రిఫ్రిజిరేషన్ ఎక్విప్‌మెంట్‌లలో సాంకేతిక నిపుణులుగా 31 వారాలు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. మంగళవారం 1 ఈఎంఈ సెంటర్‌లో నిర్వహించిన అగ్నివీర్ పాసింగ్‌ఔట్ పరేడ్‌కు బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైనిక, సాంకేతిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అగ్నివీర్‌లను, వారికి శిక్షణ ఇచ్చిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. శిక్షణలో భాగంగా ఫిజికల్ ఫిట్‌నెస్, అకడమిక్స్, డ్రిల్, ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అగ్నివీర్‌లను బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ పురస్కారాలతో సత్కరించారు. డ్రిల్ పరేడ్‌లో రుస్తుమ్ కుమార్ మౌర్య అత్యుత్తమ అవార్డు, ఓవరాల్ అగ్నివీర్ అవార్డును అభిషేక్ రావత్ అందుకున్నారు. పాసింగ్‌ఔట్ పరేడ్‌లో 1 ఈఎంఈ సెంటర్‌లోని బోధకులు, సిబ్బంది, అగ్నివీర్‌ల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచనందుకు.. సొసైటీ చైర్మన్, డైరెక్టర్లకు జరిమానా

దొన్కల్ గ్రామాభివృద్ధి కమిటీ తీర్మానం

మోర్తాడ్(బాల్కొండ): సాగుకు అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచడంలో విఫలమయ్యారంటూ సహకార సంఘం చైర్మన్‌తోపాటు, ఐదుగురు డైరెక్టర్లకు గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) జరిమానా విధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై ఆగ్రహించిన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్కల్ వీడీసీ చేసిన తీర్మానం చర్చనీయాంశమైంది. శెట్‌పల్లి సహకార సంఘానికి దొన్కల్‌కు చెందిన నాయకుడే చైర్మన్ కాగా, ఐదుగురు నాయకులు డైరెక్టర్లుగా ఉన్నారు. శెట్‌పల్లి సహకార సంఘం నుంచి దొన్కల్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు ప్రతి సీజన్‌లో అందుబాటులో ఉంచడం లేదని తమకు ఫిర్యాదులు అందినట్టు వీడీసీ వెల్లడించింది. వారం రోజుల కింద చైర్మన్, డైరెక్టర్లను పిలిపించి ఎరువుల సరఫరాపై ఆరా తీసినట్టు తెలిసింది. సహకార సంఘం ద్వారా ఎరువులను విక్రయించడంలో పాలకవర్గ సభ్యులు విఫలమయ్యారని, తద్వారా రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయని వీడీసీ వెల్లడించింది. ఇందుకు బాధ్యులైన చైర్మన్ రూ.25 వేలు, డైరెక్టర్లు రూ.5 వేల చొప్పున జరిమానా చెల్లించాలని వీడీసీ తీర్మానించింది. ఈనెల 1వ తేదీన వారంతా జరిమానా సొమ్మును వీడీసీ సభ్యులకు చెల్లించినట్టు తెలిసింది.

రేపు మంత్రి జూపల్లితో ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రతి వారం జరిగే 'మంత్రితో ముఖాముఖి'కార్యక్రమాన్ని ఈనెల 5న నిర్వహించనున్నారు. గాంధీభవన్‌లో గురువారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి.. టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారు. కార్యక్రమంలో భాగంగా పలు సమస్యలపై ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించనున్నారు.

మనం ఉన్నదంతా
మనం ఆలోచించిన దాని ఫలితమే.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 4 డిసెంబర్ 2024

బైడెన్ పుత్రవాత్సల్యం

చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉండటం, తలకెత్తుకున్న విలువలను చివరివరకూ శిరోధార్యంగా భావించటం అంత తేలిక కాదు. అధికార వైభోగాల్లో మునిగితేలేవారికి అది ప్రాణాంతకం కూడా. ఇందుకు మినహాయింపు ఎవరని జల్లెడ పడితే ప్రపంచవ్యాప్తంగా వేళ్లమీద లెక్కబెట్టేంత మంది మిగులుతారేమో! అధికార పీఠం నుంచి మరో నెలన్నరలో తప్పుకోబోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు హంటర్ బైడెన్‌కు క్రిమినల్ కేసుల నుంచి విముక్తి కలిగించే ఉత్తర్వులపై ఆదివారం సంతకం చేసిన ఉదంతం ఇప్పుడు అమెరికాలో పెద్ద చర్చనీయాంశమైంది. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డోనాల్డ్ ట్రంప్ అధికార పీఠం అధిష్ఠించాక ఒక్కొక్కరి సంగతీ చూస్తానంటూ వీలైనప్పుడల్లా హూంకరిస్తున్నారు. ప్రత్యేకించి హంటర్ బైడెన్ గురించి కూడా చెప్పారు. మన అధమస్థాయి నేతల్లా 'రెడ్ బుక్' అని పేరేమీ పెట్టుకోలేదుగానీ వేధించదల్చుకున్నవారి పేర్లన్నిటినీ ఒక చిట్టాలో రాసుకున్నట్టే కనబడుతోంది. కత్తికి పదును పెట్టుకుంటున్న వైనం కళ్ల ముందే కనబడుతోంది. 2021 జనవరి 6న వాషింగ్టన్‌లో కీలక వ్యవస్థలన్నీ కొలువుదీరిన కాపిటల్ హిల్‌లోకి చొరబడి కనీవినీ ఎరుగని విధ్వంసం సృష్టించిన మూకకు క్షమాభిక్ష పెట్టడం ఆయన తొలి ప్రాధాన్యం. ఆ కేసుల్ని దర్యాప్తు చేసినవారినీ, కేసులు దాఖలు చేసిన న్యాయవాదులనూ, వీరి వెనకున్న డెమాక్రటిక్ నేతలనూ జైళ్లపాలు చేయటం ట్రంప్ ఎజెండా.

అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అయితేనేమి... ఇతర సందర్భాల్లో అయితేనేమి తాను విలువలకు మారు పేరని బైడెన్ ఒకటికి పదిసార్లు చెప్పుకున్నారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని విచారణ ఎదుర్కొంటున్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు అధ్యక్షుడిగా విశేషాధికారాలను వినియోగించి క్షమాభిక్ష పెట్టే యోచన లేదని చెప్పారు. నిరుడు హంటర్‌ను వివిధ అభియోగాల్లో నేరస్తుడని ప్రకటించి, శిక్షాకాలాన్ని తర్వాత ప్రకటిస్తామని న్యాయస్థానం చెప్పినప్పుడు 'తుది నిర్ణయం ఏదైనా శిరసావహిస్తాను. న్యాయవిచారణ ప్రక్రియను గౌరవిస్తాను' అని బైడెన్ ప్రకటించారు. ఆర్నెల్ల క్రితం ఇటలీలో జీ–7 సమావేశాల సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో సైతం ఆయన దీన్నే చెప్పారు. మరేమైంది? తన మాటల్ని తానే ఎందుకు మింగేశారు? సరిగ్గా 82 ఏళ్ల వయసులో పదవి నుంచి నిష్క్రమించే వేళ తన డెమాక్రటిక్ పార్టీని ఎందుకని ఇరుకున పడేశారు? తమది పురాతన పరిణత ప్రజాస్వామ్యమని అమెరికన్లు గొప్పలు పోతారు. ఎవరైనా– సామాన్య పౌరులైనా, ఉన్నతస్థాయి నేతలైనా–తమ దేశంలో చట్టం ముందు సమానులేనని చెప్పుకుంటారు. అయితే అదంతా నిజం కాదని అడపా దడపా రుజువవుతూనే ఉంటుంది. పైపైన చూస్తే ఇప్పుడు బైడెన్ చర్య కూడా ఆ తానులో ముక్కేనని అందరూ భావిస్తారు. కానీ ఆయన అందర్నీ మించిపోయాడన్నది డెమాక్రాట్లలోనే వినిపిస్తున్న విమర్శల సారాంశం. ఎందుకంటే ఇంతక్రితం అధ్యక్షులు తమ సన్నిహితులకు క్షమాభిక్ష పెట్టారు తప్ప సంతానానికి ఇలాంటి వెసులుబాటు కల్పించే స్థితి ఏర్పడలేదు. గతంలో జార్జి డబ్ల్యు బుష్ అమెరికా రక్షణ మంత్రిగా పనిచేసిన కాస్పర్ వీన్‌బెర్గర్‌నూ, మరికొంతమంది అధికారులనూ ఇరాన్–కాంట్రా వ్యవహారంలో నేరారోపణల నుంచి విముక్తం చేశారు. బిల్ క్లింటన్ తన సవతి సోదరుడిని మాదకద్రవ్యాల కేసు నుంచి తప్పించారు. ట్రంప్ మాత్రం 2016–20 మధ్య ఎడాపెడా క్షమాభిక్షలు ప్రకటించారు. అందులో తన అల్లుడు జేర్డ్ కుష్నెర్ తండ్రి చార్లెస్ కుష్నెర్ ఒకరు. ఆయనకు పన్ను ఎగవేత కేసులో రెండేళ్ల శిక్షపడగా క్షమాభిక్ష పెట్టారు. అతన్నిప్పుడు ఫ్రాన్స్ రాయబారిగా కూడా ప్రకటించారు. హంటర్‌కు క్షమాభిక్ష పెట్టాక విడుదల చేసిన ప్రకటనలో బైడెన్ తన కుమారుణ్ణి కావాలని అన్యాయంగా ఇరికించి విచారణ తంతు సాగించారని ఆరోపించారు. అతణ్ణి జైలుపాలుచేసి మానసికంగా తనను ఛిద్రం చేయాలని చూస్తున్నట్టు అర్థమవుతోందన్నారు. 'ఇది ఇక్కడితో ఆగుతుందనుకోవటానికి లేద'ని ప్రకటించారు. హంటర్ కేసుల్ని గమనిస్తే జో బైడెన్‌ది పుత్ర ప్రేమ తప్ప మరేం కాదని సులభంగా తెలుస్తుంది. ఆయన మాదకద్రవ్యాల వినియోగంలో ఒకప్పుడు మునిగి తేలేవాడు. దశాబ్దం క్రితం ఆయనది చీకటి జీవితం. ఒబామా హయాంలో తన తండ్రి ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయానికి హంటర్ కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. అతని ప్రవర్తన బైడెన్‌కు చాలా తలనొప్పులు తెచ్చిపెట్టింది. తుపాకీ కొనుగోలు చేశాక దాన్ని తన దగ్గర కేవలం 11 రోజులే ఉంచుకుని తిరిగి అధికారులకు అప్పగించి ఉండొచ్చు. కానీ దరఖాస్తు చేసినప్పుడు తన నేర చరిత్ర దాచిపెట్టాడు. మాదకద్రవ్యాలు వాడుతున్న సంగతిని చెప్పలేదు. పన్ను ఎగవేత కేసు సరేసరి.

మొత్తానికి రెండు రకాల న్యాయం అమలవుతున్న వైనం కళ్ల ముందు కనబడుతుండగా అనవసర స్వోత్కర్షలకు పోరాదని ఇకనైనా అమెరికన్లు గుర్తించాల్సివుంది. నిజానికి ఇలాంటి అసమ వ్యవస్థే ట్రంప్ వంటివారి ఆవిర్భావానికి దారితీసింది. ఏదేమైనా విలువల గురించి మాట్లాడే నైతికార్హత డెమాక్రాట్లు కోల్పోయారు. ట్రంప్ ముమ్మందు ఏం చేయబోతారో ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్ నియామకమే చెబుతోంది. దాన్ని చూపించి బైడెన్ చర్య హేతుబద్ధమైనదని డెమాక్రాట్లు చెప్పలేరు. పైపెచ్చు వచ్చే నాలుగేళ్లలో తాను చేసే ప్రతి అక్రమాన్నీ సమర్థించుకోవటానికి డోనాల్డ్ ట్రంప్ బైడెన్‌ను ఉదాహరిస్తుంటే వారు మౌనంగా మిగిలిపోక తప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిరమాసం, తిథి: శు.తదియ ప.12.26 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: పూర్వాషాఢ సా.5.18 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.1.18 నుండి 2.50 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.30 నుండి 12.18 వరకు
అమృతఘడియలు: ప.12.17 నుండి 1.55 వరకు.

సూర్యోదయం : 6.19
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఉక్రెయిన్‌కు ట్రంప్ పరిష్కారం?

విశ్లేషణ
టంకశాల అశోక్

లెబనాన్‌లో కాల్పుల విరమణ జరిపించి, గాజాలోనూ ఆ ప్రయత్నం చేయగలనన్న అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఉక్రెయిన్ యుద్ధం గురించి మాత్రం ఎటువంటి ప్రస్తావన చేయకపోవటం గమనించదగ్గది. పైగా, కొత్త అధ్యక్షుడు ట్రంప్ జనవరి 20న బాధ్యతలు స్వీకరించి ఆ విషయమై తన శాంతి ప్రయత్నాలు ఆరంభించేలోగా, రష్యాతో చర్చలలో ఉక్రెయిన్ బేరసారాల బలాన్ని వీలైనంత పెంచే పనిలో ఉన్నారు. తాను గెలిచినట్లయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమస్యను ఇరవై నాలుగు గంటలలో పరిష్కరించగలనని ఎన్నికల ప్రచార సమయంలో ప్రకటించిన ట్రంప్ శాంతి పథకమేమిటో అంచనా వేయటం అవసరం. మరి ఆయన గెలిచి మరొక యాభై రోజులలోనే పదవిని స్వీకరించనుండగా ఈ విషయమై ఏదైనా ఆలోచిస్తున్నట్లా?

రష్యా–ఉక్రెయిన్ యుద్ధ పరిష్కారానికి ఎన్నికల సమయంలో ట్రంప్ ఎటువంటి పథకాన్ని సూచించలేదంటూ చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. అయితే, ఆయన దాని గురించి ఆలోచించటమే కాదు, రష్యా – ఉక్రెయిన్ సమస్యపై తన ప్రతినిధిగా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెల్లోగ్‌ను 28వ తేదీన నియమించారు కూడా. జనరల్ కెల్లోగ్‌తో పాటు, ట్రంప్ ఇప్పటికే చేసిన వ్యాఖ్యలను, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తన వ్యవహరణను గమనించి నట్లయితే, సమస్యకు ట్రంప్ ప్రభుత్వం సూచించే పరిష్కారమేమిటో కొంత అవగతమవుతుంది. ట్రంప్ మాటలను ఇప్పటికే చూశాం గనుక, కొత్తగా రంగంలోకి వస్తున్న జనరల్ కెల్లోగ్ వైఖరిని గమనిద్దాం. ఆయన ట్రంప్ మొదటి పాలనా కాలంలో జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు. ఉక్రెయిన్ సమస్యపై కొంతకాలం క్రితమే తన ఆలోచనలను వివరిస్తూ ఒక పత్రాన్ని ప్రకటించారు. ఇతరత్రా టెలివిజన్ చర్చ వంటి వాటిలో పాల్గొన్నారు.



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా 'ఎన్నికైన' అధ్యక్షుడు ట్రంప్

ముందు కాల్పుల విరమణ

కెల్లోగ్ ప్రకారం, ముందుగా రష్యా, ఉక్రెయిన్‌లు కాల్పుల విరమణ పాటించాలి. ఉభయుల సేనలు ఆ విరమణ రోజుకు ఎక్కడ ఉంటాయో అక్కడ ఆగిపోవాలి. తర్వాత చర్చలు మొదలు కావాలి. దీనంతటికీ ఉక్రెయిన్ అంగీకరించకపోయినట్లయితే వారికి సహాయం నిలిపివేయాలి. రష్యా కాదన్న పక్షంలో ఉక్రెయిన్‌కు సహాయం కొనసాగించాలి. పోతే, రాజీ కోసం ఉక్రెయిన్ కొంత భూభాగాన్ని రష్యాకు వదలుకోవలసి రావచ్చు. అదేవిధంగా, నాటోలో సభ్యత్వ విషయం నిరవధికంగా వాయిదా పడుతుంది. ట్రంప్ ఈ మాటలు ఇంత నిర్దిష్టంగా చెప్పలేదుగానీ, ఉక్రెయిన్‌కు సహాయంపై నియంత్రణలు, వారు తమ భూభాగాన్ని కొంత వదులు కోవలసి రావటం గురించిన ప్రస్తావనలు స్పష్టంగానే చేశారు. అవి యూరప్ అంతటా కలవరం సృష్టించాయి. ట్రంప్ వైఖరిని మార్చేందుకు జెలెన్‌స్కీ చేసిన ప్రయత్నాలు నెరవేర లేదు.

ఇదే పథకం అమలుకు ట్రంప్ ప్రయత్నించినట్లయితే పరిస్థితి ఏ విధంగా ఉండవచ్చు? భూభాగం వదులుకునేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు అంగీకరిస్తారా? ఒకవేళ అంగీకరిస్తే ఏ మేరకు అనే కీలకమైన ప్రశ్నను అట్లుంచితే, మొదట కాల్పుల విరమణకు, సేనలను యథాతథ స్థితిలో నిలిపివేయటానికి సమ్మతించటంలో ఎవరికీ సమస్య ఉండకపోవచ్చు. ట్రంప్ ప్రభుత్వ ఆధ్వర్యంలో చర్చలకు సిద్ధమని జెలెన్‌స్కీతో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే ప్రకటించారు. చర్చల సందర్భంగా జనరల్ కెల్లోగ్ ప్రతిపాదనలు ఏ దశలో ముందుకు వచ్చేదీ చెప్పలేము గానీ, మొదట మాత్రం రష్యా, ఉక్రెయిన్ దేని షరతులు అది విధిస్తుంది. ఆ షరతులేమిటో మనకు ఇప్పటికే తెలుసు. 2014 నుంచి తమ ఆక్రమణలో గల క్రిమియాను ఉక్రెయిన్ తిరిగి కోరకపోవటం, ఉక్రెయిన్ తూర్పున రష్యన్ జాతీయులు ఆధిక్యతలో గల డోన్‌బాస్ ప్రాంతాన్ని తమకు వదలటం, నాటోలో చేరకుండా తటస్థంగా ఉండటమన్నవి రష్యా షరతులు. నాటో సభ్యత్వం సంగతి ఎట్లున్నా తమ భూభాగాలన్నింటిని తమకు తిరిగి అప్పగించటం, తమ రక్షణకు పూర్తి హామీలు లభించటం ఉక్రెయిన్ షరతులు.

భూభాగాలను వదులుకోవాల్సిందే!

నల్ల సముద్రంలోని క్రిమియా తమ అధీనంలో లేనట్లయితే రష్యా సముద్ర వాణిజ్యం శీతాకాలం పొడవునా స్తంభించి పోతుంది. కనుక ఆ ప్రాంతాన్ని 2014లో ఆక్రమించిన రష్యా, దానిని వదలుకునేందుకు ససేమిరా అంగీకరించదు. ఈ వాస్తవ స్థితిని అప్పటినుంచే గ్రహించిన ఉక్రెయిన్, అమెరికా శిబిరాలు బయటకు కాకున్నా అంతర్గతంగా రాజీ పడిపోయాయి. పోతే, డోన్‌బాస్ ప్రాంతంలోని రష్యన్లను ఉక్రెయిన్ రకరకాలుగా వేధించటం ఎప్పటినుంచో ఉంది గనుకనే ఆ భూభాగాలను రష్యాలో విలీనం చేసుకుని తీరగలమని పుతిన్ ప్రకటించారు. ప్రస్తుత యుద్ధ కాలంలో అందులో అధిక భాగాన్ని ఆక్రమించారు కూడా. మరొకవైపున కనిపించే ఆసక్తికరమైన అంశాలు మూడున్నాయి. తమ ప్రభుత్వ వైఖరి ఏమైనప్పటికీ రష్యాతో శాంతి కోసం కొంత భూభాగం వదులు కోవచ్చుననే ఉక్రెయిన్ ప్రజల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఒకవైపు ఉక్రెయిన్‌కు యుద్ధంలో మద్దతిస్తూనే యూరోపియన్ దేశాలు కూడా ఇదే మాట పరోక్షంగా సూచిస్తున్నాయి. యుద్ధానికి నిరవధికంగా సహాయం చేసేందుకు అవి పైకి అవునన్నా వాస్తవంలో సిద్ధంగా లేవు. ఇదంతా పరిగణించినప్పుడు, ఉక్రెయిన్ ఈ రాజీకి సిద్ధపడవలసి ఉంటుందనిపిస్తుంది. అయితే, ఎంత భూభాగమన్నది ప్రశ్న.

ఒకసారి యుద్ధం ముగిసినట్లయితే రష్యా నుంచి ముప్పు అన్నదే ఉండదు గనుక, ఉక్రెయిన్‌కు తను కోరుతున్న ప్రకారం రక్షణలు కల్పించటం సమస్య కాకపోవచ్చు. అయితే, నాటో సభ్యత్వ ప్రశ్న చిక్కుల మారిది. సభ్యత్వం కావాలన్నది ఉక్రెయిన్ కోరిక. రష్యా నుంచి ఎప్పటికైనా ఉక్రెయిన్‌కే గాక తక్కిన యూరప్‌కు సైతం ప్రమాదం ఉండవచ్చునని, కనుక ఉక్రెయిన్‌కు సభ్యత్వమిస్తూ నాటోను మరింత శక్తిమంతం చేసుకోవాలన్నది యూరోపియన్ యూనియన్ కోరిక. నిజానికి అది అమెరికాకు మొదటినుంచీ ఉన్న వ్యూహం. ఒకప్పటి సోవియెట్ యూనియన్‌తో పాటు వారి నాయకత్వాన ఉండిన వార్సా సైనిక కూటమి 1991లోనే రద్దయినా, రష్యాను దిగ్బంధంలోనే ఉంచేందుకు అమెరికన్లు తమ సైనిక కూటమి నాటోను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే 1991 తర్వాత మరొక 12 యూరోపియన్ దేశాలను నాటోలో చేర్చుకుని రష్యా సరిహద్దుల వైపు విస్తరించారు. ఆ సరిహద్దుల వెంట గల చివరి దేశం ఉక్రెయిన్ కావటం వల్లనే రష్యా తన భద్రత పట్ల ఇంత ఆందోళన చెందుతూ ప్రస్తుత యుద్ధానికి సమకట్టింది. వార్సా కూటమి రద్దయిన దరిమిలా నాటోను విస్తరించబోమంటూ ఇచ్చిన హామీని అమెరికా ఉల్లంఘిస్తూ ఇదంతా చేయటమన్నది వారి ఆగ్రహానికి కారణం.

నాటో సభ్యత్వం ఉందదా?

ఉక్రెయిన్ నాటో సభ్యత్వ విషయం నిరవధికంగా వాయిదా పడగలదని జనరల్ కెల్లోగ్ అంటున్నారు గానీ, అసలు ఉండబోదని, రష్యా కోరుకున్నట్లు ఉక్రెయిన్ తటస్థంగా ఉండగలదని మాత్రం అనటం లేదు. చర్చల సమయంలో రష్యా ఈ షరతును తీసుకురాగలదు. అందుకు ట్రంప్, తద్వారా యూరోపియన్ యూనియన్ అంగీకరించినట్లయితే తప్ప, ఈ నిర్దిష్ట సమస్యపై రాజీ సాధ్యం కాదు.

పోతే, ప్రస్తుత యుద్ధం ప్రపంచ యుద్ధానికి, అణుయుద్ధానికి దారితీయవచ్చుననే ఊహాగానాలు కొద్ది కాలం పాటు సాగి ఆందోళనలు సృష్టించాయి. పరిణామాలను గమనించినపుడు అటువంటి అవకాశాలు లేవని అర్థమైంది. రష్యాపైకి దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ అనుమతించటంగానీ, అందుకు ప్రతిగా రష్యా మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించటం గానీ, కర్స్క్ ప్రాంతంలోకి చొచ్చుకు వచ్చిన ఉక్రెయిన్ సేనల నిర్మూలనకు ఉత్తర కొరియా సేనలను రష్యా మోహరించటం గానీ, చర్చల సమయానికి తమది పైచేయిగా ఉండాలనే చివరిదశ ప్రయత్నాలు తప్ప మరొకటికాదు. ఇటువంటి వ్యూహాలు ఏ యుద్ధంలోనైనా సాధారణం. ఇదే వ్యూహానికి అనుగుణంగా, చర్చల కాలం వరకు యుద్ధం మరింత తీవ్రరూపం తీసుకున్నా ఆశ్చర్యపడనక్కర లేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మన దేశం

మోదీని సమర్థించే వారు, ఆయనను బయట పెట్టేవారు అనే రెండు వర్గాలుగా మన దేశం విభజితమైంది. నిశ్శబ్దంగా ఉండేవారు మొదటి వర్గంలోకి వస్తారు.

– కీర్తి దేవలేకర్, వ్యాఖ్యాత

పుర్రెలన్నీ ఒకటే!

1930లో 24 ఏళ్ల భారతీయ యువతి జర్మనీలో పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఆమె థీసిస్? జర్మన్, తూర్పు ఆఫ్రికన్ పుర్రెల కొలతల ఆధారంగా శ్వేతజాతి ఆధిపత్యాన్ని నిరూపించడం. దానికిగానూ 'తెల్ల పుర్రెలు' కుడి మెదడును బాగా అభివృద్ధి చేసుకున్నాయని చెప్పడం. ఇది ఆమె గైడ్ యూజెన్ ఫిషర్ సిద్ధాంతం. కానీ 150 పుర్రెలను పరిశీలించిన తర్వాత, ఆమె కనుగొన్న విషయాలు గైడ్ సిద్ధాంతానికి విరుద్ధంగా తేలాయి. అయినా అదే గైడ్‌కు 'తెలుపు', 'నలుపు' పుర్రెల మధ్య తేడా లేదంటూ థీసిస్‌ను సమర్పించడానికి దమ్ముండాలి. ఆమె భారతదేశపు మొదటి మానవ శాస్త్రవేత్త, రచయిత్రి ఇరావతీ కర్వే (ఆమె జీవిత కథ 'ఇరు' విడుదలైన నేపథ్యంలో.)

– సుష్మా దాతే, వైద్యురాలు

రెండు దేశాలు

దేశంపై యుద్ధానికి దిగిన అజ్మల్ కసబ్‌కు కూడా న్యాయపరమైన రక్షణ ఉండేలా భారత్ చూసుకుంది. కానీ అదే బంగ్లాదేశ్‌లో, మైనారిటీ హక్కుల కోసం పోరాడుతున్న చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేశారు. వాదిస్తున్న న్యాయవాదిపై క్రూరమైన దాడి జరిగినట్లు వచ్చిన నివేదికల తర్వాత, ఆయనకు ఇప్పటికీ న్యాయవాది దొరకలేదు.

– బర్ఖా దత్, జర్నలిస్ట్

ఆచరణాత్మక హింస

బంగ్లాదేశ్ సాధువులు, అనుచరులకు తిలకం లేదా వారి హిందూ విశ్వాసపు బాహ్య ప్రదర్శనను వద్దని ఇస్కాన్ సూచించింది. మతపరమైన హింస అంటే ఇలా ఉంటుంది. భారతదేశంలో లాగా టీవీలో అరుచుకోవడం కాదు.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

వదిలేసుకున్నట్టే!

ఆచరణలో ఉక్రెయిన్ తన భూభాగాలను వదిలేసుకుంది. కీవ్ నుండి వస్తున్న అన్ని ప్రకటనలను చూడండి. భూభాగాలను వెనక్కి తీసుకోవడం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఇప్పుడు వారి కీలకమైన డిమాండల్లా నాటో సభ్యత్వమే. కానీ ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం పొందడం అనేది, ఉక్రెయిన్ కోల్పోయిన తన భూభాగాలను వెనక్కి తీసుకునేంత ప్రాస్పదృష్టి గలదే.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఎవరు సీఎం?

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్‌ను కాకుండా ఇంకెవరినైనా ఎంపిక చేయడం బీజేపీ తీసుకోగల తెలివితక్కువ నిర్ణయం అవుతుంది. ఎవరో ఒక ద్వితీయ శ్రేణి నాయకుడిని ముఖ్యమంత్రిని చేయడం కోసం షిండే, పవార్‌ను పక్కన పెట్టడాన్ని ఊహించండి. ఇది ఆత్మహత్యా సదృశం. ముఖ్యంగా పురోగతి వైపు పయనిస్తున్న రాష్ట్రానికి ఇది తగనిది.

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

కాప్29... గత చరిత్రకు కొనసాగింపే!

అభిప్రాయం
దినేశ్ సి. శర్మ

అజర్‌బైజాన్ రాజధాని బాకూలో ఇటీవలే ముగిసిన వాతావరణ చర్చలకు సంబంధించిన 'కాప్' (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) 29, వివాదాస్పద ఒప్పందంతో ముగిసింది. వాతావరణపరమైన సహాయాన్ని (క్లైమేట్ ఫైనాన్స్) ఈ చర్చల్లో కేంద్ర ఇతివృత్తంగా భావించారు. ఇది వాతావరణ మార్పులను పరిష్కరించే ఉపశమనం, అనుసరణ చర్యలకు మద్దతునిచ్చే స్థానిక, జాతీయ లేదా అంతర్జాతీయ ఫైనాన్సింగ్‌ను సూచిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు... వాతావరణ మార్పుల సవాలును ఎదుర్కోవటానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టడానికి ఉపయోగపడే అదనపు నిధులను దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నాయి. అదీ ధనిక దేశాలు ఎక్కువ బాధ్యత వహించాలని అంటున్నాయి. ప్రస్తుత సంక్షోభానికి ప్రధానంగా వారిదే బాధ్యత కాబట్టి. పారిశ్రామిక విప్లవ కాలం నుండి ఉత్తరార్ధ గోళం నుండి వచ్చిన చారిత్రక ఉద్గారాలు వాతావరణ సంక్షోభానికి దారితీశాయి. క్లైమేట్ ఫైనాన్స్‌లోని గణనీయ భాగం, దాని మూలం చాలా కాలంగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య రగులుకుంటున్న అంశంగా ఉంటూ వస్తోంది.

ఈ నేపథ్యంలోనే బాకూ చర్చలు... ఒప్పందంపై మంచి అంచనాలను, ఆశలను పెంచాయి. మొత్తానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2035 నాటికి ప్రతి సంవత్సరం కనీసం 300 బిలియన్ డాలర్ల క్లైమేట్ ఫైనాన్స్ చేయాలనేది ఈ సదస్సు అంతిమ నిర్దేశం అయ్యింది. పబ్లిక్, ప్రైవేట్, ద్వైపాక్షిక, బహుపాక్షిక, ప్రత్యామ్నాయ వనరులతో సహా డబ్బు అనేక రకాల వనరుల నుండి సేకరించాలని నిర్దేశించుకున్నారు. ఈ నిధులను అందించడంలో, అభివృద్ధి చెందిన దేశాలు ముందుంటాయి. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వచ్ఛందంగా సహకారం అందించవచ్చు.

బాకూ చర్చల సమయంలో నిర్దేశించబడిన ఆర్థిక లక్ష్యం, ఉండవలసిన లక్ష్యం కంటే చాలా తక్కువగా ఉంది. పైగా అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరిన కాలపరిమితి ప్రకారం 2025 నుండి అభివృద్ధి చెందిన దేశాలు ప్రతి సంవత్సరం 1.3 ట్రిలియన్ డాలర్ల ఫైనాన్స్‌ని సమీకరించాల్సి ఉంది. ఎటువంటి తక్షణ కట్టుబాట్లనైనా నివారించడం కోసం లక్ష్యాన్ని నీరుగార్చడం, చాలా ఎక్కువ కాల వ్యవధిని విధించడం అనేది ఇప్పుడు గ్లోబల్ నార్త్ సుపరిచితమైన వ్యూహం. అంతేకాకుండా, వాగ్దానం చేసిన నిధులు కేవలం ధనికుల నుండి మాత్రమే రావు. అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా దీనికి సహకరించాలి. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలను కలవరపెడుతుందని చెప్పవచ్చు. చర్చల ముగింపు సమయంలో, భారతదేశం, బొలీవియా, నైజీరియా ఈ బలహీనమైన ఒప్పందంపై తమ ఆందోళనలను వ్యక్తం చేశాయి. దీనిని అధికారికంగా 'న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ ఆన్ క్లైమేట్ ఫైనాన్స్' అని పిలిచారు.

వాతావరణ మార్పుల సవాలును ఎదుర్కోవడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక, సాంకేతిక వనరులు అవసరం. ఉపశమనానికి డబ్బు అవసరం. దీనర్థం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, ఇంధన సామర్థ్యం, జీవన సహజ వనరులు, భూ వినియోగం నిర్వహణ, భూ– జల జీవవైవిధ్యం, స్వచ్ఛమైన రవాణా వంటి వాటికి మద్దతు ఇవ్వడానికి నిధులు సమకూర్చడమన్నమాట. వాతావరణ ప్రతికూల ప్రభావాలను తగ్గించడం, తట్టుకోవడం కోసం అదనపు నిధులు అవసరం అనేది రెండో ఆవశ్యకత. ఉదాహరణకు, తుఫానులను, వరదలను తట్టుకోగల మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నిధులు; పెరుగుతున్న సముద్ర మట్టాలు ఉన్న ప్రాంతాల నుండి అవస్థాపన ప్రాజెక్టుల పునఃస్థాపనకు ఆర్థిక సహాయం, కరువు నిరోధక విత్తనాలను అభివృద్ధి చేయడం– సరఫరా చేయడం మొదలైన చర్యలు చేపట్టడానికి నిధుల అవసరం ఎంతైనా ఉంది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో దేశాలకు సహాయం చేయడానికి 'లాస్ అండ్ డామేజ్' అని పిలువబడే మూడవ వర్గం చర్యలు చేపట్టడానికీ అదనంగా క్లైమేట్ ఫైనాన్స్ అవసరం.



బాకూలో కాప్29 సదస్సు

ఆర్థిక లక్ష్యాన్ని కనిష్ఠంగా ఉంచడానికీ, వీలైనంత వరకు ఆలస్యం చేయడానికీ పాశ్చాత్య సంపన్న దేశాలు ఎత్తులు వేయడానికి ప్రయత్నించాయి. కొత్త, అదనపు నిధులు ఇవ్వడానికి కట్టుబడి ఉండే బదులు, ప్రస్తుతం ఉన్న అభివృద్ధి సహాయాన్నే క్లైమేట్ ఫైనాన్స్‌గా ముద్రవేయడానికి ప్రయత్నం జరిగింది. దీంతో ప్రైవేట్ పెట్టుబడులు, అలాగే అభివృద్ధి–బ్యాంకు రుణాలు, ప్రభుత్వ వ్యయం ద్వారా 'సమీకరించబడిన' ప్రైవేట్ ఫైనాన్స్ కూడా... క్లైమేట్ ఫైనాన్స్ గొడుగు కిందకు వచ్చాయి. ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుకుంటున్న ఆర్థిక నాణ్యతను పలుచన చేశాయి.

అమెరికాలో ట్రంప్ తిరిగి అధికారంలోకి రావడం, ఆయన వాతావరణ వ్యతిరేక వైఖరులు... బలహీనమైన ఆర్థిక ఒప్పందాన్ని ముందుకు తీసుకురావడానికి అభివృద్ధి చెందిన దేశాలను ప్రభావితం చేశాయి. ట్రంప్ గతంలో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చేసిన విధంగానే అమెరికా బహుపాక్షిక వాతావరణ ఫ్రేమ్‌వర్క్ నుండి వైదొలిగితే, అది యూఎన్‌ఎఫ్‌సీసీసీని నిర్వీర్యం చేయడంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఈ దేశాలు భయపడ్డాయి. ఐరోపాలోని మితవాద ప్రభుత్వాలు కూడా విదేశీ క్లైమేట్ ఫైనాన్స్‌కు తమ కట్టుబాట్లను తగ్గించుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఐక్యరాజ్యసమితి ప్రక్రియ ప్రకారం, అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్‌తో సహా 24 అభివృద్ధి చెందిన దేశాలు... అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాతావరణ ఆర్థిక సహాయం అందించాలి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ఈ ప్రక్రియ నుండి వైదొలగితే, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువ భారాన్ని మోయవలసి ఉంటుంది. అందువల్ల, అభివృద్ధి చెందుతున్న దేశాలు బలహీనమైన ఒప్పందానికి అంగీకరించేలా అభివృద్ధి చెందుతున్న దేశాలను ఒప్పించాయి.

వాస్తవ ద్రవ్యం అందుబాటులో లేని స్థితిలో, బాకూ వాతావరణ ఒప్పందం వల్ల వాతావరణ మార్పులను పరిష్కరించడానికి ఎటువంటి తోడ్పాటు వచ్చే అవకాశం లేదు. కర్బన ఉద్గారాలు పెరుగుతూనే ఉన్నాయి. శిలాజ ఇంధనాలకు దూరంగా పరివర్తనం చేయడం పెద్దగా పురోగతిని సాధించలేదు. దుబాయ్‌లో జరిగిన కాప్28 సదస్సు బొగ్గు, చమురు, గ్యాస్‌లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చింది. చమురు, గ్యాస్ ఉత్పత్తి చేసే దేశాలు కూడా ఆ పిలుపుకు మద్దతు ఇవ్వడంతో ఇది ఒక సంచలనాత్మక పరిణామంగా ప్రశంసించబడింది. కానీ ఆ పిలుపును కార్యాచరణలోకి తేవడానికి బాకూలో తదుపరి చర్యల గురించి చర్చించలేదు. కాబట్టి, మరో కాప్ సదస్సు వరకు ఇది యథావిధి వ్యవహారం కానుంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఇహలోక పుణ్యమే రక్ష!

సత్య యుగంలో హరిశర్మ అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు ధనవంతుడయినా, లోభ గుణంతో తాను సరిగా తినడు. అలాగే భార్యాపిల్లలకు తృప్తిగా భోజనం పెట్టక బాధించేవాడు. అదే ఊళ్ళో ఆర్తత్రాణ పరాయణి అనే వేశ్య ఉండేది. ఆమె చాలా ఆస్తి సంపాదించింది. వయసు మళ్ళాక వైరాగ్యం పొంది తను సంపాదించిన ధనంతో పేదలకు అన్నదానం చేస్తూ మంచి పేరు తెచ్చుకుంది. అదే ఊళ్ళో విశాలాక్షి ఒక బాల వితంతువు ఉండేది. ఆమె ప్రతి వేసవిలో దాహార్తులకు మంచి నీరు ఇవ్వటానికి చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆమె వల్ల ఎందరో బాటసారులు, దాహార్తులకు మంచి నీరు లభించింది.

జ్యోతిర్మయం

కాలాంతరంలో ముగ్గురూ మరణించారు. యముడు వారి పాప పుణ్యాలు పరిశీలించి వీరు ముగ్గురూ పుణ్యాత్ములే అని వారిని వైకుంఠానికి పంపాడు. వైకుంఠంలో అన్ని భోగాలున్నా హరిశర్మకు ఆహారం లేదు. ఆకలికి తట్టుకోలేక విష్ణువుకు మొర పెట్టుకున్నాడు. విష్ణువు అతణ్ణి బ్రహ్మ దగ్గరికి పంపాడు. బ్రహ్మ 'ఆ వ్యభిచారిణి పేదలకు అన్నదానం చేసింది. ఆ బాల వితంతువు మండుటెండలో దాహార్తులకు జలదానం చేసింది. అన్నోదక దానాలకు మించిన దానాలు లేవు. మరి నువ్వలా ఏదైనా దానం చేశావా' అనడిగాడు. హరిశర్మ లేదన్నాడు. 'అయినా, నేను విష్ణువుని శ్రద్ధగా పూజించాను' అన్నాడు. బ్రహ్మ, 'పోనీ, ఆ విష్ణువుకైనా ఎప్పుడైనా పిడికెడు అన్నం నైవేద్యం పెట్టావా? లేదు కదా! అక్కడ పెట్టిందే ఇక్కడ పుడుతుంది. భూలోకంలో ఏ దానం చేయని నీకు ఇక్కడ ఆహారం ఎలా దొరుకుతుంది?' అన్నాడు. 'మరి నాకెలా' అన్న హరిశర్మతో బ్రహ్మ 'నీ పిల్లలకు స్వప్నంలో కనబడి రోజుకొక్కరికైనా అన్నదానం చేయమను. అక్కడ వారు చేస్తే నీకిక్కడ అన్నం పుడుతుంది' అని చెప్పాడు.

మనిషికి, తను చేసిన పుణ్య కార్యాలు, దాన ధర్మాలు, అవసరంలో ఉన్నవారికి చేసే సహాయం, మంచితనం... ఇవే ఇహంలోనూ, పరంలోనూ తోడు ఉంటాయి, మేలు చేస్తాయి అని చెప్పే ఒక పురాణ కథ ఇది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

యాసంగిలో 42.11 లక్షల ఎకరాలకు సాగునీరు

- అన్ని ప్రాజెక్టుల ద్వారా 365 టీఎంసీలు సరఫరా
- స్కివం కమిటీ సమావేశంలో నిర్ణయం
- 24 లక్షల ఎకరాల్లో వరి.. మిగతావి ఆరుతడి పంటలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కింద యాసంగిలో 42.11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని రాష్ట్ర స్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ (స్కివం) నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జలసౌధలో సమావేశమైన కమిటీ.. ప్రాజెక్టులవారీగా నీటి లభ్యత, ఎగువ నుంచి రానున్న ప్రవాహాలను అంచనా వేసి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రాజెక్టుల కింద 42,11,477 ఎకరాలకు మొత్తం 365.28 టీఎంసీల నీటిని అందించాలని ఈ సమావేశం తీర్మానించింది. అందులో 24,19,274 ఎకరాల్లో వరి, 17,92,203 ఎకరాల్లో ఆరుతడి పంటలున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద 1,63,205 ఎకరాల్లో ఆరుతడి, 4,74,180 ఎకరాల్లో వరి పంటకు నీరివ్వాలని నిర్ణయించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద 1,64,450 ఎకరాల్లో ఆరుతడి, 16 వేల ఎకరాల్లో వరి పంటకు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 2,60,177 ఎకరాల్లో ఆరుతడి, 20 వేల ఎకరాల్లో వరి పంటకు, నిజాంసాగర్ కింద 124,192 ఎకరాలకు, గుత్ప ఎత్తిపోతల కింద 32 వేల ఎకరాలు, కడెం ప్రాజెక్టు కింద 34 వేల ఎకరాలకు, జూరాల కింద 34 వేల ఎకరాలకు, ఎల్లంపల్లి రెండో దశ కింద 29 వేల ఎకరాలకు, కోయిల్‌సాగర్ కింద 8 వేల ఎకరాలు, రాజీవ్ భీమా కింద 29 వేల ఎకరాలకు, నెట్టెంపాడు కింద 24 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు.

ఇసుక బంకర్‌లో కూరుకుపోయి..

- ఇన్‌చార్జ్ మేనేజర్ దుర్మరణం
- సింగరేణి ఆర్జీ–2లో విషాదం


సత్యనారాయణ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): ఇసుక బంకర్‌లో కూరుకుపోయి ఓ ఇన్‌చార్జ్ మేనేజర్ సజీవసమాధి అయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సింగరేణి రామగుండం డివిజన్–2 పరిధి జీడీకే–7ఎల్ఈపీ గని లోని స్టవింగ్ బంకర్‌వద్ద పేరుకుపోయిన బాటం యాష్‌ను తొలగించేందుకు ఇన్‌చార్జ్ మేనేజర్ తీట్ల సత్యనారాయణ(45) మంగళవారం మరో కార్మికుడితో కలిసి బంకర్‌లోకి దిగారు. అయితే ఆ కార్మికునికి సేఫ్టీబెల్ట్ ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సత్యనారాయణకు సేఫ్టీబెల్ట్ లేకపోవడంతో బంకర్‌లోని చూట్ వద్దకు వెళ్లి పడిపోయాడు. పక్కన పేరుకుపోయిన యాష్ అతడిపై పెద్దమొత్తంలో కప్పేసింది. సత్యనారాయణ అందులో కూరుకు పోయి శ్వాస ఆడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో సూపరింటెండెంట్ మాధవరావు నేతృత్వంలో రెస్క్యూ బృందం ఘటన స్థలానికి చేరుకుని నాలుగు గంటల పాటు ఆపరేషన్ నిర్వహించింది. ముందుగా కార్మికుడు కొంతమేర కూరుకుపోవడంతో అతడి ని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం బంకర్‌లో కూరుకుపోయిన సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన ప్రాంతాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్.రాజ్‌ఠాగూర్, ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ఇతర అధికారులు పరిశీలించారు. కాగా మూసివేసిన జీడీకే–7 ఎల్ఈపీ గని మేనేజర్ సెలవుపై వెళ్లడంతో, ప్రస్తుతం సత్యనారాయణ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మూసీలోకి పారిశ్రామిక వ్యర్థాలు..

సంగారెడ్డిలోని రుద్ర టెక్నాలజీస్ సంస్థ మూసివేతకు టీపీసీబీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: మూసీ నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు విడిచిపెడుతున్న కంపెనీలపై కఠినచర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) వెల్లడించింది. రాజేంద్రనగర్ మండలం హైదర్‌గూడ, అత్తాపూర్ బాపూఘాట్ వంతెన సమీపంలో మూసీలోకి ఓ ట్యాంకర్ ద్వారా వ్యర్థ జలాలను విడుదల చేయడం పీసీబీ అధికారులు ధ్రువీకరించారు. దీని తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పీసీబీ... సంగారెడ్డి జిల్లాలోని రుద్ర టెక్నాలజీస్ (గతంలో శ్రీనివాస ల్యాబ్స్) పరిశ్రమ మూసివేతకు మంగళవారం ఉత్తర్వు జారీ చేసింది. ఈ కంపెనీ మూసీ నదిలోకి అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నప్పుడు లంగర్ హౌస్ నివాసితులు పట్టుకున్నారు. అక్కడి ప్రజల ఫిర్యాదుతో రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పీసీబీ అధికారులు వ్యర్థాలు వదిలిన ప్రాంతాన్ని పరిశీలించారు. మూసీలోకి పైప్‌లైన్‌తో వ్యర్థాలను ట్యాంకర్లతో విడుదల చేయడాన్ని నిర్ధారించారు. మట్టి నమూనాలను మూసీ ఒడ్డు నుంచి కూడా సేకరించారు. అనంతరం ట్యాంకర్లో ఉన్న వ్యర్థాలు, ఇన్‌వాయిస్‌ను ధ్రువీకరించారు, దీని ప్రకారం ఈ వ్యర్థాలను రుద్ర టెక్నాలజీస్ నుంచి వికారాబాద్ జిల్లా కరణ్‌కోట్‌లోని మెసెర్స్ రాఘవేంద్ర కెమికల్స్ తీసుకొచ్చినట్టు తేల్చారు. గతంలోనే పీసీబీ రాఘవేంద్ర కెమికల్స్ మూసివేతకు ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఒక్కొక్కరిది ఒక్కో గాథ!



అడవిబాట పట్టి అసువులు బాసిన మావోయిస్టులు

అంతా పేద గిరిజన కుటుంబాలే...

ఏటూరునాగారం: విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితులైనవారు కొందరు. వివిధ రకాల పరిస్థితులు, వ్యక్తిగత సమస్యలు, వేధింపుల నేపథ్యంలో అడవి బాట పట్టిన వారు మరి కొందరు. ఏళ్ల తరబడి కుటుంబాలకు దూ రంగా ఉన్నారు. అకస్మాత్తుగా జరిగిన ఎన్ కౌంటర్‌లో అసువులు బాశారు. ఇన్నాళ్లూ ఎక్కడో ఒకచోట క్షేమంగా ఉన్నార్లే అను కున్న తల్లిదండ్రులు, బంధువులు.. విగత జీవులైన తమ పిల్లల్ని చూసి తల్లడిల్లిపో యారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారందరివీ నిరుపేద కుటుంబాలే కావడం గమ నార్హం. చెల్పాక ఎదురు కాల్పుల్లో నేలకొ రిగిన మావోయిస్టులను తీసుకెళ్లేందుకు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన ఆదివాసీలను 'సాక్షి' పలకరించింది.

చిన్నతనంలోనే అడవి బాట పట్టింది



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూర్వాడ తాలూకా బైరాన్‌గుట్ట గ్రామానికి చెందిన ముసాకి జమున తండ్రి రాజు, తల్లి కొసంగి చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పాటు గ్రామాల్లో సల్వాజుడుం, మావోయిస్టులు, పోలీసుల ఇబ్బందులు తాళలేక జమున తొమ్మిదేళ్ల వయస్సులోనే గ్రామానికి చెందిన మరి కొంతమందితో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లింది. అప్పట్నుంచీ తిరిగి వచ్చింది లేదు. ఇప్పుడు శవమై కన్పించింది.

– లక్ష్మణ్, జమున బాబాయి

వాళ్లపాటలు విని అడవిలోకిపోయిండు



మాది ఛత్తీస్‌గఢ్. నాకు ఇద్దరు కొడుకులు. చిన్నోడు ముసాకి కరుణాకర్ అలియాస్ దేవల్ అడవిలో అప్పు డప్పుడు వినిపించే పాటలకు ఆకర్షితుడై ఐదేళ్ల క్రితం అడవి బాట పట్టిండు. వాడి చిన్నతనంలోనే నా భార్య సోడి చనిపో యింది. ఇంటి దగ్గర ఉండమంటే అన్నల్లో చేరిండు. అప్పట్నుంచి కన్పించలేదు.

– ముసాకి బుజ్జ, కరుణాకర్ తండ్రి

22 ఏళ్ల క్రితం వెళ్లాడు



భద్రు (కుర్సం మంగు) పొలం పనులు చేసుకుంటూ ఉండేవాడు. 22 ఏళ్ల క్రితం సల్వాజుడుం కార్యకలాపాలు ముమ్మరంగా ఉన్న సమయంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన గొడవలు, అల్లర్లతో అడవిలోకి వెళ్లి ఇక రాలేదు. అడవిలోకి వెళ్లాక జానకిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమార్తె ఉంది.

– కుర్సం సోడి (సోమయ్య) భద్రు సోదరుడు. ఛత్తీస్‌గఢ్

గూడెంలోకి వచ్చేవారితో కలిసి వెళ్లాడు



మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు తాలూకా మలంపెంట. నా భర్త చనిపోయాడు. నేను నా పెద్ద కొడుకు, చిన్నోడు కామేష్ కూలి పనులు చేసుకుంటూ ఉండేవాళ్లం. కామేష్ 14 ఏళ్ల వయస్సులో మా గూడెంలోకి వచ్చేవారితో కలిసి అడవి లోకి వెళ్లాడు. ఇప్పటికి రెండేళ్లు అవుతోంది.

– కారం ఉంగి, కామేష్ తల్లి

మల్లయ్య మృతదేహాన్ని మరో రెండురోజులు భద్రపర్చండి

- ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పిటిషన్‌పై హైకోర్టు
- ఆధారాలు లేకుండా చట్ట ప్రక్రియను ఆపలేమని స్పష్టీకరణ
- తదుపరి విచారణ రేపటికి వాయిదా


జమున మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన పెద్దపల్లికి చెందిన మల్లయ్య మృతదేహాన్ని తదుపరి విచారణ వరకు భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇతర మృతదేహాలను వారి కుటుంబసభ్యులు అడిగితే అప్పగించవచ్చని సూచించింది. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది. ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, మత్తు పదార్థం/విషమిచ్చి పట్టుకుని కాల్చి చంపారని, తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూసేందుకు కూడా పోలీసులు అనుమతించడం లేదంటూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కాలవల ఐలమ్మ (మీనా) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు.

పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించారు

మీనా తరఫు న్యాయవాది సురేశ్ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ తన భర్త మృతదేహాన్ని చూసింది. మృతదేహంపై తీవ్ర గాయాలున్నాయి. పోలీసులు ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని ఉల్లంఘించారు. ఇంత హడావుడిగా రీ పోస్టుమార్టం ఎగ్జామినేషన్ (పీఎంఈ) చేశారంటేనే ఎన్‌కౌంటర్ బూటకం అని అర్థమవుతోంది. మృతదేహాలకు తిరిగి పీఎంఈ నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వాలి...' అని విజ్ఞప్తి చేశారు. పోలీసుల తరఫున హోంశాఖ జీపీ మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. 'తన భర్త మృతదేహాన్ని చూసేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చాం. పీఎంఈ వీడియో రికార్డు చేశాం. తమ వారి మృతదేహాలను అప్పగించాలని ఇతరుల తరఫు కుటుంబసభ్యులు కోరుతున్నారు..' అని కోర్టుకు తెలిపారు.

ఆధారాల్లేకుండా చట్ట ప్రక్రియను ఆపలేం

మావోయిస్టుల మృతదేహాలకు పీఎంఈ నిర్వహించాల్సిందిగా ఎలా ఆదేశిస్తామని హైకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. ఎనిమిది మంది వైద్య నిపుణులు రెండు బృందాలుగా పీఎంఈ చేశారని తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండా చట్ట ప్రక్రియ ఆపలేమని స్పష్టం చేసింది. విచారణ ముగిసేవరకు మృతదేహాలను కుటుంబసభ్యులకు స్వాధీనం చేయవద్దని కోరడం కూడా సమంజసం కాదని, శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. అయితే పెద్దపల్లికి చెందిన మల్లయ్య మృతదేహాన్ని మాత్రం తదుపరి విచారణ వరకు భద్రపర్చాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది.

నలుగురి మృతదేహాలు అప్పగింత

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధి చెల్పాకలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల్లో నలుగురి మృతదేహాలను మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మరో ఇద్దరివి వారి తరఫు ఎవరూ రాకపోవడంతో ఆస్పత్రిలోనే ఉంచారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన మధు అలియాస్ మల్లయ్య మృతదేహానికి రీ పోస్టుమార్టం కోరడంతో కోర్టు ఆదేశం మేరకు ఆస్పత్రి ఫ్రీజర్‌లోనే ఉంచారు. మావోయిస్టుల మృతదేహాలను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో భద్రపరిచిన విషయం తెలిసిందే.

ఇక ఎన్‌కౌంటర్లు ఉండవని ప్రకటించాలి

ప్రభుత్వానికి మానవ హక్కుల వేదిక డిమాండ్

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్‌లో ఎన్‌కౌంటర్లు ఉండవని ప్రభుత్వం ప్రకటించాలని మానవ హక్కుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్ విషయంలో పోలీసులు చెప్పే కథనానికీ, ఎన్‌కౌంటర్ మృతుడు మల్లయ్య భార్య మీనా ప్రత్యక్షంగా శవాన్ని పరిశీలించి చెప్పిన కథనానికీ ఎక్కడా పొంతన లేదని అభిప్రాయపడ్డారు. మృతదేహాల ఫొటో లను పరిశీలిస్తే.. బుల్లెట్ గాయాలతో పాటు ఇతర గాయాలున్నాయన్నారు. వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపత య్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు దశాబ్దాలుగా అధి కారంలో ఏ పార్టీ ఉన్నా మావో యిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హత మార్చడం ఒక ఉమ్మడి పాలసీగానే చేస్తున్నాయని విమర్శించారు. ఇటీవల కాలంలో ఎన్‌కౌంటర్ మృతులంతా ఆదివాసులేనన్నారు.

317 జీవో లోపాలను సరిదిద్దాలి: దేవీప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఏడాది పాలనలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని బీఆర్ఎస్ నేత దేవీ ప్రసాద్ విమర్శించారు. 317 జీవోపై ప్రభుత్వం వేసిన సబ్ కమిటీ ఆర్నెల్ల తర్వాత ఇచ్చిన నివేదిక కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని ఎద్దేవాచేశారు. పార్టీ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, భుజంగరావుతో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో దేవీప్రసాద్ మీడియాతో మాట్లాడారు. స్థానికత అంశాన్ని సబ్‌కమిటీ పూర్తిగా విస్మరించడంపై ఉద్యోగ సంఘాలు నిరసన తెలుపుతున్నాయన్నారు. ఖాళీల ఆధారంగా బదిలీలు ఉంటాయని సబ్‌కమిటీ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. 317 జీవో బాధితులను సీఎం కలవడం లేదని, జీవోలోని లోపాలను వెంటనే సరిదిద్ది 317 బాధితులకు న్యాయం చేయాలని దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం ఏడాది కాలంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగ భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు రూ.3 వేల కోట్లకు పైగా బకాయిలు, డీఏలు, పీఆర్సీ, హెల్త్‌కార్డులు, ఒకటో తేదీన వేతనాలు వంటి అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని దేవీప్రసాద్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలు నిర్వీర్యం

పాఠశాల ఎదుట ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరసన


గురుకుల పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజాపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని బీఆర్ఎస్ ఫైమెన్ కమిటీ సభ్యుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో 53 మంది విద్యార్థుల ప్రాణా లు పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మంగళవా రం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశా ల ను సందర్శించేందుకు ప్రవీణ్‌కుమార్ బీఆర్ ఎస్వీ నాయకులతో కలిసి వచ్చారు. ముందస్తు సమాచారం తెలుసుకున్న గురుకుల పాఠశాల సిబ్బంది పాఠశాల గేటుకు తాళం వేశారు. దీంతో ప్రవీణ్‌కుమార్ ప్రిన్సిపాల్ కు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో పాఠశాల సిబ్బందిని అడిగారు. ఉన్నతా ధికారుల ఆదేశాలమేరకు ఎవరినీ లోనికి రానివ్వడం లేదని సిబ్బంది తెలిపారు. దీంతో బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల గేటు వద్ద బైఠా యించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గొంగిడి మహేందర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అంజనేయులుగౌడ్, తుంగ బాలు పాల్గొన్నారు.

'ఉత్తమ' టీచర్.. చెత్త పనులు

- బాలికలతో వికృత చేష్టలు
- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు
- సస్పెండ్ చేసిన విద్యాశాఖ




మంచిర్యాల అర్బన్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు సభ్య సమాజం సిగ్గుపడేలా వ్యవహరించాడు. అభంశుభం తెలి యని బాలి కల పట్ల వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చిన ఈ కీచక ఉపాధ్యాయుడి ఉదంతం మంగళ వారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ పాఠశాలలో ఎస్ఏ(తెలుగు) టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.సత్యనారాయణ కొన్ని రోజులుగా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయురాలితో పాటు డీఈవో యాదయ్యకు సమాచారం అందించారు. ఆయన మంగళవారం ఎంఈవో, సెక్టోరల్ అధికారులను విచారణకు ఆదేశించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విచారణ చేప ట్టారు. సత్యనారాయణ అసభ్యకరంగా తాకుతున్నాడని, కళ్లు మూసుకుని ధ్యానం చేయాలంటూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడని బాలికలు పేర్కొన్నారు. మాటల్లో చెప్పరాని విషయాలను లిఖిత పూర్వకంగా ఇచ్చారు. విచారణ అధికారులు వెళ్లిన తర్వాత ఆ ఉపాధ్యాయుడిని బయటకు రావాలని తల్లిదండ్రులు పదేపదే పిలి చినా రాకపోవడంతో ఆగ్రహించి దేహశుద్ధి చేశారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సత్యనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో ప్రకటించారు. కాగా, సత్యనారాయణ గతంలో ఉత్తమ టీచర్ అవార్డు కూడా అందుకున్నట్లు తెలుస్తోంది.

అంగీకరించకపోతే పక్కన పెట్టేస్తాం

- గోదావరి–కావేరి అనుసంధానంపై తేల్చి చెప్పిన కేంద్రం
- రాష్ట్రాలు నాలుగేళ్లుగా నాన్చుతున్నాయంటూ అసంతృప్తి
- కేటాయింపులు పెంచాలన్న విజ్ఞప్తులు సాధ్యం కాదని స్పష్టీకరణ
- జాతీయ ప్రయోజనాల దృష్ట్యా సమ్మతి తెలపాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టుకు రాష్ట్రాలన్నీ సమ్మతి తెలపాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కోరారు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్రాలు నాలుగేళ్లుగా నాన్చుడు వైఖరిని అవలంబిస్తున్నాయని, పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో పదేళ్లు గడిచినా ప్రాజెక్టు ముందుకు కదలదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రాలు సహకరించకపోతే ప్రాజెక్టును పక్కనపెట్టక తప్పదని తేల్చి చెప్పారు. రాష్ట్రాలన్నింటికీ సాధ్యమైనంత గరిష్ఠంగా నీటి కేటాయింపులు చేశామని, ప్రాజెక్టు ద్వారా 148 టీఎంసీలే తరలిస్తున్నందున కేటాయింపులు పెంచాలన్న రాష్ట్రాల డిమాండ్లను నెరవేర్చడం సాధ్యం కాదని కూడా చెప్పారు. నదుల అనుసంధానంపై మంగళవారం ఢిల్లీలో జరిగిన నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశంలో ఆమె మాట్లాడారు. నెలాఖరులోగా రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధిపతులతో ఢిల్లీలో ప్రత్యక్ష విధానంలో సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నించాలని ఎన్‌డబ్ల్యూడీఏకు దేబశ్రీ సూచించారు. జనవరిలో అన్ని రాష్ట్రాల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామని చెప్పారు.



తెలంగాణకు 50% కోటా ఇవ్వలేం..

ప్రాజెక్టు ద్వారా తరలించనున్న 148 టీఎంసీల్లో 50 శాతం తమకు కేటాయించాలన్న తెలంగాణ డిమాండ్‌ను దేబశ్రీ తోసిపుచ్చారు. గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద కొత్త బరాజ్ నిర్మించడానికి బదులు సమ్మక్క బరాజ్ నుంచే నీళ్లను తరలించాలనే తెలంగాణ ప్రతిపాదనలను పరిశీలి స్తున్నామని చెప్పారు. సమ్మక్క బరాజ్‌లో 83 మీటర్ల నీటి మట్టానికి ఎగువన లభ్యతగా ఉండే నీళ్లను మాత్రమే ఈ ప్రాజెక్టులో భాగంగా తరలించాలని, ఆ మేరకు నీటి లభ్యతను తేల్చడానికి సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించాలన్న రాష్ట్రం సూచనను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా నల్లగొండ జిల్లాలో రెండు కొత్త రిజర్వాయర్లు నిర్మించాలని రాష్ట్రం చేసిన మరో ప్రతిపాదనకు సూత్రప్రాయంగా సమ్మతి తెలిపారు. సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, సీఈ మోహన్ కుమార్, గోదావరి బేసిన్ డీడీ సుబ్రమణ్యం ప్రసాద్ మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్–2 తేల్చిన తర్వాతే నాగార్జునసాగర్ ప్రాజెక్టును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకోవాలని చెప్పారు. తక్కువ భూసేకరణ చేసేలా ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను రూపొందించాలని కోరగా దేబశ్రీ అంగీకరించారు.

పోలవరం నుంచి అనుసంధానం సాధ్యం కాదు

పోలవరం ప్రాజెక్టు నుంచి నదుల అనుసంధానం చేపట్టాలని ఏపీ చేసిన విజ్ఞప్తిని దేబశ్రీ తోసిపుచ్చారు. పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లను తరలిస్తే ఏపీ, తమిళనాడు, పాండిచ్చేరి మాత్రమే లబ్ధి పొందుతాయని, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర భాగస్వామ్యం కోల్పోతాయని స్పష్టం చేశారు. ఏపీ భూభాగం పరిధిలో రెండు నదుల అనుసంధానానికి ప్రతిపాదనలతో వస్తే సహకరిస్తామని హామీ ఇచ్చారు.

కర్ణాటకకు కోటా పెంచలేం..

తమ రాష్ట్ర భూభాగంలో మాత్రమే జరగనున్న బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ప్రాజెక్టును గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టు పరిధి నుంచి తొలగించాలని కర్ణాటక చేసిన విజ్ఞప్తిపై దేబశ్రీ ముఖర్జీ సానుకూలంగా స్పందించారు. గోదావరి–కావేరి ప్రాజెక్టులో కర్ణాటకకు 16 టీఎంసీల తాగునీరు మాత్రమే కేటాయించారని, సాగునీరును సైతం కేటాయించాలని చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. తాము ఇప్పటికే సమ్మతి తెలుపుతూ ఎంఓయూపై సంతకాలు చేశామని తమిళనాడు, పుదుచ్చేరిలు తెలిపాయి. తమ రాష్ట్రం సొంతంగా చేపట్టిన దామన్‌గంగా–వైతర్ణ–గోదావరి నదుల అనుసంధానాన్ని గోదావరి–కావేరి ప్రాజెక్టు కింద చేర్చాలని మహారాష్ట్ర విజ్ఞప్తి చేసింది.

పౌర సరఫరాలశాఖ వార్షిక ప్రగతి భేష్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏడాది పాలనలో పౌరసరఫరాల శాఖ సాధించిన ప్రగతి సంతృప్తినిచ్చిందని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో వార్షిక ప్రగతిపై సమీక్షించారు. తెలంగాణ ఏర్పడే నాటికి పౌరసరఫరాల కార్పొరేషన్‌పై రూ.4,747.12 కోట్లు ఉన్న రుణం గత ప్రభుత్వ హయాంలో రూ.58,623.08 కోట్లకు చేరుకుందన్నారు. దానిని ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఒక సంవత్సరంలోనే రూ.11,608.40 కోట్లు తగ్గించి రూ.47,014.68 కోట్లకు చేర్చడం గొప్ప మైలురాయిగా అభివర్ణించారు. రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసిస్తుందని చెప్పారు. భారత ప్రభుత్వ ఆహార కార్యదర్శి ఇటీవల రాష్ట్రంలో పర్యటించి పౌర సరఫరాల పనితీరును ప్రశంసించారని, ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా ఉండాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్) నిర్వహించిన ఒక అధ్యయనంలో పీడీఎస్‌లో ఆహార ధాన్యాల లీకేజీ గుజరాత్‌లో 43 శాతం ఉండగా, తెలంగాణలో అత్యల్పంగా 0.3 శాతం నమోదు అయ్యిందని, ఇది రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. తెలంగాణలో పీడీఎస్‌లో లీకేజీ, రీసైక్లింగ్ గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో డిఫాల్టర్ మిల్లర్లపై 79 క్రిమినల్ కేసులు నమోదు చేసిందని, 41 మిల్లులపై రూ.1,069.63 కోట్ల రికవరీకి ఆర్ఆర్ చట్టాన్ని ప్రయోగించగా, రూ.408 కోట్లు డిఫాల్టర్లు డిపాజిట్ చేసినట్టు చెప్పారు. తెలంగాణలో పండించిన బియ్యం నాణ్యత గణనీయంగా మెరుగుపడిందన్నారు. ఈ సంవత్సరం మొదటిసారిగా తెలంగాణ బియ్యం 11 రాష్ట్రాలకు సరఫరా చేసినట్టు మంత్రి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ డీఎస్.చౌహాన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఊహలతో పిటిషన్ వేస్తారా?

- పుష్ప–2 సినిమా విడుదల ఆపాలన్న పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- పిటిషనర్‌కు జరిమానా.. ఆ సొమ్మును స్వచ్ఛంద సంస్థకు ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 చిత్రం విడుదలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. పుష్ప–1 సినిమాలో కథానాయకుడు ఎర్ర చందనం కలప స్మగ్లింగ్ చేస్తుంటారని, ఇది సమాజానికి చెడు సందేశాన్ని ఇచ్చేలా ఉందని సికింద్రాబాద్ నల్లగుట్టకు చెందిన ఎస్ శ్రీశైలం అనే వ్యక్తి పిటిషన వేశారు. పుష్ప–2 కూడా ఇలాగే ఉంటుందేమో అని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆధారాలులేకుండా ఊహాగానాలతో పిటిషన్ వేస్తారా? అని మండిపడ్డారు. న్యాయస్థానంతోపాటు సెన్సార్ బోర్డు, సినిమా నిర్మాణ సంస్థ సమయాన్ని వృథా చేసినందుకు జరిమానా విధించారు. ఆ జరిమానా సొమ్మును అక్రమ రవాణాకు గురవుతున్న మహిళలు, పిల్లల సంక్షేమం కోసం పనిచేసే ఏ సంస్థకైనా అందజేయాలని ఆదేశించారు. చిత్ర విడుదలను ఆపివేయాలని పిటిషన్ వేసే అర్హత పిటిషనర్‌కు లేదని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్ చెప్పారు. సినిమాటోగ్రఫీ చట్టం, నిబంధనల ప్రకారం సెన్సార్‌బోర్డు కమిటీ సినిమాను వీక్షించి, సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వడానికి ముందు ఐదు మార్పులు చేసిందని వెల్లడించారు. చివరి నిమిషంలో సినిమా ఆగిపోతే నిర్మాత, దర్శకులపై తీవ్ర ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.

టికెట్ల రేట్ల పెంపు అధికారం ప్రభుత్వానిదే

పుష్ప – 2 చిత్ర బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్ల పెంపును నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్న మరో పిటిషనర్ విజ్ఞప్తిని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం తిరస్కరించింది. ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు ప్రకటించింది. టికెట్ల రేట్లు పెంపు అధికారం ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేసింది. పుష్ప– 2 సినిమా బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా శాంతినగర్‌కు చెందిన సతీశ్ కమాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. టికెట్ కొనలేనివారు పిటిషన్ వేస్తే పరిశీలించవచ్చని, ఇక్కడ పిటిషనర్ పేదవాడు కాదని అభిప్రాయపడింది. ఎన్ని టికెట్లు విక్రయించారనే వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్‌ను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

దృష్టిలోపం ఉన్న వారికోసం
అధునాతన ఏఐ కళ్లద్దాలు

యూపీ కుర్రాడి ఘనత ● ఐఐటీ ముంబై టెక్‌ఫెస్ట్‌లో ఆవిష్కరణ


ఏఐ కళ్లదాలతో మునీర్‌ఖాన్

లఖీంపూర్‌ఖేరీ(ఉత్తరప్రదేశ్): అజ్ఞానాంధకారంలో మగ్గిపోతున్న వారికి అక్షరజ్ఞానం పంచితే వారి జీవితం వెలుగులమయం అవుతుందని పెద్దలంటారు. అంధత్వం లేకపోయినా తీవ్రస్థాయిలో దృష్టిలోపంతో బాధపడే వాళ్ల ప్రపంచం ఒక రకంగా చీకటిమయం. వారి ప్రపంచాన్ని వెలుగుమయం చేసేందుకు ఓ యువకుడు బయల్దేరాడు. వినూత్న ఆవిష్కరణలు చేస్తూ తీవ్ర దృష్టిలోప బాధితులకు అండగా నిలబడ్డారు. అధునాతన కృత్రిమ మేధతో పనిచేసే స్మార్ట్ కళ్లద్దాలను ఆవిష్కరించారు. స్మార్ట్ నీళ్లసీసా, నేలసారాన్ని కొలిచే స్మార్ట్ పరికరం తయారుచేసి ఇప్పటికే ప్రపంచం దృష్టిని ఆకర్షించిన 28 ఏళ్ల మునీర్ ఖాన్ తాజాగా 'ఏఐ విజన్ ప్రో' పేరిట కొత్తరకం కళ్లజోడును సృష్టించాడు. ఈనెల 17న ఐఐటీ ముంబైలో జరిగిన టెక్‌ఫెస్ట్‌లో దీనిని ఆవిష్కరించారు. '' తీవ్ర దృష్టిలోపం ఉన్న వాళ్లు కృత్రిమ మేధతో పనిచేసే ఈ కళ్లద్దాలు ధరిస్తే తమ రోజువారీ పనులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసు కోవచ్చు. సెన్సార్లు, కెమెరాలు, ఎస్‌విడి యా జెట్సాన్ ప్రాసెసర్లు, లీడార్ సాంకేతికత, ఏఐ మోడల్ కంప్యూటేషన్‌లతో ఇది పనిచేస్తుంది. కళ్లద్దాల ముందున్న అంశాలను రియల్‌టైమ్‌లో సంగ్రహించి, ధరించిన వారికి దిశానిర్దేశం చేస్తుంది. ఇది ధరిస్తే ఎదుటి వారి ముఖాలను గుర్తుపట్టొచ్చు. అనారోగ్యం వేళ వేసుకోవాల్సిన మందులు, ఆహారం మధ్య తేడాలను చెప్తుంది. నడిచేటప్పుడు దారిలో అడ్డుగా ఏవైనా ఉంటే హెచ్చరిస్తుంది. చుట్టుపక్కల సమీపంలో ఏమేం ఉన్నాయో చెబుతుంది. ముద్రించిన వాటిని చదివేందుకు సాయపడుతుంది'' అని మునీర్ చెప్పారు.

మట్టిలో మాణిక్యం

ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్‌ఖేరీలో గౌరియా గ్రామం మునీర్ సొంతూరు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మునీర్‌ను పేదరికం వెక్కిరించింది. తను ఏడాది వయసు ఉన్నప్పుడు తండ్రి చనిపోయారు. చదువుల్లో మేటి అయిన మునీర్‌ను ఎలాగైనా చదివించాలని ఆయన తల్లి, నలుగురు అన్నయ్యలు ఎంతో కష్టపడ్డారు. సొంతూరిలో పదో తరగతి దాకా ప్రభుత్వ పాఠశాలలో చదివిన మునీర్ తర్వాత ఇంటర్ మాత్రం ప్రైవేట్‌లో పూర్తిచేశాడు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని భీమ్‌టాల్‌లో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లో అడ్మిషన్ సాధించాడు. రెండో ఏడాదిలోనే ఫ్రాన్స్, రష్యాల నుంచి పరిశోధనా ఇంటర్న్‌షిప్‌లను సాధించి ఔరా అనిపించాడు. కృత్రిమ మేధ, సెన్సార్ టెక్నాలజీలపై ఆసక్తితో వాటిలో పరిశోధనలు చేశాడు. కొలంబియా విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ పూర్తిచేశాక అమెరికా, భారత్‌లో కార్యకలాపాలు కొనసాగించేలా క్యాడర్ టెక్నాలజీస్ సంస్థను స్థాపించాడు. కొలంబియాలో చదువుకునే రోజుల్లోనే హైడ్రోహోమీ పేరిట స్మార్ట్ వాటర్ బాటిల్‌ను తయారుచేశాడు. భారత్‌లో రైతన్నలకు సాయపడేలా మరో అద్భుత ఆవిష్కరణ చేశాడు. నేలసారం ఏ స్థాయిలో ఉందో తెల్సుకునేందుకు పరిశోధనశాలలకు మట్టి నమూనాలను పంపాల్సిన పనిలేకుండా చిన్న పరికరంపై మట్టిని ఉంచితే కొద్దిసేపట్లోనే ఆ నేలలోని ధాతువులు, మూలకాల పరిమాణాన్ని, నేలతీరును ఇట్టే చెప్పేస్తుంది. 'స్మార్ట్ సాయిల్ టెస్టింగ్ డివైజ్'గా అందుబాటులోకి వచ్చిన ఈ పరికరంతో మునీర్ ఈ ఏడాది యువ శాస్త్రవేత్త అవార్డ్‌ను సైతం జూలైలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా అందుకున్నారు.

హిందీ నేర్చుకుంటున్నందుకు...
నన్ను హేళన చేశారు: నిర్మల

స్కూలు రోజుల అనుభవాన్ని సభలో పంచుకున్న మంత్రి



న్యూఢిల్లీ: తమిళనాడులో స్కూలుకెళ్లే రోజుల్లో హిందీ నేర్చుకునే విద్యార్థినిగా అవమానాలను ఎదుర్కొన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. లోక్‌సభలో మంగళవారం బ్యాంకింగ్ చట్ట సవరణ బిల్లుపై ఆమె హిందీలో మాట్లాడుతుండగా ప్రతిపక్ష సభ్యులు అడ్డుకున్నారు. దాంతో ఆమె తన చిన్ననాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు. ''తమిళనాడులో హిందీ నేర్చుకునే వారికి అడ్డంకులు సృష్టించారు. తమిళ గడ్డపై పుట్టి, ఉత్తర భారత భాష నేర్చుకోవడమేంటని అడ్డుకునే వారు. నేను మదురై వీధుల్లో వెళ్తుండగా హేళనగా మాట్లాడేవారు'' అని చెప్పారు. ''ఇష్టమైన భాషను నేర్చుకునే స్వేచ్ఛ, హక్కు నాకు లేవా? తమిళనాడు మన దేశంలో భాగం కాదా? హిందీ నేర్చుకోకుండా నన్ను అడ్డుకోవడం నిర్బంధం కాదా?'' అని ప్రశ్నించారు. హిందీ, సంస్కృతాలను విదేశీ భాషలుగా పరిగణించడం తగదన్నారు. హిందీని బలవంతంగా రుద్దుతున్నామంటూ విమర్శించే వారు తన ప్రశ్నలకు సమాధానమివ్వాలన్నారు. ''తమిళ భాషను ప్రధాని మోదీ ఐరాస దృష్టికి తీసుకెళ్లారు. ఇలా ఇంకెవరైనా చేయగలిగారా? మోదీ ప్రసంగాల్లో తరచూ తమిళ భాషను ప్రస్తావిస్తారు. అదీ తమిళులకు మేమిచ్చే గౌరవం! డీఎంకేతో పొత్తు పెట్టుకునే పార్టీకి చెందిన ప్రధానులెవరైనా ఇలా చేశారా?'' అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి నిర్మల దుయ్యబట్టారు.

51వ రాష్ట్రంగా చేరిపొండి

కెనడాపై ట్రంప్ వెటకారం



కెనడా ప్రధాని ట్రూడోతో భేటీ సందర్భంగా వ్యాఖ్య

వాషింగ్టన్: తాను అధికారంలోకి వస్తే కెనడా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించి కెనడా కలవరపాటుకు గురయ్యేలా చేసిన డొనాల్డ్ ట్రంప్ ఈసారి ఏకంగా కెనడా ప్రధానితోనే వెటకారంగా మాట్లాడారు. అమెరికా పర్యటనలో భాగంగా కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భేటీ అయిన సందర్భంగా ఈ అనూహ్య సంభాషణ చోటుచేసుకుందని సమాచారం. అమెరికా మీడియా కథనాల ప్రకారం ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునే చర్యల్లో భాగంగా కెనడాపై పన్నుల భారం తగ్గించుకునేందుకు ట్రూడో శనివారం రాత్రి ఫ్లోరిడాలోని పామ్‌బీచ్ ప్రాంతంలో ట్రంప్‌కు చెందిన మార్-ఏ-లాగో రిసార్ట్‌లో కలిశారు. మెక్సికో, కెనడా, చైనాలపై అదనపు దిగుమతి సుంకాలు విధిస్తానన్న అంశం, అక్రమ వలసలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా అంశాలు ట్రంప్, ట్రూడో మధ్య ప్రస్తావనకు వచ్చాయి. పన్నులు పెరిగితే తమ దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాలు తప్పవని ట్రంప్‌కు ట్రూడో స్పష్టంచేశారు. దీనిపై వెంటనే ట్రంప్ స్పందించారు. '' అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లకు చేరువవుతోంది. ఇలాంటి కష్టకాలంలో మేం పన్నులు పెంచక తప్పదు. కెనడా నుంచి అమెరికాలోకి అక్రమ వలసలను అరికట్టండి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోండి. ప్రత్యేక దేశంగా ఉంటూ కూడా ఇవన్నీ చేయడం మీ వల్ల కాకపోతే అంతటి భారీ పన్నులను తప్పించుకోవడం కోసమైనా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరిపోండి'' అని ట్రంప్ వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. దీంతో ట్రూడో నిశ్చేష్టులయ్యారని వినికిడి. ట్రంప్‌తో వాగ్వాదానికి దిగలేక ట్రూడో ముఖంపై కృత్రిమ నవ్వును ఒలకబోశారని అక్కడి వారు చెప్పారు. '' కెనడా అమెరికాలోకి చేరాక రెండు రాష్ట్రాలుగా ముక్కలైతే బెటర్. ఒక ముక్కకు ట్రూడో గవర్నర్‌గా ఉండటం ఇంకా బెటర్. రెండు రాష్ట్రాల్లో ఒకటి లిబరల్ స్టేట్‌గా, మరోటి కన్జర్వేటివ్ స్టేట్‌గా ఉంటే బాగుంటుంది'' అని ట్రంప్ ముక్తాయించాడు.

బందీలను తక్షణం
వదిలేయండి

- లేదంటే నరకం చూపిస్తా
- హమాస్‌కు ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా జనవరి 20న తాను బాధ్యతలు స్వీకరించేందుకు ముందే ఇజ్రాయెలీ, ఇతర బందీలందరినీ విడుదల చేయాలని హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. ''లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. నరకం చవిచూస్తారు జాగ్రత్త!'' అంటూ హెచ్చరించారు. ''అమెరికా చరిత్రలోనే ఎవరిపైనా చేయనంత తీవ్ర స్థాయిలో మీపై దాడి చేసి తీరుతుంది. అందుకే చెబుతున్నా. బందీలను తక్షణం విడుదల చేయండి'' అన్నారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఈ మేరకు పోస్ట్ చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ఈ అంశంపై ట్రంప్ తొలిసారిగా మాట్లాడారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేయడం తెలిసిందే. ఆ సందర్భంగా 250 మందికి పైగా బందీలుగా పట్టుకుంది. కొందరిని విడుదల చేయగా పలువురు మరణించారు. ఇంకా గాజాలో బందీలుగా ఉన్న 101 మంది ఇజ్రాయెలీ, విదేశీయుల్లో కనీసం సగం మంది సజీవంగా ఉన్నట్లు భావిస్తున్నారు. చనిపోయిన బందీల్లో 33 మంది జాతీయత తెలియడం లేదని హమాస్ సోమవారం తెలిపింది.

భారత్ ఒక ప్రయోగశాల

గేట్స్ వ్యాఖ్యలపై దుమారం



వాషింగ్టన్: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ యథాలాపంగా చెప్పిన ఒక వాక్యం వివాదాస్పదమైంది. తరచూ భారత్‌ను పొగిడే బిల్‌గేట్స్ ఒక్కసారిగా భారత్‌ను ప్రయోగశాలతో పోల్చడమేంటని కొందరు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రీడ్ హాఫ్‌మన్‌తో నిర్వహించిన ఒక పాడ్‌కాస్ట్ చర్చావేదికలో భారత ప్రస్థానాన్ని బిల్‌గేట్స్ ప్రస్తావించారు. '' జనాభాపరంగా అతిపెద్దదైన భారత్‌లోనూ ఆరోగ్యం, పోషకాహారం, విద్యారంగాలు అభివృద్ధిబాటలో పయనిస్తున్నాయి. భారతీయులు సుస్థిరాభివృద్ధిని మాత్రమేకాదు సుస్థిర ప్రభుత్వా దాయాలను సమకూర్చుకుంటున్నారు. వచ్చే 20 ఏళ్లలో అక్కడి ప్రజలు మరింత పురోభివృద్ధిని సాధించగలరు. భారత్ వెలుపల కంటే భారత్‌లో తమను తాము నిరూపించుకునేందుకు ఆ దేశం నిజంగా ఒక ప్రయోగశాల. అమెరికా వెలుపల మా అతిపెద్ద కార్యాలయం భారత్‌లోనే ఉంది. ప్రపంచంలో మరెక్కడా పైలట్ ప్రాజెక్టులు మేం చేపట్టినా మా భాగస్వాములు మాత్రం ఇండియా నుంచే ఉంటున్నారు. మీరుగనక భారత్‌కు వెళ్లి అక్కడి వీధుల్లో గమనిస్తే ఆదాయంలో చాలా తారతమ్యాలు ఉన్న వ్యక్తులు కోకొల్లలుగా కనిపిస్తారు. అయినా సరే మీరు అక్కడి వైవిధ్యాన్ని ఆస్వాదించగలరు'' అని అన్నారు.

వెల్లువెత్తిన విమర్శలు

భారత్‌ను ప్రయోగశాలగా పోల్చడంపై నెటిజన్ల నుంచి విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. '' తమ ప్రయోగాత్మక ఔషధాలను ప్రయోగించడానికి భారత్‌ను ఒక ల్యాబ్‌లాగా వాడుకుంటున్నారు. అయినాసరే ఇలాంటి పెద్దమనుషులు మనల్ని గినీ పందుల్లా వాడుకునేందుకు మన ప్రభుత్వాలే అనుమ తిస్తున్నాయి. దిగ్భ్రాంతికరం. సిగ్గుపడాల్సిన విషయం'' అని సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''మా దేశం మీకొక ప్రయో గశాల అనుకుంటున్నారా?. అయితే దేశం విడిచి వెళ్లిపొండి' అని ఒక నెటిజన్ వ్యాఖ్యా నించారు. '' బిల్‌గేట్స్ భారతీయ మీడియా మొదలు విపక్షం, అధికార పక్షం ద్వారా ప్రతి వ్యవస్థనూ తనకు అనుకూలంగా మార్చుకుందన్నారు. మనమెప్పుడు మేల్కొంటామో'' అని ఇంకో నెటిజన్ ఆవేదన వ్యక్తంచేశారు.

సీఈసీ, ఈసీల నియామక కేసు...
విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించబోనని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టంచేశారు. ఈ కేసును మంగళవారం సీజేఐ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారించింది. గతంలో జడ్జిగా ఉన్న జస్టిస్ ఖన్నా ఇటీవల ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో తన పదవికి సంబంధించిన కేసును తానే విచారించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఆయన ఈ కేసు విచారణ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. '' ధర్మాసనంలో సభ్యునిగా నేను లేని బెంచ్‌కు ఈ కేసును బదిలీచేస్తున్నాను'' అని సీజేఐ వెల్లడించారు. మీరు కొనసాగినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సీనియర్ అడ్వకేట్ గోపాల్ శంకరనారాయణ్, లాయర్ ప్రశాంత్ భూషణ్ చెప్పినా సరే సీజేఐ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. సీఈసీ, ఈసీల నియామకాలకు సంబంధించిన చట్టంలో గత ఏడాది మార్పులు చేస్తూ కేంద్రం తెచ్చిన చట్టంలోని సెక్షన్7 చట్టబద్ధతను సవాల్‌చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే.

యూనసే మాస్టర్‌మైండ్: షేక్ హసీనా



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హత్యలు, అత్యాచారాలకు మహ్మద్ యూనస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వమే కారణమని పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు. న్యూయార్క్‌లో జరిగిన అవామీ లీగ్ సమావేశానుద్దేశించి ఆమె వర్చువల్‌గా మాట్లాడారు. ఆలయాలు, చర్చిలు, ఇస్కాన్ మందిరాలు తదితరాలపై దాడులకు యూనసే కారణమన్నారు. 'సామూహిక హత్యలు చేయించానంటూ నాపై ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవానికి, విద్యార్థి సంఘాలతో కలిసి పక్కాగా రూపొందించిన ప్రణాళిక ద్వారా యూనస్ సామూహిక హత్యలకు పాల్పడ్డారు. సామూహిక హత్యలకు యూనస్, విద్యార్థి సంఘాల నేతలే కారణం'అని హసీనా దుయ్యబట్టారు. తన తండ్రి, బంగబంధు ముజిబుర్ రహ్మాన్ మాదిరిగానే తనను కూడా అంతం చేసేందుకు కుట్ర జరిగిందన్నారు. 'నాపై దాడికి వచ్చిన ఆందోళన కారులపైకి కాల్పులు జరపరాదంటూ భద్రతా సిబ్బందిని ఆదేశించాను. ఎలాగైనా అధికారంలో కొనసాగాలని అనుకుని ఉన్నట్లయితే పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయి ఉండేవారు. అలా జరగడం ఇష్టం లేకనే అధికార బాధ్యతలు వదిలేశా'అని ఆగస్ట్ 5వ తేదీన అనూహ్యంగా చోటుచేసుకున్న పరిణామాలను ఆమె గుర్తు చేశారు.

దక్షిణ కొరియాలో సంక్షోభం

అధ్యక్షుడు వర్సెస్ విపక్షాలు
- ఎమర్జెన్సీ విధించిన యూన్
- ఎత్తేస్తూ పార్లమెంటు నిర్ణయం
- ఆ వెంటనే సైన్యం రంగప్రవేశం
- గంటల్లోనే కీలక పరిణామాలు
- వాళ్లు ఉత్తర కొరియా ఏజెంట్లు
- విపక్షాలపై అధ్యక్షుని ధ్వజం
- సొంత పార్టీలోనే చుక్కెదురు


జాతీయ అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్న బలగాలు (ఇన్‌సెట్‌లో) అధ్యక్షుడు యూన్

సియోల్: దక్షిణ కొరియా పెను రాజకీయ సంక్షోభం అంచున నిలిచింది. నానాటికీ తగ్గుతున్న ప్రజాదరణకు తోడు విపక్షాల దూకుడుతో సతమతమవుతున్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఉన్నట్టుండి తీవ్ర చర్యలకు దిగారు. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధిస్తూ మంగళవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. ''విపక్షాలన్నీ ఉత్తర కొరియా సానుభూతిపరులతో నిండిపోయాయి. వాళ్లు ప్రభుత్వ వ్యతిరేకత కార్యకలాపాలకు పాల్పడుతూ పాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఆ దేశ వ్యతిరేక శక్తులందరినీ వీలైనంత త్వరగా ఏరేసి పరిస్థితులను చక్కదిద్దుతా. అందుకు వీలుగా మార్షల్ లా విధిస్తున్నా '' అంటూ ప్రకటించారు. దీనిపై ఇంటాబయటా విమర్శలు వెల్లువెత్తాయి. విపక్షాలతో పాటు యూన్ స్వపక్షమైన పీపుల్స్ పవర్ పార్టీ కూడా యూన్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అనంతరం ప్రతిపక్షాలు హుటాహుటిన స్పందించాయి. గంటల వ్యవధిలోనే జాతీయ అసెంబ్లీని సమావేశపరచడమే గాక మార్షల్ లాకు వ్యతిరేకంగా ఓటింగ్ చేపట్టాయి. ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం 190 మంది చట్టసభ్యులూ దానికి వ్యతిరేకంగా ఓటేశారు. అనంతరం మార్షల్ లాను ఎత్తేస్తున్నట్టు స్పీకర్ వూ వున్ షిక్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసనలు, నినాదాలతో రాజధాని సియోల్ అట్టుడికింది. అసెంబ్లీ ముందు ఆందోళనకారులు భారీగా గుమిగూడారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు వారిని చెదరగొట్టాయి. జాతీయ అసెంబ్లీ మెజారిటీ ఓటుతో మార్షల్ లాను ఎత్తేసేందుకు దక్షిణ కొరియా చట్టాలు అనుమతిస్తాయి. విపక్ష డెమొక్రటిక్ పార్టీకి మెజారిటీ ఉండటంతో సభపై రెండేళ్లుగా విపక్షాల ఆధిపత్యమే సాగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో సైన్యం కూడా రంగప్రవేశం చేసింది. సమాజంలో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నిస్తే పార్లమెంటుతో పాటు రాజకీయ పార్టీలను కూడా సస్పెండ్ చేస్తామని ప్రకటించడంతో పరిస్థితి మరింత జటిలంగా తయారైంది. కొద్ది నెలలుగా సమ్మె చేస్తున్న వైద్యులంతా 48 గంటల్లోగా విధుల్లోకి రావాలని కూడా సైన్యం ఆదేశించింది! సమస్యలు సృష్టించేందుకు ప్రయతిన్ంచే వారందరినీ ఎలాంటి వారెంటూ లేకుండానే అరెస్టు చేస్తామని ప్రకటించింది. పార్లమెంటుతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాలపై సైనిక హెలికాప్టర్లు రాత్రంతా చక్కర్లు కొడుతూ కన్పించాయి.

కంట్లో నలుసుగా విపక్షాలు

అధ్యక్షుడు యూన్‌కు విపక్షాలు రెండేళ్లుగా కంట్లో నలుసుగా మారాయి. 2022 ఎన్నికల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో యూన్ బొటాబొటి మెజారిటీతో గెలిచినా పార్లమెంటులో మాత్రం విపక్షాలదే పైచేయిగా మారింది. నాటినుంచీ సభలో పలు బిల్లుల ఆమోదాన్ని అవి పదేపదే అడ్డుకుంటూ వస్తున్నాయి. దీనికి తోడు కొద్ది రోజులుగా సర్వేలన్నింట్లోనూ యూన్‌కు ప్రజాదరణ బాగా తగ్గుతూ వస్తోంది. అంతేగాక ఆయన భార్యతో పాటు అత్యున్నత స్థాయిలోని పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. వాటిపై స్వతంత్ర దర్యాప్తుకు విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఇలా చుట్టూ సమస్యలతో యూన్ సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది బడ్జెట్‌కు సంబంధించిన బిల్లును కూడా విపక్షాలు తాజాగా సభలో అడ్డుకున్నాయి. దాంతో చిర్రెత్తుకొచ్చిన యూన్ మార్షల్ లా విధింపు నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. 1987లో దక్షిణ కొరియా ప్రజాస్వామ్య బాట పట్టాక దేశంలో మార్షల్ లా విధించడం ఇదే తొలిసారి. చివరిసారిగా 1979 అక్టోబర్‌లో మార్షల్ లా విధించారు.


ఎట్టకేలకు 'మహా' స్పష్టత!

- సీఎంగా రేపు ఫడ్నవీస్ ప్రమాణం
- డిప్యూటీ పదవికి ఒప్పుకున్న షిండే
- నేతలిరువురి భేటీ, ఏకాంత చర్చలు
- మంత్రి పదవుల పంపకంపైనా స్పష్టత
- బీజేపీకి 21, సేనకు 12, ఎన్సీపీకి 10
- 'హోం'శాఖపై పీటముడి

ముంబై: మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై ఎట్టకేలకు సస్పెన్స్ వీడినట్టు కన్పిస్తోంది. బీజేపీ అధిష్టానం బుజ్జగింపులతో ఆపద్ధర్మ సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే అలక వీడినట్టు చెబుతున్నారు. బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కు సీఎం పీఠం అప్పగించి ఉప ముఖ్యమంత్రి పదవి స్వీకరించేందుకు అంగీకరించినట్టు ఉన్నత స్థాయి వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా మంగళవారం పేర్కొంది. దీనికి బలం చేకూర్చేలా రోజంతా పలు పరిణామాలు జరిగాయి. గత మూడు రోజుల్లో రెండుసార్లు అధికార మహాయుతి కూటమి భేటీలకు డుమ్మా కొట్టిన షిండే మూడు రోజుల తర్వాత మంగళవారం ముంబై చేరుకున్నారు. కాసేపటికి ఫడ్నవీస్ ఆయన అధికార నివాసానికి వెళ్లారు. నేతలిద్దరూ కాసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. మరోవైపు అధికార కూటమి భాగస్వామి ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ కూడా ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు పది రోజులుగా బీజేపీ అధిష్టానం చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చినట్టేనంటున్నారు. ''గురువారం సాయంత్రం ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయనతో పాటు షిండే, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ కూడా ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారు'' అని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. ''మంత్రి పదవుల పంపకంపైనా ఇప్పటికే అంగీకారం కుదిరింది. బీజేపీకి 21 నుంచి 22, షిండే సేనకు 12, ఎన్సీపీకి ఆర్థిక శాఖతో పాటు 9 నుంచి 10 బెర్తులు దక్కుతాయి'' అని తెలిపాయి. అయితే కీలకమైన హోం శాఖపై మాత్రం పీటముడి వీడటం లేదు.


భారత్‌కు రూ.9,900 కోట్ల రక్షణ ఉత్పత్తులు

ఫైల్‌పై బైడెన్ సంతకం



వాషింగ్టన్: భారత్‌కు సుమారు రూ.9,900 కోట్ల విలువైన హెలికాప్టర్ పరికరాలు, ఇతర సామగ్రి విక్రయానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అంగీకారం తెలిపారు. ఎంహెచ్-60ఆర్ మల్టీ-మిషన్ హెలికాప్టర్ సామగ్రి, సంబంధిత పరికరాల విక్రయానికి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సోమవారం కాంగ్రెస్‌కు తెలిపారు. ఇవి సమకూరాక భారత్ యాంటీ సబ్‌మెరీన్ యుద్ధ సామర్థ్యాలు మరింతగా పెరుగుతాయని, భవిష్యత్తులో ఎదుర్కొనే సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సత్తా ఒనగూరనుందని అంచనా. ఇందులో ప్రధాన కాంట్రాక్టర్ లాక్‌హీడ్ మార్టిన్ రోటరీ అండ్ మిషన్ సిస్టమ్స్. ఒప్పందంలో భాగంగా 25 మంది కాంట్రాక్టర్ ప్రతినిధులు భారత్‌కు వచ్చి సాంకేతిక సాయం, నిర్వహణలో సాయం అందించనున్నారు. మరో నాలుగు వారాల్లో అధ్యక్ష పదవిని వీడనున్న బైడెన్ ప్రభుత్వం ఈమేరకు కీలక నిర్ణయం తీసుకోవడం విశేషం.

సుప్రీం జడ్జిగా జస్టిస్ మన్మోహన్



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్(61)ను సుప్రీంకోర్టులో జడ్జిగా నియమించాలంటూ నవంబర్ 28న కొలీజియం పంపిన ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు మంగళవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. 'భారత ప్రధాన న్యాయమూర్తితో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చర్చలు జరిపిన మీదట ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా నియమించేందుకు ఆమోదం తెలిపారు'అని కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ 'ఎక్స్'లో వెల్లడించారు. జస్టిస్ మన్మోహన్ విధుల్లో జాయినైతే సుప్రీంకోర్టుకు మంజూరైన 34 పోస్టులకుగాను 33 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నట్లవుతుంది.

పీఎస్ఎల్వీ సీ-59 ప్రయోగం నేడే

సూళ్లూరుపేట: పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగవేదిక నుంచి బుధవారం ప్రయోగం జరగనుంది. మంగళవారం మధ్యాహ్నం 2.38కి కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలైంది. దీనిద్వారా 550 కిలోల ప్రోబా-03 శాటిలైట్‌ను జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ రూపొందించిన ప్రోబా-03 సూర్యుడిపై పరిశోధనలు చేపట్టనుంది. ఇందులో అమర్చిన కరోనా గ్రాఫ్, ఆక్యుల్టర్ అనే స్పేస్‌క్రాఫ్టులు పరస్పర సమన్వయంతో క్రమ పద్ధతిలో భూకక్ష్యలో పరిభ్రమిస్తాయి. ఈ తరహా ప్రయోగం ప్రపంచంలోనే మొట్టమొదటిది కావడం విశేషం.

మూడు అంశాలే కీలకం

చైనాతో సరిహద్దు వివాదంపై జైశంకర్

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దు వివాదానికి న్యాయమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం భారత్ కట్టుబడి ఉందని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ చెప్పారు. తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దులకు అత్యంత సమీపంలో మోహరించిన ఇరు దేశాల సైన్యాల ఉపసంహరణ ఘర్షణాత్మక ప్రాంతాలైన డెప్సాంగ్, డెమ్చోక్‌లతో సహా దశల వారీగా సంపూర్ణంగా పూర్తయిందన్నారు. చైనాతో సంబంధాలపై మంగళవారం ఆయన లోక్‌సభలో ప్రకటన చేశారు. అక్టోబర్ 21న చైనాతో జరిగిన ఒప్పందం వివరాలను సభ ముందుంచారు. ''భారత్-చైనా వాస్తవాధీన రేఖను విధిగా గౌరవించాలి. యథాతథ స్థితిని ఏకపక్షంగా మార్చేందుకు ఎవరూ ప్రయత్నించరాదు. సరిహద్దు నిర్వహణ ఒడంబడికలకు లోబడి ఉండాలి. ఈ మూడు అంశాలపైనే చైనాతో సంబంధాలు ఆధారపడి ఉంటాయి'' అని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నివారణ, నిర్వహణలపైనా చర్చిస్తామన్నారు.

దశాబ్దాలుగా ఆక్రమణలోనే..

1962లో జరిగిన యుద్ధంలో చైనా ఆక్సాయ్ చిన్‌లోని 38 వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఆక్రమించుకుందని మంత్రి జై శంకర్ గుర్తు చేశారు. అది ఇప్పటికీ వివాదాస్పదంగానే మిగిలి ఉందన్నారు. దీంతోపాటు, పాకిస్తాన్ 1948 నుంచి ఆక్రమించుకుని ఉన్న 5,180 కిలోమీటర్ల భూభాగాన్ని 1963లో చైనాకు ధారాదత్తం చేసిందని చెప్పారు. ఈ సమస్యలన్నిటిపైనా పూర్తి స్థాయిలో చర్చలు జరగాలన్నదే తమ అభిమతమన్నారు.

సజావుగా పార్లమెంటు

- ప్రశాంతంగా సాగిన సభలు
- సంభాల్ హింసపై అఖిలేశ్ వ్యాఖ్యలతో రగడ

సాక్షి, న్యూఢిల్లీ: విపక్షాల ఆందోళనల నేపథ్యంలో వరుస వాయిదాల అనంతరం పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఎట్టకేలకు మంగళవారం సజావుగా సాగాయి. ఉదయం సమావేశాలు మొదలవగానే అదానీ, మణిపూర్ హింస, ఫెంగల్ తుఫాన్, ఢిల్లీలో నేరాలు, అజ్మీర్ దర్గా వివాదం, ఒడిశాకు ప్రత్యేక హోదా, వయనాడ్ వరద బాధితులు, బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి తదితరాలపై ఉభయ సభల్లోనూ విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలిచ్చారు. సభాపతులు వాటిని తిరస్కరించి ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. దీన్ని నిరసిస్తూ పలువురు సభ్యులు వాకౌట్ చేశారు. యూపీలోని సంభాల్‌లో మసీదు సర్వే సందర్భంగా జరిగిన హింసాకాండను సమాజ్‌వాదీ సభ్యులు ఉభయ సభల్లోనూ ప్రస్తావించారు. ఆ హింసాకాండ యూపీ బీజేపీ ప్రభుత్వ కుట్రలో భాగంగానే జరిగిందని లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ ఆరోపించడంతో కలకలం రేగింది. వాటిపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. బ్యాంకు ఖాతాలకు నలుగురు నామినీలను అనుమతించే బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లును విపక్ష సభ్యుల అభ్యంతరాలు, నిరసనల మధ్యే లోక్‌సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. అంతకుముందు అదానీ గ్రూప్ ఆరోపణలపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ విపక్షాలు కాంగ్రెస్ నేతృత్వంలో పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగాయి.

...వారాంతాల్లోనూ సమావేశాలు: స్పీకర్

లోక్‌సభ కార్యకలాపాలకు పలువురు సభ్యులు పదేపదే అంతరాయం కలిగిస్తున్నారంటూ స్పీకర్ ఆగ్రహం వెలిబుచ్చారు. ఇలాగైతే శని, ఆదివారాల్లో కూడా సమావేశాలు జరుగుతాయని హెచ్చరించారు.

భారత దౌత్యాధికారికి బంగ్లా సమన్లు

ఢాకా: త్రిపుర రాజధాని అగర్తలాలోని బంగ్లాదేశ్ కాన్సులర్ కార్యాలయం వద్ద ఉల్లంఘన ఘటనపై మరో పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై భారత రాయబారికి బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ కార్యాలయం సమన్లు పంపించింది. రెండు దేశాల మధ్య సంబంధాలకు ఒక్క అంశం కూడా అడ్డంకిగా మారరాదని, ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా, నిర్మాణాత్మకంగా ఉండాలని పేర్కొంది. భద్రతా కారణాల రీత్యా కాన్సులర్ కార్యాలయంలో వీసా, ఇతర సేవలను నిలిపివేస్తున్నామని తెలిపింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ కార్యదర్శి రియాజ్ హమీదుల్లాతో సమావేశం అనంతరం భారత్ రాయబారి ప్రణయ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ..ఆపద్ధర్మ ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగిస్తామని చెప్పారు.

ఇక్కడున్నది హసీనా ప్రభుత్వం కాదు..

షేక్ హసీనా పదవీచ్యుతురాలైన నేపథ్యంలో బంగ్లాదేశ్‌తో సంబంధాలను భారత్ పునఃసమీక్షించుకోవాలని ఆ దేశ న్యాయ వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ వ్యాఖ్యానించారు. ఎన్నికలు నిర్వహించకుండానే అధికారంలో కొనసాగేందుకు హసీనా ప్రభుత్వం భారత అనుకూల విధానం అమలు చేసిందని ఆరోపించారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



ఫిట్.. సెట్..

నగరంలో యువత, మహిళలు అధిక శాతం మంది జిమ్ బాట పడుతున్నారు. శరీరంలోని వివిధ అవయవాలకు సంబంధించిన ప్రత్యేక వ్యాయామాలపై దృష్టి పెడుతున్నారు. - సిటీప్లస్‌లో



వైల్డ్ ఫీల్.. విత్ వర్చువల్

బొటానికల్ గార్డెన్‌లో వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ నగర వాసులకు అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేకంగా 3డీ థియేటర్లను ఏర్పాటు చేశారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/22.0

నగరంలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



జలమండలి స్టాల్‌లో ఎస్టీపీ సిబ్బంది భద్రత పరికరాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

దాహార్తి తీర్చిన ఘనత మాదే

- కాంగ్రెస్ సర్కారు ముందుచూపుతోనే ఇది సాధ్యమైంది
- అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను ప్రగతి పథంలో నిలుపుతాం
- ప్రజా పాలన విజయోత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

కృష్ణా, గోదావరి జలాలతో నగర తాగునీటి సమస్యను పరిష్కరించాం

సాక్షి, సిటీబ్యూరో: నగర ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం జలమండలికి సంబంధించిన పలు ప్రాజెక్టులను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ప్రాజెక్టు 3 దశలను, గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ప్రాజెక్టును చేపట్టిందని గుర్తు చేశారు. ఆయా ప్రాజెక్టుల వల్ల నగర ప్రజల దాహార్తి తీరిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో చేపట్టిన ప్రాజెక్టుల వల్లే ఈ సమస్య పరిష్కారమైందన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కాలుష్య రహితంగా మార్చేందుకు మూసీ ప్రక్షాళన, మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ప్రపంచంతో పోటీ పడుతున్న హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ లాంటి మౌలిక వసతుల్ని మెరుగుపర్చి.. విశ్వ నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

రూ.10 వేల కోట్లు కేటాయించాం..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. నగరాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించిందని వివరించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు దూర ప్రాంతాల నుంచి రోజూ 600 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు రిజర్వాయర్లు సైతం నిర్మిస్తున్నట్లు చెప్పారు. మురుగు నీటి శుద్ధి కోసం ఎస్టీపీలను నిర్మిస్తున్నామని వెల్లడించారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

నగర ప్రజలకు కలుషితం లేని గాలి, నీరు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని హెచ్ఎండీఏ ఐమాక్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మహా నగరం అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు.

స్టాళ్ల సందర్శన..

ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 'హైదరాబాద్ రైజింగ్' ఉత్సవాల సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి, మంత్రులు సందర్శించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఆరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, మాజీ ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలివచ్చిన ప్రజలు



హెచ్ఎండీఏ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తదితరులు



సభా ప్రాంగణానికి వస్తున్న సిరిసిల్ల రాజయ్య, భట్టి విక్రమార్క, అంజన్‌కుమార్, మధుయాష్కీ తదితరులు

మూసీ పునరుజ్జీవంతో నగరానికి మరింత బ్రాండ్ ఇమేజ్: పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవంతో ప్రపంచంలోనే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 'హైదరాబాద్ రైజింగ్' ఉత్సవాల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మూసీ రివర్ బెడ్‌లో నివసిస్తున్న వారికి సైతం మంచి భవిష్యత్ కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలకులు మూసీ అభివృద్ధి అంటూ కేవలం మాటలు, బోర్డు ఏర్పాటుకు పరిమితమయ్యారని విమర్శించారు. తమ ప్రభుత్వం మూసీని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుంటే దానిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. హైదరబాద్ అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులు తేకపోగా రాజకీయ విమర్శలకు పరిమితవుతున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుతూ దాదాపు రూ.7 వేల కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు మంత్రి పొన్నం వెల్లడించారు. నగరంలో 141 ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి సంపులను నిర్మించినట్లు చెప్పారు. రహదారులపై నీరు నిల్వకుండా వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ తీసుకొచ్చామన్నారు.

దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు..

నగరంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తామని మంత్రి పొన్నం వెల్లడించారు. ఢిల్లీలో ఎదురవుతున్న సమస్య హైదరాబాద్‌కి రావద్దని, కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. 2026 డిసెంబర్ వరకు ఇది వర్తిస్తుందన్నారు. ఢిల్లీలో పాఠశాలలను బంద్ చేసే పరిస్థితి ఏర్పడింది.. హైదరాబాద్‌లో కూడా ఈవీ బస్సులు నడిపించాలని ముఖ్యమంత్రి ఆలోచన అని పొన్నం వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తు నిర్వహణ

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తు నిర్వహణ చేస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. నగరంలో వరద ముప్పు అధిగమించేందుకు హైడ్రా సరైన ప్రణాళికలు రచిస్తోందని పేర్కొన్నారు. మంగళవారం హెచ్ఐసీసీలో జరిగిన జియో స్మార్ట్ ఇండియా సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. చెరువుల పునరుద్ధరణ, వాటి అనుసంధానంపై తాము దృష్టి పెట్టామని వివరించారు. రెండు సెంటీమీటర్ల వర్షం పడినా నగరంలో వరద ముంచెత్తి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, ఇది పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు. దీంతో ఇంధనంతో పాటు సమయం వృథా అవుతోందని, కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే చెరువుల పునరుద్ధరణ చేపట్టామని, నాలాల ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టామని, పార్కులను, ప్రభుత్వ స్థలాలు కాపాడుతున్నామని చెప్పారు. చారిత్రక అమీన్‌పూర్ చెరువు పరిసరాల్లో ఆక్రమణల తొలగించడంతో వలస పక్షులు వస్తున్నాయని చెప్పారు.

క్రిస్మస్‌ను అధికారికంగా జరిపించిన ఘనత కేసీఆర్‌దే: హరీష్‌రావు



కేక్ కట్ చేస్తున్న హరీష్‌రావు

రాంగోపాల్‌పేట్: దేశంలో ఎక్కడాలేని విధంగా క్రిస్మస్ పండగను అధికారింగా నిర్వహించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ వెస్లీ చర్చిలో గాడ్ విజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. యేసుక్రీస్తు ప్రేమ, దయాగుణం, శాంతి, కరుణను అందరిలో పెంపొందించారని.. ఇవే మనిషిని ఉన్నత స్థానానికి తీసుకుని వెళతాయన్నారు. పదవి, సంపద ఉండటమనేది ఉన్నత స్థానం కాదని గుణగణాలతో ఉన్నతంగా జీవించే వారే ఉన్నతమైన స్థానంలో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్లు విల్సన్, ఐవాన్, దినకర్, గాడ్ విజన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సికిందర్, ప్రతినిధులు సాగర్, దేవ సహాయం, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో దారుణం

అప్పు డబ్బులు తిరిగి అడిగినందుకు గొంతు కోసి చంపేశాడు

లింగోజిగూడ: అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇమ్మన్నందుకు వ్యక్తి గొంతు కోసి హత్య చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం దోనకొండకు చెందిన యక్కలి కాశీరావు (37), భార్య సుమలత, ఇద్దరు పిల్లలతో కలిసి హయత్‌నగర్ భాగ్యలత అరుణోదయ నగర్‌లో రెండున్నరేళ్లుగా ఉంటున్నాడు. కాశీరావు స్థానికంగా కార్ల క్రయవిక్రయాలు చేస్తుంటాడు. కాశీరావు కిరాయికి ఉంటున్న ఇంట్లోని మొదటి అంతస్తులోనే నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన బ్యాచ్‌లర్లు పెద్దగాని శేఖర్, పెద్దగాని సాయి, ఐతరాజు శంకర్‌లు అద్దెకి ఉంటున్నారు. వీరిలో సాయి, శంకర్ హయత్‌నగర్‌లోని బొమ్మలగుడి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాశీరావు, పెద్దగాని శేఖర్ ఇద్దరూ కలిసి కార్ల వ్యాపారం ప్రారంభించారు. 2023లో రూ.1.5 లక్షలు ఒకసారి, రూ. 3.60 లక్షలు మరోసారి కాశీరావు వద్ద శేఖర్ అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వాలని శేఖర్ గదికి వెళ్లి కాశీరావు అడుగుతుండేవాడు. ఈ విషయమై వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సాయి, శంకర్ వ్యక్తిగత పనిపై గదిలోంచి బయటకు వెళ్లారు. 10 గంటల సమయంలో కాశీరావు.. పైఅంతస్తులో ఉన్న శేఖర్ గదికి వెళ్లాడు. 20 నిమిషాలు గడుస్తున్నా కాశీరావు కిందకు రాలేదు. 10.20 గంటల సమయంలో శేఖర్ రక్తపు మరకలతో కిందకు దిగి వచ్చాడు. అక్కడే దుస్తులు ఆరేస్తున్న కాశీరావు భార్య సుమలతతో.. 'నీ భర్తను చంపేశాను' అంటూ వెళ్లిపోయాడు. సుమలత వెంటనే పైఅంతస్తులోని గదికి వెళ్లి చూడగా.. మెడ భాగంలో బలమైన గాయాలతో కాశీరావు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. భర్తను పైకి లేపాలని సుమలత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అతడు అప్పటికే మృతి చెందినట్లు గ్రహించిన సుమలత స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించింది. అప్పు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతున్నాడనే కోపంతోనే గొడపడిన శేఖర్.. కాశీరావును గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు శేఖర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



కాశీరావు (ఫైల్)

బల్కంపేట ఎల్లమ్మ సన్నిధిలో మంత్రి పొన్నం

అమీర్‌పేట: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రానున్న నాలుగేళ్లలో ప్రజలకు మరింత సంక్షేమం అందించేలా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు.



శ్రీకాంతాచారి ఆశయాలను నెరవేరుస్తున్నాం..

కాచిగూడ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి ఆశయాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ జనసమితి, యువజన విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమంలో యువత పోషించిన పాత్రను గుర్తు చేస్తూ 'తెలంగాణ యూత్ డే' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో భర్తీ చేయని ఉద్యోగాలను ప్రజా ప్రభుత్వం ఏడాదిలో భర్తీ చేసి చూపించిందని, ఆ ఘనత ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన వ్యక్తి శ్రీకాంతాచారి అని కొనియాడారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమరవీరుల త్యాగాలను గౌరవించకపోవడం అన్యాయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రగతి భవన్‌కు మంత్రులకు కూడా ప్రవేశం ఉండేది కాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో విద్య, వైద్యం, ఆర్థిక రంగాలను నిర్వీర్యం చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీమ్ పాషా, విద్యార్థి జనసమితి అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, నర్సయ్య, సుధాకర్, కొత్త రవి, ఎర్ర వీరన్న, రవి నాయక్, పేరాల ప్రశాంత్, శేఖర్ యాదవ్, నరేందర్, గోపీ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆటో బంద్ యథాతథం

- చర్చల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- జేఏసీ కన్వీనర్ వెంకటేశం



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ వెంకటేశం

కాచిగూడ: తొలుత ప్రకటించిన విధంగానే ఈ నెల 7న రాష్ట్రవ్యాప్త ఆటో బంద్‌ను యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ కన్వీనర్ (ఏఐటీయూసీ) బి.వెంకటేశం తెలిపారు. ఈ నెల 6వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలకు ఆహ్వానించారని, చర్చల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మంగళవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. దీంతో ఈ నెల 7వ తేదీన ఆటో బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో తమ ప్రతినిధి బృందం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను వివరించిందన్నారు.

కలసి తింటే.. కలదు సుఖం

బంధుమిత్రులతోనే మీ(ఈ)టింగ్ ...

- సినిమాకి ముందూ వెనుకా.. విందు
- కొత్త రుచుల అన్వేషణపై ఆసక్తి సైతం
- సిటీజనుల డైనింగ్ కల్చర్‌పై ఐఎఫ్ఎస్ఆర్ రిపోర్ట్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ, ఉత్తర భారత సంప్రదాయ వంటకాలతో పాటు నగర విందు వైవిధ్యభరితంగా ఉంటుంది. అమెరికన్, మెక్సికన్, ఇటాలియన్ సహా పాశ్చాత్య వంటకాలు, క్లాసిక్ చైనీస్ వంటకాలు ఇక్కడ డిమాండ్‌లో ఉన్నాయి. మరోవైపు సుసంపన్నమైన వంటల వారసత్వానికి ప్రసిద్ధి చెందింది మన నగరం. దీంతో రెస్టారెంట్‌ల సంఖ్యలో వృద్ధితో పాటే సిటీ జనుల ఆహారపు అలవాట్లలో వేగవంతమైన మార్పును చవిచూస్తోంది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఇండియా ఫుడ్ సర్వీసెస్ రిపోర్ట్ (ఐఎఫ్ఎస్ఆర్) 2024 ప్రకారం, సిటీజనులు నెలకు సగటున ఏడు సార్లు బయటే భోజనం చేస్తారు లేదా ఫుడ్ ఆర్డర్ చేస్తారు. ఇది జాతీయ సగటు 8కి అతి దగ్గరగా ఉంది. ఇంకా ఈ ఐఎఫ్ఎస్ఆర్ నివేదిక తెలిపిన అంశాల్లో మరికొన్ని ఇలా..

సరికొత్త వంటకాలు.. రెస్టారెంట్‌ల అన్వేషణ..

సామాజిక సమూహాలు, కుటుంబాలు, స్నేహితులతో సమావేశాలు సిటీలో డైనింగ్ కల్చర్‌ను ప్రభావితం చేస్తున్న ముఖ్యాంశాలు. హైదరాబాదీలు కూడా విహార యాత్రలతో పాటు సినిమాలను చూడటం దాకా రెస్టారెంట్ల సందర్శనను కూడా జత చేస్తారు. అంతేకాక కొత్త వంటకాలు సరికొత్త రెస్టారెంట్లను అన్వేషించడానికి ఎల్లప్పుడూ ఆసక్తిని కలిగి ఉంటారు.



అవుట్‌సైడ్ ఫుడ్.. రీజన్స్ ఇవే..

బయటి ఆహారం తినడానికి కుటుంబం, స్నేహితులతో గెట్- టుగెదర్ 28.9 శాతం మందికి ప్రధాన కారణంగా ఉంది. అదే విధంగా థియేటర్‌లో సినిమా చూడడానికి ముందు, ఆ తర్వాత 19.3 శాతం మంది బయటే తింటున్నారు. అలాగే పండగ లేదా నేషనల్ హాలిడేస్ వచ్చినప్పుడు 19.3 శాతం మంది, పుట్టినరోజులు, వార్షికోత్సవాలు, ప్రమోషన్లు వంటి ఆనందకరమైన సందర్భాలను సెలబ్రేట్ చేసుకోవడానికి 19.3 శాతం మంది, కొత్త అవుట్‌లెట్స్, రెస్టారెంట్స్ వచ్చినప్పుడు ఎలా ఉందో చూడడానికి అని13.3 శాతం మంది బయటి ఫుడ్‌కి ఓటేస్తున్నారు.

దేశంలోనే 5వ స్థానంలో...

నగరంలో అన్ని సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్నవి కలిపితే 74,000 పైగా ఆహార విక్రయశాలలు ఉన్నాయి. నగరం వ్యవస్థీకృత రంగాన్నే తీసుకుంటే రూ. 10,161 కోట్ల విలువ చేస్తుందని అంచనా. మన భాగ్యనగరానిది దేశంలోనే ఐదో అతిపెద్ద మార్కెట్. నగరం 40 వేలకుపైగా రెస్టారెంట్లు కలిగి ఉంది. వీటిలో క్లౌడ్ కిచెన్‌లూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇవి మొత్తం మార్కెట్‌లో 40 శాతం వాటా కలిగి ఉండడం క్లౌడ్ కిచెన్‌ల వృద్ధికి అద్దం పడుతోంది.

అనారోగ్యాలకూ ఆహ్వానం..

సిటీలో అవుట్‌సైడ్ ఫుడ్ తినడం అనేది పెరగడం ఆరోగ్యపరమైన సవాళ్లను తెచ్చిపెడుతోంది. కొన్నిచోట్ల అపరిశుభ్ర నిల్వ పద్ధతులు, నాసిరకం వంట పద్ధతులు ప్రమాణాలు పాటించని విధానాలు సిటీజనులకు రోగాలను కొని తెచ్చిపెట్టుకున్నట్టుగా చేస్తున్నాయి. అంతేకాకుండా.. కేలరీలు అధికంగా ఉండే రెస్టారెంట్ ఫుడ్ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, స్థూలకాయం సంబంధిత ఆరోగ్య సమస్యలకు దోహదపడవచ్చు. వీటిని గుర్తించి అవగాహనతో మాత్రమే అవుట్‌సైడ్ డైనింగ్‌ను ఆస్వాదించాల్సి ఉంది.



రైల్వే కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ సంఘ్ ధ్యేయం

- గుర్తింపు ఎన్నికల్లో ఎస్‌సీఆర్‌ఈఎస్‌ను గెలిపించండి
- రైల్వే కార్మిక సంఘం జాతీయ నేత మర్రి రాఘవయ్య పిలుపు



మర్రి రాఘవయ్య

అడ్డగుట్ట: రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్(ఎస్‌సీఆర్‌ఈఎస్)ఎల్లప్పుడూ ముందు ఉంటుందని ఎన్ఎఫ్ఐఆర్, ఎస్సీఆర్ఈఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. ఈ నెల 4 నుండి 6వ తేదీ వరకు యూనియన్ల గుర్తింపు కోసం సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికలు 17 జోనల్ రైల్వేలు, 2 ప్రొడక్షన్ యూనిట్లలో నిర్వహిస్తారని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో దాదాపు 78 వేల మంది రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. 1966 నుంచి ఎస్‌సీఆర్‌ఈఎస్ (ఎన్ఎఫ్ఐఆర్ అనుబంధం) ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ అంకిత భావంతో సేవలందిస్తుందన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ పోరాటాల ఫలితంగానే డీఏ ఫార్ములా అమలు చేశారని, ఇప్పుడు ప్రతీ ఉద్యోగికి ధరల పెరుగుదల ఆధారంగా డీఏ లభిస్తోందన్నారు. 1957లో లిబరలైజ్డ్ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టిందని, అయితే కేంద్ర ప్రభుత్వం జనవరి 1వ తేదీన 2004లో కొత్త పెన్షన్ స్కీం అమలు చేసిందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణకై శ్రమిస్తున్నామని రాఘవయ్య వెల్లడించారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు డిమాండ్లపై తాము పోరాటం చేస్తున్నామని వివరించారు. రైల్వే ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టరైజేషన్‌కు వ్యతిరేకంగా తమ యూనియన్ నిరంతరం ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్న ఎంప్లాయీస్ సంఘ్‌కు యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మాజీ సీఎం రోశయ్య వర్ధంతి సభ

హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎంలు

లక్డీకాపూల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమం బుధవారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త, ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ ఇండియా చైర్మన్ బెల్దె శ్రీధర్, రోశయ్య మెమోరియల్ ఫోరమ్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు.

చెట్టుకొకరు..పుట్టకొకరు!

- గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ తరలింపుతో వ్యాపారులు, రైతుల అవస్థలు
- మార్కెట్ వ్యవస్థ మొత్తం వివిధ ప్రాంతాలకు తరలిన వైనం
- జామ్‌బాగ్, కొత్తపేట్, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే విక్రయాలు
- ఇప్పటికీ ప్రారంభం కాని కోహెడ్ మార్కెట్ పనులు



కొత్తపేటలో..



జాంబాగ్‌లో ..

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా మంచి ఆదాయం అందించిన కొత్తపేటలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ ఉనికి లేకుండా పోయింది. ఇక్కడ ఎన్నో ఏళ్ల పాటు వ్యాపార లావాదేవీలు కొనసాగించిన రైతులు, వ్యాపారులు ఇప్పుడు పుట్టకొకరు.. గట్టుకొకరు అన్నట్లుగా కకావికలమయ్యారు. కొందరు జామ్‌బాగ్‌కు, మరికొందరు కొత్తపేట రైతు బజార్‌కు, ఎర్రగడ్డకు తరలివెళ్లారు. ఇక మరికొందరు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పండ్ల మార్కెట్ స్థలంలో ఆస్పత్రిని నిర్మిస్తుండగా..పండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా బాటసింగారంలో మార్కెట్ ఏర్పాటు చేశారు. కానీ అక్కడ సౌకర్యాలు లేవు. సిటీకి మరీ దూరంగా ఉండడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

ఇక రెండేళ్లలో కోహెడలో అత్యాధునిక సౌకర్యాలతో పండ్ల మార్కెట్ నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం కమీషన్ ఏజెంట్లకు చెప్పి ఖాళీ చేయించింది. మార్కెట్‌ను బాటాసింగారం తరలించే సమయంలో కోహెడలో మార్కెట్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేస్తామని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కూడా వ్యాపారులకు హామీ ఇచ్చారు. కానీ రెండేళ్లు పూర్తి అయినా ఇప్పటికీ కోహెడలో మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. దీంతో గడ్డి అన్నారంలో బ్రహ్మాండంగా కొనసాగిన హోల్‌సేల్ పండ్ల మార్కెట్ రెండేళ్లలో ముక్కలైంది. జామ్‌బాగ్, కొత్తపేట్, ఎర్రగడ్డ, మెహిదీపట్నం ప్రాంతాల్లోని మార్కెట్లే ఇప్పుడు దిక్కయ్యాయి. బాటసింగారం మార్కెట్‌కు రైతులు, వ్యాపారులు వెళ్లకపోవడం వల్ల మార్కెటింగ్ శాఖకు దాదాపు రూ.5 కోట్ల ఆదాయం దూరమైంది. ఇక నగరంలోని వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్ పండ్ల మార్కెట్లు కొనసాగుతున్నాయి. దీని వల్ల కూడా మార్కెట్ ఆదాయం తగ్గింది. కాగా గతేడాది ప్రభుత్వం పహడీషరీఫ్‌లో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అన్ని సౌకర్యాలతో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా ఈ మార్కెట్ కోసం డీపీఆర్ తయారు చేసి మార్కెట్ నిర్మించారు. కానీ ఇప్పటికీ ప్రారంభించలేదు.

నకిలీ ఆధార్ కార్డు.. నకిలీ 'రిజిస్ట్రేషన్'

- చీటింగ్‌కు పాల్పడి ప్లాట్ కబ్జా చేసిన 9 మంది ముఠా
- నలుగురి అరెస్టు

నాగోలు: ఓపెన్ ప్లాట్‌ను కబ్జా చేయాలనే ఉద్దేశంతో అసలు ఓనర్ ఆధార్ కార్డును పోలిన నకిలీ ఆధార్ కార్డు తయారు చేసి...అసలు ఓనర్ మాదిరిగా ఒక నకిలీ వ్యక్తిని సృష్టించి..అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి..ప్లాట్‌ను మార్కెట్ ధరకు విక్రయించి సొమ్మును పంచుకున్న 9 మంది ముఠా ఆటకట్టించారు ఎల్‌బీనగర్ పోలీసులు. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మమహ్మద్ సాదిక్, పాషా, జనార్దన్‌రెడ్డి, కోయల్కర్ చంద్రశేఖర్, లాలాజీ శ్రీశైలం, మొహ్మద్ ఇమాదుద్దీన్, ఉబెద్ బావోస్, మనోహర్‌గౌడ్, చిన్ను నాయక్‌లు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ గ్రామంలోని సర్వే నెంబర్ 104/1లో వాడుకలో లేని ఓపెన్ ప్లాట్‌పై కన్నేశారు. ఈ ప్లాట్‌ను కబ్జా చేయాలనే ఉద్దేశంతో అసలు ఓనర్ ఆధార్ కార్డును పోలిన నకిలీ ఆధార్ కార్డును తయారు చేశారు. ఒక నకిలీ వ్యక్తిని ఎల్‌బీనగర్ రిజిస్ట్రేషన్ అధికారి ముందు హాజరుపరిచి ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. తిరిగి ఆ ప్లాట్‌ను మార్కెట్ ధరకు విక్రయించారు. వచ్చిన సొమ్మును అందరూ కలిసి పంచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అసలు ప్లాట్ యజమాని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ముఠాలోని మహమ్మద్ సాదిక్, కోయల్కర్ చంద్రశేఖర్, లాలాజీ శ్రీశైలం, మహ్మద్ ఇమాదుద్దీన్‌లను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న కొంత మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్నవారిని అరెస్టు చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

లక్డీకాపూల్: ప్రజా పాలనలో తమ ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన వినతులను మంత్రి స్వీకరించారు. భూ సమస్యలు, శాంతిభద్రతలు, ఇతర కేసుల వినతులపై మంత్రి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న వినతులపై సమస్య పరిష్కారం త్వరితగతిన జరగాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. సిరిసిల్ల జిల్లాలో తమపై అక్రమంగా నమోదైన కేసులపై మహిళలు ప్రజావాణిలో చెప్పగా వెంటనే సిరిసిల్ల ఎస్పీతో మంత్రి పొన్నం మాట్లాడారు. ప్రజా పాలన నోడల్ అధికారిణి దివ్య దేవరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దృష్టికి పలు సమస్యలు..

- బేగంపేట్, అమీర్ పేట్ సహా పలు ప్రాంతాల్లోని హాకర్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారుల నుంచి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని హాకర్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.
- 61 సంవత్సరాల వయసు నిండిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరలోనే పరిష్కార మార్గం చూస్తుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.
- తార్నాక, కవాడిగూడ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మహిళలు తమకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరగా, వారి ప్రత్యేకతలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

430 దరఖాస్తులు

ప్రజావాణి కార్యక్రమంలో 430 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 114 అర్జీలు వచ్చాయి. మైనారిటీ సంక్షేమ శాఖ 126, విద్యుత్ శాఖ 54, రెవెన్యూ శాఖ 46, హోం శాఖ 20 , ఇతర శాఖలకు సంబంధించి 70 దరఖాస్తులు అందాయి.

ఘంటసాలకు గానసభ ఘన నివాళి



సభలో మాట్లాడుతున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

చిక్కడపల్లి: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గానసభలోని కళామారుతి కళావేదికపై 'ఎందరో మహానుభావులు' కార్యక్రమంలో భాగంగా ఘన నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కాదని, ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. ఘంటసాల మన మధ్య లేకపోయినా.. ఆయన పాటలు మాత్రం ఎప్పటికీ సజీవమేనన్నారు.

హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రాకు ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వుల జారీ చేశారు. కార్యాలయ నిర్వహణ, వాహనాల కొనుగోలు, కూల్చివేతలకు సంబంధించిన బిల్లుల నిమిత్తం నిధులకు పరిపాలన అనుమతులిచ్చింది.

సీఎం ప్రకటన హర్షణీయం: ఐఎంఏ

సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బంజారాహిల్స్ విభాగం అధ్యక్షుడు డా. ప్రభు కుమార్ చల్లగాలి హర్షం వ్యక్తం చేశారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఇంపాక్ట్ కాన్ 2024లో జరిగిన చర్చా వేదికపై వైద్యులపై దాడులు ప్రధానంగా చర్చకు వచ్చాయని తెలిపారు. ఈ దాడుల ఘటనలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇంపాక్ట్ కాన్ కార్యక్రమంలోనూ ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు దాడుల ఘటనలను వివరించామన్నారు. దాడుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ...ఇదే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్తామని వారు చెప్పారన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని పేర్కొన్నారు.

మతచాందసుల అరాచకాలపై కవులు గళమెత్తాలి: గోరటి

గన్‌ఫౌండ్రీ: సమాజంలో మత చాందస వాదులు చేస్తున్న అరాచకాలపై కవులు గళమెత్తాలని శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న సూచించారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నెలపొడుపు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన 'అసిపె' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాయీబ్రాహ్మణుల వృత్తిపై పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పాశ్చాత్య ధోరణిలో నాయీబ్రాహ్మణుల చేతివృత్తి సైతం కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బహుజన ఉద్యమంలో భాగంగా బీసీ కవులు, రచయితలు, కళాకారులు ఏకమై నిలవాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, చరిత్ర పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, కవి గుంటూరు లక్ష్మీనర్సయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పరువు, ఆస్తి కోసమే హత్య

- కానిస్టేబుల్ నాగమణి మర్డర్ నిందితుడికి రిమాండ్
- పరమేశ్‌కు సహకరించిన మరో వ్యక్తి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ సత్యనారాయణ



నిందితుడు పరమేశ్‌తో సీఐ సత్యనారాయణ, పోలీసులు

ఇబ్రహీంపట్నం: కులాంతర వివాహం చేసుకోవడంతో పాటు ఆస్తి కోసం బెదిరిస్తోందనే కారణంతో సొంత అక్కను చంపిన నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కులాంతర వివాహం, ఆస్తి వ్యవహారంతోనే కానిస్టేబుల్ నాగమణిని ఆమె సొంత తమ్ముడు కొంగర పరమేశ్(26) హత్య చేశాడని పేర్కొన్నారు. నాగమణి కదలికలపై నిందితుడికి సమాచారం ఇచ్చిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. మృతురాలు నాగమణికి అక్క హైమావతి, తమ్ముడు పరమేశ్ ఉన్నారు. 2009లో అక్క వివాహం జరగ్గా ఆమె భర్తతో కలిసి తుర్కయంజాల్‌లో నివసిస్తోంది. పదేళ్ల క్రితమే తల్లిదండ్రులు చనిపోవడంతో నాగమణి, పరమేశ్ రాయపోల్‌లోని పెద్దనాన్న సంరక్షణలో పెరిగారు. 2014లో నాగమణికి పటేల్‌గూడ వాసితో వివాహం జరిగింది. ఈ సమయంలో పసుపుకుంకుమల కింద ఎకరా భూమి రాసిచ్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో నాగమణి అతన్ని వదిలేసి, రాయపోల్ వచ్చేసింది. హయత్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఈ క్రమంలో 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై కుషాయిగూడ, హయత్‌నగర్ పీఎస్‌లలో పనిచేసింది. 2022లో మొదటి భర్తతో విడాకులు తీసుకుంది. రాయపోల్‌లో ఉన్నప్పుడే ఆ గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్‌తో ఉన్న పరిచయం ప్రేమగా మారింది. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినా ఆమె వినలేదు. దీంతో మొదటి పెళ్లి జరిగిన సమయంలో ఆమెకు ఇచ్చిన ఎకరా భూమిని తిరిగి ఇచ్చేసింది. గత నెల 10న యాదగిరిగుట్టలో శ్రీకాంత్‌ను కులాంతర వివాహం చేసుకుంది. ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్‌గా పనిచేసే శ్రీకాంత్‌తో కలిసి వనస్థలిపురం సహారా ఎస్టేట్స్‌లోని ఓ అద్దెంట్లో కాపు రం పెట్టారు. ఈ క్రమంలో తన ఎకరం తనకు తిరిగివ్వాలని తమ్ముడిని డిమాండ్ చేసింది. కులాంతర వివాహం చేసుకొని తమ పరువు తీయడమేగాకుండా, భూమి ఇవ్వాలని పేచీ పెడుతోందని పరమేశ్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం ఓ కత్తి (కమ్మ కత్తి)కొని కారులో దాచిపెట్టి అవకాశం కోసం ఎదురుచూడసా గాడు. ఆదివారం భర్తతో కలిసి వచ్చిందని తెలియడంతో హత్యకు సిద్ధమయ్యాడు. నాగమణి కదలికలను తెలిపేందుకు స్నేహితుడు అచ్చన శివను ఉపయోగించుకున్నాడు. సోమవారం ఉదయం స్కూటీపై విధులకు బయలుదేరిన విషయాన్ని శివ ఫోన్‌లో చేరవేశాడు. దీంతో పరమేశ్ కారులో ఆమెను వెంబడించాడు. మన్నె గూడ రోడ్డు జంక్షన్ వద్ద వెనక నుంచి ఢీకొట్టి, కిందపడగానే వెంటనే కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు మంగళవారం రాయపోల్ సమీపంలోని జనహర్ష వద్ద పరమేశ్‌ను పట్టుకున్నారు. అతని నుంచి కారుతోపాటు ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి సహకరించిన శివ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

అల్మాస్‌గూడలో హైడ్రా పంజా

- పార్కు స్థలంలో వెలిసిన నిర్మాణాల తొలగింపు
- హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు



వెంకటేశ్వరకాలనీలో ఆక్రమణలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

బడంగ్‌పేట్: నీటి వనరుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కట్టడికి ఏర్పాటైన హైడ్రా మరోసారి దూకుడు ప్రదర్శించింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో హైడ్రా అధికారులు పంజా విసిరారు. కార్పొరేషన్ పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన ఓ కంటైనర్‌ను హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో మంగళవారం నేలమట్టం చేసింది. బాలాపూర్ మండలం అల్మాస్‌గూడలోని వెంకటేశ్వరకాలనీలో సర్వేనంబర్లు 89, 90లలో పట్టాదార్లు 1982లో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. అప్పట్లో వెంచర్‌లో మూల మలుపుల వద్ద క్రాస్ బిట్లను పార్కుగా చూయించారు. ప్రస్తుతం భూమికి రేట్లు పెరగడంతో సదరు వెంచర్‌దారులు ఖాళీ ప్రాంతాన్ని కబ్జా చేశారు. దీంతో కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని పార్కు స్థలాలు అంటూ బోర్డులు పాతి ఫెన్సింగ్ వేశారు. అయినప్పటికీ వెంచర్‌దారులు దౌర్జన్యంగా సూచిక బోర్డులు తీసేసి స్థలంలో కంటైనర్, ఇతర నిర్మాణాలు చేపట్టారు. కాలనీవాసుల ఫిర్యాదుతో పాటు మున్సిపల్ అధికారులు కలిసి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు సుమారు రూ.50 కోట్లు విలువచేసే 700 వందల గజాల స్థలం కార్పొరేషన్‌కు చెందింది అని నిర్ధారించారు. పార్కు స్థలంలో అక్రమంగా వెలిసిన కంటైనర్‌ను తొలగించారు. దీంతో కాలనీవాసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

రంగనాథ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాలనీవాసులు

కొన్నేళ్లుగా పార్కు స్థలం కోసం మున్సిపల్ అధికారులతో కలిసి పోరాడుతున్నా వెంచర్ నిర్వాహకుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని కాలనీవాసులు ఆరోపించారు. మాగోడు విని హైడ్రా అధికారులు స్పందించి పార్కు జాగాను అక్రమార్కుల చెర నుంచి విడిపించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చిత్రపటానికి కాలనీవాసులు క్షీరాభిషే కం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బి.జంగయ్య, సభ్యులు కె.బాబు, మధుసూధన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, రవి, సూర్య, దర్శన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, రాము, కిషన్‌యాదవ్, రమాచారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?

- ఇంకెంత కాలం నిర్లక్ష్యం చేస్తారు
- వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టండి
- అఖిలపక్షం నాయకుల డిమాండ్
- హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ధర్నా



చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు కాలయాపన చేస్తుండడంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చేవెళ్లలో మంగళవారం ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అనంతరెడ్డి, వైభవ్‌రెడ్డి, సీపీఐకి చెందిన కె.రామస్వామి సత్తిరెడ్డి, సీపీఎంకు చెందిన దేవేందర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన శైలజ, సమత, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా కోర్టు కేసులు అంటూ జాప్యం చేస్తారా అంటూ నిలదీశారు. ఎన్‌జీటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే కేసు వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల కోటాను సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్: రాష్ట్రంలోని అన్ని శాఖల్లో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఉంటుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ సమాజంలోని దివ్యాంగులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని అవయవాలు బాగున్న వారు చేయలేని ఎన్నో అద్భుత కార్యాలను దివ్యాంగులు చేసి చూపుతున్నారని, ఇది మనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. మనమంతా దివ్యాంగులు ఆయా రంగాల్లో రాణించే విధంగా మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. తొలుత ఆయన పలువురు దివ్యాంగులకు ట్రై సైకిల్స్, చేతికర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా, యుసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, శ్యాంరావు, ఆంజనేయులు యాదవ్, పవన్, సత్య, సంతోష్ ముదిరాజ్, నర్సింగ్‌దాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో విజయోత్సవాలు

ఖైరతాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు
ప్రజాపాలన విజయోత్సవాలకు భారీ ఏర్పాట్లు : ఎమ్మెల్యే దానం నాగేందర్



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ప్రజాపాలన విజయోత్సవాలు కనీవినీ ఎరుగని రీతిలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైజింగ్ హైదరాబాద్ పేరుతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన ఖైరతాబాద్‌లో వెయ్యిమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే 1,000 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీన సచివాలయం ఎదుట తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ, ఆరు గ్యారంటీలు అమలు పరిచిన రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిల భారీ కటౌట్‌లకు భారీ క్రేన్లు ఉపయోగించి పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. కనీవినీ ఎరుగని రీతిలో ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కూడా ఉంటుందని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఈ వేడుకకు హాజరై ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఈ విజయోత్సవాల్లో పాలుపంచుకోవాలన్నారు. దేశంలోని 29 రాష్ట్రంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే నెంబర్–1 సీఎంగా పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించడం జరిగిందని, ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆర్థిక సహాయం కూడా అందజేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటి కూడా అమలుపరచలేదని ఆరోపించారు.

బస్తీ దవాఖానా వైద్యురాలికి పదోన్నతి



డాక్టర్ అమూల్య

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–72లోని ప్రశాసన్‌నగర్ బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమూల్యకు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పదోన్నతి లభించింది. ఇక్కడ బస్తీ దవాఖానా ఏర్పాటైన దగ్గరి నుంచి ఆమె మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. శ్రీరామ్‌నగర్ క్లస్టర్ నుంచి మెడికల్ ఆఫీసర్ పదోన్నతి పొందడం డాక్టర్ అమూల్యకే దక్కింది. ఆమెను వికారాబాద్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 400 మందికి సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా పదోన్నతులు ఇవ్వగా అందులో డాక్టర్ అమూల్య కూడా ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందిస్తున్న ఎంఎల్‌సీ మీర్జా రియాజ్

శ్రీనగర్‌కాలనీ: ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌సీ మీర్జా రియాజ్ సూచించారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఐదుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు కాగా, మంగళవారం ఎంఎల్‌సీ మీర్జా రియాజ్, జూబ్లీహిల్స్ ఎంఐఎం ఇంచార్జ్ అన్వర్ సదత్, శ్రీనగర్‌కాలనీ ఎంఐఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్‌జాఫర్‌లు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మీర్జా రియాజ్ మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎర్ర నగేష్ ఆసిఫ్, ఉమన్ పాల్గొన్నారు.

సమాజంలో ప్రతీ వ్యక్తి గౌరవంగా జీవించాలి



అవగాహన వాక్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

బంజారాహిల్స్: సమాజంలో ప్రతీ వ్యక్తి గౌరవంగా జీవించే హక్కు ఉందని మా గ్రూప్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత జి.కుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సమ్మిళిత, స్థిరమైన భవిష్యత్తు కోసం దివ్యాంగుల నాయకత్వాన్ని విస్తరించడం' అనే నేపథ్యంతో అవగాహన వాక్‌తో పాటు ఇంటర్–కాలేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌ను 'మా' రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించింది. కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఉన్న మా హాస్పిటల్స్ వరకు ఈ వాక్ చేపట్టింది. విద్యార్థులు, అధ్యాపకులు, కమ్యూనిటీ సభ్యులు ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వాక్‌ను సునీత జి.కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే సమాజ నిర్మాణం ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. అలాంటి మార్పు తేవడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దివ్యాంగులకు సమాజంలో మంచి అవకాశాలు కల్పించాలని, అన్నింట్లో అవి సమానంగా ఉండాలని ఆకాంక్షించారు. మా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ సాంకేతికత జీవితాలను ఎలా మార్చగలదో..ప్రపంచానికి మరిన్ని అవకాశాలు ఇవ్వగలదో..ఈ సాంకేతికత ప్రదర్శన తెలియజేసిందని చెప్పారు. మూస పద్ధతులను సవాల్ చేయడానికి, అవకాశాలను మెరుగుపరచడానికి తమ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

మంత్రి జూపల్లిని కలిసిన బాబా ఫసియుద్దిన్



మంత్రిని శాలువతో సన్మానిస్తున్న బాబా ఫసియుద్దిన్

రహమత్‌నగర్: కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నగరంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తనను మంత్రి సూచించినట్లు బాబా ఫసియుద్దిన్ తెలిపారు.

లైబ్రరీ సైన్స్ కోర్సుకు దేశంలో ఎంతో గుర్తింపు



నిరసన ప్రదర్శనలో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ సైన్స్ కోర్సు దేశంలోనే అత్యంత గుర్తింపు పొందిన కోర్సుగా పేరుందని జేఏసీ కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి రాజాగౌడ్ పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ కోర్సుల్లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆలోచనను ఉపసంహరించుకోవాలని చేపడుతున్న దీక్ష కార్యక్రమంలో శ్రీనివాస్, రాజాగౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులే ఎక్కువ శాతం ఉద్యోగాలు సాధించారన్నారు. ఇలాంటి పరిస్థితిలో లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు మౌలిక వసతులు (ప్రాక్టికల్ క్లాస్‌లు) కల్పించాలంటే లేబరేటరీ కేంద్రాలను విస్తరించాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరారు. అనంతరం ఐక్య కార్యాచరణ సమితి చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎల్వీకే రెడ్డి, రబీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, మేరీ సునంద, బ్రహ్మానందనాయుడు, రుషేంద్రమణి, కిషోర్, రాఘవేంద్ర, రజిత, షబ్బీర్, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

ఖైరతాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో డివిజన్లవారీగా విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి కోరారు. మంగళవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించాలని ఆయా డివిజన్ల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'ఆరు అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్'



చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలతో ప్రజలను మోసం చేసి ప్రభుత్వాన్ని స్థాపించిందని జూబ్లీహిల్స్ బీజేపీ ఇంచార్జ్ లంకల దీపక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నాగార్జుననగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణాలో దగాకోరు పార్టీగా మారిందని, చెప్పిన హామీలను నెరవేర్చడంలో పూర్తి విఫలమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అబద్ధాల గ్యారంటీలపై బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో చార్జిషీట్‌ను విడుదల చేశామన్నారు. మూసీనది ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, కానీ చేసే విధానాలకు తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. హైడ్రా పేరుతో ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని తెలిపారు. గ్రేటర్‌లో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యంపై ఈనెల 5న కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కనబడటం లేదని, బోరబండ నేతలు ఈవారంలో పోలీస్‌స్టేషన్ మిస్సింగ్ కంప్లెయింట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్లలో కాంగ్రెస్ నేతల గ్రూప్ రాజకీయాలతో అయోమయంగా మారిందన్నారు. కేవలం బీజేపీ పార్టీనే ప్రజల సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలపడంలో ముందుంటున్నారు. ఈ సమావేశంలో నేతలు కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్; కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ, సుప్రియ గౌడ్, నాగేశ్వరరావు, జ్యోతి, సునీత, గణస్త్రస్, లక్ష్మణ్, వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్స్‌లో ఈనెల 11న జరగనున్న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు విజయవంతం చేయాలని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రౌండ్స్‌లో జరుగుతున్న క్రిస్మస్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని పండుగలకు ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని అన్ని చర్చిలకు చెందిన క్రైస్తవ సోదరులు పాల్గొనాలని కోరారు. ఆయన వెంట క్రైస్తవ మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను అంగీకరించం



మాట్లాడుతున్న వి.ఎల్.రాజు

లిబర్టీ: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ తాము అంగీకరించబోమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్.రాజు అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం రిజర్వేషన్ల పరిరక్షణ కోసం దళితులంతా ఐక్యంగా ఉద్యమించాలి తప్ప వర్గీకరణ వాదనను విడనాడాలని సూచించారు. మంగళవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వర్గీకరణ చెల్లదని, ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీగా చేయడం కుదరదని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చేయడం చెల్లదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వర్గీకరణ చేయాలని పట్టుబట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. అటు న్యాయస్థానం తీర్పు చెప్పినప్పటికి ఇటు రాజ్యాంగంలో పేర్కొన్నప్పటికి వర్గీకరణ కావాలని మొండి పట్టుకు వ్యవహరించడం మంచిది కాదన్నారు. దళితుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో సమన్యాయం కోసం పోరాటం చేసేందుకు దళిత వర్గాల ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో సలహాదారులు వి.కృష్ణ, స్వరూప్ పాల్గొన్నారు.

ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



వేడుకలను ప్రారంభిస్తున్న జయేష్ రంజన్



బధిర విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జయేష్‌రంజన్

ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

శ్రీనగర్‌కాలనీ: బధిరులకు బాసటగా ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయని ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. మంగళవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జయేష్‌రంజన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం నిరుద్యోగ యువకులకు డిజిటల్ ఎప్లాయ్‌మెంట్ ఆఫ్ తెలంగాణా ప్లాట్‌ఫాంను విడుదల చేశారు. బధిరులతో అపారమైన తెలివితేటలు ఉంటాయని, వారికి ఈ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుందన్నారు. వేడుకల్లో భాగంగా బధిర విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి అభినందించారు. ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ బధిరులకు చదువుతో పాటు వారి ఆలనాపాలన అందిస్తూ వారికి ఉపాధిని కూడా కల్పించడం ప్రశంసనీయమని, సంస్థ డీపీకే బాబు చేస్తున్న కృషి మార్గదర్శకమని కొనియాడారు. ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ బధిరులకు చేసిన సేవలకు బెస్ట్ ఇనిస్టిట్యూషన్ స్టేట్ అవార్డు లభించడం వారిలో ఉన్న కృషికి నిదర్శనమన్నారు. అనంతరం బధిర విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో క్వాల్‌కలమ్ ఇంజినీర్ ప్రిన్సిపాల్ సుధీర్ సుంకర, స్టేట్ స్ట్రీట్ డెవలెప్‌మెంట్ మేనేజర్ శరత్‌బాబు చిటిరాల, నీతూ చడ్డ, సూపర్ గ్యాస్ జనరల్ కౌన్సిల్ శ్రీమన్నారాయణ కదలి, డెల్ డిజిటల్ గ్లోబల్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ జంపుల, జడ్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ సుధీర్ నరిశెట్టి, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మలు మీదపడి నలుగురికి గాయాలు

వెంగళరావునగర్: వాహనం చెట్టును ఢీకొన్న సంఘటనలో చెట్టు కొమ్మలు విరిగి నలుగురికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బంజారాహిల్స్‌లో నివసించే డి.కిశోర్‌కుమార్, అతని స్నేహితుడు శ్రీకాంత్ మంగళవారం అమీర్‌పేట నుంచి యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి గుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఎస్‌బీఐ వద్దకు రాగానే సామాన్లు తరలించే లారీ వేగంగా వచ్చి చెట్టును ఢీకొంది. దీంతో చెట్టు కొమ్మలు విరిగి కిశోర్‌కుమార్, శ్రీకాంత్‌లతో పాటుగా రామ్మోహన్‌సాగర్, మహేష్‌గౌడ్‌లపై పడ్డాయి. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన రాజస్తాన్‌కు చెందిన రవిసింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై మంత్రికి వినతి



రవాణా శాఖ మంత్రికి సమస్యలు వివరిస్తున్న రుద్రాక్ష మల్లేష్

లిబర్టీ: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలన్నారు. 13 సంవత్సరాలుగా ఆటో మీటర్ చార్జీలు పెంచలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 12 రూపాయల నుంచి మీటర్ చార్జి రూ. 20 రూపాయలకు పెంచిందని గుర్తు చేశారు. పెరిగిన పెట్రో, గ్యాస్ ధరలతో ఆటో డ్రైవర్లపై ఆర్థికభారం పడుతుందని ఆయన అన్నారు. రూ. 20 రూపాయల నుంచి ఆటో మీటర్ చార్జి రూ. 40కి పెంచాలని కోరారు. అదేవిధంగా ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా రూ. 10 లక్షలు కల్పించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శివ, ఫరూఖ్ తదితరులున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



నిందితుడు సోహెల్ అలీఖాన్

బంజారాహిల్స్: ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... టోలిచౌకి పారామౌంట్ కాలనీకి చెందిన సోహెల్ అలీఖాన్ (27) డ్రైవర్‌గా పనిచేస్తుండగా, సోమవారం రాత్రి టీఎస్ 09 యూఈ 2139 బైక్‌పై బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో సిగ్నల్ వద్ద ఆగాడు. అయితే రెడ్‌సిగ్నల్ లైన్‌లో కాకుండా ఫ్రీ లెఫ్ట్‌లో బైక్ నిలపడంతో వెనుక వస్తున్న వాహనాలకు అడ్డంకిగా ఉండడంతో ట్రాఫిక్ ఆగిపోయింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు ఫ్రీ లెఫ్ట్ నుంచి బైక్‌ను ముందుకువెళ్లాలని చెప్పాడు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకపోగా తనకే చెబుతావా అంటూ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోహెల్ అలీఖాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాభాలు వస్తాయని నమ్మినందుకు...

రూ.1.20 లక్షలు కాజేశారు

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో వ్యాపారం పేరుతో యువకుడిని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన ఎం.ప్రసాద్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గతనెల 24న అతనికి టెలిగ్రాంలో ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో మెసేజ్ వచ్చింది. దీనికి స్పందించిన ప్రసాద్‌కు తమ సంస్థలో జాయిన్ అయితే అత్యధికంగా లాభం పొందవచ్చని సూచించారు. ఈ క్రమంలో తొలుత రూ.10 వేలు, అనంతరం మరో రూ.10 వేలు ఈ విధంగా దాదాపు రూ.లక్షా 20 వేల రూపాయల వరకు చెల్లించుకున్నారు. అక్కడ నుంచి ఎలాంటి లావాదేవీలు రాకపోవడంతో తాము మోసపోయానని గ్రహించి మంగళవారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: మెట్రో వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సారథీనగర్‌లో నివసించే జి.సంతోష్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 30న ఉదయం తన ద్విచక్ర వాహనాన్ని మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసి ఉప్పల్‌కు వెళ్ళి రాత్రి 8 గంటలకు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



వెంగళరావుపార్కు వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వేర్వేరు చోట్ల ఆపరేషన్ రోప్ నిర్వహించి పెద్ద ఎత్తున ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు. జలగం వెంగళరావు పార్కును ఆనుకుని ఫుట్‌పాత్‌పై తోపుడుబండ్లు, కొబ్బరిబోండాల దుకాణాలు ఏర్పాటు చేయగా పాదచారులకు, పార్కుకు వచ్చిన సందర్శకులకు తీవ్ర అడ్డంకిగా మారింది. ఇటీవల వీటిపై పోలీసులకు అనేక ఫిర్యాదులు అందాయి. దీనిలో భాగంగా వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆక్రమణలు తొలగించారు. అలాగే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బీమార్ట్ హోటల్, స్టార్ హాస్పిటల్, రెయిన్‌బో హాస్పిటల్ రోడ్డులో కూడా ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, టీ డబ్బాలు, ఇతర దుకాణాలను బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయిప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో తొలగించారు.

జూబ్లీహిల్స్‌లో భవనం సీజ్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. భవన నిర్మాణదారుడు నివాస భవనాన్ని అనధికారికంగా వాణిజ్య సంస్థగా మార్చాడు. గతంలో అధికారులు ఈ నిర్మాణాన్ని కూల్చివేసినప్పటికీ యజమాని మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాన్ని చేపట్టాడు. దీనిపై విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రాపర్టీని సీజ్ చేశారు.

నగరంలో నేడు

- కొత్తగూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీని ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమం హైటెక్స్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు పాల్గొంటారు.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- పల్లెటూరి వాతావరణాన్ని తలపించే మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అందం.. ఆహ్లాదం!

అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్వాల్‌గూడ ఎకో పార్కు

పచ్చికబయళ్లు, ఉద్యానవనాలు, బోర్డ్‌వాక్‌లు | విందులు, వినోదాలు, వేడుకలు, సాహసక్రీడలు | 85 ఎకరాలు, సుమారు రూ.300 కోట్ల వ్యయం

పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు ఇలాంటివెన్నో నగరవాసుల్ని ప్రశాంతతకు దూరం చేస్తున్నాయి. నిత్యం వాటితో కుస్తీ పట్టి కాసింత సేద తీరాలంటే మొదట గుర్తుకువచ్చేవి పార్కులే.. పచ్చని మొక్కలు, హాయినిచ్చే పూలు, చల్లని గాలులు.. అలా పార్కుల్లో నడుచుకుంటూ వెళుతుంటే అన్నీ మరిచిపోయేలా చేస్తాయి. ఆ దిశగా సిటీజనుల మేలు కోసం కొత్వాల్‌గూడ ఎకో పార్కు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. ఈ పార్కులో ఎన్నో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. సాహసక్రీడలు, ట్రెక్కింగ్‌కు అవకాశం ఉంది. ఎలివేటెడ్ వాక్ వే వంటి సౌకర్యాలతో పాటు చిన్నచిన్న వేడుకలు జరుపుకునేలా లగ్జరీ వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో




కొత్వాల్‌గూడ ఎకో పార్కు

కొత్వాల్‌గూడ ఎకో పార్కు సకల హంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. హిమాయత్‌సాగర్‌కు చేరువలో, ఔటర్‌రింగ్ రోడ్డు అంచుల్లో ఆకుపచ్చ అందాలతో రూపుదిద్దుకుంటోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో, ఎన్నెన్నో వైవిధ్యభరితమైన ప్రత్యేతలతో ఏర్పాటు చేస్తోన్న కొత్వాల్‌గూడ ఎకో పార్కు పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రజాపాలన వేడుకల్లో భాగంగానే ఈ పార్కును ప్రారంభించే ప్రతిపాదన ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం అక్టోబర్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుమారు రూ.300 కోట్ల అంచనాలతో ఎకోపార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందుకోసం 85 ఎకరాలను కేటాయించారు. ఎకోపార్కుతో పాటు సుమారు 1000 రకాల చేపలతో కూడిన అతిపెద్ద అక్వేరియం టన్నెల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ప్రస్తుతం పార్కు పనులు పూర్తయ్యాయి. అక్వేరియం ప్రతిపాదన మాత్రం వాయిదా పడింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో అక్వేరియం నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. కానీ ప్రైవేట్ సంస్థలు ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు వెనుకడుగు వేయడంతో అక్వేరియం ప్రతిపాదనలను వాయిదా వేశారు. ఎకోపార్కు నిర్మాణానికే పరిమితమయ్యారు. విశాలమైన పచ్చికబయళ్లు, ఉద్యానవనాలు, విందులు, వినోదాలు, వేడుకల కోసం ప్రత్యేక సదుపాయాలతో ఎకో పార్కు సిద్ధమవుతోంది. త్వరలోనే ఈ పార్కును నగరవాసులకు అందుబాటులోకి తేనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. హిమాయత్‌సాగర్‌ను ఆనుకొని నిర్మించిన ఈ పార్కు లేక్‌వ్యూ ఫ్రంట్ పార్కుగా సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతులతో కనువిందు చేయనుంది.

ఎన్నో ప్రత్యేకతలు..

ఇటు ఐటీ కారిడార్ల నుంచి అటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఉన్న వివిధ కాలనీలు, ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఒక అద్భుతమైన ఆటవిడుపుగా, అందమైన కాలక్షేపంగా, పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి వేడుకలకు అవసరమైన వేదికలు, లగ్జరీ సదుపాయాలతో సిద్ధమవుతోన్న ఎకోపార్కులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ పార్కులో ఏర్పాటు చేసిన ఏవియరి (పక్షుల గ్యాలరీ) దేశంలోనే అతిపెద్దదిగా సందర్శకులను ఆకట్టుకోనుంది. రకరకాల పక్షుల కిలకిలలతో ఆహ్లాదాన్ని పంచనుంది. అలాగే 2.5 కిలోమీటర్లతో ఎలివేటెడ్ వాక్ వేలను ఏర్పాటు చేశారు. నగరవాసులు ఉదయం, సాయంత్రం ఈ వాక్‌వేలపై నడకకు వెళ్లొచ్చు. విశాలమైన పచ్చికబయళ్లతో పాటు అందమైన పూల వనాలను కూడా ఏర్పాటు చేశారు. బటర్‌ఫ్లై పార్కు మరో ప్రత్యేకత. సీతాకోకచిలుక ఆకృతిలో ఏర్పాటు చేసిన ఈ పార్కు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనుంది. పార్కులో ఉన్న అడవుల సహజత్వానికి ఏ మాత్రం విఘాతం కలగకుండా ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేశారు. అలాగే సీజనల్ ఉద్యానవనాలు ఎకోపార్కులోని మరో ప్రత్యేకత. ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎదిగే వృక్షాలు, పూల మొక్కలతో ఇది ఆకట్టుకోనుంది.

అడ్వెంచర్స్ జోన్..

పార్కులో పిల్లల కోసం ప్రత్యేకమైన ఆట స్థలాలను ఏర్పాటు చేశారు. కొండలు, గుట్టలతో కూడిన సహజమైన అడవులు అడ్వెంచర్స్ ఉన్నాయి. ట్రెక్కింగ్ వంటి సాహసక్రీడల పట్ల అభిరుచి కలిగిన వాళ్లు ఈ జోన్‌లో తమ సాహసాలకు పదునుపెట్టుకోవచ్చు. ఎకోపార్కులో ఏర్పాటు చేసిన లగ్జరీ కన్వెన్షన్ వేడుకలు జరుపుకొనేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. రెండేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం అన్ని హంగులతో ప్రాజెక్టు తుదిదశకు చేరుకుంది. రెండో దశలో అక్వేరియంతో పాటు థీమ్‌పార్కులు, ల్యాండ్‌స్కేప్‌లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.



గార్లపాటి పల్లవికి నవసాహితీ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జీవితంపై 'సుస్వరాల సుబ్బులక్ష్మి' పేరుతో గార్లపాటి పల్లవి రాసిన గ్రంథాన్ని ఉత్తమ జీవితచరిత్ర గ్రంథంగా ప్రథమ బహుమతికి ఎంపిక చేసినట్లు నవసాహితి ఇంటర్నేషనల్(చెన్నై) వ్యవస్థాపకులు ఎస్వీ సూర్యప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బహుమతి వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ కథ, నవల తదితర రచనలకు అవార్డులను అందజేస్తుండగా, మొట్టమొదటిసారి ఆ కేటగిరిలోకి జీవితచరిత్ర గ్రంథాలను చేర్చినట్లు పేర్కొన్నారు. గార్లపాటి పల్లవి రాసిన మహానటి సావిత్రి జీవిత చరిత్ర పుస్తకం 14 వేల ప్రతులు, సుస్వరాల సుబ్బులక్ష్మి గ్రంథం 5 వేల ప్రతులు అమ్ముడైనట్లు పేర్కొన్నారు. ప్రాచీన చరిత్రపై ఎమ్మె చదివిన ఆమె జీవిత చరిత్రల రచనలో ప్రత్యేకమైన శైలిని కలిగి ఉన్నట్లు చెప్పారు.

మెట్రోరైల్ భవన్‌లో వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల సందర్భంగా బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవన్‌లో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో దీన్ని నిర్వహించారు. మెట్రో రైల్ సంస్థ అధికారులు, సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొన్నారు. డాక్టర్లు కంటి, దంత వైద్య పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేశారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

యూజీసీ నిబంధనలు పాటించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అటానమస్ (స్వయంప్రతిపత్తి) కాలేజీలు యూజీసీ నియమనిబంధనలు పాటించాలని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. ఓయూలోని పాలన భవనంలో అటానమస్ కాలేజీల నిర్వహకులతో మంగళవారం సమావేశమయ్యారు. కాలేజీ ప్రిన్సిపల్స్, అధ్యాపకుల నియామకాలు, విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు యూజీసీ నిబంధనల ప్రకారం పారదర్శకంగా సాగాలన్నారు. పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులతో పాటు ఓయూ పరిధిలోని 38 అటానమస్ కాలేజీల నిర్వహకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఓయూ సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమైన వీసీ ప్రొ.కుమార్ ఆదేశాలను జారీ చేశారు. వర్సిటీ క్యాంపస్‌లో రాత్రి వేళ గస్తీ తిరగాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

నేడు ఎస్.పి.శైలజకు ఘంటసాల పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా ఘంటసాల 102వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ చైర్మన్ భీమ్‌రెడ్డి, కార్యదర్శి ఆమని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని ఎస్‌పీ.శైలజకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయడంతో పాటు సినీ సంగీత విభావరి ఉంటుందని తెలియజేశారు.

6న అంబేడ్కర్ స్మారకోపన్యాసం

కాచిగూడ: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'అంబేడ్కర్ జీవితం–ఆశయం–విజయాలు' అనే అంశంపై అంబేడ్కర్ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. అంబేడ్కర్ అందించిన సేవలపై ప్రతి ఏడాది ఆయన వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థి కుటుంబానికి పరిహారం?

పోచారం: అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి తల్లిదండ్రులకు పరిహారం చెల్లించేందుకు కళాశాల యాజమాన్యం అంగీకరించింది. సోమవారం అర్ధరాత్రి వరకు విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద ఆందోళన చేశారు. కాలేజీ ఫర్నిచర్ ధ్వంసం చేసి ప్రిన్సిపాల్ రాంరెడ్డిపై దాడి చేశారు. తన కొడుకును అన్యాయంగా చంపేశారంటూ విద్యార్థి తండ్రి జగన్నాథం బోరున విలపించారు. అర్ధరాత్రి తర్వాత కాలేజీ యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు అంగీకరించి సమస్యను పరిష్కరించుకున్నట్లు సమాచారం. మంగళవారం తెల్లవారుజాము వరకు కళాశాలలో ఉన్న విద్యార్థులను వారి ఇళ్లకు పంపారు. ఏబీవీపీ నాయకులు కళాశాల ముందే నిద్రించారు. కళాశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ నాయీబ్రాహ్మణ జీవో పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయీ


ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

కవాడిగూడ: నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను ఏర్పాటు చేసి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, కార్పొరేట్ సంస్థలు రావడం వల్ల నాయీ బ్రాహ్మణుల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతోందని, వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమ కులవృత్తిని ఇతర కులాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాయీ బ్రాహ్మణ జీవో పోరాట సమితి అధ్యక్షుడు రమేష్ నాయీ డిమాండ్ చేశారు. తమ చేతి వృత్తిని కార్పొరేట్ శక్తులు నిర్వహించడం వల్ల నాయీబ్రాహ్మణ కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ నాయీ బ్రాహ్మణ జీవో పోరాట సమితి ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయీ మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణ కులవృత్తిని కార్పొరేట్ శక్తులు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాల్లో నాయీబ్రాహ్మణులకు భాగస్వాములను చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించడం వల్ల రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఉపాధి కోల్పోయి అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర ఉందని, దీన్ని ప్రభుత్వాలు విస్మరించవద్దని అన్నారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రత్యేక జీవో తీసుకువచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, నర్సింహ, వెంకటేష్, యాదయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఓయూలో ఇంజినీరింగ్ విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో కొనసాగుతున్న డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు పాలన భవనం ఎదుట ధర్నా చేశారు. డిటెన్షన్ విధానం వలన ఏటా 1500 మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి పేర్కొన్నారు. నాణ్యత పేరుతో డిటెన్షన్ విధానం వలన ఇంజినీరింగ్ విద్యార్థులు కోర్సు పూర్తి చేయాలేకపోతున్నారని వివరించారు. లక్షల రూపాయల ఫీజులు చెల్లించి 4 సంవత్సరాలు చదివి ఇంజినీరింగ్ పూర్తి కాగా వృథాగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డిటెన్షన్ రద్దు చేయాలని వోఎస్‌డీ ప్రొ.జితేందర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

సాంకేతికత.. దివ్యాంగులకు వరం

- ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్
- టీ–వర్క్స్‌లో అసిస్టివ్ టెక్నాలజీ సదస్సు



సాక్షి, సిటీబ్యూరో: సాంకేతికత దివ్యాంగులకు వరం లాంటిదని ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీ–వర్క్స్‌లో మంగళవారం జరిగిన అసిస్టివ్ టెక్నాలజీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంక్లూజివ్ ఇన్నోవేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ఉందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు.. ముఖ్యంగా దివ్యాంగులకు ఉపయోగపడేలా ఎన్నో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో అనేక మంది ఔత్సాహిక దివ్యాంగ పారిశ్రామికవేత్తలు పాల్గొని, వారి అనుభవాలు, విజయాలను పంచుకుని స్ఫూర్తి నింపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడే ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లు పలువురిని ఆకర్షించాయి. సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పిస్తున్న పలువురు దివ్యాంగ పారిశ్రామికవేత్తలను టీ–వర్క్స్ సీఈవో జోగిందర్, వీ–హబ్ సీఈవో సీత తదితరులు సత్కరించారు.

రాష్ట్ర సాధనకు కేసీఆర్ కుటుంబం చేసిందేమీలేదు

తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ కుటుంబం చేసిందేమీ లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సెంటిమెంట్, తెలంగాణ ప్రజలను వాడుకున్నారని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కమ్మ, రెడ్డిలు ఏలుతున్నారు.. వెలమలు ఎందుకు ఏలకూడదనే టీఆర్‌ఎస్ పెట్టారని, కేసీఆర్ ఆయన కుటుంబానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఇష్టం లేదని ఆరోపించారు. తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం, ఓయూ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గజ్జెల కాంతం, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో హరీష్‌రావు ఒంటిపై పెట్రోలు పోసుకుని అగ్గిపెట్టె దొరకక ఆగిపోయాడని, అదే శ్రీకాంత్‌చారి వంటి అసలైన ఉద్యమకారులు మాత్రం బలిదానాలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర విద్యార్థులు, ఉద్యమకారులదే అని, కేసీఆర్ కుటుంబానిది చాలా చిన్నపాత్ర అన్నారు. ఉద్యమకారులను గుర్తిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం హర్షణీయం అన్నారు. ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ.25 లక్షలు, ప్రతి ఉద్యమకారుడికి రూ.25 వేల పింఛన్, ఉద్యమకారుల అర్హతనుబట్టి ఉద్యోగాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు గుడిపల్లి రవికుమార్, డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్, ముప్పు భిక్షపతి రజక, నరసింహ మాదిగ, సముద్రాల అజయ్, మామిడి మట్టియ్య, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఉద్యమకారులు

దివ్యాంగులకు అండగా 'గాంధీ'


జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన సదస్సు ప్రారంభిస్తున్న గాంధీ పాలనాధికారులు

గాంధీఆస్పత్రి: వైద్యపరంగా అనేక అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించి దివ్యాంగులకు అండగా నిలిచి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపామని పలువురు గాంధీ వైద్యులు తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వాల్యా నేతృత్వంలో మంగళవారం అలుమ్నీ భవనంలో వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఇన్‌కమ్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ప్రకాశ్‌రాథోడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. గాంధీఆస్పత్రిలో దివ్యాంగులకు అందించిన వైద్యసేవలు, శస్త్రచికిత్సల వివరాలు, శారీరక, మానసిక సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దివ్యాంగుల పట్ల సానుభూతితో పాటు చేయూత అందించి అన్నిరంగాల్లోనూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రొఫెసర్ సుబోధ్ కుమార్, రవిశేఖర్‌రావు, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఉస్మానియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ పీఎల్ శ్రీనివాస్, బన్సీలాల్‌తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్యం నుంచి కాపాడిన గాంధీ వైద్యులు: నర్సింహ

గాంధీ ఆస్పత్రి వైద్యులు వైకల్యం నుంచి తనను కాపాడారని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నర్సింహ తెలిపారు. నక్సలైట్ల దాడి ఘటనలో బుల్లెట్ తన భుజంలో ఉండిపోయిందని, కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులకు తిరిగి లక్షలాది రూపాయల ఖర్చు చేసినా బుల్లెట్ తొలగించలేకపోయారని, గాంధీ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ వాల్యా ఆధ్వర్యంలో వైద్య బృందం బుల్లెట్‌ను తొలగించి వైకల్యం నుంచి కాపాడారని, గాంధీ వైద్యులకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

ఎండీ ఆదేశాలతో సమస్యకు పరిష్కారం



సాక్షి, సిటీబ్యూరో: చింతల్‌బస్తీలో సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశాలతో పరిష్కారం లభించింది. 20రోజులుగా చింతల్‌బస్తీ మెయిన్ రోడ్డులో మురుగు పొంగి పారుతోందని ఎండీ దృష్టికి రావడంతో సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యల్ని పట్టించుకోని సీవరేజ్ ఇన్‌స్పెక్టర్, మేనేజర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు.. చింతల్‌బస్తీ మెయిన్ రోడ్డు నుంచి షాదాన్ కాలేజీ వరకు ఉన్న మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించారు.

ఓయూలో శ్రీకాంతాచారి 15వ వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి వర్ధంతిని ఓయూ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట శ్రీకాంతచారి 15వ వర్ధంతి సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐయూఐ రాష్ట్ర నాయకులు సైదులు యాదవ్, చందు, టీఎస్‌పీ నేత భారీ అశోక్‌యాదవ్, వెంకట్, నరేష్, టీఎస్ పొలిటికల్ జేఏసీ నేత వలిగొండ నరసింహ, డీఎస్ఎఫ్ నేత నోముల శేషు, ఎంఎస్ఎఫ్ నేతలు కొమ్ముశేఖర్, అజయ్ స్వామాట్, పీడీఎస్‌యూ నేతలు సుమంత్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ఆదాయం రూ.1,32,33,779



కీసర: నెల రోజుల పాటు నిర్వహించిన కార్తీక మాసోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామికి రూ.1,32,33,779ల ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం తెలిపారు. ప్రసాదాలు, అభిషేకాలు, దర్శనం టికెట్లతో రూ.1,01,81,543, మంగళవారం హుండీ లెక్కించగా రూ.30,52,236లతో కలిపి మొత్తం రూ.1,32,33,779 ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే రూ.29,44,243 ఆదాయం అధికంగా వచ్చిందని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ టి.శేఖర్, నరసింహ సేవాసమితి, అన్నపూర్ణ సేవా సమితి, శ్రీవారి సేవ బృందం, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఆదాయాన్ని స్వామివారి పేరిట బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ ၊ బుధవారం ၊
4 ၊ డిసెంబర్ ၊ 2024



సొగసైన శరీరాకృతి అందరూ కోరుకుంటారు. అయితే దానికి మన వంతుగా ఎలాంటి ప్రయత్నం చేస్తున్నామన్నదే ముఖ్యం. ఎవరైనా నిత్యం వ్యాయామం చేస్తూ, జిమ్ ట్రైనర్స్ సూచనలు పాటిస్తే మెరుగైన ఆకృతిని సొంతం చేసుకోవచ్చు. దీనికి ఆహారపు అలవాట్లు, శరీరతత్వం, ఉద్యోగ సమయం, ఆరోగ్యం పరిస్థితులు, తదితర అంశాలు సైతం శరీరంపై ప్రభావం చూపిస్తాయి. నగరంలో యువత, మహిళలు అధిక శాతం మంది జిమ్ బాట పడుతున్నారు. ఇందులో కొంత మంది ప్రాథమిక వ్యాయామానికే పరిమితం అవుతుండగా, మరికొంత మంది మాత్రం తమ శరీరంలోని వివిధ అవయవాలకు సంబంధించిన ప్రత్యేక వ్యాయామాలపై దృష్టి పెడుతున్నారు. ట్రైనర్స్ ఏం చెబుతున్నారు? ఎలాంటి డైట్ పాటించాలి? తెలుసుకుందాం..!

- సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్



- జిమ్ ట్రైనర్స్ ఏం సూచిస్తున్నారు?
- టెక్నిక్స్ ఫాలో అయితేనే ఫలితాలు
- సెట్ ఆఫ్ వర్కవుట్స్‌పై అవగాహన తప్పనిసరి
- వ్యాయామం పట్ల నగర వాసుల ఆసక్తి
- సరైన డైట్‌తోనే మెరుగైన ఫలితాలు

ఫిట్.. సెట్..

రొటీన్ వర్కవుట్స్ ఫర్ హెల్తీలైఫ్

నగర యువత అత్యధిక శాతం మంది తమ శరీరాకృతిని ఆరు పలకల ఆకృతిలోకి మార్చుకోడానికి ఆసక్తి చూపిస్తున్నారు. పొట్ట ప్రదేశంలో అనవసరమైన కొవ్వులను కరిగించుకోడానికి అబ్డామిన్ స్ట్రెచ్చెస్, క్రంచెస్ వంటి వ్యాయామాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పొట్ట భాగం సరైన ఆకృతిలోకి వస్తోంది. జంపింగ్ స్క్వాట్స్ చేయడం వల్ల బరువుని తగ్గించుకోవచ్చు. ఎత్తుకు సరిపడేంతగా సన్నబడడం, షోల్డర్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టిసారిస్తున్నారు. శరీరంలో వృథాగా పేరుకుపోయే కొవ్వులు, కేలరీలను కరిగించేందుకు బర్పీస్ చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. మౌంటెనింగ్, క్లైంబింగ్స్ వంటివి ఫ్లాట్ స్టామక్‌ని అందిస్తాయి.

డంబెల్స్‌తో డిఫరెంట్ సెట్స్..

చూడచక్కని షోల్డర్స్ కోసం డంబెల్స్‌తో వర్కౌట్ చేయాలి. బెంచ్ ప్రెస్ చేయడం వల్ల గుండె భాగంపై ప్రభావం కనిపిస్తుంది. చెస్ట్ కండరాలు స్పష్టమైన అమరికతో ఆకర్షణీయంగా తయారవుతాయి. వీపు వైపు బలంగా, ఫిట్‌గా ఉండాలంటే పుల్ డౌన్, నడుము బలంగా తయారవడానికి డెడ్ లిఫ్ట్ వర్కౌట్ చేయాలి. ప్లాంక్ పోశ్చర్‌పై పరుగు తీస్తే గుండె కొట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ వ్యాయామాలు ముఖ్యంగా భుజాలు, గుండె భాగం, కాళ్లపై ప్రభావం చూపిస్తాయి. మజిల్స్ బలంగా తయారై, శరీరాన్ని ఫ్లెక్సిబిలిటీగా ఉంచుతుంది.

మహిళలను వేధిస్తున్న అధిక బరువు..

ఇటీవలి కాలంలో జిమ్‌లకు వస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పిల్లలు పుట్టిన తరువాత మహిళలు బరువు పెరుగుతున్నారు. ఇంట్లో సరైన వ్యాయామం లేకపోవడంతో వివిధ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. బెల్లీఫ్యాట్ తగ్గించుకోవడం, గుండె భాగం ఫిట్‌గా ఉండటం, నడుము బలంగా తయారు కావడానికి వ్యాయామాలు చేస్తున్నారని ట్రైనర్స్ పేర్కొంటున్నారు.



శరీరం ఫిట్‌గా తయారైంది..



రెండేళ్లుగా నిత్యం జిమ్ చేస్తున్నాను. వారంలో కనీసం మూడు రోజులు 60 నుంచి 70 కిలో మీటర్ల వరకూ పరుగెత్తుతాను. గతంలో కిడ్నీలో స్టోన్స్, అల్సర్, ఛాతీలో నొప్పి వంటి సమస్యలు బాధించేవి. వ్యాయామం చేయడం మొదలు పెట్టిన తర్వాత సుమారు 20 కిలోల వరకూ బరువు తగ్గాను. ఇప్పుడు శరీరం ఫిట్‌గా తయారైంది. వచ్చే ఏడాది జనవరిలో జరిగే రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాను.

- శ్రీశైలంగౌడ్, బండ్లగూడ



శరీరం దృఢంగా ఉండాలంటే..

శరీరం దృఢంగా, బలంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడం సహజం. అయితే బిజీ సిటీ లైఫ్‌లో ఆహారపు అలవాట్లు, కాలుష్యం, నిద్ర అనేక అంశాలు శరీర పటుత్వంపై ప్రభావం చూపిస్తాయి. సరైన వ్యాయామం చేయకుంటే అనేక వ్యాధులకు మనం ఆహ్వానం పలికినట్లే అవుతుంది. శరీరం ఫిట్‌గా ఉండేందుకు క్రాస్ ఫీట్, బర్పీస్, జంపింగ్ తదితర వ్యాయామాలు చేయడం మంచిది. శరీర కండరాలు సరైన ఆకృతిలో పెరగాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా ఆహారపు క్రమశిక్షణ అవసరం. బయట చిరుతిళ్లు, నూనె వంటకాలకు దూరంగా ఉండాలని జిమ్ ట్రైనర్స్ సూచిస్తున్నారు.

క్రమశిక్షణ అవసరం..



యువతలో ఎక్కువ మంది జిమ్ చేసే సమయంలో శరీరాకృతి కోసం అడుగుతున్నారు. పెద్దలు సాధారణ వ్యాయామాలపై దృష్టిసారిస్తున్నారు. మహిళలు సన్నబడటం, బెల్లీ ఫ్యాట్, బరువు తగ్గించుకోడానికి ఆసక్తి చూపిస్తున్నారు. డైట్ పాటించాలి. మాంసాహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. ప్రతి రోజూ కనీసం అరగంట సమయం నడక, పరుగు తీయడం మంచిది. - సద్దాం, జిమ్ ట్రైనర్



సాహసాల.. సాగర్..

ఆహ్లాదకర పర్యాటకానికి చిరునామాగా మారిన ట్యాంక్ బండ్ పరిసరాలు అడ్వెంచర్ టూరిజానికి కేంద్రంగా మారనున్నాయి. హుస్సేన్ సాగర్ వేదికగా బుధవారం నుంచి ప్రారంభం కానున్న సాహసక్రీడలు వాటర్ స్పోర్ట్స్ ఇష్టపడేవాళ్లను ఆకట్టుకోనున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో

- నగరంలో వాటర్ అడ్వెంచర్స్..
- అందుబాటులోకి విభిన్న సాహస క్రీడలు
- హుస్సేన్‌సాగర్‌లో నేటి నుంచే ప్రారంభం

నగరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విభిన్న రకాల ప్రణాళికలు అమలు చేస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ అదే క్రమంలో వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు స్థానం కల్పిస్తోంది. దీనిలో భాగంగా అమరావతి బోటింగ్ క్లబ్‌తో కలిసి ఏర్పాటు చేసిన పలు క్రీడా కార్యక్రమాలను మంత్రి జూపల్లి ప్రారంభించనున్నట్లు పర్యాటక శాఖ ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా..

హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా 34 చోట్ల వాటర్ స్పోర్ట్స్ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సాహస క్రీడలను ప్రవేశపెట్టాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీటీడీసీ) లిమిటెడ్ ఇటీవల నిర్ణయించింది. నీటి వనరులున్న చోట అడ్వెంచర్ స్పోర్ట్స్, హౌస్‌బోట్ కార్యకలాపాల నిర్వహణకు ఆపరేటర్లను వేలం ప్రక్రియ ద్వారా ఎంచుకున్నట్టు సమాచారం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆదాయ భాగస్వామ్య ప్రాతిపదికన వివిధ నీటి కొలనులు, నదులలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ, ప్రాజెక్ట్ ఒప్పందం ఐదు సంవత్సరాలు ఉంటుంది.

నీటిపై.. సాహసాలివే...

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధునిక ట్రెండ్స్ పరిశీలించిన మీదట.. పలు జల సాహస క్రీడలను ఫైనల్ చేశారు. వాటిలో జెట్‌స్కీ (వాటర్ స్కూటర్), జెట్ అటాక్ (ఆపరేటర్ కంట్రోల్‌తో సెల్ఫ్–డ్రైవ్), వాటర్ రోలర్, కయాకింగ్ (స్వయంగా బోట్‌ని నడపడం) వంటివి ప్రారంభిస్తున్నారు. ఇవే కాకుండా పర్యాటకుల ఆదరణ మీద ఆధారపడి జోర్బింగ్, వాటర్ సైక్లింగ్, వాటర్ స్కీయింగ్, సోలార్ జిప్సీ బోట్, బంపర్, బనానా బోట్, ఫ్లై బోర్డ్, సహా పదకొండు అడ్వెంచర్ స్పోర్ట్స్ యాక్టివిటీలు పరిచయం చేయనున్నారు.



బ్రాండ్స్‌తో వార్డ్ రోబ్ 'రిఫ్రెష్'..

సాక్షి, సిటీబ్యూరో: తమ దుస్తుల వార్డ్ రోబ్‌ను రిఫ్రెష్ చేసుకోవాలని ఆశించే వారి కోసం ఆన్‌లైన్ విపణి అమెజాన్ ఫ్యాషన్ తమ 15వ వార్డ్ రోబ్ రిఫ్రెష్ సేల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సేల్ ఈ నెల 6 నుంచి 11 వరకూ ఉంటుందని, కొలంబియా, స్వరోస్కీ, బాస్, న్యూ బ్యాలెన్స్, మోకోబారా తదితర కొత్త బ్రాండ్స్ నుంచి ఫ్యాషన్ లవర్స్ ఎంచుకోవచ్చని వివరించారు. రాత్రి 7 గంటల నుంచి మాత్రమే ఈ సేల్ కొనసాగుతుందని అత్యధిక రాయితీలు, ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.



కలెక్షన్ విత్.. క్యాట్ వాక్..



ఆధ్వరియా సిల్క్స్ ఆధ్వర్యంలో 'కామాక్షి' వస్త్ర ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఆధ్వరియా సిల్క్స్ డిజైనర్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కామాక్షి కలెక్షన్స్‌తో టాప్ మోడల్స్ సందడి చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ దీప్తిరెడ్డి తీర్చిదిద్దిన ఈ కలెక్షన్స్‌ను నగర ఫ్యాషన్ ప్రియుల కోసం ఆవిష్కరించారు. బంజారా హిల్స్ వేదికగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షోలో మోడల్స్ క్యాట్‌వాక్ చేస్తూ ఈ డిజైన్స్ ప్రదర్శించారు. ఆధ్వరియా సిల్క్స్ ఆధ్వర్యంలో 'కామాక్షి కలెక్షన్స్' స్థానికి సంస్కృతిని అత్యాధునికంగా ప్రదర్శిస్తాయన్నారు డిజైనర్ దీప్తిరెడ్డి. ఈ కలెక్షన్స్ వంశ పారంపర్యమైన కంజీవరం చీరలతో కళాత్మకంగా తీర్చిదిద్దామన్నారు. మన తెలుగు సంప్రదాయంలోని క్లాసిక్‌తో పెళ్లి వేడుకలకు సాంస్కృతిక హంగులు ఉట్టిపడేలా కలెక్షన్స్ ఉంటుందని పేర్కొన్నారు.

వైల్డ్ ఫీల్.. విత్ వర్చ్యువల్

అత్యాధునికంగా బొటానికల్ గార్డెన్

- వీఆర్ ఎక్స్‌పీరియన్స్ జోన్ ఏర్పాటు
- చిన్నారుల కోసం ఏఆర్ కిడ్స్ లైబ్రరీ
- అడవులు, పక్షులు, జంతువులు కళ్ల ముందు ప్రత్యక్షం









గచ్చిబౌలి : బొటానికల్ గార్డెన్‌లో క్రూర జంతువుల మధ్య అడవిలో తిరిగిన అనుభూతిని కల్పించే వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ నగర వాసులకు అందుబాటులోకి వచ్చింది. తూర్పు, పశ్చిమ కనుమల్లోని ఎత్తయిన కొండలు, జలపాతాలు, ప్రకృతి అందాలు, గిరిజన తెగల జీవన విధానం, ఆదిలాబాద్‌లో జలపాతాలు వంటి పర్యాటక ప్రాంతాలను ఇప్పుడు వర్చువల్‌గా వీక్షించవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా 3డీ థియేటర్లను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఏసీ బస్సులో కూర్చొని హెడ్ సెట్ పెట్టుకున్న తరువాత అడవిలో వెళ్తుంటే అడ్డుగా వచ్చే ఏనుగులు, పులులు వాటి మధ్యే మనం ఉన్నామనే ఫీల్ కలుగుతుంది. కొత్తగూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో 107 ఎకరాల విస్తీర్ణంలో వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీని ఏర్పాటు చేశారు. కిడ్స్ కోసం ఏఆర్ లైబ్రరీ, మ్యూజిక్ ఆఫ్ ప్లాంట్స్, వీఆర్ కయాక్ బోట్, జంగిల్ ఒడిస్సీ పేరిట ఆర్బిటాల్ 9డీ సినిమా, 360 ఇండోర్ థియేటర్, 360 ట్రైబల్ కంటెంట్ తదితర విభాగాలను వర్చువల్‌గా చూడవచ్చు. అయితే వీటిని వీక్షించేందుకు ప్రతి దానికీ టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.

ఐఎస్ఎస్ స్పేస్..

అంతరిక్షంలో ఉండే వ్యోమగాములను దగ్గరి నుంచి చూడవచ్చు. సౌర కుటుంబంలోని నక్షత్రాలు, గ్రహాలను వీక్షించవచ్చు. మనం అంతరిక్షానికి దగ్గరగా ఉన్నామనే ఫీలింగ్ కలుగుతుంది. ఆకాశం నుంచి భూమి చూసిన అనుభూతి, జీరో గ్రావిటీలో గాల్లో ఉండటం, మెడికల్, ఫుడ్ కిట్స్‌ను పట్టుకోవడం చూపిస్తారు.

చిన్నారుల కోసం ఏఆర్ లైబ్రరీ..

కిడ్స్ ఏఆర్ అరేనా పేరిట ఏర్పాటు చేసిన కిడ్స్ లైబ్రరీ చిన్నారులను ఎంతగానో ఆకట్టుకోనుంది. పుస్తకాలలో ఉండె జంతువులు, ఇతర బొమ్మలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేస్తే అవి లేచి నిలబడతాయి. ఏఆర్ జూలో బోర్డులపై ఉండె జంతువుల బొమ్మలను స్కాన్ చేస్తే అవి మన ముందే తిరుగుతున్నట్లు ఉంటుంది. తినే ఆహారం, వాటి జీవన విధానం వంటివి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

వీఆర్ ఎక్స్‌పీరియన్స్ జోన్..

ఇందులో నేచర్‌వాక్ చాలా బాగుటుంది. ఆకాశాన్నంటే చెట్టు ఖాండం వద్ద మనం నిల్చున్నట్లు ఉంటుంది. జూరాసిక్ పార్క్, ప్లానెట్స్, ఓషనప్స్, ఆస్ట్రేలియా రెడ్ రాక్, బ్లూ మూన్ వంటివి ఆకట్టుకుంటాయి. వాటిని సెలక్ట్ చేసుకుంటే వాటి మధ్య మనం నిల్చున్నట్లు ఉంటుంది. సీడ్స్ సబ్ థీమ్స్ సెలక్ట్ చేసుకుని, వాటిని వెదజల్లితే ఇట్టే మొక్కలు మొలిచి.. అవి చెట్లుగా పెరిగి అడవి ఏర్పడుతుంది. వర్షాని ఎంచుకుంటే వర్షం కురిసిన ఫీల్ కలుగుతుంది. జూరాసిక్‌పార్క్‌ను సెలక్ట్ చేసుకుంటే అన్ని రాక్షస బల్లులే కనిపిస్తాయి.



గుకేశ్ చేజారిన అవకాశం... లిరెన్‌తో ఏడో గేమ్ కూడా 'డ్రా'

సింగపూర్ సిటీ: దొమ్మరాజు గుకేశ్ (భారత్), డింగ్ లిరెన్ (చైనా) మధ్య జరుగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో 'డ్రా'ల పరంపర కొనసాగుతోంది. వీరిద్దరి మధ్య మంగళవారం జరిగిన ఏడో గేమ్ కూడా 'డ్రా'గా ముగిసింది. చాంపియన్‌షిప్ సమరంలో ఇది వరుసగా నాలుగో 'డ్రా' కావడం విశేషం. 5 గంటల 22 నిమిషాల పాటు సాగిన గేమ్‌లో 72 ఎత్తుల తర్వాత ఆటను ముగించేందుకు గుకేశ్, లిరెన్ అంగీకరించారు. అయితే కీలక దశలో గెలిచే స్థితిలో నిలిచిన గుకేశ్ దానిని వృథా చేసుకోవడం అతడిని నిరాశపరిచే అంశం. తెల్ల పావులతో ఆడిన గుకేశ్ ఓపెనింగ్ నుంచే దూకుడుగా ఆడి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. గుకేశ్ 44వ ఎత్తు తర్వాత లిరెన్ ఓటమికి బాట పడినట్లుగా కనిపించింది. అయితే ఈ గెలుపు అవకాశాన్ని వాడుకోలేక గుకేశ్ వేసిన 45వ ఎత్తు లిరెన్ మళ్లీ కోలుకునేలా చేసింది. ఏడు గేమ్‌ల తర్వాత ఇద్దరూ చెరో 3.5 పాయింట్లతో ఉన్నారు.

భారత్ బోణీ



భావన

న్యూఢిల్లీ: ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో భారత జట్టు 31–28 గోల్స్ తేడాతో హాంకాంగ్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున మేనిక 9 గోల్స్, భావన శర్మ 8 గోల్స్‌తో రాణించారు. సోనిక 5 గోల్స్, షాలిని ఠాకూర్ 4 గోల్స్, ప్రియాంక ఠాకూర్ 3 గోల్స్, ప్రియాంక 2 గోల్స్ నమోదు చేశారు. మరో మ్యాచ్‌లో జపాన్ 34–14తో ఇరాన్‌ను ఓడించింది. గ్రూప్ 'ఎ'లో జరిగిన మ్యాచ్‌ల్లో కజకిస్తాన్ 28–26తో చైనాపై, దక్షిణ కొరియా 47–5తో సింగపూర్‌పై గెలుపొందాయి.



భారత్ X పాకిస్తాన్

- జూనియర్ ఆసియా కప్ హాకీ టైటిల్ కోసం నేడు అమీతుమీ
- సెమీఫైనల్స్‌లో మలేసియాపై భారత్; జపాన్‌పై పాకిస్తాన్ విజయం

మస్కట్: జూనియర్ ఆసియా కప్ హాకీ పురుషుల టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు విజయం దూరంలో ఉంది. మంగళవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత్ 3–1 గోల్స్‌తో మలేసియాపై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (10వ నిమిషంలో), రోహిత్ (45వ నిమిషంలో), శార్దానంద్ తివారి (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను అజీముద్దీన్ 57వ నిమిషంలో సాధించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తొలి క్వార్టర్‌లోనే ఖాతా తెరిచింది. పదో నిమిషంలో అరిజీత్ సింగ్ పాస్‌ను నేర్పుగా దిల్‌రాజ్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అయితే మలేసియా కూడా ఆరంభంలో హోరాహోరీగా తలపడింది. ఈ క్రమంలో తొలి క్వార్టర్‌లో లభించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను భారత డిఫెండర్లు నీరుగార్చారు. గోల్ కీపర్ బిక్రమ్‌జీత్ సింగ్, అంకిత్ పాల్ సమన్వయంతో చక్కగా అడ్డుకున్నారు. భారత్‌కు రెండో క్వార్టర్‌లో మూడు పెనాల్టీ కార్నర్లు లభించినప్పటికీ అందులో ఒక్కటి కూడా గోల్‌గా మలచలేకపోయింది. మూడో క్వార్టర్ ముగిసే దశలో రోహిత్, ఆఖరి క్వార్టర్‌లో తివారి గోల్స్ చేశారు. ఈ టోర్నీలో పరాజయం ఎరుగని అజేయ భారత్ కథ ఇప్పుడు ఫైనల్‌కు చేరింది. మరో సెమీఫైనల్లో పాక్ 4–2 గోల్స్ తేడాతో జపాన్‌పై విజయం సాధించింది. టైటిల్ కోసం నేడు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

ఎదురులేని ఆంధ్ర

ముస్తాక్ అలీ ట్రోఫీలో వరుసగా ఐదో గెలుపు

- నాకౌట్ దశకు అర్హత
- కేరళపై 6 వికెట్ల తేడాతో విజయం
- మెరిసిన శశికాంత్, కేఎస్ భరత్



శశికాంత్‌కు సహచరుల అభినందన

సాక్షి, హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు అదరగొడుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ వరుసగా ఐదో విజయం సాధించిన ఆంధ్ర జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మంగళవారం గ్రూప్ 'ఈ'లో భాగంగా సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన పోరులో రికీ భుయ్ సారథ్యంలోని ఆంధ్ర జట్టు 6 వికెట్ల తేడాతో కేరళ జట్టును ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కేరళ 18.1 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సంజూ సామ్సన్ (7) మరోసారి నిరాశ పరచగా... జలజ్ సక్సేనా (27; 3 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడాడు. రోహన్ కున్నుమ్మల్ (9), మొహమ్మద్ అజహరుద్దీన్ (0), సల్మాన్ నిజార్ (3), విష్ణు వినోద్ (1), వినోద్ కుమార్ (3) విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ 3 వికెట్లు పడగొట్టగా... వినయ్ కుమార్, సుదర్శన్, సత్యానారాయణ రాజు తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఆంధ్ర బౌలర్ల ధాటికి నిలవలేకపోయిన కేరళ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర జట్టు 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (33 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించాడు. అశ్విన్ హెబ్బర్ (12), షేక్ రషీద్ (5), అవినాశ్ (0), రికీ భుయ్ (14) ఎక్కువసేపు నిలవలేకపోయారు. మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడుతున్నా... ఏమాత్రం వెనక్కి తగ్గని భరత్... భారీ షాట్లతో విరుచుకుపడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేరళ బౌలర్లలో జలజ్ సక్సేనా 3 వికెట్లు తీశాడు. మొత్తం 7 జట్లున్న గ్రూప్ 'ఈ'లో 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు ఐదింటిలోనూ గెలిచి 20 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. గురువారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబైతో ఆంధ్ర జట్టు తలపడనుంది. మరోవైపు రాజ్‌కోట్‌లో మధ్యప్రదేశ్‌తో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఏడు పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమితో హైదరాబాద్ జట్టు లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశ ముగిశాక ఐదు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 10 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. 1–6 స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటాయి. 7–10 స్థానాల మధ్య నిలిచిన జట్లు ప్రిక్వార్టర్ ఫైనల్లో ముఖాముఖిగా తలపడతాయి. గెలిచిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశిస్తాయి.



ముఖీమ్ 2.4-0-3-5

రెండో టి20లో పాక్ ఘన విజయం ● 10 వికెట్లతో జింబాబ్వే చిత్తు

బులవాయో: జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను పాకిస్తాన్ 2–0తో సొంతం చేసుకుంది. మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో పాక్ 10 వికెట్లతో జింబాబ్వేను ఓడించింది. ముందుగా జింబాబ్వే 12.4 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. టి20ల్లో జింబాబ్వేకు ఇదే అత్యల్ప స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూఫియాన్ ముఖీమ్ స్పిన్‌కు జింబాబ్వే తలవంచింది. 16 బంతులు వేసిన ముఖీమ్ 3 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. పాక్ తరఫున టి20ల్లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో అతను కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఉమర్ గుల్ 6 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాక్ 5.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 61 పరుగులు సాధించింది. సయీమ్ అయూబ్ (18 బంతుల్లో 36 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), ఒమర్ యూసుఫ్ (15 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కేవలం 33 బంతుల్లో ఆట ముగించారు. విజయం సాధించిన సందర్భంలో మిగిలి ఉన్న బంతుల పరంగా చూస్తే ఇది కొత్త రికార్డు (87 బంతులు) కావడం మరో విశేషం. ఇరు జట్ల మధ్య సిరీస్‌లో చివరి మ్యాచ్ గురువారం జరుగుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రూ. 2 కోట్ల 12 లక్షలకు...

వేలంలో అమ్ముడుపోయిన బ్రాడ్‌మన్ క్యాప్





సిడ్నీ: క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ ధరించిన 'బ్యాగీ గ్రీన్' క్యాప్‌కు ఊహించినట్లుగానే వేలంలో భారీ ధర పలికింది. 1947–48లో సొంతగడ్డపై భారత్‌తో జరిగిన సిరీస్‌లో ఆయన ధరించిన ఈ క్యాప్‌పై వేలంలో పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఆసక్తి కనబరిచారు. స్వదేశంలో బ్రాడ్‌మన్‌కు ఇదే చివరి సిరీస్ కాగా... ఐదు టెస్టుల ఈ పోరులో 4 సెంచరీలు సహా బ్రాడ్‌మన్ ఏకంగా 715 పరుగులు సాధించడం విశేషం. పది నిమిషాల పాటు సాగిన వేలంలో చివరకు ఒక వీరాభిమాని 2 లక్షల 50 వేల డాలర్లకు (సుమారు రూ.2.12 కోట్లు) దీనిని సొంతం చేసుకున్నాడు. ఆ వ్యక్తి వివరాలను నిర్వాహకులు వెల్లడించలేదు. దాదాపు 77 ఏళ్ల క్రితం వాడి రంగులు వెలిసిపోయి, కాస్త చినిగిపోయిన ఈ టోపీ లోపలి భాగంలో బ్రాడ్‌మన్ పేరు రాసి ఉంది. ఇన్నేళ్ల తర్వాత కూడా బ్రాడ్‌మన్ విలువ ఏమిటో ఈ వేలం ధర చూపించింది. ఈ బ్యాగీ గ్రీన్ క్యాప్‌కు ఆసక్తికర నేపథ్యం ఉంది. భారత్‌తో సిరీస్ ముగిశాక బ్రాడ్‌మన్ క్యాప్‌ను భారత జట్టు మేనేజర్ పంకజ్ గుప్తాకు బహుమతిగా అందజేశారు. ఈ సిరీస్‌లో భారత జట్టు వికెట్ కీపర్, ఆ తర్వాత తన మేనకోడలిని పెళ్లాడిన ప్రబీర్ కుమార్ సేన్‌కు పంకజ్ గుప్తా ఇచ్చారు. అదే క్యాప్ ఇప్పుడు వేలానికి వచ్చింది.

సినిమా



● చిరంజీవి

శాంతిని వెతుక్కున్నాడు!

'హింసలోనే అతడు తన శాంతిని వెతుక్కున్నాడు...' అంటూ హీరో చిరంజీవి కొత్త సినిమాకు సంబంధించిన ప్రకటన వచ్చింది. ఈ చిత్రాన్ని హీరో నాని యునానిమస్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఎస్ ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. నాని హీరోగా 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తెరకెక్కించిన శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. మంగళవారం ఈ సినిమాని ప్రకటించి, ''చిరంజీవిగారి నుంచి స్ఫూర్తి పొందుతూ ఎదిగా. ఆయన సినిమాల కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉన్నాను. నా సైకిల్ కూడా పోగొట్టుకున్నా. ఆయన మాకొక వేడుక. ఇప్పుడు ఆయన్నే మీ ముందుకు తీసుకొస్తున్నా. భూమి గుండ్రంగా ఉంటుందంటే ఇదేనేమో. మెగాస్టార్ చిరంజీవిని మరింత కొత్తగా చూపించడానికి వేచి చూస్తున్నాం. నా దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఆ కల సాకారం కాబోతోంది'' అని సామాజిక మాధ్యమం ద్వారా నాని పేర్కొన్నారు. ఈ సినిమా గురించి ఇతర విశేషాలను త్వరలో ప్రకటిస్తారు. ఇదిలా ఉంటే.. 'దసరా' వంటి హిట్ మూవీ తర్వాత నాని–శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'ది ప్యారడైజ్' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే.



● ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్

గోదారి గట్టు మీద రామ సిలకవే...

'గోదారి గట్టు మీద రామ సిలకవే.... గోరింటాకు ఎట్టుకున్న సందమామవే' అని పాడేస్తున్నారు వెంకటేశ్. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి 'గోదారి గట్టు మీద రామ సిలకవే...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు. ''ట్రయాంగిల్ క్రైమ్ కథతో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేశ్, ఐశ్వర్యా రాజేశ్‌లపై చిత్రీకరించిన రొమాంటిక్ సాంగ్ 'గోదారి గట్టు..'కి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఈ పాట భార్యాభర్తల మధ్య చిలిపి సరదాలని అందంగా ప్రజెంట్ చేస్తుంది. జానపదం టచ్ ఉన్న ఈ పాటని భీమ్స్ అద్భుతంగా కంపోజ్ చేశారు. రమణ గోగుల యూనిక్ స్టయిల్ వాయిస్ ఈ మెలోడీకి అదనపు ఆకర్షణ తీసుకొచ్చింది. మధుప్రియ మెస్మరైజ్ వాయిస్ ఆకట్టుకుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.



● నాగార్జున

కథ విన్నారా?

సోలో హీరోగా నాగార్జున కొత్త సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ నాగార్జున మాత్రం ఎప్పటికప్పుడు కొత్త కథలను వింటూనే ఉన్నారట. కాగా 'హుషారు, రౌడీబాయ్స్, ఓం భీమ్ బుష్' సినిమాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న హర్ష కొనుగంటి ఇటీవల నాగార్జునకు ఓ స్టోరీ లైన్ వినిపించగా, నచ్చి ఈ సినిమా చేసేందుకు అంగీకరించారట నాగార్జున. దీంతో కథకు మరింత మెరుగులు దిద్దే పనిలో పడ్డారట హర్ష. ఫైనల్‌గా కథ ఓకే అయితే ఈ సినిమాను సంక్రాంతి తర్వాత సెట్స్‌పైకి తీసుకువెళ్లాలని నాగార్జున భావిస్తున్నారని భోగట్టా. మరి... నాగార్జున–హర్షల కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ', ధనుష్ హీరోగా చేస్తున్న 'కుబేర' చిత్రాల్లో లీడ్ రోల్స్ చేస్తూ నాగార్జున బిజీగా ఉన్నారు. ఫిబ్రవరిలో 'కుబేర', మేలో 'కూలీ' విడుదల కానున్నాయి.

ఆగ్రాకి స్వాగతం



● 'వెల్‌కమ్ టు ఆగ్రా' ప్రారంభోత్సవంలో అలీతో యూనిట్

అలీ ప్రధాన పాత్రలో 'వెల్‌కమ్ టు ఆగ్రా' అనే హిందీ సినిమా రూపొందుతోంది. ఆశిష్ కుమార్ దూబే రచించి, దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్ ఫిలిమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతున్న 'వెల్‌కమ్ టు ఆగ్రా' సినిమా ప్రారంభోత్సవంలో భాగంగా ముహూర్తపు సన్నివేశాన్ని ముంబైలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ– ''ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా కేంద్రంగా జరిగే ప్రేమకథే ఈ సినిమా. ఈ చిత్రంలో ప్రధాన పాత్రకి నన్ను ఎంచుకున్నందుకు దర్శక– నిర్మాతలకు కృతజ్ఞతలు. గతంలో సల్మాన్ ఖాన్ వంటి పలువురు హీరోల కాంబినేషన్‌లో హిందీలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేశాను. 'వెల్‌కమ్ టు ఆగ్రా'లో పూర్తి నిడివి ఉన్న పాత్ర చేయనుండటం ఎంతో ఆనందంగా ఉంది'' అని తెలిపారు. ఈ మూవీలో అన్షుమాన్ ఝా, సారా అంజలి, ఆకాశ్ ధబాడే, రౌనక్ ఖాన్, ఫైజల్ మాలిక్, అంచల్ గాంధీ, కైరా చౌదరి తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

మరాఠా యోధుడిగా...



● రిషబ్ శెట్టి

కన్నడ స్టార్ రిషబ్ శెట్టి మంచి జోరు మీద ఉన్నారు. 'కాంతార' సినిమాతో బ్లాక్‌బస్టర్ సాధించిన రిషబ్ ప్రస్తుతం 'కాంతార'కు సీక్వెల్‌గా 'కాంతార: ఛాప్టర్ 1' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం 2025 అక్టోబరు 2న విడుదల కానుంది. అలాగే దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లోని 'జై హనుమాన్' చిత్రంలోనూ రిషబ్ శెట్టి హీరోగా చేయనున్నారు. ఈ చిత్రాలు ఇలా ఉండగానే... హిందీ చిత్రం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్ ఛత్రపతి శివాజీ మహారాజ్'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు రిషబ్. ఇందులో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీగా కనిపిస్తారాయన. ఈ బహు భాషా చిత్రానికి సందీప్ శర్మ దర్శకత్వం వహిస్తారు. మంగళవారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, రిషబ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, సినిమాను 2027 జనవరి 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ''ఛత్రపతి శివాజీ నేషనల్ హీరో. ఆయన పాత్రలో నటించడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా చేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అని రిషబ్ పేర్కొన్నారు.



● ఆలియా భట్

హారర్ సినిమాకు ఓకే

లవ్ స్టోరీ, యాక్షన్, ఫ్యామిలీ, కమర్షియల్... ఇలా డిఫరెంట్ జానర్స్‌లో సినిమాలు చేశారు ఆలియా భట్. అయితే తొలిసారిగా ఆలియా భట్ ఓ పూర్తి స్థాయి హారర్ ఫిల్మ్ చేసేందుకు రెడీ అవుతున్నారని బాలీవుడ్ సమాచారం. హిందీలో 'స్త్రీ, స్త్రీ 2, భేడియా, ముంజ్యా' వంటి హారర్ సినిమాల నిర్మాణంలో భాగమైన నిర్మాత దినేష్ విజన్‌తో ఆలియా భట్ ఇటీవల భేటీ అయ్యారట. వీరి సమావేశం ఓ హారర్ ఫిల్మ్ కోసం అని, ఈ విషయమై త్వరలో స్పష్టత రానుందని భోగట్టా. ఇటీవలే యాక్షన్ ఫిల్మ్ 'ఆల్ఫా'ను పూర్తి చేసిన ఆలియా త్వరలోనే 'లవ్ అండ్ వార్' సినిమా చిత్రీకరణతో బిజీ కానున్నారు. అయితే ఈ రెండు చిత్రాల విడుదల తర్వాతే ఆలియా హారర్ సినిమా మొదలవుతుందని ఊహించవచ్చు.



● రష్మికా మందన్న

వైవిధ్యమైన ప్రేమకథ

ఓ వైపు హీరోయిన్‌గా, మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలతో ఫుల్ బిజీగా దూసుకెళుతున్నారు రష్మికా మందన్న. ఆమె లీడ్ రోల్‌లో రూపొందుతోన్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు–దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో హీరో దీక్షిత్ శెట్టి నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మిస్తున్నాయి. త్వరలో ఈ సినిమా టీజర్ విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ చూసిన అనంతరం డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ– ''ది గర్ల్ ఫ్రెండ్ టీజర్‌ను రాహుల్ రవీంద్రన్ చూపించాడు. రష్మిక నటన, భావోద్వేగాలు, క్లోజప్ షాట్స్ చాలా బాగున్నాయి'' అని పేర్కొన్నారు. ''వైవిధ్యమైన ప్రేమ కథతో తెరకెక్కుతున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం చివరి దశలో ఉంది'' అన్నారు మేకర్స్. ఇదిలా ఉంటే త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌లో రష్మిక పాత్రను, నేపథ్యాన్ని హీరో విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో పరిచయం చేస్తారని సమాచారం.

ప్రేమ... వినోదం... భయం



● ఆర్కే, రిద్ధి ఒబెరాయ్

'నల్లమల, ఆకాశవాణి, ప్రతిఘటన, ప్రేమికుడు, వంగవీటి, కొండా' వంటి పలు చిత్రాలకు నృత్య దర్శకునిగా చేసిన ఆర్కే హీరోగా నటించిన చిత్రం 'నీరుకుళ్ళ'. రమేశ్ ప్లాస్సి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రిద్ధి ఒబెరాయ్ హీరోయిన్‌గా నటించారు. బిట్ల కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. బిట్ల కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''ప్రేమ, వినోదం, భయం వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'నీరుకుళ్ళ'. 24 రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మా చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రమణ, సంగీతం: ఉదయ్ కిరణ్.



క్వార్ట్జ్ గనుల్లో.. ఘనుల లూటీ!

నెల్లూరు జిల్లా సైదాపురంలో 'ముఖ్య' నేత ముడుపుల డీల్

రూ.వేల కోట్ల విలువైన ఖనిజ సంపద లూటీకి భారీ స్కెచ్

- స్థానిక సీనియర్ ప్రజాప్రతినిధిని ముందుపెట్టి నడిపిస్తున్న ప్రభుత్వ పెద్దలు
- లీగల్ మైన్లు సైతం తమకు అప్పగించాలంటూ బెదిరింపులు
- హైదరాబాద్‌కు పిలిచి ఆ ప్రజా ప్రతినిధి కార్యాలయంలో గనుల యజమానులకు తీవ్ర హెచ్చరికలు
- ఆర్నెళ్లుగా అందరి మైన్లు నిలిపివేసి 4 గనులకే అనుమతుల వెనుక మతలబు ఏమిటి?
- వారిని బెదిరించి దారికి తెచ్చుకుని రూ.వేల కోట్లు కొట్టేసే వ్యూహం
- లీగల్ మైన్లను దుర్మార్గంగా నిలిపివేయడంపై గనుల యజమానుల ఆవేదన
- ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా కొత్త పరిశ్రమ ఏర్పాటు పేరుతో పావులు
- చక్రం తిప్పుతున్న నెల్లూరుకు చెందిన సీనియర్ ప్రజాప్రతినిధి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా 'ముఖ్య'నేత పర్యవేక్షణలో జరుగుతున్న 'తెల్ల'బోయే లూటీ కథ ఇదీ! పరిశ్రమ ఏర్పాటు ముసుగులో ప్రకృతి సంపదను పిండి చేసే ఘనాపాటీల వ్యూహం దీని వెనుక దాగి ఉంది. 'ముఖ్య'నేత ఆదేశాలతో స్వయంగా ఆయన కార్యాలయమే రంగంలోకి దిగి ఈ వ్యవహారాలను చక్కబెడుతోంది. ఇక ఈ మైనింగ్ దోపిడీలో అధికారికం.. అనధికారికం అనే తేడాలే లేవు. అనుమతుల పట్టింపే లేదు. గనులు ఎవరివైనా సరే.. ఖనిజాన్ని మాత్రం వారు చెప్పిన ధరకు అప్పగించాల్సిందే. ఇస్తావా..? లేదంటే చస్తావా?.. అంతే!! ఐదేళ్లలో రూ.వేల కోట్లను ఆర్జించే ఎత్తుగడ ఇదీ. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని క్వార్ట్జ్ (తెల్ల రాయి) గనుల్లో నిక్షిప్తమైన అపార ఖనిజ సంపద దోపిడీ కుట్రలు టీడీపీ పెద్దల కనుసన్నల్లో సాగుతుండగా.. నెల్లూరుకు చెందిన ఓ సీనియర్ ప్రజాప్రతినిధిని ముందుపెట్టి 'ముఖ్య' నేత కార్యాలయం అనునిత్యం దీన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సైదాపురం పరిసరాల్లో క్వార్ట్జ్ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు ముసుగులో ఈ దందాకు తెర తీశారు.

ఇందుకు సీనియర్ ప్రజాప్రతినిధి 50 శాతం పెట్టుబడి పెడితే ఆయనకు వాటాలు దక్కేలా డీల్ కుదిరినట్లు సమాచారం. దీంతో సైదాపురం పరిసర ప్రాంతాల నుంచి నిత్యం రాత్రి పూట వందల లారీల్లో ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. తమకు ముడిసరుకు మొత్తం అప్పగించకుంటే గనుల నుంచి మీ లారీలు వెళ్లలేవని, కేసులు బనాయించి లీజులు రద్దు చేయిస్తామని బెదిరించినట్లు అన్ని అనుమతులున్న గనుల యజమానులు వాపోతున్నారు. తమ మైన్లకు అన్ని అనుమతులు ఉన్నాయని, గత 50 ఏళ్లుగా 'డెడ్ రెంట్'సైతం చెల్లిస్తున్నామని, గత ఆర్నెళ్లుగా మైనింగ్‌ను అడ్డుకుని బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొంటున్నారు.

వేస్ట్ మెటల్‌తో కోట్లు..

స్థానిక సీనియర్ ప్రజాప్రతినిధి కీలక అనుచరుడి చేతిలో నాలుగు మైన్లు ఉన్నాయి. సైదాపురం సమీపంలోని శ్రీనివాస పద్మావతి, చాగణం సమీపంలో ఉన్న సిద్ధి వినాయక, తుమ్మలతలుపూరులో ఉన్న జయలక్ష్మి కనకదుర్గా, కలిచేడు సమీపంలో ఉన్న రాఘవేంద్ర గనులు ఆయన ఆధీనంలో ఉన్నాయి. ఈ గనుల్లో గతంలో ఎందుకు పనికి రాదని గుట్టలు గుట్టలుగా వదిలేసిన వేస్ట్ ఖనిజమే మైకా క్వార్ట్జ్. ఈ ఖనిజానికి ప్రస్తుతం విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఆ వేస్ట్ మెటల్‌తోనే కోట్లు ఆర్జించే దందాలో భాగస్వాములయ్యారు.

తాజాగా మరో 4 గనులకు..!

స్థానిక ప్రజాప్రతినిధి బంధువులు, అనుచరులకు రెండు రోజుల క్రితం మరో నాలుగు గనులకు అనుమతి ఇచ్చారు. ఆయన బంధువుకు రెండు, జోగుపల్లికి చెందిన దళారీకి పొక్కందల సమీపంలో ఒక గని, చాకలికొండ వద్ద ఉన్న మరో గనికి అనుమతి ఇచ్చారు. సైదాపురం మండలంలోని రామసాగరం, చిల్లకూరు మండలంలోని రెట్టపల్లిలో ఉన్న గనికి కూడా అనుమతులు మంజూరు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు పావులు కదపడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

క్వార్ట్జ్ ఆధారిత పరిశ్రమ పేరుతో..

సైదాపురం పరిసరాల్లో క్వార్ట్జ్ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి తెచ్చి మొత్తం మైనింగ్‌పై పెత్తనాన్ని ప్రభుత్వ పెద్దలు స్థానిక సీనియర్ ప్రజాప్రతినిధికి అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల సైదాపురం వ్యవహారంపై ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు వెళ్లిన ఆయన... ప్రస్తుతం చైనాలో ఉన్న క్వార్ట్జ్ ఆధారిత పరిశ్రమను మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేస్తామని ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా 50 శాతం పెట్టుబడి పెడితే వాటాలు ఇచ్చే ఒప్పందంతో సైదాపురం గనులను ఆయనకు అప్పగించారనే ప్రచారం సాగుతోంది. దీంతో క్వార్ట్జ్ మెటల్‌ను వ్యాపారులు ఇకపై ఆయన అనుచరులు నిర్ణయించిన ధరకే ఇచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశాలు అందినట్లు చెబుతున్నారు. 'ముఖ్య'నేత కార్యాలయం నుంచి అధికారులకు ఈమేరకు ఆదేశాలు రావడంతో జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, మరో కీలకనేత దీనిపై మైనింగ్ మంత్రితో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారం అంతా 'ముఖ్య'నేత కార్యాలయం పర్యవేక్షిస్తోందని, ఇకపై ఎవరూ కూడా ఈ దందా విషయంలో కలగజేసుకోవద్దని మంత్రి కార్యాలయం చేతులెత్తేసినట్లు సమాచారం.

మైకా క్వార్ట్జ్ ఖనిజం టన్ను 2 లక్షలు!

సైదాపురం మండలంలో దొరికే మైకా క్వార్ట్జ్ ఖనిజం టన్ను రూ.20 వేల నుంచి మొదలై రూ.2 లక్షల వరకు పలుకుతోంది. దీంతో కాలం చెల్లిన గనుల్లో ఉన్న ఈ ఖనిజాన్ని దోచుకునేందుకు, మిగిలిన గనులను సొంతం చేసుకునేందుకు కూటమి నేతలు రాజకీయ పైరవీలు సాగిస్తున్నారు. ఇప్పటికే అనధికారికంగా మైనింగ్ చేస్తున్న కూటమి నేతలు చీకటి పడితే చాలు దండులా వాహనాలతో తెల్లరాయి అక్రమ రవాణా సాగిస్తున్నారు. టన్నుల లెక్కన అనధికారికంగా వసూలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ముగ్గురు అధికారుల పాత్ర కూడా ఉండడంతో అక్రమ రవాణాకు ఎక్కడా అడ్డు చెప్పడం లేదని తెలుస్తోంది. దీనిపై ముగ్గురు ఎమ్మెల్యేలు, మరో కీలక నేత రగిలిపోతున్నారు. తమ జేబులోకి వచ్చి పడే సొమ్మును లాక్కెళ్లిపోతున్నారని గుర్రుమంటున్నారు.

80 గనులు ఓపెన్? ఖనిజం విలువ రూ.10 వేల కోట్లు..

గత ఆర్నెళ్లుగా నిలిచిపోయిన 80 గనులకు రాష్ట్ర గనుల శాఖ నుంచి అనుమతులు మంజూరు చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల గనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రాష్ట్ర అధికారులకు నివేదిక పంపారు. అన్ని గనుల్లో ఉన్న ఖనిజం విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వ పెద్దలకు రహస్య నివేదిక ఇవ్వడంతో కప్పం వసూలుకు సిద్ధమయ్యారు. లీగల్ మైన్లు తాము నిర్దేశించిన వారి చేతికి అప్పగిస్తేనే వాటికి పర్మిషన్లు ఇస్తామంటున్నారు. దీంతో గత 40 – 50 ఏళ్లుగా 'డెడ్ రెంట్'కడుతున్న గనుల యజమానులు లబోదిబో అంటున్నారు. ఇంత దుర్మార్గం ఎక్కడైనా ఉంటుందా? అని వాపోతున్నారు.

నెలకు 30 – 50 వేల టన్నులు..

ఈ ప్రాంతంలో దొరికే మైకా క్వార్ట్జ్ ఖనిజాన్ని ప్రతి నెలా 30 వేల నుంచి 50 వేల టన్నులను తవ్వి ఎగుమతులు చేసే అవకాశాలున్నాయి. ప్రభుత్వానికి టన్నుకు కేవలం రూ.230 చొప్పున రాయల్టీ చెల్లించాల్సి ఉంది. నిత్యం సైదాపురం మండలంలో 1,000 టన్నులు, ఇతర ప్రాంతాల్లో మరో 500 టన్నులు దొరికే అవకాశం ఉంది.

రాత్రి వేళ అక్రమ రవాణా..

స్థానిక ప్రజాప్రతినిధి అనుచర వర్గం గత రెండు నెలలుగా రాత్రి వేళల్లో సైదాపురం నుంచి అనుమతులు లేకుండా తెల్ల క్వార్ట్జ్‌ను నిత్యం భారీ స్థాయిలో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. మండలంలో 40 గనుల్లో నిల్వలున్న క్వార్ట్జ్‌ను స్థానిక వ్యాపారులతో మాట్లాడుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన మైన్ల పర్మిట్లతో సైదాపురం క్వార్ట్జ్‌ను చెన్నైకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక వ్యాపారుల నుంచి టన్ను రూ.2 వేల నుంచి రూ.5 వేలు వంతున కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌లో రూ.50 వేలు వంతున విక్రయిస్తున్నారు. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధి కీలకంగా వ్యవహరిస్తుండడంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడం లేదు. నెలవారీ మామూళ్లతో కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మైనింగ్‌దారులకు బెదిరింపులు

జిల్లాలో మైనింగ్ దందాను చేజిక్కించుకున్న స్థానిక సీనియర్ ప్రజాప్రతినిధి అనుచరులు అధికారికంగా అనుమతులున్న గనులు యజమానులపై బెదిరింపులకు దిగుతున్నారు. అధికారిక గనుల్లో ఉన్న ముడిసరుకును సైతం తమకే ఇవ్వాలని, తాము చెప్పిన ధరకే అప్పగించాలని నెల్లూరులో ఓ చోటా నేత బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉన్న కార్యాలయానికి గనుల యజమానులను పిలిపించుకుని తీవ్ర స్థాయిలో హెచ్చరికలకు దిగినట్లు సమాచారం. ముడిసరుకు ఇవ్వకుంటే గనుల నుంచి మీ లారీలు వెళ్లలేవని, పలు రకాల కేసులు నమోదు చేయించి లీజులు రద్దు చేయిస్తామంటూ బెదిరించినట్లు ఓ గని యజమాని వాపోయాడు.

విస్తార గనులు.. అపార సంపద

సైదాపురం, పొదలకూరు, చేజర్ల, ఉదయగిరితోపాటు తిరుపతి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దొరికే మైకా, మైకా క్వార్ట్జ్, క్వార్ట్జ్, పల్స్పర్, వర్ముఖ్‌లైట్ ఖనిజాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ ఏడు భూగర్భ గనులు, 130 ఓపెన్ మైనింగ్ క్వారీలు, 26 కాలం చెల్లిన గనులున్నాయి. ఒక్క సైదాపురంలోనే 70 ఓపెన్ క్వారీలు ఉండగా మిగతావి ఇతర ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో మరో వందేళ్ల పాటు మైనింగ్ చేసినా తరగని అపార మైకా క్వార్ట్జ్ నిల్వలు ఉన్నాయి. ప్రధానంగా సైదాపురం మండలంలో దొరికే మైకా క్వార్ట్జ్ ఖనిజానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఖనిజ సంపద అపారంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ గనులపై కన్నేసింది. ఆర్నెళ్లుగా అన్ని రకాల మైనింగ్ అనుమతులను నిలిపివేసింది.



ఈనెల 5న 'ఇందిరా మహిళా శక్తి బజార్' ప్రారంభం సందర్భంగా మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ఆహ్వానించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క. చిత్రంలో బుర్రా వెంకటేశం





మంగళవారం రవీంద్రభారతిలో దివ్యాంగుల నృత్య ప్రదర్శన

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): చిన్న లోపాన్ని చూసుకొని మానసికంగా కుంగిపోవద్దని ఆత్మ విశ్వాసంతో అడుగులు వేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే దివ్యాంగులకు పెన్షన్ పెంచడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.300 పెన్షన్ ఇస్తోందని అది రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గత 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం దారుణమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ బుచ్చినేని వీరయ్య మాట్లాడుతూ, రాబోయే రెండు నెలల్లో 40 శాతం వైకల్యానికి ఉచితంగా సహాయ ఉపకరణాలు పంచుతున్నట్లు ప్రకటించారు. అనంతరం వివిధ రంగాలలో అద్భుత విజయాలు సాధించిన దివ్యాంగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కాళ్లులేని దివ్యాంగులకు మంత్రి సీతక్క స్వయంగా కృత్రిమ కాళ్లను తొడిగారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రాంచంద్రన్, డైరెక్టర్ శైలజ, జీఎం.ప్రభంజన్‌రావులతో పాటు వివిధ వికలాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కృత్రిమ కాలిని తొడుగుతున్న మంత్రి సీతక్క

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలకు బంగారు పతకం

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకొని డైమండ్ జూబ్లీ బంగారు పతకం అందజేసేందుకు విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి, మాజీ డీన్ టి.వి.కె.సింగ్, కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. ఈ మేరకు టి.వి.కె సింగ్.. తన సోదరుడు శివకుమార్ ఠాకూర్‌తో కలిసి మంగళవారం ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్యను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఉపకులపతి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీన్ జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు టీపీటీఎఫ్ మద్దతు

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో చేపట్టే రిలే దీక్షలు, 9వ తేదీన నిర్వహించే నిరవధిక సమ్మెకు టీపీటీఎఫ్ మద్దతు ప్రకటించింది. వారి ఆందోళనకు.. తమ సంఘం జిల్లా కార్యకర్తలు అండగా ఉంటారని టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అనిల్‌కుమార్, నన్నెబోయిన తిరుపతి ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఉత్తర 'రింగు'కు అటవీ అనుమతులు

- ఇక పర్యావరణ అనుమతులే తరువాయి
- అవి కూడా వస్తే ఎక్స్‌ప్రెస్ వే నంబర్ కేటాయింపు!

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి అటవీ అనుమతులు మంజూరయ్యాయి. ఈ నెలాఖరుకు గాని జనవరి మొదటి వారంలో గాని ఈ రోడ్డుకు టెండర్లు పిలిచేందుకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధమవుతున్న సమయంలో అటవీ అనుమతులకు సంబంధించిన ఇబ్బంది తొలగిపోయినట్టయ్యింది. ఇక పర్యావరణ అనుమతులు రావాల్సి ఉంది. అవి కూడా వస్తే ఈ రోడ్డుకు ఎక్స్‌ప్రెస్ వే నంబర్ కేటాయింపు సులభవుతుంది. ఆ నంబర్ వస్తేనే టెండర్లు తెరిచేందుకు వీలుంటుంది. మెదక్ జిల్లా పరిధిలో 35.5882 హెక్టార్లు, సిద్దిపేట జిల్లా పరిధిలో 28.2544 హెక్టార్లు, యాదాద్రి జిల్లాలో 8.511 హెక్టార్లు .. వెరసి 72.3536 హెక్టార్ల అటవీ భూమిని ఉత్తర రింగు అలైన్‌మెంటులో భాగంగా సేకరించనున్నారు. ఇందుకు ప్రతిగా అటవీ శాఖకు వేరే ప్రాంతంలో అంతే మొత్తం భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. సేకరించే అటవీ భూమిలో కోల్పోయే చెట్లకు పరిహారంతో పాటు, కొత్తగా పొందే భూమిలో అటవీ శాఖ చెట్ల పెంపకానికి అయ్యే ఖర్చును కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ భాగానికి కావాల్సిన భూమిలో 90 శాతం సేకరణ ప్రక్రియ పూర్తయింది. త్వరలో అవార్డులు పాస్ చేయటం ద్వారా భూ యజమానులకు పరిహారం చెల్లించనున్నారు.

అనుమతి లేఖ అందింది: మంత్రి కోమటిరెడ్డి



ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి 72.3536 హెక్టార్ల అటవీ భూమి స్వాధీనానికి అనుమతిస్తూ కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాష్ భీమ్‌రావ్ భవర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా సమాచారం ఇచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర భాగం రీజినల్ రింగురోడ్డు నిర్మాణానికి భారతమాల పరియోజన కింద అనుమతి ఇస్తున్నట్టుగా లేఖలో పేర్కొనట్టు వెల్లడించారు. పర్యావరణ నిబంధనలకు లోబడి భూసేకరణ చేస్తామని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు తెలిపామని పేర్కొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే 15 జిల్లాల్లో పూర్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 15 జిల్లాల్లో వంద శాతం పూర్తయింది. సామాజిక సాధికారత లక్ష్యంగా అన్ని వర్గాలకు సమానమైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 94.9 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. నవంబర్ 6న రాష్ట్రంలో సర్వే ప్రక్రియ ప్రారంభం కాగా.. 27 రోజుల్లో 1,11,49,488 కుటుంబాలను సర్వే చేశారు. ఇందులో 79,63,637 కుటుంబాల డేటా ఎంట్రీ కూడా పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 67.8 శాతం ఫారాల కంప్యూటరీకరణ పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకుగాను మంగళవారం నాటికి 15 జిల్లాల్లో వందకు వంద శాతం సర్వే పూర్తయినట్లు పేర్కొంది. ములుగు, నారాయణపేట, రాజన్న సిరిసిల్ల, జనగాం, ఖమ్మం, నల్లగొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, పెద్దపల్లి, మెదక్, వనపర్తి, కుమరంభీం ఆసిఫాబాద్, భద్రాచలం కొత్తగూడెం జిల్లాలు వంద శాతం సర్వే పూర్తయిన జాబితాలో ఉన్నాయి.

మోడల్ స్కూల్ విద్యార్థినులకు అస్వస్థత

పెద్ద అడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో మంగళవారం రాత్రి నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా వసతి గృహంలో అన్నం సరిగా ఉడకకపోవడంతో పాటు ముద్దలుగా ఉండటంతో విద్యార్థినులు సరిగా భోజనం చేయడం లేదు. దీంతో పలువురు విద్యార్థినులు అనారోగ్యం పాలయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి చెందిన పూజిత, మల్లేశ్వరి, మౌనిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విద్యార్థినులకు తోడుగా దేవరకొండ ఆస్పత్రికి వెళ్లిన కె.హరిణి కూడా ఆస్పత్రిలో అస్వస్థతకు గురైంది. చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆత్మహత్యలు జరుగుతుంటే సంబురాలా?: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పటి పరిస్థితులు తెలంగాణలో పునరావృతం అవుతున్నాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల మూలంగా ఏడాది కాలంలో 620 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం రైతు సంబురాలు చేస్తోందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్టా మధు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారని, భరోసా కంటే బోనస్ బాగుందని మంత్రులు చెప్పడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సన్న ధాన్యానికి కేవలం రూ.25 కోట్లు బోనస్ చెల్లించి, రూ.15 వేల రైతు భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంబురాల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో సమన్యాయం లోపించిందని మనోహర్‌రెడ్డి విమర్శించారు. యువ వికాసం కార్యక్రమంలో బుధవారం పెద్దపల్లి పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్ హామీల అమలు వైఫల్యంపై వివరణ ఇవ్వాలని పుట్ట మధు డిమాండ్ చేశారు.

ఆర్టీసీలో నిరసనలపై ప్రభుత్వం దృష్టి

కార్మిక నేతలతో మంత్రి పొన్నం భేటీ

సాక్షి, హైదరాబాద్: పలు పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రత్యక్ష పోరాటానికి ఆర్టీసీ కార్మిక సంఘాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆర్టీసీలోని రెండు జేఏసీలు విడివిడిగా ప్రత్యక్ష పోరాట కార్యాచరణకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో ఓ జేఏసీ ఈనెల 5న బస్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. మరో జేఏసీ, డిసెంబర్ 9 డెడ్‌లైన్ విధించింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 5న నెక్లెస్‌రోడ్‌లో రవాణాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. సరిగ్గా ఇదే సమయంలో కార్మిక సంఘాలు నిరసనలకు దిగటాన్ని ప్రభుత్వం కొంత తీవ్రంగానే పరిగణిస్తున్నట్టు తెలిసింది. నిరసన కార్యక్రమాలను విరమింపజేసేందుకు రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కార్మిక సంఘాలతో మాట్లాడాలని నిర్ణయించినట్టు తెలిసింది. మంగళవారం కొందరితో సచివాలయంలో మాట్లాడగా, మరికొందరితో బుధ, గురువారాల్లో మాట్లాడతారని సమాచారం.

రాజకీయ కోణంలో ఆటో బంద్ సరికాదు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ కోణంలో ఆటో బంద్ సరికాదని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, తెలంగాణ ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్ అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై మంగళవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆ సంఘం నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆటో, రవాణా కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏటా రూ.12 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అక్రమంగా నడిచే ఓలా, ఊబర్, రాపిడో తదితర అక్రమ బైక్ సర్వీసులను నిషేధించాలని విన్నవించారు. దీనికి మంత్రి స్పందిస్తూ చర్చలు జరపటం ఆలస్యమైనందున ఆటో బంద్ సరికాదన్నారని.. త్వరలోనే ఆటో, ప్రైవేట్ రవాణా సంఘాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారని సంఘం నేతలు తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
598	181
80,846	24,457

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,407	▲	3
డోజోన్స్	44,581	▼	199
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,359	▲	47
డాక్స్	20,035	▲	102
షాంఘై	3,379	▲	15
నికాయ్	39,249	▲	736

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	76,760
బంగారం (22 క్యారెట్)	70,360
వెండి (కిలో)	91,780

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.85	85.14
£	బ్రిటన్ పౌండ్	104.85	107.84
€	యూరో	86.89	89.67
¥	జపాన్ ఎన్ (100)	45.82	61.86
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.54	55.53
S$	సింగపూర్ డాలర్	60.68	63.54
SAR	సౌదీ రియాల్	21.68	23.24
UAE D	యూఏఈ దిర్హామ్	22.17	23.17
¥	చైనా యువాన్	10.75	12.57

అదానీ గ్రూప్ ఆర్థిక పరిస్థితి గుడ్

యూఎస్ రీసెర్చ్ సంస్థ బెర్న్‌స్టీన్



న్యూఢిల్లీ: ప్రస్తుతం అదానీ గ్రూప్ ఆర్థిక పరిస్థితి యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల సమయంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నట్లు బెర్న్‌స్టీన్ పేర్కొంది. ప్రమోటర్ల షేర్ల తనఖా తగ్గడంతోపాటు.. లెవరేజ్ కనిష్టస్థాయికి చేరినట్లు యూఎస్ రీసెర్చ్ సంస్థ తెలియజేసింది. గత రెండేళ్ల కాలంలో గ్రూప్ లెవరేజ్, షేర్ల తనఖా, రుణ చెల్లింపులు, బిజినెస్ విలువలు తదితరాల విశ్లేషణతో నివేదికను విడుదల చేసింది. కాగా.. 2023 జనవరిలో అదానీ ఖాతాలలో ఆర్థిక అవకతవకలు జరిగినట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించిన కారణంగా గ్రూప్ కంపెనీలోని పలు షేర్లు అమ్మకాలతో దెబ్బతిన్నాయి. తదుపరి అదానీ గ్రూప్ వీటిని ఆధార రహితాలుగా కొట్టిపారేసింది. దీంతో తిరిగి గ్రూప్ కంపెనీలు బలపడటంతోపాటు నిధులను సైతం సమీకరించగలిగాయి. ఈ నేపథ్యంలో గతంతో పోలిస్తే రిస్కులు తగ్గినట్లు బెర్న్‌స్టీన్ అభిప్రాయపడింది. కాగా.. గత నెల 21న యూఎస్ అధికారికవర్గాలు గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, సంబంధిత ఉన్నతాధికారులపై లంచాల ఆరోపణలు చేసింది. వీటిని సైతం అదానీ గ్రూప్ తోసిపుచ్చింది.

ఐటీ కంపెనీల స్టార్టప్ వేట!

ఏఐ, చిప్ డిజైన్, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంపెనీల కొనుగోలు
ఆదాయాలు, వేల్యుయేషన్లు పెంచుకోవడమే లక్ష్యం
టెక్నాలజీ అంతరాన్ని పూడ్చుకునే వ్యూహం...



బడా ఐటీ కంపెనీలు ఇప్పుడు స్టార్టప్ కంపెనీల వెంట పడుతున్నాయి. టెక్నాలజీ సామర్థ్యాలతో పాటు ఆదాయాలు, వేల్యుయేషన్లను పెంచుకోవడమే లక్ష్యంగా దేశీ స్టార్టప్ సంస్థల కొనుగోలుకు తెరతీశాయి. ఏఐ వంటి అధునాతన సాంకేతికతల్లో అంతరాన్ని పూడ్చుకోవడానికి కూడా ఈ వ్యూహం బాగానే పనిచేస్తోంది. మరోపక్క, నిధుల కటకటను ఎదుర్కొంటున్న స్టార్టప్‌లకు ఇది దన్నుగా నిలుస్తోంది.

ఇప్పుడు ఏ రంగంలో చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ వంటి అధునాతన సాంకేతికతల వినియోగం అంతకంతకూ జోరందుకుంటోంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందున్న ఐటీ కంపెనీలు.. ఆయా విభాగాల్లో తమ సామర్థ్యాలను వేగంగా పెంచుకోవడం కోసం స్టార్టప్ కంపెనీలను బుట్టలో వేసుకుంటున్నాయి. దేశంలో సెమీకండక్టర్ల (చిప్) తయారీ ఊపందుకోవడంతో చిప్ డిజైన్, స్పేస్ టెక్నాలజీ పైగా దృష్టి సారిస్తున్నాయి. ఈ వేటలో యాక్సెంచర్, ఇన్ఫోసిస్, ఐబీఎంతో వంటి దిగ్గజాలతో పాటు మధ్య తరహా ఐటీ సంస్థలైన పర్సిస్టెంట్, సైయంట్, గ్లోబల్ లాజిక్ కూడా ముందు వరుసలో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో ప్రావీణ్యం కలిగిన చిన్న, స్టార్టప్‌లను దక్కించుకోవడం వల్ల ఐటీ కంపెనీల ఆదాయం, వేల్యుయేషన్లు కూడా పుంజుకోవడానికి వీలుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.



> ఆర్థిక అనిశ్చితి, ఇతరత్రా కారణాలతో క్లయింట్ల ఐటీ వ్యయాలు తగ్గుముఖం పట్టడంతో గత కొంత కాలంగా ఐటీ కంపెనీలు ఆదాయాలను పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంలో భాగంగానే కొత్త టెక్నాలజీల్లో పెట్టుబడుల జోరు పెంచుతున్నాయి. అధునాతన నైపుణ్యాల్లో వేగంగా దూసుకెళ్లేందుకు స్టార్టప్‌ల కొనుగోలు మార్గాన్ని ఎంచుకుంటున్నాయి.
>
> – అవినాశ్ వశిష్ఠ, థోలాన్స్ చైర్మన్

జోరుగా.. హుషారుగా...

గత నెలలో బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ యాజ్–ఎ–సర్వీస్ (సాస్) స్టార్టప్ ప్రెసింటోను ఐబీఎం కొనుగోలు చేసింది. ఇదే నెలలో హైదరాబాద్ ఐటీ ఇంజినీరింగ్ సర్వీసుల సంస్థ సైయంట్ అమెరికాకు చెందిన భారతీయ స్టార్టప్ అజిమత్ ఏఐలో 27.3 % వాటాను చేజిక్కించుకుంది. ఇందుకోసం దాదాపు 7.25 మిలియన్ డాలర్లను వెచ్చించింది. సెమీకండక్టర్ పరిశ్రమలో సైయంట్ సామర్థ్యాల విస్తరణకు ఈ కొనుగోలు దోహదం చేయనుంది. ఇక మరో మిడ్‌క్యాప్ ఐటీ కంపెనీ పర్సిస్టెంట్ సిస్టమ్స్... పుణేకు చెందిన డేటా ప్రైవసీ మేనేజ్‌మెంట్ సంస్థ ఆర్కాను రూ.14.4 కోట్లకు దక్కించుకోనున్నట్లు ప్రకటించింది. టాప్–2 ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సైతం స్పేస్ టెక్ స్టార్టప్ గెలాక్స్‌ఐలో రూ.17 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకొచ్చింది. కంపెనీలో ఇన్నోవేషన్ ఫండ్‌లో భాగంగా ఈ పెట్టుబడి పెడుతోంది. తద్వారా ఆ స్టార్టప్‌లో 20 శాతం ఇన్ఫోసిస్‌కు చిక్కనుంది. మరో అగ్రగామి యాక్సెంచర్ ఈ ఏడాది జూలైలో చిప్ డిజైన్ స్టార్టప్ ఎక్సెల్‌మ్యాక్స్ టెక్నాలజీస్‌ను దక్కించుకుంది. ఫిబ్రవరిలో ఇన్ఫోగెయిన్ కూడా యూఎస్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టార్టప్ ఇంపాక్టివ్‌ను కైవసం చేసుకుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

తాజా కొనుగోళ్లు ఇలా...

- యాక్సెంచర్ - ఎక్సెల్‌మ్యాక్స్ (చిప్ డిజైన్)
- ఇన్ఫోసిస్ - గెలాక్స్‌ఐ (స్పేస్ టెక్)
- ఐబీఎం - ప్రెసింటో (సాస్)
- జోరియంట్ - మ్యాపిల్‌ల్యాబ్స్ (క్లౌడ్ మేనేజ్‌మెంట్)
- సైయంట్ - అజిమత్ ఏఐ (సెమీకండక్టర్)
- పర్సిస్టెంట్ సిస్టమ్స్ - ఆర్కా (డేటా ప్రైవసీ)

3 రోజుల్లో 1,802 పాయింట్లు అప్

- తాజాగా 598 పాయింట్లు జూమ్
- 80,846 వద్ద ముగిసిన సెన్సెక్స్
- 181 పాయింట్లు లాభపడిన నిఫ్టీ
- బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్



ముంబై: ప్రధానంగా పీఎస్‌యూ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లకు పెరిగిన డిమాండ్‌తో వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపాయి. సెన్సెక్స్ 598 పాయింట్లు జంప్‌చేసి 80,846 వద్ద ముగిసింది. నిఫ్టీ 181 పాయింట్ల వృద్ధితో 24,457 వద్ద నిలిచింది. వెరసి మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,802 పాయింట్లు జమ చేసుకుంది. మరోసారి ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడంతో ఒక దశలో సెన్సెక్స్ 701, నిఫ్టీ 205 పాయింట్లు చొప్పున ఎగశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ గరిష్టంగా 81,000 సమీపానికి(80,949)కి చేరింది. గ్లోబల్ మార్కెట్ల సానుకూలతలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు నిపుణులు తెలియజేశారు. ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో బ్యాంకింగ్ కౌంటర్లు వెలుగులో నిలిచినట్లు పేర్కొన్నారు.

బ్లూచిప్స్ బలిమి..: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా పీఎస్‌యూ బ్యాంక్స్, మీడియా 2.5 శాతం జంప్‌చేయగా.. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, ప్రయివేట్ బ్యాంక్స్ 1 శాతం చొప్పున పుంజుకున్నాయి. ఆటో, ఐటీ 0.5 శాతం బలపడగా.. ఎఫ్ఎంసీజీ 0.4 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ పోర్ట్స్ 6 శాతం జంప్‌చేసింది. ఎన్‌టీపీసీ, అదానీ ఎంటర్, యాక్సిస్, ఎస్‌బీఐ, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్, ఓఎన్‌జీసీ, సిప్లా, బీఈఎల్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.7–1 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే ఎయిర్‌టెల్, హీరోమోటో, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 1.5–0.8 శాతం మధ్య డీలాపడ్డాయి. మార్కెట్ల బాటలో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 1% ఎగశాయి. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు ఆపి రూ. 3,665 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయడం గమనార్హం! దేశీ ఫండ్స్ రూ. 251 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి.

- వారాంతాన 40 శాతం ప్రీమియంతో లిస్టయిన ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్ ఇంట్రాడేలో మరో 19 శాతం జంప్‌చేసి రూ. 264ను తాకింది. చివరికి ఈ షేరు 16 % లాభంతో రూ. 258 వద్ద ముగిసింది.
- గత నెల 27న లిస్టయిన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ షేరు 10 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 142 వద్ద నిలిచింది. ఈ షేరు ఐపీవో ధర రూ. 108.

బంపర్ లిస్టింగ్‌లు

సీ2సీ అడ్వాన్స్‌డ్

చిన్న తరహా కంపెనీ(ఎస్ఎంఈ).. సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ బంపర్ లిస్టింగ్ సాధించింది. ఇష్యూ ధర రూ.226తో పోలిస్తే 90% ప్రీమియంతో రూ.429 వద్ద ప్రారంభమైంది. చివరికి 99.5 శాతం లాభంతో రూ.451 వద్ద ముగిసింది.

రాజ్‌పుటానా బయోడీజిల్

ఎస్ఎంఈ సంస్థ రాజ్‌పుటానా బయోడీజిల్ లిస్టింగ్ అదిరింది. ఇష్యూ ధర రూ. 130తో పోలిస్తే 90% ప్రీమియంతో రూ. 247 వద్ద ప్రారంభమైంది. చివరికి 99.5% లాభంతో రూ. 259 వద్ద ముగిసింది.

భారత్‌లో జపాన్ సెమీకండక్టర్ యూనిట్లు!

దేశీ సంస్థలతో భాగస్వామ్యానికి ఆసక్తి ● డెలాయిట్ సంస్థ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు జపాన్ కంపెనీలు ఆసక్తితో ఉన్నట్టు డెలాయిట్ సంస్థ వెల్లడించింది. ఈ రంగంలో జపాన్ కంపెనీలకు ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నాయని, అవి భారత్‌లో భాగస్వామ్యాలకు ఉత్సాహం చూపిస్తున్నట్టు తెలిపింది. నైపుణ్యాలు కలిగిన మానవ వనరులు, నిధుల లభ్యత, ప్రభుత్వం నుంచి మద్దతు భారత్‌లో ఈ రంగం వృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు అనుకూలించనున్నట్టు పేర్కొంది. జపనీస్ కంపెనీలు భారత మార్కెట్ పట్ల ఎంతో ఉత్సాహం చూపిస్తున్నట్టు డెలాయిట్ ఏపీ, డెలాయిట్ జపాన్ ఎస్ఆర్‌టీ లీడర్ షింగో కామయ తెలిపారు. భారత్‌లో సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి చేతులు కలిపిన వాటిల్లో యూఎస్ తర్వాత రెండో క్వాడ్ భాగస్వామి జపాన్ అన్న విషయాన్ని గుర్తు చేశారు. సెమీకండక్టర్ డిజైన్, తయారీ, ఎక్విప్‌మెంట్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి భారత్, జపాన్ మధ్య అవగాహన ఒప్పందాలు కుదరడాన్ని ప్రస్తావించారు. 100 సెమీకండక్టర్ ప్లాంట్లతో సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ కలిగిన టాప్ 5 దేశాల్లో జపాన్ ఒకటిగా డెలాయిట్ పేర్కొంది. చిప్‌ల తయారీలో వాడే వేఫర్లు, కెమికల్, గ్యాస్, లెన్స్‌ల తయారీలో జపాన్ టాప్‌లో ఉన్నట్టు వివరించింది. భారత్ 10 ఏళ్లలో 10 సెమీకండక్టర్ కంపెనీల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకుందని.. ఈ దిశగా జపాన్ మెరుగైన భాగస్వామి అవుతుందని అంచనా వేసింది. సెమీకండక్టర్ పరంగా జపాన్ కంపెనీలకు ఉన్న టెక్నాలజీ, ప్రత్యేక నైపుణ్యాలను ప్రస్తావించింది. ఏదో ఒక ఫ్యాక్టరీ ఏర్పాటుతో సెమీకండక్టర్ లక్ష్యం నెరవేరదని, మొత్తం ఎకోసిస్టమ్ (సమగ్ర వ్యవస్థ) ఏర్పాటు చేయాల్సి ఉంటుందని డెలాయిట్ పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సైబర్ దాడులకు టాప్ టార్గెట్‌గా భారత్
ఆర్థికాభివృద్ధిలో క్రీడారంగాన్ని భాగస్వామిని చేయాలి

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

గ్రూప్-2 మెయిన్స్‌లో మెరవాలంటే!

ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్.. డీటీ, ఏసీటీఓ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ తదితర ఎగ్జిక్యూటివ్, నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. తొలిదశ స్క్రీనింగ్ టెస్ట్‌లో విజయం సాధించిన వారికి మలిదశలో మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తారు. తాజాగా.. గ్రూప్-2 మెయిన్స్‌ను 2025, ఫిబ్రవరి 23న నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. గ్రూప్-2 మెయిన్స్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ మార్గాలు..

- 2025 ఫిబ్రవరి 23న ఏపీ గ్రూప్-2 మెయిన్స్
- రెండు పేపర్లుగా మెయిన్స్ పరీక్ష నిర్వహణ
- ప్రాక్టీస్, రివిజన్‌తోనే సక్సెస్‌కు మార్గం



ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–2 తొలిదశ పరీక్ష స్క్రీనింగ్ టెస్ట్‌కు మొత్తం 4,04,037 మంది హాజరయ్యారు. వీరిలో 92,250 మంది మెయిన్స్‌కు అర్హత పొందారు. గ్రూప్ 2 ఎంపిక ప్రక్రియ ద్వారా 899 పోస్టులు భర్తీ చేయనున్నారు. దీంతో ఒక్కో పోస్ట్‌కు వంద మందిని చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేశారు. 2025 ఫిబ్రవరి 23న ఏపీ గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ఇటీవల ప్రకటించింది.

స్క్రీనింగ్ టెస్ట్ కొనసాగింపుగా

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్‌లో అడిగిన ప్రశ్నల తీరును విశ్లేషించేందుకు రెండు, మూడు రోజులైనా కేటాయించాలి. ఇప్పటికే విజయం సాధించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు కొనసాగింపు అనే ధోరణిలో ప్రిపరేషన్ సాగించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాల్లో అధిక శాతం స్క్రీనింగ్ టెస్ట్‌లో కవర్ అయ్యాయి. స్క్రీనింగ్ టెస్ట్‌లో విజేతలయ్యారంటే.. ఆయా అంశాలపై పట్టు సాధించినట్లేనని భావించాలి. కాబట్టి కొత్తగా పరీక్షకు ప్రిపేర్ అవుతున్నామనే ఆందోళన భావన వీడాలి. సానుకూల దృక్పథంతో ఇప్పటికే చదివిన అంశాలను పదే పదే రివిజన్ చేయాలి.

టైం మేనేజ్‌మెంట్

గ్రూప్ 2 మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు టైం మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జనరల్ స్టడీస్, ఏపీ హిస్టరీ, ఇండియన్ హిస్టరీ, పాలిటీ, ఏపీ ఎకానమీ, ఇండియన్ ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దేశించిన సిలబస్‌ను పూర్తి చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

ప్రిపరేషన్ వైవిధ్యత

మెయిన్స్‌కు విశ్లేషణాత్మక అధ్యయనం మేలు చేస్తుంది. ఆయా అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. స్క్రీనింగ్ టెస్ట్‌లో కొన్ని ప్రశ్నలు అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో ఉన్నప్పటికీ.. ఫ్యాక్ట్స్‌కు కొంత ఎక్కువ ప్రాధాన్యం కనిపించింది. కాని మెయిన్స్‌లో ప్రశ్నల సరళి ఇందుకు భిన్నంగా పూర్తిగా అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో ఉండే అవకాశముంది.

పేపర్-1కు ఇలా

ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు; భారత రాజ్యాంగం సమీక్ష పేరుతో రెండు సెక్షన్లుగా పేపర్–1 నిర్వహిస్తారు. హిస్టరీలో ముందుగా ఆంధ్రప్రదేశ్ సామాజిక చరిత్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు, మతం, సంస్కృతి, రాజులు, రాజ వంశాలు, వారు అనుసరించిన విధానాల గురించి తెలుసుకోవాలి. స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించి ఆంధ్ర ప్రాంతంలో ప్రాధాన్యం సంతరించుకున్న ఉద్యమాలు, వాటికి జాతీయ ప్రాధాన్యతపై అవగాహన పెంచుకోవాలి. విభజన ఉద్యమాల గురించి కూడా అవగాహన ఏర్పరచుకోవాలి. మద్రాస్ స్టేట్ నుంచి విడిపోవడం, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమైన పరిణామాల గురించి తెలుసుకోవాలి.

పాలిటీ కోసం ప్రత్యేకంగా

పేపర్–1లో రెండో విభాగంగా పేర్కొన్న భారత రాజ్యాంగం–సమీక్ష (యాన్ ఓవర్ వ్యూ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్) కోసం విస్తృత అధ్యయనం చేయాలి. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు నుంచి తాజా రాజ్యాంగ సవరణలు, అందుకు కారణాలు, సమకాలీన పరిస్థితుల్లో వాటి ప్రాముఖ్యత, ఆవశ్యకత.. ఇలా అన్ని కోణాల్లో అభ్యసనం సాగించాలి. ఇటీవల కాలంలో పార్లమెంట్‌లో ఆమోదం పొందిన బిల్లుల గురించి తెలుసుకోవాలి. పాలిటీని ఇతర విభాగాల(ఆర్థిక విభాగం, శాసన విభాగం)తో అనుసంధానం చేసుకుంటూ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఉదాహరణకు బడ్జెట్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ద్రవ్య బిల్లు అనేది ఇటు శాసన పరంగా, అటు ఆర్థిక పరంగా కలగలసిన అంశం. పాలిటీని చదివేటప్పుడు రాజ్యాంగ పీఠిక నుంచి కాంటెంపరరీ ఇష్యూస్ వరకూ.. ప్రాధాన్యం ఉన్న ప్రతి ఒక్క అంశాన్ని వాటి నేపథ్యం తెలుసుకుంటూ చదవడం ఎంతో మేలు చేస్తుంది.

పేపర్-2కు

- భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ; సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలతో రెండు సెక్షన్లుగా పేపర్–2 ఉంటుంది. కోర్ ఎకనామిక్ ఫార్ములాలతోపాటు ఎకనమిక్ ఇన్‌స్టిట్యూషన్స్, బేసిక్ ఎకనామిక్ డెఫినిషన్స్,పాలసీల గురించి తెలుసుకోవాలి. తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.
- భారత అభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర; మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ లైఫ్ సైన్సెస్; అభివృద్ధి, వాతావరణ సమస్యలపై అవగాహన ఏర్పరచుకోవాలి. కోర్ సైన్స్ అంశాలపైనా పట్టు సాధించాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్‌లో ఆయా అంశాలకు సంబంధించి ప్రాథమిక భావనలు, వాటి అనువర్తనాలు, ప్రమాణాల గురించి తెలుసుకోవాలి. దేశ శాస్త్ర సాంకేతిత రంగంలో తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. ఇస్రో ప్రయోగాలు, డీఆర్‌డీఓ, క్షిపణి వ్యవస్థ, ఆయుధ వ్యవస్థల సమాచారం తెలుసుకోవాలి.
- వీటితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.

ప్రాక్టీస్ టెస్ట్‌లు

ప్రస్తుతం సమయంలో గ్రూప్–2 అభ్యర్థులు ప్రాక్టీస్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు ఇప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాల విషయంలో స్పష్టత వస్తుంది. అదే విధంగా తాము చేస్తున్న పొరపాట్లను విశ్లేషించుకుని వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

ఆయా అంశాలను చదివేటప్పుడు విశ్లేషణాత్మక దృక్పథాన్ని అనుసరించాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అవగాహన ఏర్పరచుకోవాలి.

సొంత నోట్స్

ప్రిపరేషన్ సమయంలో సొంత నోట్స్ రాసుకోవాలి. ప్రిపరేషన్ ప్రారంభం నుంచే ఆయా సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన అంశాలతో సొంత నోట్స్ రాసుకుంటే రివిజన్ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు, పాయింట్లతో నోట్స్ రాసుకుని.. వాటిని చదువుతూ ముందుకు సాగాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

జాబ్ పాయింట్

ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్, సికింద్రాబాద్‌లో 723 పోస్టులు

సికింద్రాబాద్‌లోని సెంట్రల్ రిక్రూట్‌మెంట్ సెల్, ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రీజియన్లలో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 723.
- **పోస్టుల వివరాలు:** ట్రేడ్స్‌మేన్ మేట్(టీఎంఎం) -389, ఫైర్‌మ్యాన్(ఎఫ్ఎం)-247, మెటీరియల్ అసిస్టెంట్(ఎంఏ)-19, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్(జేవోఏ)-27, సివిల్ మోటార్ డ్రైవర్(ఓజీ)-04, టెలి ఆపరేటర్ గ్రేడ్2-14, కార్పెంటర్ అండ్ జాయినర్ -07, పెయింటర్ అండ్ డెకరేటర్-05, మల్టీ-టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) -11.
- **రీజియన్లు:** ఈస్టర్న్, వెస్టర్న్, నార్తెర్న్, సదరన్, సౌత్ వెస్టర్న్, సెంట్రల్ వెస్ట్, సెంట్రల్ ఈస్ట్.
- **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, ఐటీఐ, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. టైపింగ్ నాలెడ్జ్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- **వయసు:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్/సివిల్ మోటార్ డ్రైవర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఇతర పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** నెలకు మెటీరియల్ అసిస్టెంట్‌కు రూ.29,200 నుంచి రూ.92,300, ట్రేడ్స్‌మ్యాన్ మేట్‌కు రూ.18,000 నుంచి 56,900, ఇతర పోస్టులకు రూ.19,900 నుంచి రూ.63,200.
- **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎండ్యూరెన్స్/స్కిల్ టెస్ట్, రాతపరీక్ష, సర్టిఫికేట్ల పరిశీలన, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.12.2024.
- **వెబ్‌సైట్:** www.aocrecruitment.gov.in

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో 140 అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్.. 2026 బ్యాచ్‌లో ప్రవేశాలకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 140.
- **విభాగాలు:** జనరల్ డ్యూటీ(జీడీ)-110, టెక్నికల్(మెకానికల్/ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్)-30.
- **అర్హత:** విభాగాన్ని అనుసరించి పన్నెండో తరగతి(ఫిజిక్స్/మ్యాథ్స్), డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ(నేవల్ ఆర్కిటెక్చర్/మెకానికల్/మెరైన్/ఆటోమోటివ్ /మెకాట్రానిక్స్/ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్/మెటలర్జీ/డిజైన్/ఏరోనాటికల్ /ఏరోస్పేస్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** 01.07.2025 నాటికి 21నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100.
- **ఎంపిక విధానం:** స్టేజ్–1, స్టేజ్–2, స్టేజ్–3, స్టేజ్–4, స్టేజ్–5 పరీక్షలు, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.12.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.12.2024
- **వెబ్‌సైట్:** https://joinindiancoastguard.cdac.in

ఐఐటీఎం పుణెలో 55 పోస్టులు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ(ఐఐటీఎం).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 55.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్ 3–03, ప్రాజెక్ట్ సైంటిస్ట్2–05, ప్రాజెక్ట్ సైంటిస్ట్1–09, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–01, ప్రాజెక్ట్ అసోసియేట్2–02, ప్రాజెక్ట్ అసోసియేట్1–32, ప్రాజెక్ట్ మేనేజర్–01, ప్రాజెక్ట్ కన్సల్టెంట్–01, ప్రోగ్రామ్ మేనేజర్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం కలిగి ఉండాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి 35 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్3, ప్రోగ్రామ్ మేనేజర్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ పోస్టులకు రూ.78,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్2కు రూ.67,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్1 రూ.56,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000, ప్రాజెక్ట్ అసోసియేట్2కు రూ.28,000, ప్రాజెక్ట్ అసోసియేట్1కు రూ.25,000, ప్రాజెక్ట్ మేనేజర్‌కు రూ.1,25,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 05.12.2024.
- **వెబ్‌సైట్:** www.tropmet.res.in

పీజీసీఐఎల్, గురుగ్రామ్‌లో 22 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

గురుగ్రామ్‌లోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్) దేశవ్యాప్తంగా పీజీసీఐఎల్ రీజియన్/కార్యాలయాల్లో ట్రైనీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఫుల్ టైం బీఈ, బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. గేట్–2024 స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
- **గరిష్ట వయో పరిమితి:** 19.12.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **పే స్కేల్:** నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
- **ఎంపిక విధానం:** గేట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.12.2024.
- **వెబ్‌సైట్:** www.powergrid.in

ఐఏఎస్‌లు.. నియంతలం అనుకోరాదు

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు హితవు



కామారెడ్డి అర్బన్: కలెక్టర్లు.. తాము బ్రిటిష్ వైస్రాయ్‌ల్లాగా నియంతలం అనుకుంటే.. వారిని ఎలా సక్కగా చేయాలో తెలుసని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని డెయిరీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం టీజీవోస్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు నియంతల్లాగా వ్యవహరిస్తూ జిల్లా అధికారులను అవమాన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులను బానిసలుగా చూసే కలెక్టర్ల విషయమై జిల్లాల నాయకత్వాలు కార్యాచరణ ప్రకటిస్తే.. సీఎంను కలిసి మాట్లాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా నూతన అధ్యక్షుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ హైదరాబాద్ కార్గోకు గోల్డెన్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న జీఎంఆర్ హైదరాబాద్ కార్గో ప్రతినిధులు

శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ కార్గో గోల్డెన్ అవార్డును సొంతం చేసుకుంది. చెన్నైలో జరిగిన దక్షిణ–ఈశాన్య ఎయిర్ కార్గో కాన్‌క్లేవ్-2024లో 'టైమ్ క్రిటికల్ లాజిస్టిక్ సొల్యూషన్ ప్రొవైడర్ ఆఫ్ ది ఇయర్' విభాగంలో స్వర్ణపురస్కారాన్ని దక్కించుకుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ సున్నితమైన షిప్‌మెంట్‌లను నిర్వహించడంతో జీఎంఆర్ హైదరాబాద్ కార్గో ప్రపంచస్థాయి లాజిస్టిక్ ప్రమాణాలతో పనిచేస్తోందన్నారు. అంతరాయాలు లేకుండా నిర్వహిస్తున్న లాజిస్టిక్ రంగంలో భాగస్వాముల సహకారంతోపాటు నిబద్ధతతో చేసిన కృషికి ఇది మంచి గుర్తింపులాంటిదని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి రికార్డు స్థాయిలో ఆదాయం

76 రోజుల్లో రూ.5.35 కోట్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చరిత్రలో మొదటిసారిగా రూ.5.35 కోట్ల ఆదాయం వచ్చింది. 76 రోజుల హుండీల్లో ఆదాయాన్ని ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవారం ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.5,35,41,432 నగదు.. 215 గ్రాముల మిశ్రమ బంగారం, 7కిలోల 700 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. దీంతో పాటు విదేశీ కరెన్సీ వచ్చినట్లు వెల్లడించారు.

యాజమాన్య కోటా.. ఇక ఆన్‌లైన్!


వచ్చే ఏడాది ఇంజనీరింగ్‌లో కొత్త రూల్!

కన్వీనర్ కోటాలాగే బీ, సీ కేటగిరీ సీట్ల భర్తీ

మెరిట్ విద్యార్థులు నష్టపోవద్దనే మార్పులు

కన్వీనర్ కోటాకన్నా మూడురెట్లు ఫీజులు

ఉన్నత విద్యామండలి కసరత్తు.. త్వరలో ప్రభుత్వానికి నివేదిక



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వచ్చే ఏడాది నుంచి యాజమాన్య కోటా సీట్లను కూడా ఆన్‌లైన్ విధానంలోనే భర్తీ చేయాలని భావిస్తున్నారు. ఈ సీట్లను ఇప్పటివరకు ఏ కాలేజీకి ఆ కాలేజీ సొంతంగా భర్తీ చేసుకునేవి. ఈ సీట్లను కూడా మెరిట్ ఆధారంగానే భర్తీ చేయాల్సి ఉన్నా.. ఎవరు ఎక్కువ ఫీజు చెల్లిస్తే వారికే అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మేనేజ్‌మెంట్ కోటా భర్తీలోనూ పారదర్శకతను తీసుకొచ్చి, మెరిట్ విద్యార్థులకు మేలు చేసేందుకు ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేసేందుకు ఉన్న అవకాశాలపై నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యా మండలిని ప్రభుత్వం కోరింది. దీనిపై మండలి చేపట్టిన కసరత్తు తుది దశకు చేరిందని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ నివేదికలో మండలి కొన్ని కీలక ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలిసింది.

పారదర్శకత కోసమే..

రాష్ట్రంలో 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ప్రైవేటు కాలేజీల్లో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ఈ కోటాలో సీటు పొందిన వారిలో అర్హులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీ యింబర్స్‌మెంట్ వస్తుంది. మిగిలిన 30 శాతం సీట్లలో 15 శాతం 'బీ'కేటగిరీ కింద భర్తీ చేస్తారు. మిగిలినవి ఎన్‌ఆర్‌ఐల పిల్లలకు కేటాయించారు. యాజమాన్య కోటాలో సీటు పొందిన విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. జేఈఈ, టీజీఈఏపీ ర్యాంకు ఆధారంగా, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు వచ్చిన వారికే ఈ సీట్లు ఇవ్వాలి. ఇక సీ కేటగిరీ కింద ఎన్‌ఆర్‌ఐల పిల్లలకు సీట్లు కేటాయించాలి. అయితే, మెరిట్ లేకున్నా ఎవరు ఎక్కువ ఫీజు చెల్లిస్తే వారికే మేనేజ్‌మెంట్ సీట్లు అమ్ముకొంటున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. నిజానికి కన్వీనర్ కోటాలో ఫీజు రూ.లక్ష ఉంటే.. మేనేజ్‌మెంట్ కోటాలోని బీ కేటగిరీ సీటుకు మూడింతలు.. అంటే రూ.3 లక్షలు, ఎన్‌ఆర్‌ఐ కోటా సీటుకు ఐదింతలు.. అంటే రూ.5 లక్షల వరకు మాత్రమే ఫీజు తీసుకోవాలి. కానీ.. మేనేజ్‌మెంట్ కోటాలో కంప్యూటర్ సైన్స్ సీట్లను కాలేజీలు రూ.8 నుంచి రూ.16 లక్షల వరకు అమ్ముకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల అంత ఫీజు చెల్లించలేని మెరిట్ విద్యార్థులు నష్టపోతున్నారు. ఈ సీట్లు ఎవరికి, ఎంతకు అమ్ముకొంటున్నారన్న వివరాలు కూడా బయటపెట్టకపోవటంతో ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఈ సీట్లను భర్తీ చేయటం వల్ల నిర్ణీత ఫీజు చెల్లిస్తే మెరిట్ విద్యార్థులకే సీట్లు లభిస్తాయని, సీట్ల భర్తీ అంతా పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఇవీ ప్రతిపాదనలు...

- బీ, సీ కేటగిరీ సీట్లకు ప్రభుత్వమే ఫీజులు ప్రతిపాదిస్తుంది. కన్వీనర్ కోటాకన్నా బీ కేటగిరీకి మూడు రెట్లు, సీ కేటగిరీ సీట్లకు ఐదురెట్లు అధికంగా ఫీజులు వసూలు చేయవచ్చు. దీంతో పాటు లేబొరేటరీలు, లైబ్రరీ ఫీజులు అదనంగా వసూలు చేసుకునే అధికారం ఇవ్వాలనే సూచన చేయనున్నట్లు సమాచారం.
- ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి నీట్ అనుసరిస్తున్న విధానాన్నే ఇంజనీరింగ్‌లోనూ అనుసరించాలనే మరో ప్రతిపాదన చేస్తున్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేసే ఈ ప్రక్రియ మొత్తం కన్వీనర్ కోటా మాదిరిగా సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నడుస్తుంది. ఫీజులు మాత్రం కాలేజీలే నిర్ణయిస్తాయని అధికారులు అంటున్నారు.

5 నిమిషాల్లో భవన అనుమతులు!

- టీఎస్–బీపాస్ స్థానంలో కొత్తగా ఏకీకృత ఆన్‌లైన్ అనుమతుల వ్యవస్థ 'బిల్డ్ నౌ'
- మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



ఆగ్‌మెంటెడ్ రియాలిటీ విజువలైజర్ సాయంతో భవన డిజైన్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో దానకిశోర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భవన నిర్మాణాలతోపాటు లేఅవుట్ల తనిఖీ ప్రక్రియ ఇకపై కేవలం ఐదు నిమిషాల్లోపే అనుమతులు లభించనున్నాయి. ప్రస్తుతం నిర్మాణ అనుమతులకు అనుసరి స్తున్న 'టీఎస్–బీపాస్' విధానం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నూతన ఏకీకృత ఆన్‌లైన్ భవన నిర్మాణ, లేఅవుట్ ఆమోద వ్యవస్థ 'బిల్డ్ నౌ'ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా 'బిల్డ్ నౌ' యాప్ రూపొందించింది. ఈ యాప్ ద్వారా ఐదు నిమిషాల్లోపే అను మతులు జారీ అవుతాయని ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐఐటీ విద్యార్థులు రూపొందించిన 'బిల్డ్ నౌ' యాప్‌ను మంగళవారం ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. కొత్త విధానాన్ని ఫిబ్రవరి 1 నుంచి అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

రోజుల తరబడి నిరీక్షణకు తెర..

ప్రస్తుత టీఎస్–బీపాస్ విధానంలో భవన నిర్మాణాల డ్రాయింగ్ స్క్రూటినీకి 20 నుంచి 30 రోజుల వరకు సమయం పడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. కానీ 'బిల్డ్ నౌ' వ్యవస్థ దేశంలోనే అత్యంత వేగవంతమైన విధానంగా నిలవనుందన్నారు. అలాగే భవన డిజైన్లు నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉన్నాయో లేదో అధికారులు 3డీ ఆగ్‌మెంటెడ్ రియాలిటీ విజువలైజర్ల సాయంతో పరిశీలించే అవకాశం లభిస్తుందని వివరించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ అధికారులు సైతం ఇంటిగ్రేటెడ్ యాప్ సాయంతో భవనాల వివరాలను సరిపోల్చుకోవచ్చని చెప్పారు. అలాగే ప్రజలు ప్రతిపాదిత నివాస భవనం, కమర్షియల్ కాంప్లెక్స్‌లోని బ్లాక్‌లు, హాల్, కిచెన్, బెడ్రూం వంటి గదులను 3డీ విధానంలో చూడొచ్చన్నారు. ఏఐ చాట్ సపోర్ట్ ద్వారా అనుమతుల నియమాలపై వారికి తక్షణ సమాచారం లభిస్తుందన్నారు. భవన అనుమతులతోపాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ సర్టిఫికెట్ల జారీ వంటి అన్ని ప్లానింగ్ సంబంధిత సమస్యలకు సింగిల్ పోర్టల్ తీసుకొచ్చామన్నారు. 'రెరా' వెబ్‌సైట్‌తో ఈ కొత్త విధానాన్ని లింక్ చేస్తామని చెప్పారు. ఈ యాప్‌పై ఆర్కిటెక్ట్‌లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, ప్రభుత్వ అధికారులకు రాబోయే రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తెలంగాణలో దాదాపు 60 శాతం జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉన్నందున సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తున్నారని శ్రీధర్‌బాబు చెప్పారు.

రియల్ ఎస్టేట్‌లో హైదరాబాదే టాప్

రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ మొదటి స్థానంలో కొనసాగుతోందని పలు జాతీయస్థాయి నివేదికలు చెబుతున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారని వెల్లడించారు. రూ.250 కోట్లకుపైగా అధిక నెట్‌వర్త్ ఉన్న వ్యక్తులు హైదరాబాద్‌లో 467 మంది ఉ న్నారని, ఇది బెంగళూరు కంటే ఎక్కువని చెప్పారు. హైదరా బాద్‌లో 9.5లక్షల మందికిపైగా ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నార న్నారు. 2024లో ప్రపంచంలో టాప్–5 నగరా ల్లో హైదరాబాద్ ఉందని, జీఎస్ డీపీలో 15 ఏళ్లుగా హైదరాబాద్ వృద్ధి బాటలో కొనసాగుతోందని వెల్లడించారు. నగరంలో కొత్తగా 22% భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు పెరిగాయని చెప్పారు.

లంచం ఇవ్వకండి... సమాచారం ఇవ్వండి

వారోత్సవాల పోస్టర్ విడుదల చేసిన ఏసీబీ డీజీ విజయ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: 'లంచం ఇవ్వకండి..సమాచారం ఇవ్వండి'అన్న నినాదంతో తెలంగాణ అవినీతి నిరోధకశాఖ మంగళవారం నుంచి ఈనెల 9 వరకు అవినీతి వ్యతిరేక వారోత్సవాలు నిర్వహిస్తోంది. వారోత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్‌ను ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ మంగళవారం ఏసీబీ కేంద్ర కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 9న 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం'నేపథ్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఏసీబీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఏసీబీ కేంద్ర కార్యాలయంతోపాటు అన్ని రేంజ్ కార్యాలయాల్లో డీఎస్పీలు ఆయా జిల్లా కలెక్టర్లతో పోస్టర్లు ఆవిష్కరించినట్టు అధికారులు తెలిపారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, ఏసీబీ రేంజ్‌ల వారీగా అధికారుల ఫోన్ నంబర్లు ఉన్న పోస్టర్లను కలెక్టర్ కార్యాలయం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రదర్శిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా బుధవారం అన్ని జిల్లాల్లో 8 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు, ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఈనెల 5, 6 తేదీల్లో రేంజ్ డీఎస్పీ కార్యాలయాల్లో అవగాహన ర్యాలీలు, నిందితులకు శిక్షపడిన ఏసీబీ కేసులలోని ఫిర్యాదుదారులకు ఈనెల 7న సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.



పులి భయం.. మాస్క్‌తో అభయం

ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజలకు ఫేస్‌మాస్క్‌లు
పులి దాడి చేయకుండా అధికారుల సూచన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచారంతో తీవ్ర భయాందోళనలో ఉన్న ప్రజలకు అటవీ శాఖ అధికారులు ధైర్యం చెబుతున్నారు. పులి దాడిచేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వారిలో భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల వరుసగా ఇద్దరిపై పెద్దపులి దాడి చేయడంతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో రైతులు పొలం పనులకు వెళ్లటానికి జంకుతున్నారు. దీంతో అటవీ అధికారులు వారికి పలు సూచనలు చేస్తున్నారు. తల వెనుకభాగంలో ఫేస్‌మాస్కులు ధరించాలని, మైక్‌లతో శబ్దాలు చేయాలని, ఒంటరిగా ఉండకుండా గుంపులుగా ఒకేచోట పనిచేయాలని చెబుతున్నారు. ప్రజలకు మాస్కులు సరఫరా చేస్తున్నారు. గ్రామస్థాయిలో రక్షక కమిటీలు ఏర్పాటుచేసి భరోసా కల్పిస్తున్నారు. కాగా, ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవేగం శివారులో తాజాగా పులి జాడలు కనిపించాయి. దీంతో అధికారులు అప్రమత్తమై ఆ పులి గమనాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు.



తన తమ్ముడిలా మరొకరు బలికావద్దని..

వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేసిన అన్న

కాటారం: తన తమ్ముడిలా రోడ్డు ప్రమాదంలో మరొకరు తనువు చాలించొద్దని భావించిన ఓ అన్న వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రతాపగిరి గ్రామానికి చెందిన బందెల లవాకర్ సోదరుడు బందెల లతీష్ ఏడాది క్రితం బైక్‌పై వస్తూ అదుపుతప్పి పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో లవాకర్ తీవ్ర కలతకు గురయ్యాడు. తన తమ్ముడిలా మరొకరు హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదాలకు గురికావద్దని భావించాడు. లతీష్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం వంద మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేశాడు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కోరారు. అంతకుముందు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.



చిరుతను ఢీకొట్టిన వాహనం..

సదాశివనగర్: కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం దగ్గి అటవీ ప్రాంతం శివారులో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న చిరుతపులిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చిరుతకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేసరికే.. చిరుత అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని సదాశివనగర్ అటవీ సెక్షన్ ఆఫీసర్ ముబాషీర్ తెలిపారు. చిరుత కోసం అటవీ ప్రాంతంలో గాలించామన్నారు. బుధవారం కూడా గాలిస్తామని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కట్టుదిట్టమైన కార్యాచరణతో వన్యప్రాణుల సంరక్షణ

అటవీ శాఖ మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి సహజ ధర్మాలకు విఘాతం కలగకుండా వ్యవహరించడమే మనుషులుగా వన్యప్రాణుల సంరక్షణకు మనం నిర్వర్తించే అత్యుత్తమ విధి.. అని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. వన్యప్రాణుల సంరక్షణకు తమ ప్రభుత్వం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. వన్యప్రాణుల పరిరక్షణ చట్టం అమలుతో పాటు, వన్యప్రాణుల వేట, జంతువుల అక్రమ వ్యాపారం నివారణకు 'క్యాచ్ ది ట్రాప్' పేరుతో అటవీశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అరుదైన వన్యప్రాణులైన పులుల సంరక్షణకు కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వెల్లడించారు. బుధవారం వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడుతున్న అటవీశాఖ సిబ్బందిని, ప్రకృతి ప్రేమికులను మంత్రి అభినందించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ఏడాది కాలంగా ప్రజాపాలనకు సహకరించిన ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పక్షాన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి నేతగా, తెలంగాణ ఉద్యమకారుడిగా నిర్వహించిన బాధ్యతను గుర్తించి ఎమ్మెల్యేగా గెలిపించిన హుస్నాబాద్ ప్రజలకు మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏడాది కాలంలో రైతు, మహిళా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. విద్య, వైద్యంతో పాటు ఇతర రంగాల్లో సంస్కరణలు అమలు చేశామని వివరించారు. రానున్న నాలుగేళ్ల కాలంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే ఎజెండాగా ముందుకెళ్తామని హామీ ఇచ్చారు.



బుధవారం జరిగే తన సోదరుడి కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆహ్వానించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు

దివ్యాంగుల హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏడాది పాలన దాటుతున్నా దివ్యాంగులకు ఇస్తామన్న రూ.6 వేల పింఛన్ పెంపుదల ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని, ప్రత్యేక కోటా కింద ఇళ్లు, లోన్లు ఇవ్వలేదని మండిపడ్డారు. ఏడాది కాలంలో రూ.3 లక్షల కోట్ల బడ్జెట్, రూ.80 వేల కోట్ల అప్పులు తెచ్చినా దివ్యాంగులను ఆదుకోవాలనే సోయి ప్రభుత్వానికి లేకుండా పోయిందని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలోని దివ్యాంగులకు న్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని, సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతున్నారని చెప్పారు. ఇటీవల పారా ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటారని, విద్యా రంగం, వ్యాపార రంగాల్లో కూడా రాణిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ మొదటిసారిగా వారి లోపాలను ఎత్తిచూపకుండా దివ్యాంగులు అని నామకరణం చేశారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గుర్తుచేశారు. దివ్యాంగుల కోసం అనేక నిబంధనలను సవరించి తొందరగా సర్టిఫికెట్ తీసుకునేలా, దివ్యాంగుల రిజర్వేషన్లను పెంచేలా కేంద్రం చర్యలు తీసుకుందని తెలిపారు.

అభ్యర్థుల ఎంపిక ఆచితూచి!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇదీ బీజేపీ వ్యూహం

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన వరకూ వేచిచూసే ధోరణి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన విషయంలో బీజేపీ ఆచితూచి అడుగులేస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తరఫున బరిలో దిగే అభ్యర్థుల ఖరారు తర్వాతే కార్యరంగంలోకి దిగాలని భావిస్తోంది. త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ (రెండు టీచర్స్, ఒక గ్రాడ్యుయేట్)లో రెండింటిని గెలిచి సత్తా చాటాలని ఆ పార్టీ ముఖ్యనేతలు పట్టుదలగా ఉన్నారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రులు (ఒక్కో సీటు), వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పరిధిలోనే 4 ఎంపీలు, 7 ఎమ్మెల్యే సీట్లు గెలిచి ఉత్తర తెలంగాణలో కమలనాథులు సత్తా చాటిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలుచుకొని పట్టభద్రులు, టీచర్లలోనూ బీజేపీకి ఆదరణ ఉందని రుజువు చేయాలని ఆ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకు అనుగుణంగానే అభ్యర్థుల ఖరారు విషయంలోనూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తన పట్టును నిరూపించేందుకు సిద్ధమైన నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ముందుకు కదలాలని కాషాయదళం భావిస్తోంది. మరోవైపు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసే అవకాశాలు ఏ మేరకు ఉన్నాయి..ఆ పార్టీ అభ్యర్థులు కూడా రంగంలోకి దిగితే త్రిముఖ పోటీలో ఎలాంటి మార్పులొచ్చే అవకాశాలుంటాయనే దానిపైనా దృష్టి సారించింది. ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో పోటీకి బీఆర్ఎస్ విముఖంగా ఉంటే... కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టి మూడింటిలో రెండు ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకోవాలనే పట్టుదలతో బీజేపీ ముఖ్యనేతలున్నారు.

అన్ని పార్టీల కంటే ముందే అని అనుకున్నా...

అన్ని పార్టీల కంటే ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించడం ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ప్రచారం ముమ్మరం చేయాలని తొలుత బీజేపీ నాయకత్వం భావించింది. అయితే ఆ తర్వాత వ్యూహం మార్చుకుంది. బలమైన ఎమ్మెల్సీ అభ్యర్థులను నిలిపేందుకు పార్టీపరంగా ప్రాథమిక కసరత్తు జరిగినా ప్రస్తుతం అది నిలిచిపోయింది. వచ్చే ఏడాది మార్చి 29తో ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఆ లోగానే ఈ స్థానాలకు ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది.

- బీజేపీలో ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలకు తీవ్ర పోటీ నెలకొంది. పట్టభద్రుల టికెట్ కోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన గోదావరి అంజిరెడ్డి, మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథరావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, గత ఎన్నికల్లో ఈ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి పోటీచేసిన సుగుణాకరరావు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీకి విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య, గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మామిడి సుధాకర్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పార్టీకి పట్టుండడంతోపాటు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మంచి ఓటింగ్ శాతాన్ని నమోదు చేసుకున్నందున ముందుగానే అభ్యర్థుల ప్రకటన మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- ఖమ్మం-నల్లగొండ-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ టికెట్ కోసం పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, సంఘ్ పరివార్‌కు చెందిన టీపీయూఎస్ నాయకుడు సాయిరెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.



తుది దశకు 'అమృత్' పనులు

జీహెచ్ఎంసీ సహా 12 పురపాలికల్లో పూర్తికావొచ్చిన 66 ప్రాజెక్టులు

రూ. 1,663 కోట్లతో తాగునీరు, సీవరేజీ, పార్కుల అభివృద్ధి పనులు

ఇప్పటికే రూ. 832 కోట్లు విడుదల చేసిన కేంద్రం.. రూ. 806 కోట్లను వెచ్చించిన రాష్ట్రం

అమృత్ 2.0లో హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్‌ప్లాన్ చేర్చాలన్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ (ది అటల్ మిషన్ ఫర్ రిజునువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్) కింద రాష్ట్రంలోని 12 పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. దేశంలోని ఎంపిక చేసిన పట్టణాల్లో తాగునీటి సరఫరాతోపాటు సీవరేజీ పైప్‌లైన్ల వ్యవస్థ, పట్టణ రవాణా, పచ్చదనం పెంపు, వరదనీటి కాలువల అభివృద్ధి ప్రధాన అంశాలుగా 2015 జూన్ 25న 'అమృత్' పథకం ప్రారంభమైంది. తొలి దశలో ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 500 నగరాలను కేంద్రం ఎంపిక చేయగా అందులో రాష్ట్రం నుంచి హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), వరంగల్ (జీడబ్ల్యూఎంసీ), కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం నగరాలతోపాటు ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట పట్టణాలను ఎంపిక చేశారు. ఈ 12 పురపాలికల్లో తాగునీరు, సీవరేజీ, పార్కుల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పనులు ప్రారంభించింది. కేంద్రం, రాష్ట్రం 50:50 ప్రాతిపదికన చేపట్టే ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 1,663.08 కోట్లు కాగా.. అందులో కేంద్ర సాయం రూ. 832.6 కోట్లు.

66 ప్రాజెక్టులు... తాగునీటికి అధిక మొత్తం...

అమృత్ పథకం కింద 12 పురపాలికల్లో 66 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. రూ. 1,663.08 కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు కేంద్రం తన వాటాగా రూ. 832.6 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అందులో రూ. 831.52 కోట్లను కేంద్రం విడుదల చేయగా రాష్ట్రం తన వాటాతోపాటు కేంద్రం వాటాలో రూ.806.21 కోట్లు వినియోగించుకుంది. తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ పట్టణాల్లో 27 నీటి సరఫరాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందుకోసం 4,336.54 కిలోమీటర్ల పొడవైన నీటి సరఫరా పైప్‌లైన్‌లను నిర్మించారు. వాటి విలువ రూ. 1,424.09 కోట్లు. అందులో అత్యధికంగా వరంగల్‌కు రూ. 341.3 కోట్లు వెచ్చించడం విశేషం. ఈ పథకం కింద నిజామాబాద్, సిద్దిపేటల్లో రూ. 203.3 కోట్ల విలువగల నాలుగు మురుగునీటి శుద్ధి, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులను చేపట్టారు. ఈ రెండు పురపాలికల్లో 278.53 కి.మీ. పొడవైన మురికినీటి పారుదల పైప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. 5.54 లక్షల నల్లా నీటి కనెక్షన్లు, 0.87 లక్షల మురుగునీటి పారుదల కనెక్షన్లను అమృత్, కన్వర్జెన్స్‌లో భాగంగా సమకూర్చారు. రాష్ట్రంలోని 12 పురపాలికల్లో రూ. 35.69 కోట్లతో 35 హరిత స్థలాలు, పార్కులను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ దాదాపు పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. దీనికి అదనంగా రాష్ట్రంలో 18.25 ఎంఎల్‌డీ సామర్థ్యంగల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్టీపీ)ను, 442.45 ఎకరాల విస్తీర్ణంలో హరిత క్షేత్రాలను 'అమృత్' కింద అభివృద్ధి చేసింది. ప్రస్తుతం అమృత్ 2.0 కింద కొత్త ప్రతిపాదనలు కేంద్రానికి చేరాయి.

సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని కోరిన సీఎం రేవంత్

2021లో మొదలైన అమృత్-2.0 (పథకం రెండో దశ)లో భాగంగా హైదరాబాద్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ఇటీవల విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రతిపాదించిన సమగ్ర సీవరేజీ మాస్టర్‌ప్లాన్ (సీఎస్ఎంపీ)ని చేర్చాలని కోరారు. అమృత్ తొలి విడత ప్రాజెక్టులో జీహెచ్ఎంసీలో పచ్చదనం కోసం కేవలం రూ. 3.3 కోట్లు మాత్రమే కేటాయించిన నేపథ్యంలో సీఎస్ఎంపీని అమృత్‌లోకి తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌తోపాటు సమీప పురపాలక సంఘాలతో కలుపుకొని 7,444 కి.మీ. మేర రూ. 17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్లు ఖట్టర్‌కు సీఎం తెలిపారు. సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సాయం చేయడం లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులివ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

12 పురపాలికల్లో 'అమృత్' పనులకు అయిన ఖర్చు (రూ. కోట్లలో)..

జిల్లా	తాగునీటి పైప్‌లైన్ల ఖర్చు	సీవరేజీ ఖర్చు	పచ్చదనం ఖర్చు	మొత్తం
ఆదిలాబాద్	78.3	----	2.87	80.77
జీహెచ్ఎంసీ	----	----	3.3	3.33
కరీంనగర్	98.92	----	2.71	101.63
ఖమ్మం	205.63	----	2.37	208
మహబూబ్‌నగర్	156.12	----	3.17	159.29
మిర్యాలగూడ	38.91	----	2.58	41.49
నల్లగొండ	106.97	----	2.37	109.34
నిజామాబాద్	90.39	26.73	4.22	121.34
రామగుండం	79.64	----	2.91	82.55
సిద్దిపేట	----	176.57	2.82	179.39
సూర్యాపేట	27.91	----	3.22	31.13
వరంగల్	541.3	----	3.55	544.85
మొత్తం	1,424.09	203.3	35.69	1,663.08



కాంగ్రెస్ పార్టీ పాలనకు ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

గాంధీభవన్‌లో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడి ప్రజలు ప్రజాపాలన తెచ్చుకున్న డిసెంబర్ 3వ తేదీ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. దశాబ్ద కాలం పాటు అణచివేతకు గురైన ప్రజల హక్కులకు స్వేచ్ఛ వచ్చిన రోజును మరిచిపోలేమని సాయికుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా ఉండాలని, రానున్న పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండాలే వేరు... ఎజెండా ఒక్కటే

బీఆర్ఎస్-బీజేపీపై బండ్రు శోభారాణి విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి

సాక్షి, హైదరాబాద్: జెండాలు వేరైనా బీఆర్ఎస్, బీజేపీల ఎజెండా ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర మహిళాభివృద్ధి సహకార కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై బీజేపీ నేతలు చార్జిషీట్ విడుదల చేశారని, అదే కోవలో ఇప్పుడు బీఆర్ఎస్ కూడా చార్జిషీట్ వేస్తామని చెబుతోందని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జక్కిలి అయిలయ్య యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, పదేళ్ల కాలంలో ప్రజలకిచ్చిన ఒక్క హామీని కూడా కేసీఆర్ నెరవేర్చని కారణంగానే బీఆర్ఎస్‌కు అధికారం పోయిందని, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు హరీశ్, కేటీఆర్‌లు పోటీలు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన చేస్తుంటే బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పాటు దరిద్రపు పాలన సాగిందని విమర్శించారు. ఈ రెండు పాలనలపై బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలని ఆమె డిమాండ్ చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన సాగుతుందని శోభారాణి స్పష్టం చేశారు.

రాజకీయంగా మాదిగలను ముంచింది కాంగ్రెస్సే

ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజికవర్గాన్ని రాజకీయంగా, కేబినెట్ కూర్పు, పార్టీలో ప్రాతినిధ్యం కల్పించడంలో ముంచిందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి వర్గీకరణపై కొత్త ఆలోచనలు వచ్చినట్టున్నాయని, అందువల్లే ఓ కాంగ్రెస్ నేత ఇటీవల సమావేశం నిర్వహించి మాలలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు మాదిగలను ముంచి మాలలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపైన కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో వాసుదేవరెడ్డి, బాల్కసుమన్, దేవీప్రసాద్ తదితరులు

ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం.. వ్యవస్థలు విచ్ఛిన్నం: బాల్క సుమన్

తెలంగాణ భవన్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రేవంత్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలు విచ్ఛిన్నం కాగా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపి ఆ తర్వాత హామీలు అమలు చేయకపోవడంతో అన్ని వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నాయని తెలిపారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రపంచ దివ్యాంగుల దిన వేడుకలో బాల్క సుమన్ మాట్లాడారు. గురుకుల విద్యాసంస్థల పరిశీలనకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడాన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్‌పాస్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛను హామీ అమలు చేయాలన్నారు. కాగా, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాదరావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ)లో కేక్ కట్ చేస్తున్న అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్, బీజేపీ లీగల్ సెల్ నేత కేవీ రామారావు తదితరులు

క్లుప్తంగా...

'కాంట్రాక్ట్ లెక్చరర్లుగా గుర్తించాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్లుగా 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను కాంట్రాక్టు లెక్చరర్లుగా మార్పు చేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలంటూ ఆయా ఉద్యోగ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. శాంక్షన్ పోస్టుల్లోనే తాము ఏళ్ల తరబడి అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నామని, తమ శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన వెలువరించింది.

బీసీ కార్పొరేషన్లకు విధులతో పాటు నిధులు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సాక్షి, అమరావతి: బీసీ కార్పొరేషన్లకు విధులతో పాటు నిధులూ కేటాయించినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను ఎమ్మెల్యే అరవింద్ బాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి సహా బీసీ సంఘాల నాయకులు మంగళవారం కలిశారు. ఈ నెల 6న కృష్ణా జిల్లా అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో జరగనున్న తమ ఆత్మీయ అభినందన సభకు హాజరుకావాలని మంత్రిని చిలకలపూడి పాపారావు కోరారు. మంత్రి సవిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇటీవల బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించడమే కాకుండా బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ నాయకులు దేవ్వళ్ల మురళి, కేసన శంకరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సమీక్ష కేంద్రాల బలోపేతానికి చర్యలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన విద్యా సమీక్ష కేంద్రాన్ని (కమాండ్ కంట్రోల్ సెంటర్) బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంగళగిరిలోని వీఎస్‌కేలో సేవలు అందించేందుకు 26 జిల్లాల నుంచి సర్‌ప్లస్ ఉపాధ్యాయుల్లో ముగ్గురు ఎస్‌జీటీల చొప్పున ఎంపిక చేసి పంపించాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు డీఈవోలను ఆదేశించారు. పూర్తి వివరాలను ఈ నెల 5వ తేదీ నాటికి అందించాలన్నారు. రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలల పనితీరును నిరంతరం పరిశీలించేందుకు గత ప్రభుత్వం 2022 జూలైలో విద్యా సమీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లాకు ఇద్దరు ఇన్‌చార్జుల చొప్పున 52 మంది, మరో నలుగురు సూపర్‌వైజర్ల చొప్పున ఉపాధ్యాయులను ఈ కేంద్రంలో నియమించింది. తద్వారా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, అకడమిక్ మానిటరింగ్, జేవీకే కిట్స్ పంపిణీ, కన్సెస్టివ్ రిథమ్ (గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో అనుసంధానం) తదితర అంశాలను మంగళగిరిలోని వీఎస్‌కే నుంచి పరిశీలించేవారు. దీంతో బడుల్లో పథకాల అమలు, విద్యార్థుల హాజరు మెరుగుపడడంతోపాటు ఏ బడిలో ఏం జరిగినా నిమిషాల వ్యవధిలో ప్రభుత్వానికి తెలిసేలా ఏర్పాట్లు చేశారు. తొలుత ఈ కేంద్రాన్ని మూసివేయాలని నిర్ణయించుకున్న సర్కారు.. వీఎస్‌కే ద్వారా జరిగిన మేలును గుర్తించి బలోపేతం చేస్తోంది.

సౌదీలో చిక్కుకున్న వారిని భారత్‌కు తీసుకువస్తాం

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మంది యువకులు సౌదీ అరేబియాలో చిక్కుకున్నారని, ఏజెంట్ల ద్వారా మోసపోయిన జిల్లా యువకులను తిరిగి వారి సొంత ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ఎన్.ఆర్.ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఏపీఎన్ఆర్టీ విభాగం ద్వారా సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయంతో ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఆందోళన చెందవద్దని బాధితుల బంధువులకు తెలిపారు.

సేవ్ వాల్తేరు

విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వాల్తేరు డివిజన్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలను బట్టి చూస్తేడివిజన్ విభజన అనివార్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వైపు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా.. మరోవైపు వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌గా ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 130 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌ను కాపాడాలన్న ప్రజల డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అందరిలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- సాక్షి, విశాఖపట్నం



- కొత్త జోన్‌కి టెండర్ల నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌పై నీలినీడలు
- రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయనున్న బోర్డు
- డివిజన్ కొనసాగింపును పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వాల్తేరు డివిజన్ తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణకోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో ప్రజలు ఆనందించినప్పటికీ.. కేంద్రం తీసుకున్న తదుపరి నిర్ణయంతో ఆ ఆనందం నీరుగారిపోయింది. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ, మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లో కలుపుతున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 1,106 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న వాల్తేరు డివిజన్‌లో 541 చదరపు కిలోమీటర్ల భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాయగడ డివిజన్‌లో, మిగిలిన 565 చదరపు కిలోమీటర్ల భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పట్టించుకోని నేతలు



ఓవైపు జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ఇటీవలే టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు ఖరారు చేసిన రెండేళ్లలో కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ లోగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. జోన్ డీపీఆర్‌లోనూ విశాఖ డివిజన్‌ని కొనసాగిస్తే మంచిదని కూడా సూచించారు. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన అనివార్యమైనట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుత ఎంపీలు ఈ విషయంలో ఎలాంటి చొరవ చూపడం లేదు. ఎంపీలు ఒత్తిడి తెస్తే వాల్తేరు డివిజన్ కొనసాగే అవకాశం ఉన్నా.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

వాల్తేరే కీలకం

తూర్పుకోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటిది. జోన్ పరిధిలో అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే డివిజన్ ఇదే. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా.. ఇందులో రూ.7 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12–14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లు ఉన్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లు ఉండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్‌గా వాల్తేరు నిలుస్తోంది. ఐరన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్ వంటి ప్రధాన మార్గాల ద్వారా వాల్తేరు డివిజన్‌కు అధిక ఆదాయం వస్తుంది. వాల్తేరు డివిజన్‌ను విభజిస్తే.. ఈ ఆదాయం రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. అంటే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త జోన్ తన సింహభాగం ఆదాయాన్ని కోల్పోనుంది.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



వాల్తేరు డివిజన్ విభజన ప్రకటనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదు. జోన్ రావడం ఆనందంగా ఉన్నా.. చారిత్రక నేపథ్యం ఉన్న డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. వాల్తేరును విజయవాడలో విలీనం చేయడం అవగాహనా రాహిత్యం. దీని వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల సెంటిమెంట్ దెబ్బతిన్నట్లే. ప్రజా ప్రతినిధులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

– బి.కృష్ణారావు, విశ్రాంత రైల్వే ఉద్యోగి

వాల్తేరు డివిజన్ కొనసాగించాల్సిందే...



ఎంతో చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. యూనియన్లు, వివిధ ప్రజాసంఘాలు కలిసికట్టుగా పోరాటం చేస్తే.. ప్రజలంతా మద్దతునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– ఎస్.ఈశ్వరరావు, రైలు ఫ్యాన్ అసోసియేషన్ ప్రతినిధి

తీరం తరుక్కుపోతోంది..

- కోతకు గురవుతున్న భూములు
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ప్రభావం
- సరుగుడు, మడ అడవులు మాయం

సాక్షి, అమలాపురం/ అల్లవరం: కోస్తా తీరం భారీగా కోతకు గురవుతోంది. వాయుగుండాలు, అల్పపీడనాలు, తుపాన్లు ఏర్పడిన సమయంలో కోత అధికంగా ఉంటోంది. తాజాగా ఫెంగల్ తుపాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తీరం పొడవునా కోత అధికమైంది. మన రాష్ట్రంలో 972 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 140 కిలోమీటర్ల మేర ఉంది. కోనసీమ జిల్లాలో అంతర్వేది సముద్ర సంగమ ప్రాంతం నుంచి ఐ.పోలవరం మండలం భైరుపాలెం వరకూ 90 కిలోమీటర్లు కాగా, తాళ్లరేవు మండలం గాడిమొగ నుంచి తుని మండలం వరకూ సుమారు 50 కిలోమీటర్ల మేర తీరం ఉంది. పచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదీ పాయల కోత వల్ల ఇప్పటికే వందలాది ఎకరాల కొబ్బరి తోటలు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. ఇదే సమయంలో తీరం పొడవునా సముద్ర కోత కూడా అధికంగా ఉంటోంది. కోనసీమ జిల్లాలో ఓడలరేవు, కేశనపల్లి, అంతర్వేది, కొమరగిరిపట్నంలో ప్రభావం ఎక్కువగా ఉంది. భూములు, సరుగుడు తోటలు సముద్రంలో కలసిపోతున్నాయి. గడచిన పదేళ్లలో కోత తీవ్రత రెట్టింపు అయ్యింది. ఓడలరేవులో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ తీరాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ చమురు బావులు ఇప్పుడు సముద్రంలో ఉన్నాయి. ఎనిమిదేళ్ల కిందట ఓడలరేవు బీచ్‌లో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం వరకూ సముద్రం చొచ్చుకువచ్చి భూమి కోతకు గురవుతోంది. అంతర్వేది బీచ్‌లో అలల ఉధృతి స్థానికంగా ఉన్న రిసార్ట్స్ వరకూ వస్తోంది. స్థానికంగా ఉన్న పల్లిపాలెం గ్రామంలోకి సైతం అలలు అప్పుడప్పుడు వచ్చి ఇళ్లను ముంచెత్తుతున్నాయి. కేశవదాసుపాలెం తూర్పులంక వంటి గ్రామాల్లోకి ఉప్పు నీరు ముంచెత్తడంతో కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయి.



ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్దకు చొచ్చుకు వచ్చిన సముద్ర తీరం

కాలుష్యాన్ని కలిపేస్తూ..

అరేబియా సముద్రం కన్నా బంగాళాఖాతం అత్యంత ప్రమాదకరం. దేశంలో చాలా వరకూ నదులన్నీ దీనిలోనే కలుస్తాయి. ఉత్తరాదిన గంగా, బ్రహ్మపుత్ర, మధ్యభాగంలో మహానది, దిగువన గోదావరి, కృష్ణ, పెన్నా, కావేరి, వంశధార, నాగావళి వంటి నదుల సంగమం బంగాళాఖాతంలోనే. దేశంలో చాలా వరకూ కాలుష్యాన్ని మోసుకువస్తున్న ఈ నదులు దానిని బంగాళాఖాతంలో కలిపేస్తున్నాయి. ఫలితంగా బంగాళాఖాతం త్వరగా వేడెక్కుతోంది. దీనివల్ల తరచూ తుపాన్లు ఏర్పడుతున్నాయి. అందుకే అరేబియా సముద్రం కన్నా బంగాళాఖాతంలోనే తుపాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాలు అధికం. వీటి ప్రభావంతో అలలు ఎగసిపడి కోత ఉధృతి పెరుగుతోంది. తమిళనాడు నుంచి పశ్చిమ బెంగాల్ వరకూ భూభాగ నైసర్గిక స్వరూపం సముద్రంలోకి చొచ్చుకు వచ్చినట్టు ఉంటుంది. దక్షిణాయన కాలంలో అంటే జూలై 16 నుంచి జనవరి 13 వరకూ బంగాళాఖాతంలో అలలన్నీ దక్షిణం నుంచి ఉత్తరం వైపునకు వస్తాయి. ఫలితంగా అప కేంద్ర బలాలతో తీరం పొడవునా కోత తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు.

అలలు ఎగసిపడి..

కాకినాడ జిల్లా ఉప్పాడ, కోనపాపపేట తీరం కోతకు తరుక్కుపోతుంది. కాకినాడ తీరం సమీపంలో హోప్ ఐలెండ్ ఉండడం, డీప్ వాటర్ పోర్టు కోసం సముద్రంలో ఇసుక తవ్వకాల ప్రభావం సమీపంలోని ×ఉప్పాడ× గ్రామంపై పడుతోంది. సముద్రంలో తవ్వకాలు చేసిన ప్రాంతాల్లో తిరిగి ఇసుక పూడుకునేటప్పుడు ఏర్పడుతున్న ఒత్తిడితో ఉప్పాడ వద్ద అలలు ఎగసిపడుతున్నాయి. హోప్ ఐలెండ్ వద్ద తీరం పెరుగుతుండగా, ఉప్పాడ వద్ద కోత పెరుగుతోంది. కోత ఇలా కొనసాగితే కొద్ది సంవత్సరాల్లో ఉప్పాడ గ్రామం కనుమరుగు కానుంది.

భూములను కలిపేసుకుని..

ప్రకృతి ప్రకోపానికి ఓడలరేవు నదీ సంగమం నుంచి రిసార్ట్స్ వరకూ వందలాది ఎకరాల జిరాయితీ, డీపట్టా భూములు సముద్రంలో కలసిపోయాయి. 25 ఏళ్లుగా సముద్రం 500 మీటర్లకు పైగా ముందుకు వచ్చింది. ఇటీవల నెల రోజుల్లో రెండు పర్యాయాలుగా సముద్రం ముందుకు వచ్చి 936, 937 సర్వే నంబర్ గల జిరాయితీ, డీ పట్టా భూములు సుమారు 17 ఎకరాలను సముద్రం తనలో కలిపేసుకుంది. దీంతో ఓడలరేవులో సీతారామస్వామి దేవస్థానానికి చెందిన 11 ఎకరాలు, పెమ్మాడి సూర్యనారాయణ, ఇల్లింగి కాసులమ్మ, తదితరులకు చెందిన మరో ఆరు ఎకరాలు భూమి కోతకు గురైంది.

–పాల వర్మ, ఓడలరేవు, అల్లవరం మండలం



ప్రమాదంలో ఓఎన్జీసీ టెర్మినల్

కోనసీమ జిల్లా పరిధిలోని ఓడలరేవు ఓఎన్జీసీ వశిష్ట టెర్మినల్‌లోకి సముద్రం నీరు చొచ్చుకు రావడంతో ఉద్యోగులు, స్థానికులు ఆందోళన చెందారు. సముద్ర అలల తాకిడికి ఈ టెర్మినల్ ప్రధాన గోడ వరకూ భూమి కోతకు గురైంది. ఇప్పుడున్న టెర్మినల్ గోడకు సముద్ర తీరం సుమారు కిలోమీటరు దూరంలో ఉండేది. నెమ్మదినెమ్మదిగా సముద్రం చొచ్చుకొస్తూ గోడ వరకు వచ్చింది. కోత నివారణకు జియోట్యూబ్ పద్ధతిలో రాళ్లు వేసినా కోత ఆగడం లేదు. తాజాగా తుపాన్లతో అలల ఉధృతికి కోత తీవ్రత మరింత పెరిగింది. భారీ రక్షణ గోడ ఏర్పాటు చేస్తే తప్ప ఇక్కడ కోత ఆగే పరిస్థితి లేదు.

మానవ తప్పిదాలే కారణం

ప్రకృతిలో జరుగుతున్న మార్పుల కన్నా మానవ తప్పిదాల కారణంగానే సముద్రాలు గతి తప్పుతున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరిగి తుపాన్లకు దారి తీస్తున్నాయి. తీరానికి రక్షణగా ఉండే మడ అడవులు, సరుగుడు తోటలను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు, ఆక్వా చెరువులతో కూడా తీరం కోతకు గురవుతోంది. ఇటీవల కాలంలో చంద్రుడు, భూమికి మధ్య ఆకర్షణ శక్తి పెరుగుతోందని, ఫలితంగా అలల ఉధృతి పెరిగిందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు.

కాకినాడ పోర్టు వ్యవహారంపై సీఐడీ విచారణ

మంత్రులతో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ యాజమాన్య మార్పిడికి సంబంధించిన వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. మంగళవారం మంత్రివర్గ సమావేశం తర్వాత ఆయన మంత్రులతో ప్రత్యేకంగా రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టు, సెజ్‌ను గత ప్రభుత్వంలో కొన్ని కంపెనీలకు బలవంతంగా ఇప్పించారని సీఎం చెప్పినట్లు తెలిసింది. పోర్టును బలవంతంగా లాక్కుని 41 శాతం కేవీ రావుకు, 59 శాతం అరబిందో కంపెనీకి అప్పగించారని అన్నట్లు తెలిసింది. ఆస్తులను లాక్కోవడం ఎప్పుడూ చూడలేదని, వీటిపై సీఐడీ విచారణ జరిపిద్దామని చెప్పినట్లు సమాచారం. కాకినాడ పోర్టు నుంచి బియ్యం రవాణా అంశంపైనా చర్చించారు. ఎప్పటి మాదిరిగానే మంత్రుల పనితీరును ప్రస్తావించి కొందరు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించినట్లు తెలిసింది.

భద్రత చర్యల్లో డ్రోన్లను వినియోగించాలి

భద్రత చర్యలు, నేరాల నియంత్రణలో డ్రోన్లను వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ రూపొందించిన మల్టీ పర్పస్ డ్రోన్ల డెమోని మంగళవారం ఆయన సచివాలయంలో వీక్షించారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వాహనాల సంఖ్య, తక్షణం చేపట్టాల్సిన చర్యలపై డ్రోన్లు రియల్ టైమ్‌లో అంచనా వేస్తాయని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యత

'వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్'లో స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యత నిచ్చేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సెర్ప్, మెప్మా అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఏడాదికి రూ.లక్ష కన్నా తక్కువ ఆదాయం వచ్చే గ్రూపును 'నాన్ లాక్‌పతి'గా, రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు 'లాక్‌పతి', రూ.10 లక్షలపైన సంపాదిస్తే 'మైక్రో', రూ.50 లక్షలకన్నా అధికంగా ఆదాయం వస్తే 'స్మాల్', రూ.కోటి కన్నా ఎక్కువ ఆర్జిస్తే 'మీడియం' కేటగిరీలుగా విభజించాలని ఆయన సూచించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 03 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 58,607 మంది స్వామివారిని దర్శించుకోగా 19,841 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.61 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి పాదాలు ఊరేగింపు

చంద్రగిరి: గరుడోత్సవం పురస్కరించుకుని శ్రీవారి పాదాలను మంగళవారం తిరువీధుల్లో వేడుకగా ఊరేగించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు రాత్రి అమ్మవారికి గరుడసేవ నిర్వహిస్తారు. శ్రీవారి వాహనమైన గరుడపై ఊరేగే అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా సర్వభూపాల వాహనసేవ అనంతరం శ్రీవారి పాదాలను గ్రామ ముఖద్వారంలోని పసుపు మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ శ్రీవారి పాదాలను బంగారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి గరుడవాహన సేవలో శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు శ్రీవారి పాదాలతో భక్తులను అనుగ్రహించారు. జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'యోగవాసిష్టం' బహూకరణ



తిరుపతి సిటీ : తెలుగులోకి అనువదించిన యోగవాసిష్టం గ్రంథాన్ని మంగళవారం జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తికి వ్యాసాశ్రమం ప్రతినిధులు బహూకరించారు. వారు మాట్లాడుతూ గ్రంథం అనువదించడంలో వర్సిటీ అధ్యాపకులు, వేద విద్యార్థులు సహకరించారని వెల్లడించారు. మహత్కార్యానికి మార్గనిర్దేశం చేసిన వీసీకి అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీన్ లలితారాణి, అధ్యాపకులు పీటీజీ రంగరామానుజాచార్యులు పాల్గొన్నారు.

విద్యా సమాచారం

వెయిట్ లిఫ్టింగ్ విజేత మంగుళూరు యూనివర్సిటీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్, వెస్ట్ జోన్ పురుషుల అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ మంగళవారం ముగిసింది. టీం చాంపియన్‌షిప్‌ను మంగళూరు యూనివర్సిటీ కైవసం చేసుకుంది.

ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్

సత్తెనపల్లి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కిల్ హబ్‌లో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు అర్హులైన యువత ఈనెల 5లోపు వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి తమ్మాజీరావు కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్– డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సుల్లో 3 నెలలు ట్రైనింగ్ ఉంటుందన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసించి, 16 నుంచి 40 ఏళ్లలోపు ఉన్న వారు ట్రైనింగ్‌కు అర్హులన్నారు. ట్రైనింగ్ పూర్తయ్యాక స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డిని 80743 93466 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు



నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జునరావు తెలిపారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 30, ఈనెల 1 తేదీలలో తుళ్లూరు మండలం మందడం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థులు ఎం.బిందు, జేడీ ప్రసన్నకుమార్ పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఒడిశాలో జరిగే జాతీయ పోటీలలో విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



ఎర్ర ఆకు అరటి!

ఎర్ర అరటి పండు మనకు అక్కడక్కడా కనిపిస్తుంది. అయితే, ఎర్ర ఆకులతో కూడిన అరటి చెట్టు అరుదనే చెప్పాలి. దీని ఆకు మాదిరిగానే కాయ కూడా ఎర్రగానే ఉంటుంది. కర్ణాటకలోని సిర్సికి చెందిన రైతు ప్రసాద్ కృష్ణ హెగ్డే ఈ అరుదైన అరటి వంగడాన్ని సంరక్షిస్తున్నారు. దీనితో పాటు ఆయన మరో 80 అరటి రకాలను తన పొలంలో పెంచుతూ అరటి పంటల్లో వైవిధ్యాన్ని కాపాడుతున్నారు. ప్లాస్టిక్ బనానా అనే మరో రకం కూడా ఈయన దగ్గర ఉంది. దీని ఆకులను భోజనం చేయటానికి వాడతారట.

మైసూరులో ఇటీవల 3 రోజుల పాటు సహజ సమృద్ధ, అక్షయకల్ప ఆర్గానిక్స్ ఆధ్వర్యంలో జరిగిన 'అరటి పండుగ' సందర్భంగా ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. 550 అరటి రకాలను సంరక్షిస్తున్న కేరళకు చెందిన వినోద్ నాయర్ 75 రకాల అరటి పండ్లను ఈ ఉత్సవంలో ప్రదర్శించటం మరో విశేషం. వినోద్ నాయర్‌తోపాటు 100 దేశీ అరటి రకాలను సంరక్షిస్తున్న తమిళనాడుకు చెందిన సెంథిల్ కుమార్‌ను సైతం ఘనంగా సత్కరించారు.

ఆహార నిపుణురాలు, రచయిత్రి రత్న రాజయ్య అరటి పండుగలో మాట్లాడుతూ ఏదో ఒకే రకం అరటిని సాగు చేయటం ప్రమాదకరమని, ఏదైనా మొండి తెగులు సోకిందంటే మొత్తం ఆ అరటి రకమే అంతరించిపోతుందన్నారు. భవిష్యత్తు తరాల కోసం అరటి రకాల్లో జీవవైవిధ్యాన్ని మన తరం పరిరక్షించుకోవాలని పలుపునిచ్చారు.


కొత్త పంట

ఎర్ర అరటి జగత్‌ప్రసిద్ధం

సహజ సమృద్ధ ఎన్జీవో డైరెక్టర్ జి. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 'అరటి బంగారంతో సమానం. అరటి ప్రపంచం పెద్దది. వందలాది వంగడాలున్నాయి. మానవ జీవితంలో పుట్టుక దగ్గరి నుంచి చావు వరకు అనేక సందర్భాల్లో, ఆచార వ్యవహారాల్లో అరటి పండు సాంస్కృతిక అవసరం ఉంటుంది. ప్రతి రకం రుచి, రంగు, సైజు, చెట్టు ఎత్తులో వైవిధ్యభరితంగా ఉంటాయ' న్నారు. ప్రపంచవ్యాప్తంగా వెయ్యి అరటి రకాలున్నాయి. ఆఫ్రికన్ జంజిబార్ ఫ్రాంట్ లాంగ్ బనానా, ఇండోనేషియా జావా బ్లూ బనానా, హవాయికి చెందిన తెల్ల చారల అరటితో పాటు దక్షిణాసియాకు సంబంధించి ఎర్ర అరటి రకాలు జగత్‌ప్రసిద్ధి గాంచాయన్నారు.

అరటికి భారతదేశం పుట్టిల్లు. ఇక్కడ ఎన్నో వందల రకాల అరటి వంగడాలు కనిపిస్తాయి. భింకెల్ అనే రకం అరటి చెట్టు ఎత్తయిన దూలం మాదిరిగా ఉంటుంది. కేరళకు చెందిన పొడవాటి రకం అరటి గెలకు వెయ్యి కాయలుంటాయి. ప్రపంచంలోకెల్లా ఇదే అతి పొడవైన అరటి రకం. కొడి గుడ్డు అంత చిన్న అరటి కాయ రకం కూడా ఉంది అన్నారు కృష్ణప్రసాద్. కర్ణాటకకు ప్రత్యేకమైన అరటి రకాలు ఉన్నాయన్నారు. వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న కావెండిష్ బ్రీడ్ల అరటి పంటలను సాగు చేయటం ప్రారంభమైన తర్వాత దేశీ వంగడాలు మరుగున పడిపోయాయంటున్నారు కృష్ణప్రసాద్. ఒకే రకం అరటి సాగు చేస్తే పనామా కుళ్లు తెగులు సోకే ముప్పు ఉందని చెబుతూ, ఈ తెగులు సోకిందంటే పంటంతా తుడిచిపెట్టుకుపోవటం ఖాయమన్నారు.


మైసూర్ అరటి ఫెస్టివల్‌లో సత్కారం అందుకుంటున్న ప్రసాద్ కృష్ణ హెగ్డే




అత్యంత పొడవైన అరటి గెల

కార్డమమ్, నెంద్ర ఆర్గానిక్ సాగుకు అనుకూలం

సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన అరటి పండ్లకు ఈ రోజుల్లో అధిక డిమాండ్ ఉందన్నారు కృష్ణప్రసాద్. సేంద్రియంగా సాగు చేయటం వల్ల భూమి కరువు బారిన పడకుండా ఉంటుంది. రసాయనాలకు ఖర్చుపెట్టే డబ్బు ఆదా అవుతుంది అన్నారాయన. కార్డమమ్, నేంద్ర అరటి రకాలు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయటానికి అనువైనవే కాక, మార్కెట్ డిమాండ్ రీత్యా కూడా ఇవి మేలైనవని దేశీ విత్తన నిపుణుడు కూడా అయిన కృష్ణప్రసాద్ వివరించారు. అరటి సాళ్ల మధ్యన ముల్లంగి, ఆకు కూరలు, గుమ్మడి, బీన్స్, పసుపు, చిలగడదుంప పంటలను సాగు చేసుకోవచ్చని కృష్ణప్రసాద్ వివరించారు.

ఇతర వివరాలకు.. 94821 15495.


ప్రసాద్ కృష్ణ హెగ్డే

వెదురు బుట్టల్లో ఇంపైన ఇంటిపంటలు

సేంద్రియ ఇంటిపంటలను సాగు చేయడానికి అనువైనవి వెదురు బుట్టలు. ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవడంతో పాటు, మొక్కలకు ఎండ తాకిడి అంతగా లేకుండా చూడడానికి వెదురు బుట్టలు ఉపయోగపడతాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత నగరంలో అపార్ట్‌మెంట్లపైన ఇలా వెదురు బుట్టల్లో సేంద్రియ ఇంటిపంటలు సాగవుతున్నాయి. న్యూటౌన్ కోల్‌కత డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్.కె.డి.ఎ.) అపార్ట్‌మెంట్లపై ఇంటిపంటల సాగును ప్రోత్సహిస్తుండడం విశేషం.





బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ల టెర్రస్‌పైన సౌర విద్యుత్తు కోసం అమర్చిన సౌర పలకల కింద.. వెదురు బుట్టల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. విశాలమైన అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైన 5 వేల చదరపు అడుగుల ఖాళీలో ఎన్.కె.డి.ఎ. తోడ్పాటుతో 690 వెదురు బుట్టలతో ఇంటిపంటల గార్డెన్ ఏర్పాటైంది. నిపుణుల పర్యవేక్షణలో ఏపుగా పెరుగుతోంది. బరువును తగ్గించడానికి మట్టికి బదులుగా కొబ్బరి పొట్టు, వర్మీ కంపోస్టు మిశ్రమాన్ని వెదురు బుట్టల్లో వాడుతున్నారు. తిరిగి వాడుకోదగిన స్థానిక వంగడాలనే సాగు చేస్తూ.. చక్కని దిగుబడులు తీస్తున్నారు. తూర్పు భారత దేశంలో మట్టి వాడకుండా సాగవుతున్న అతిపెద్ద టెర్రస్ కిచెన్ గార్డెన్ ఇదేనట!


ఇంటి పంట

వెదురు బుట్టల్లో పారదర్శకంగా ఉండే పల్చటి 'సెల్లోఫేన్' పేపర్‌ను వేసి.. దానిపైన కొబ్బరిపొట్టు, వర్మీకంపోస్టు మిశ్రమం పోసి మొక్కలు పెంచుతున్నారు. 'సెల్లోఫేన్' ప్రమాదం కాని ప్లాస్టిక్ వంటిది. దీన్ని ఆహారోత్పత్తుల ప్యాకింగ్‌లో ఉపయోగిస్తుంటారు. త్వరగా మట్టిలో కలిసిపోయే స్వభావం కలిగినది కావడంతో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇది వాడుకలోకి వచ్చింది.

క్లైమెట్ మర్మాలు

మిటిగేషన్

వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రతికూల పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేందుకు తీసుకునే చర్యలనే 'మిటిగేషన్' అంటారు. భూగోళాన్ని అమితంగా వేడెక్కించే కర్బన ఉద్గారాలను తగ్గించడానికి లేదా నిరోధించడానికి లేదా వాతావరణం నుంచి హరితగృహ వాయువులను తొలగించే 'కార్బన్ సింక్'లను మెరుగుపరచడానికి ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు లేదా వ్యక్తులు తీసుకునే ఉపశమన చర్యలు ఇవి.

హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడం లేదా నిరోధించడానికి అనేక ఉపశమన చర్యలు దోహదం చేస్తాయి. బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను మండించటం ద్వారా కర్బన ఉద్గారాలు అధికమొత్తంలో విడుదలై భూతాపోన్నతికి కారణమవుతున్నాయి. ఈ ఉద్గారాలను తగ్గించేందుకు గాలి మరల విద్యుత్తు, సౌర విద్యుత్తు వంటి పునరుత్పాదక ఇంధన వనరులకు మారాలి. ఇంధనాన్ని మరింత సమర్థవంతంగా ఉపయోగించడం నేర్చుకోవాలి. కర్బన ఉద్గారాలు తక్కువగా వెలువడే లేదా కాలుష్యానికి కారణం కాని రవాణా పద్ధతులను అవలంబించాలి. రసాయనాల్లేకుండా సుస్థిర వ్యవసాయ, భూ వినియోగ పద్ధతులకు మళ్లేలా ప్రోత్సహించాలి. ఉత్పత్తి, వినియోగ నమూనాలను, ఆహారపు అలవాట్లను పర్యావరణహితంగా మార్చడం ద్వారా వాతావరణ మార్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. అడవులు, చిత్తడి నేలలను పునరుద్ధరించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూమి పైన పర్యావరణ వ్యవస్థలను, సముద్ర పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం వంటి ఉపశమన చర్యల ద్వారా కర్బన ఉద్గారాల వత్తిడిని భూవాతావరణంలో తగ్గించవచ్చు. ఉపశమన చర్యలు విజయవంతం కావాలంటే, చట్టాలు, విధానాలు, పెట్టుబడుల ద్వారా ప్రపంచ దేశాలు అందుకు దోహదపడే సానుకూల వాతావరణాన్ని పెంపొందించడం చాలా కీలకం.



మీకు తెలుసా? :

భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్షియస్‌కు పరిమితం చేయాలన్నది లక్ష్యం. హరితగృహ వాయు ఉద్గారాలను 2030కి ముందే 45 శాతం తగ్గించి, శతాబ్దపు మధ్య (2050) నాటికి వంద శాతం తగ్గించడానికి (నికర-సున్నాకి చేరుకోవడానికి) వాతావరణ మార్పులను తగ్గించే ఉపశమన చర్యలను అమలు చేయాలి.

తాటి తేగలతోనూ వంటకాలు!



తాటి పండు నుంచి లభించే ఉత్పత్తుల్లో తేగలు ముఖ్యమైనవి. పలు పోషకాలు, ఔషధ గుణాలు కలిగి ఉన్న తేగలతో రకరకాల వంటకాలు చేసుకోవచ్చు. తేగల పిండి తయారీని కుటీర పరిశ్రమగా చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని పందిరిమామిడి (తూ. గో. జిల్లా) ఉద్యానపరిశోధనా కేంద్రం అధిపతి, ఆహార-సాంకేతిక విజ్ఞాన సీనియర్ శాస్త్రవేత్త డా. పి సి వెంగయ్య (94931 28932) అంటున్నారు.



తాటి టెంక నుంచి 21-30 రోజుల్లో మొలక వస్తుంది. ఈ మొలక భూమిలోకి దాదాపు 45-60 సెం.మీ. పోతుంది. మొలక వచ్చినప్పటి నుంచి నాలుగు నెలలకు ఏర్పడే దానిని తేగ అంటారు. తేగ పెరిగే కొద్ది కొబ్బరిలా గట్టిగా ఉండే పదార్థం కరిగిపోతుంది. ఇది దాదాపు 6-12 నెలలు అంటే తేగ నుంచి మొక్క వచ్చే వరకు ఆహారంగా ఉపయోగపడుతుంది. టెంకలను నీడలో పాతర పెడితే తేగలు ఇంకా బాగా పెరుగుతాయి. విత్తనం నుంచి మొక్క రావటం అనేది 50 శాతం వరకు ఉంటుంది.

గుజ్జు తీసిన టెంకలు తొందరగా మొలక వచ్చి బాగా పెరుగుతాయి. పెద్ద టెంకల నుంచి మందం గల తేగలు చిన్న టెంకల నుంచి సన్న తేగలు వస్తాయి. పొడవులో మాత్రం వ్యత్యాసం ఉండదు. తేగల ఉత్పత్తిలో ఎరువులు వాడాల్సిన అవసరం లేదు.

తేగల పిండి తయారీ ఇలా...

తాజా తేగలను శుభ్రపరచి ఒక అరగంట పాటు ఉడికించి అమ్మవచ్చు. వీటిలో పలు ఔషద గుణాలు ఉన్నాయి. తేగలను వివిధ రూపాల్లోకి మార్చి సంవత్సరమంతా వాడవచ్చు. దీనికోసం తేగలను ఎండబెట్టి ముక్కలుగా నిల్వ ఉంచాలి. ఎప్పుడు అవసరమైతే అప్పుడు పిండిగా మార్చుకోవచ్చు. పచ్చి తేగలను లేదా ఉడికించిన తేగలను రెండుగా విడదీసి ఆరబెట్ట వచ్చు. చిన్న చిన్న ముక్కలుగా చేసి ఆరబెట్టటం మరో పద్ధతి. వీటిలో ఏదో ఒక విధానంలో తేగలను పిండిగా మార్చవచ్చు. తేగను పిండి రూపంలోకి మార్చి 250 మైక్రాన్ల జల్లెడ ద్వారా జల్లిస్తారు.

పచ్చి పిండిని వాడేటప్పుడు ఒకట్రెండు గంటలు నీటిలో నానబెడితే చేదు పోతుంది. పిండి నుంచి నీటిని తొలగించేందుకు వడపోయాలి. లేదా వేడి చేయాలి.

తేగల పిండితో పలు వంటకాల తయారీ

పిండిని ఉడికించడం ద్వారా వివిధ రకాల ఆహార పదార్థాలు చేయవచ్చు. ఉడికించిన పిండిలో బెల్లం, కొబ్బరి పొడి కలిపి తినవచ్చు. ఈ పిండిలో కొబ్బరిపొడి కలిపి ఆవిరితో ఉడికిస్తే మంచి రుచికరమైన వంటకం తయారవుతుంది. మినపప్పుతో కలిపి ఇడ్లీ, దోశ తయారు చేయవచ్చు. బ్రెడ్, గోధుమ పిండితో కలిపి నూడిల్స్ తయారు చేయవచ్చు. వరి, గోధుమ పిండితో తయారు చేసే అన్ని వంటకాల్లోను దీన్ని వాడవచ్చు.





తాజా తేగ 46 గ్రా. బరువుంటుంది. ఉడికించి ఆరబెట్టినది 16. గ్రా., పచ్చిది ఆరబెట్టినది 18గ్రా. బరువుంటుంది. సమారు 60 శాతం పిండి పదార్థం ఉంటుంది. తేగల్లో ముఖ్యమైనది పిండి పదార్థం. ఇది తేగ మొదటి భాగంలో ఎక్కువగా ఉంటుది. పోనుపోను తగ్గుతూ ఉంటుంది. తాజా తేగలో సుమారు 55 శాతం తేమ ఉంటుంది. ప్రోటీన్లు 5 శాతం, కొవ్వు పదార్థాలు 0.5 శాతం ఉంటాయి.



తేగల పిండిలో పోషక పదార్థాలు


	ఉడికించిన పిండి	పచ్చి పిండి
తేమ	0	0
ప్రోటీన్లు	4.5	4.0
పిండి పదార్థాలు	93.6	94.1
కొవ్వు	0.5	0.5
బూడిద	1.4	1.4

ఏక పంటల పొగలో
ఢిల్లీ ఉక్కిరి బిక్కిరి

దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వాయుకాలుష్యం 'మరింత ప్రమాదకర' పరిస్థితికి చేరింది. గాలిలో 2.5 పి.ఎం. (పార్టిక్యులేట్ మేటర్) ధూళి కణాలు ఎక్కువయ్యే కొద్దీ మానవ జీవనం దుర్భరంగా మారిపోతూ ఉంటుంది. ఈ ఇండెక్స్ 0-50 మధ్య ఉంటే మంచిది. 100 వరకు పర్వాలేదు. 200 వరకు పెరిగితే గాలి నాణ్యత ఒక మాదిరిగా ఉన్నట్లు. మార్చి - సెప్టెంబర్ మధ్యలో ఈ స్థాయిలో ఉంటుంది. అక్కడి నుంచే ప్రతి ఏటా ధూళి కణాల సాంద్రత వేగంగా పెరుగుతుంటుంది. 201-300కు పెరిగితే తీవ్రంగా ఉన్నట్లు. 400 వరకు వెళ్తే ఘోరం. 401-500కి చేరిందంటే అత్యంత ప్రమాకర స్థాయిగా చెబుతారు. 2024లో నవంబర్ 19న 494కు పెరిగింది. అన్ని వయసుల వారి ఆరోగ్యానికి హానికరంగా గాలి కాలుష్యం మారింది. **ఇందుకు ముఖ్య కారణాలు:** వాహన, పారిశ్రామిక కాలుష్యంతో పాటు వరి పొలాల్లో మోళ్లు, గడ్డిని తగులబెట్టటం. వరి కోతలయ్యాక నిప్పంటించి, ఆ వెంటనే గోధుమ విత్తుకోవటం ఢిల్లీ పరిసర రాష్ట్రాల రైతులకు అలవాటు. ఈ రెండు పంటలనే కనీస మద్దతు ధరకు ప్రభుత్వం సేకరిస్తున్నందు వల్ల ఈ విషవలయంలో రైతులు చిక్కుకుపోయారు.

'హరిత విప్లవం' మన పొలాల్లోకి వచ్చి ఇప్పటికి సరిగ్గా 65 ఏళ్లు. అప్పటి నుంచి పంట భూములను డొల్ల చేస్తున్న పర్యావరణ సంక్షోభమే ఇవాళ అతి సూక్ష్మ ధూళికణాల మహా పడగై రాజధానిని చుట్టుముట్టింది. దేశ రాజధానివాసులను మునుపెన్నడూ ఎరుగనంతగా ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది.

'హరిత విప్లవం' వెంట తెచ్చిన ఏక పంటల (మోనోకల్చర్) దుష్ట సంస్కృతి వల్ల దాపురించడమే ఈ దుస్థితికి మూలకారణం. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల పొలాల్లో ఖరీఫ్‌లో వరి, రబీలో గోధుమ పంటల సాగు పద్ధతి రైతుల మనసుల్లో లోతుగా నాటుకుపోయింది. ఈ రెండు పంట దిగుబడులను మద్దతు ధరకు ప్రభుత్వం సేకరించడం వల్ల.. పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఇతర పంటల వైపు రైతులు కన్నెత్తి చూడటం లేదు.



పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని సారవంతమైన నేలల్లో రైతులు కేవలం వరి, గోధుమ పంటలనే ఏక పంటలుగా సాగు చేస్తున్నారు. యంత్రాలతో వరి కోతలైన కొద్ది రోజుల్లోనే గోధుమ విత్తుకోవాలంటే.. పొలాల్లో మిగిలిన మోకాలెత్తు వరి మోళ్లను తగుల బెట్టడానికి మించి మరొక సులువైన మార్గం రైతులకు తోచడం లేదు. పశువులకు వరి గడ్డి కన్నా గోధుమ గడ్డి మేపడమే మేలన్న భావన అక్కడి రైతుల్లో ఉంది. అందుకే వరిగడ్డికి డిమాండ్ లేదు. ప్రభుత్వం నిషేధించినప్పటికీ వరి మోళ్లకు రైతులు నిస్సంకోచంగా నిప్పంటిస్తూనే ఉన్నారు. భూమిలో అనేక అంగుళాల లోతు వరకూ సూక్ష్మజీవరాశి మాడిపోయి పొలం నిర్జీవంగా, నిస్సారంగా మారిపోతున్నా.. ఏటేటా రసాయనిక ఎరువుల మోతాదు పెంచుతున్నారే తప్ప.. ఏక పంటల సాగు విషవలయాన్ని రైతులు ఛేదించలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అగ్గి మీద గుగ్గిలంగా మండిపోతున్న లక్షలాది హెక్టార్ల పంట భూముల పొగ.. ఢిల్లీ నగరాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

పరస్పరాధారితమైన జీవవైవిధ్యమే ప్రకృతి మనుగడకు మూల సూత్రం. ఏక పంటల రసాయనిక వ్యవసాయ నమూనా ఫలితం నేలతల్లి పొదుగు కోసి పాలుతాగడం తప్ప మరొకటి కాదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ విషవలయంలో చిక్కుకున్న అన్నదాతల ఆక్రందనలు, ఆత్మబలిదానాలు పాలకులను కదిలించలేకపోతున్నాయి. కానీ, వరి పొలాల పొగ.. ఢిల్లీ పాలకులకు, ప్రజానీకానికి పంట భూముల్లో రగులుతున్న సంక్షోభాన్ని రుచి చూపిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. పొలాల్లో పంటల జీవవైవిధ్యాన్ని, నేలతల్లి కడుపులో సూక్ష్మజీవరాశి వైవిధ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటేనే.. గ్రామీణులకైనా, దేశ రాజధానివాసులకైనా మనుగడ సాగుతుందని ఇప్పటికైనా గ్రహించడం మేలు. వాయుకాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిన నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి ఇటు నగర వాసులు, అటు రైతులందరూ సమష్టిగా కృషి చేయాలి. పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడటంతో పాటు వాహన, పారిశ్రామిక, నిర్మాణ రంగాల కాలుష్యాన్ని కూడా భారీగా తగ్గించుకునే మార్గాలు అత్యవసరంగా వెతకాలి.

కేంద్ర మంత్రివర్గం గత సోమవారం నేషనల్ మిషన్ ఫర్ నాచురల్ ఫార్మింగ్‌ను రూ. 2,481 కోట్ల బడ్జెట్‌తో ఆమోదించింది. ఇది మంచి ప్రారంభం. 60 ఏళ్ల క్రితం హరిత విప్లవం ప్రారంభంలో మాదిరిగానే పంజాబ్, హర్యానాలలో అధిక దృష్టిని కేంద్రీకరించి ఇప్పుడు ప్రకృతి సేద్యాన్ని, బహుళ పంటల సాగు పద్ధతులను దీక్షగా ప్రోత్సహించాలి. ఈ పరివర్తన మట్టితోపాటు గాలిని, మనుషులను ఆరోగ్యవంతులుగా మారుస్తుంది.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

బిజినెస్ రీల్

స్విగ్గీ నష్టాలు తగ్గాయ్

క్యూ2లో రూ. 626 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది(2024-25) రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో ఫుడ్, గ్రోసరీ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నష్టాలు స్వల్పంగా తగ్గాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 626 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది(2023-24) ఇదేకాలంలో రూ. 657 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 2,763 కోట్ల నుంచి రూ. 3,601 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,507 కోట్ల నుంచి రూ. 4,310 కోట్లకు పెరిగాయి. కంపెనీ ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావడంతో తొలిసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కాగా.. సొంత అనుబంధ సంస్థ స్కూట్సీ లాజిస్టిక్స్ ప్రయివేట్‌లో రైట్స్ ద్వారా ఒకేసారి లేదా దశలవారీగా రూ. 1,600 కోట్లకు మించకుండా ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు తాజాగా అనుమతించినట్లు స్విగ్గీ వెల్లడించింది. స్కూట్సీ ప్రస్తుతం సప్లైచైన్ సర్వీసులు, పంపిణీ బిజినెస్ నిర్వహిస్తోంది.

ఎన్ఎస్ఈలో స్విగ్గీ షేరు 0.6 శాతం నీరసించి రూ. 491 వద్ద ముగిసింది.

లావాదేవీల్లేని ఖాతాల పునరుద్ధరణ

దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ కార్యక్రమం



న్యూఢిల్లీ: ఎలాంటి లావాదేవీలు లేకుండా ఇనాపరేటివ్‌గా మారిన ఖాతాలను పునరుద్ధరించేందుకు ఎస్‌బీఐ దేశవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. వరుసగా రెండేళ్ల పాటు ఎలాంటి లావాదేవీ లేని సేవింగ్స్, కరెంట్ ఖాతాలను ఇనాపరేటివ్‌గా (నిర్వహణలో లేని) బ్యాంకులు పరిగణిస్తుంటాయి. ఈ ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలంటే తాజా కేవైసీ పూర్తి చేయాలి. లావాదేవీల నిర్వహణతో ఖాతాలు ఇనాపరేటివ్‌గా మారకుండా చూసుకోవచ్చన్నది ఈ కార్యక్రమం ద్వారా తాము ఇచ్చే కీలక సందేశమని ఎస్‌బీఐ తెలిపింది. జన్‌ధన్ ఖాతాలను యాక్టివ్‌గా ఉంచడం, కస్టమర్లు నిరంతరం లావాదేవీలు నిర్వహించేలా చూసేందుకు మళ్లీ కేవైసీ చేయాల్సిన అవసరాన్ని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ప్రస్తావించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-12-2024

విశాఖ	610-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,287.00	5.86
NTPC	367.7	2.65
ADANIENT	2,511.00	2.2
AXISBANK	1,161.00	2.1
SBIN	853.5	2.04

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,618.90	-1.5
HEROMOTOCO	4,696.00	-1.1
ITC	472.55	-0.97
HDFCLIFE	635	-0.81
SUNPHARMA	1,801.55	-0.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,174
ఎన్ఎస్ఈ	1,15,560
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,64,695
ఎఫ్ఐఐ	+ 3,665
డీఐఐ	- 251

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.00	$ 68.01
బ్రెంట్	72.76	$ 71.83

సైబర్ దాడులకు టాప్ టార్గెట్‌గా భారత్

- మొబైల్ మాల్‌వేర్ అటాక్స్‌లో మొదటి స్థానం
- అమెరికా, కెనడాలను కూడా దాటేసి ముందుకు
- జీస్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ మాల్‌వేర్ దాడులకు గురవుతున్న దేశాల్లో భారత్ మొదటి స్థానంలో ఉంది. ఈ విషయంలో అమెరికా, కెనడాలను కూడా దాటేసింది. జీస్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ రూపొందించిన 'మొబైల్, ఐవోటీ, ఓటీ థ్రెట్' నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 2023 జూన్ నుంచి 2024 మే వరకు 2000 కోట్ల పైచిలుకు మాల్వేర్ ముప్పు సంబంధిత మొబైల్ లావాదేవీలు, ఇతరత్రా సైబర్ ముప్పుల గణాంకాలను విశ్లేషించిన మీదట ఈ రిపోర్ట్ రూపొందింది. 'అంతర్జాతీయంగా మొబైల్ మాల్‌వేర్ దాడుల విషయంలో భారత్ టాప్ టార్గెట్‌గా మారింది. గతేడాది మూడో స్థానంలో ఉన్న భారత్ ఈసారి మొదటి స్థానానికి చేరింది. ఇలాంటి మొత్తం అటాక్స్‌లో 28 శాతం దాడులు భారత్ లక్ష్యంగా జరిగాయి. అమెరికా (27.3 శాతం), కెనడా (15.9 శాతం) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. డిజిటల్ పరివర్తన వేగవంతమవుతుండటం, సైబర్ ముప్పులు పెరుగుతుండటం వంటి పరిస్థితుల నేపథ్యంలో భారత సంస్థలు మరింత పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఇది తెలియజేస్తోంది' అని నివేదిక వివరించింది. గూగుల్ ప్లే స్టోర్‌లో 200 పైచిలుకు హానికారక యాప్స్‌ను గుర్తించినట్లు, ఐవోటీ మాల్‌వేర్ లావాదేవీలు వార్షికంగా 45 శాతం పెరిగినట్లు తెలిపింది. ఇది సైబర్ దాడుల ముప్పు తీవ్రతను తెలియజేస్తుందని వివరించింది. అత్యధికంగా సైబర్ దాడులకు గురవుతున్నప్పటికీ.. మాల్‌వేర్ ఆరిజిన్ పాయింట్ (ప్రారంభ స్థానం) విషయంలో మాత్రం భారత్ తన ర్యాంకును మెరుగుపర్చుకుంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అయిదో స్థానం నుంచి ఏడో స్థానానికి చేరింది.

రిపోర్టులోని మరిన్ని విశేషాలు..

- మొబైల్ అటాక్స్‌లో సగభాగం ట్రోజన్ల రూపంలో (హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రన్ చేసేలా ప్రేరేపించే మోసపూరిత మాల్‌వేర్) ఉంటున్నాయి. ఆర్థిక రంగంలో ఇలాంటి ఉదంతాలు జరుగుతున్నాయి. బ్యాంకింగ్ మాల్‌వేర్ దాడులు 29% పెరగ్గా, మొబైల్ స్పైవేర్ దాడులు ఏకంగా 111% ఎగిశాయి.
- ఆర్థికంగా మోసగించే లక్ష్యంతో చేసే మాల్‌వేర్ దాడులు, మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌లాంటి (ఎంఎఫ్ఏ) వివిధ అంచెల భద్రతా వలయాలను కూడా ఛేదించే విధంగా ఉంటున్నాయి. వివిధ ఆర్థిక సంస్థలు, సోషల్ మీడియా సైట్లు, క్రిప్టో వాలెట్లకు సంబంధించి ఫేక్ లాగిన్ పేజీలను సృష్టించి సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ దాడులకు పాల్పడుతున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు వంటి దిగ్గజ భారతీయ బ్యాంకుల మొబైల్ కస్టమర్లను ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నారు. అచ్చం సిసలైన బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలి ఉండే ఫేక్ సైట్లలో.. బ్యాంకుల కస్టమర్ల కీలక వివరాలను పొందుపర్చేలా అత్యవసర పరిస్థితిని సృష్టిస్తూ, మోసగిస్తున్నారు. గతంలోనూ నకిలీ కార్డ్ అప్‌డేట్ సైట్ల ద్వారా ఆండ్రాయిడ్ ఆధారిత ఫిషింగ్ మాల్‌వేర్‌ను జొప్పించేందుకు ఇలాంటి మోసాలే జరిగాయి.
- పోస్టల్ సర్వీసులను కూడా సైబర్ మోసగాళ్లు విడిచిపెట్టడం లేదు. యూజర్‌కు రావాల్సిన ప్యాకేజీ మిస్సయ్యిందనో లేక డెలివరీ అడ్రెస్ సరిగ్గా లేదనో ఎస్ఎంఎస్‌లు పంపడం ద్వారా వారిని కంగారుపెట్టి, తక్షణం స్పందించాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నారు. ఫేక్ సైట్ల లింకులను ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించి మోసాలకు పాల్పడుతున్నారు.
- అంతగా రక్షణ లేని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆపరేషనల్ టెక్నాలజీ (ఐవోటీ/ఓటీ) మొదలైనవి సైబర్ నేరగాళ్లకు ప్రధాన టార్గెట్‌గా ఉంటున్నాయి. కాబట్టి భారతీయ సంస్థలు సురక్షితంగా కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు సెక్యూరిటీ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మూడు ఐఐటీలతో హ్యుందాయ్ ఒప్పందం



న్యూఢిల్లీ: బ్యాటరీలు, విద్యుదీకరణ రంగాలలో సహకార పరిశోధనా వ్యవస్థను నెలకొల్పేందుకు మూడు ఐఐటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు హ్యుండై మోటార్ గ్రూప్ మంగళవారం తెలిపింది. ఇందుకోసం ఐదేళ్లలో 7 మిలియన్ డాలర్ల పెట్టుబడి చేయనున్నట్టు వెల్లడించింది. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ వీటిలో ఉన్నాయి. సహకారంలో భాగంగా హ్యుండై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ ఢిల్లీలో ఏర్పాటు చేస్తామని, హ్యుండై మోటార్ గ్రూప్ నుండి స్పాన్సర్‌షిప్‌ల ద్వారా నిర్వహిస్తామని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. బ్యాటరీలు, విద్యుదీకరణలో పురోగతిని నడిపించడం హ్యుండై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాథమిక లక్ష్యం. ప్రధానంగా భారతీయ మార్కెట్ యొక్క విభిన్న అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్ భారత విద్యా వ్యవస్థ నుండి ప్రతిభావంతులైన వ్యక్తులతో బలమైన నెట్‌వర్క్‌ను పెంపొందించగలదని నమ్ముతున్నామని, ఆవిష్కరణలు, భవిష్యత్తు వృద్ధిని ప్రోత్సహిస్తుందని హ్యుండై మోటార్ గ్రూప్ రిసర్చ్, డెవలప్‌మెంట్, ప్లానింగ్, కోఆర్డినేషన్ సెంటర్ హెడ్ నక్సప్ సంగ్ వివరించారు. హ్యుండై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అకడమిక్-పారిశ్రామిక సహకార ప్రాజెక్టులపై సంయుక్త పరిశోధనలను నిర్వహించడమే కాకుండా.. కొరియా, భారత్‌కు చెందిన బ్యాటరీ, విద్యుద్దీకరణ నిపుణుల మధ్య సాంకేతిక, మానవ వనరుల మార్పిడిని సులభతరం చేస్తుందని సంస్థ తెలిపింది.

ఆర్థికాభివృద్ధిలో క్రీడారంగాన్ని భాగస్వామిని చేయాలి

- స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా, ఈవెంట్లలోకి పెట్టుబడులు రావాలి
- వాటికి ప్రోత్సహించేలా ప్రభుత్వం విధానాలు రూపొందించాలి
- ఫిక్కీ నివేదిక

న్యూఢిల్లీ: ఆర్థికాభివృద్ధిలో క్రీడారంగాన్ని కూడా భాగస్వామిని చేసేలా ప్రభుత్వం నిర్దిష్ట మోడల్‌ను రూపొందించాలని ఓ నివేదిక సూచించింది. క్రీడల మౌలిక సదుపాయాలు, ఈవెంట్లు, సంబంధిత ఉత్పత్తులు.. సర్వీసుల్లో మరిన్ని పెట్టుబడులను ప్రోత్సహించేలా విధానాలను తయారు చేయాలని పేర్కొంది. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ, నాంగియా నెక్స్ కలిసి ఈ నివేదికను రూపొందించాయి. దీని ప్రకారం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ప్రతిభావంతులైన క్రీడాకారులకు తోడ్పాటు లభించేలా, భారీ స్థాయి క్రీడా కార్యక్రమాలకు నిధులు సమకూర్చే ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం తగు ప్రోత్సాహకాలు ఇవ్వొచ్చని నివేదిక తెలిపింది. ఇంటర్నేషనల్ కోచ్‌లు, న్యూట్రిషనిస్టులు, మానసిక..శారీర శిక్షణ నిపుణులతో సహా అత్యుత్తమ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడొచ్చని పేర్కొంది. నివేదిక ప్రకారం భారత క్రీడారంగం ప్రస్తుతం గణనీయమైన వృద్ధిని సాధించే దశలో ఉంది. 2020లో దాదాపు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ రంగం 2027 నాటికి 100 డాలర్లకు చేరుకోవచ్చనే అంచనాలు ఉన్నాయి.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- స్పోర్ట్స్ కోచింగ్, మేనేజ్‌మెంట్ అంశాల్లో నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు నిర్వహించడం, విధానాలను రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అలాగే, ద్వితీయ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల ద్వారా ఉపాధికి ఊతమిచ్చేలా క్రీడలకు సంబంధించిన అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటునివ్వాలి.
- క్రీడారంగం గణనీయంగా పురోగతి సాధించినప్పటికీ, అథ్లెట్లకు ఆర్థిక అభద్రత, మౌలిక సదుపాయాల కొరత వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆర్థిక సహాయాన్నందించే కార్యక్రమాలను విస్తరించడం, కెరియర్‌పరంగా పరివర్తనకు దోహదపడే పటిష్టమైన విధానాలను రూపొందించడం, సమ్మిళిత సంస్కృతిని పెంపొందించడం మొదలైన చర్యలు ఈ సవాళ్లను పరిష్కరించడంలో ఉపయోగపడగలవు.
- అంతర్జాతీయ కాంపిటీషన్లు, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, నిర్వహించేందుకు ప్రభుత్వం క్రియాశీలకమైన చర్యలు తీసుకోవాలి.
- దేశీయంగా వివిధ రాష్ట్రాలకు ప్రత్యేకమైన క్రీడలను మరింతగా వెలుగులోకి తెచ్చేందుకు స్పోర్ట్స్ టూరిజంను ప్రోత్సహించవచ్చు.
- స్పోర్ట్స్ లీగ్‌లు, సాంకేతిక పురోగతి, వైవిధ్యమైన క్రీడలు మొదలైనవి ఈ రంగం వృద్ధికి తోడ్పడుతున్నాయి. స్పోర్ట్స్ గూడ్స్, దుస్తులు, మీడియా హక్కులు కూడా ఇందుకు దోహదపడుతున్నాయి. స్పోర్ట్స్ మీడియా మార్కెట్ 2020లో 1 బిలియన్ డాలర్లుగా ఉండగా 2027 నాటికి 13.4 బిలియన్ డాలర్లకు చేరవచ్చనే అంచనాలు ఉన్నాయి.
- 2023 ఆసియన్ గేమ్స్, 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు, మనకు అంతర్జాతీయంగా పోటీపడే సత్తా పెరుగుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తాయి.



దేశీయ విమాన ప్రయాణికుల్లో 10 శాతం వృద్ధి

- 2024-25లో 17 కోట్ల మంది ప్రయాణం
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదిక అంచనా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 16.4-17 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2023-24తో పోలిస్తే ప్రయాణికుల సంఖ్య 7-10 శాతం పెరిగే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదిక తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో దేశీయంగా 7.93 కోట్ల మంది విమానాల్లో రాకపోకలు సాగించారు. 2023-24 ఏప్రిల్-సెప్టెంబర్‌తో పోలిస్తే 5.3 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. తీవ్రమైన వేడి గాలులు, ఇతర వాతావరణ సంబంధిత అంతరాయాలతో 2024 ఏప్రిల్-సెప్టెంబర్ కాలం పాక్షికంగా ప్రభావితమైంది. భారతీయ విమానయాన సంస్థలకు అంతర్జాతీయ ప్రయాణికుల ట్రాఫిక్ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 16.2 శాతంగా ఉందని ఇక్రా వివరించింది.

ద్వితీయార్థం పుంజుకోవచ్చు..

గతేడాదితో పోలిస్తే 2024 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య అందుబాటులో ఉన్న సీటు విషయంలో ఆదాయం-వ్యయాల మధ్య అంతరం తగ్గింది. అంటే విమానయాన సంస్థల ఆదాయాలు క్షీణించాయి. విమానాలు నిలిచిపోవడం, అధిక ఇంధన ధరలు ఇందుకు కారణం. ప్యాసింజర్లను పెంచుకునే చర్యలతో కంపెనీల దిగుబడి తగ్గింది. ఏది ఏమైనప్పటికీ ఆరోగ్యకర ప్రయాణికుల రద్దీ మధ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం పుంజుకోవచ్చని అంచనా. ఎయిర్‌లైన్స్ వ్యయాల నిర్మాణం సాధారణంగా రెండు కీలక భాగాలైన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు, రూపాయి మారకం కదలిక ఆధారంగా ఉంటుంది. గతేడాదితో పోలిస్తే 2024-25 మొదటి ఎనిమిది నెలల్లో సగటు ఏటీఎఫ్ ధరలు 6.8 శాతం తగ్గి కిలోలీటరుకు రూ.96,192కు చేరుకున్నాయి. అయితే కోవిడ్‌కు ముందు కాలం 2019-20 మొదటి ఎనిమిది నెలల్లో ఇది రూ.65,261 నమోదైందని ఇక్రా వివరించింది.

విదేశీ కరెన్సీలో చెల్లింపులు..

మొత్తం వ్యయాల్లో ఇంధన ఖర్చులు దాదాపు 30 నుండి 40 శాతం వరకు ఉంటాయి. నిర్వహణ వ్యయాలు 35-50 శాతం కైవసం చేసుకున్నాయి. విమానాల లీజు చెల్లింపులు, ఇంధన ఖర్చులు, విమానాలు, ఇంజన్ నిర్వహణ వ్యయాలు డాలర్ పరంగా నిర్ణయించబడతాయి. కొన్ని విమానయాన సంస్థలు విదేశీ కరెన్సీ రుణాన్ని కూడా కలిగి ఉన్నాయి. దేశీయ విమానయాన సంస్థలు కూడా తమ అంతర్జాతీయ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయాల మేరకు పాక్షిక సహజ రక్షణను కలిగి ఉన్నప్పటికీ మొత్తంగా విదేశీ కరెన్సీలో నికర చెల్లింపులను కలిగి ఉన్నాయి' అని రేటింగ్ ఏజెన్సీ తెలిపింది.

గత నష్టాల కంటే తక్కువగా..

దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల ట్రాఫిక్‌లో నిరంతర వృద్ధి మధ్య భారతీయ విమానయాన పరిశ్రమపై 'స్థిర' దృక్పథాన్ని ఇక్రా కొనసాగించింది. 2024-25లో విమానయాన పరిశ్రమ నష్టం రూ.2,000-3,000 కోట్ల వరకు ఉంటుందని చెబుతోంది. పరిశ్రమ 2025-26లో ఇదే స్థాయిలో నష్టాన్ని నివేదించవచ్చని అంచనా వేస్తున్నట్లు ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కో-గ్రూప్ హెడ్ కింజాల్ షా తెలిపారు. విమానయాన సంస్థల మెరుగైన ధరల శక్తి మద్దతుతో గతంలో చూసిన నష్టాల కంటే ఇది చాలా తక్కువ అని అన్నారు.

ఎంజీ సైబర్‌స్టర్ వస్తోంది

మార్చిలోగా భారత మార్కెట్లోకి



న్యూఢిల్లీ: వాహన రంగంలో ఉన్న జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఆల్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కన్వర్టబుల్ సైబర్‌స్టర్ మోడల్‌ను 2025 జనవరి-మార్చి మధ్య భారత్‌లో ప్రవేశపెడుతోంది. ధర రూ.65-70 లక్షల మధ్య ఉండే అవకాశం ఉంది. ఎంజీ సెలెక్ట్ ఔట్‌లెట్లలో విక్రయానికి రానున్న తొలి మోడల్ ఇదేనని కంపెనీ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ గౌరవ్ గుప్తా తెలిపారు. వచ్చే రెండేళ్లలో నాలుగు ఎలక్ట్రిక్ మోడళ్లను పరిచయం చేయనున్నట్టు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది. సైబర్‌స్టర్‌తో పాటు మరో మోడల్ సైతం మార్చిలోగా అడుగుపెట్టనుందని గుప్తా వెల్లడించారు. భారత్‌లో లగ్జరీ కార్ల విభాగం గత నాలుగేళ్లలో మాస్ సెగ్మెంట్ కార్ల కంటే రెండింతలై దాదాపు 25 శాతం వృద్ధి చెందిందని చెప్పారు. కంపెనీ పట్ల సానుకూల ప్రభావంతో పాటు సైబర్‌స్టర్ మొత్తం ఈవీలు, బ్రాండ్‌కు మరింత ఆకర్షణను జోడిస్తుందని అన్నారు. ఇది బ్రాండ్‌కు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు అదనపు గుర్తింపును ఇస్తుందని వివరించారు.

స్టీల్ దిగుమతులపై 25 శాతం సుంకం

- పరిశ్రమ అభ్యర్థనతో ఉక్కు శాఖ ప్రతిపాదన
- వాణిజ్య, ఉక్కు శాఖల ఉమ్మడి భేటీ



న్యూఢిల్లీ: కొన్ని రకాల స్టీల్ దిగుమతులపై 25 శాతం సుంకం విధింపునకు కేంద్ర ఉక్కు శాఖ ప్రతిపాదించింది. కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మధ్య ఢిల్లీలో జరిగిన భేటీలో ఈ ప్రతిపాదన వచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశానికి సెయిల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏఎంఎన్ఎస్ ఇండియా కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. దీనిపై మంత్రి గోయల్ ఎక్స్ వేదికపై ట్వీట్ చేశారు. "స్టీల్, మెటలర్జికల్ కోక్ పరిశ్రమల భాగస్వాములు, నా సహచరుడు, భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో కలసి సమావేశం నిర్వహించాం. దేశాభివృద్ధిలో ఈ రెండు శాఖలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉత్పత్తి, నాణ్యత పెంపుతోపాటు అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని పెంచే మార్గాలపై చర్చించాం" అని గోయల్ తన ట్వీట్‌లో వెల్లడించారు. మంత్రి కుమారస్వామి సైతం ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై స్పందించారు. రెండు శాఖల మధ్య సహకారం, దేశీ స్టీల్, భారీ పరిశ్రమలకు సంబంధించి వ్యాపార నిర్వహణను సులభతరం చేసే మార్గాలపై చర్చించినట్టు చెప్పారు. ఇదే భేటీలో స్టీల్ దిగుమతులపై 25 శాతం రక్షణాత్మక సుంకం విధించాలని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ కోరింది. కొన్ని దేశాల నుంచి చౌకగా వచ్చి పడుతున్న దిగుమతులు తమకు సమస్యగా మారినట్టు దేశీ కంపెనీలు ఎప్పటి నుంచో కేంద్రం దృష్టికి తీసుకెళుతున్నాయి. దిగుమతి సుంకాల పెంపుతో దేశీ పరిశ్రమను కాపాడాలని కోరుతున్నాయి. ఈ క్రమంలో ఉక్కు శాఖ ప్రతిపాదన కార్యరూపం దాలుస్తుందేమో చూడాల్సి ఉంది.

పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు..

దేశంలోకి వస్తున్న స్టీల్ దిగుమతుల్లో 62 శాతం మేర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కలిగిన దేశాల నుంచే ఉంటున్నాయని, వీటికి ఎలాంటి సుంకం వర్తించడం లేదని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పొండ్రిక్ గత నెలలో చెప్పడం గమనార్హం. కనుక దిగుమతి సుంకాలను పెంచినప్పటికీ ఈ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యపై తమకు అవగాహన ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో (ఏప్రిల్-సెప్టెంబర్) 5.51 మిలియన్ టన్నుల స్టీల్ దిగుమతులు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో దిగుమతులు 3.66 మిలియన్ టన్నుల కంటే 60 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా చైనా నుంచి స్టీల్ దిగుమతులు 1.85 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో చైనా నుంచి 1.0 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తులు దిగుమతయ్యాయి.

విశ్వసనీయ వాణిజ్య కేంద్రంగా భారత్

వాణిజ్య శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సమర్థవంతమైన, విశ్వసనీయ వాణిజ్య కేంద్రంగా అవతరించడమే భారత్ లక్ష్యమని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. అధీకృత ఆర్థిక ఆపరేటర్ల (ఏఈవోలు) భాగస్వామ్యం విస్తరణ, సమగ్ర స్వేచ్ఛా ఆర్థిక కేంద్రాలు, వినూత్నమైన విధానాలను ప్రోత్సహించడం ఇందులో భాగంగా ఉంటుందని చెప్పారు. "సులభతర వాణిజ్యం, అంతర్జాతీయ అనుసంధానతలో నూతన బెంచ్‌మార్క్‌లను (ప్రమాణాలు) ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం" అని ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఏఈవోల సదస్సులో భాగంగా మల్హోత్రా తెలిపారు. టెక్నాలజీ, విశ్వాసం రెవెన్యూ విభాగానికి రెండు స్తంభాలుగా పేర్కొన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నిర్వహణలో భారత్ టెక్నాలజీని అమలు చేస్తున్నట్టు చెప్పారు. అప్పీళ్లు, రిఫండ్‌లు, చెల్లింపులు తదితర సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తున్నట్టు వివరించారు.



"బిలియన్ల కొద్దీ బిల్లులను ఏటా జారీ చేస్తుంటాం. టెక్నాలజీ సాయం లేకుండా ఈ స్థాయిలో నిర్వహణ సాధ్యం కాదు. భారత్ అన్ని పోర్టులను ఆటోమేట్ చేయాలనుకుంటోంది. 20 ప్రధాన పోర్టుల్లో 17 పోర్టులు ఇప్పటికే ఆటోమేట్‌గా మారాయి. పోర్టుల్లో అన్ని సేవలను, అన్ని సమయాల్లో ఆన్‌లైన్, ఎలక్ట్రానిక్ రూపంలో అందించేందుకు కృషి చేస్తున్నాం" అని వివరించారు.

తీరని హైదరాబాధ


తిలక్ వర్మ

నాలుగో ఓటమితో ముస్తాక్ అలీ ట్రోఫీ నుంచి నిష్క్రమణ

- మధ్యప్రదేశ్ చేతిలో 7 పరుగుల తేడాతో హైదరాబాద్ పరాజయం
- మిడిలార్డర్ వైఫల్యంతో మూల్యం

రాజ్‌కోట్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పేలవ ఆటతీరు కొనసాగుతోంది. నాలుగో పరాజయంతో హైదరాబాద్ జట్టు నాకౌట్ దశకు చేరే అవకాశాలను కోల్పోయింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 7 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్ చేతిలో ఓటమి పాలైంది. 179 పరుగుల లక్ష్యఛేదనలో 14 ఓవర్లు ముగిసే సరికి 125/3తో పటిష్ట స్థితిలో కనిపించిన హైదరాబాద్ జట్టు ఆ తర్వాత మిడిలార్డర్ వైఫల్యంతో 16 బంతుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయి పరాజయాన్ని మూట గట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. హర్ష్ గావ్లి (29 బంతుల్లో 51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... సుబ్రాంషు సేనాపతి (42; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రజత్ పాటిదార్ (36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్, అజయ్‌దేవ్ గౌడ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ ఠాకూర్ తిలక్ వర్మ (34 బంతుల్లో 46; 1 ఫోర్, 2 సిక్స్‌లు), తన్మయ్ అగర్వాల్ (33 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. దీంతో హైదరాబాద్ విజయందిశగా సాగిపోయింది. అయితే మధ్యప్రదేశ్ బౌలర్లు విజృంభించడంతో హైదరాబాద్ మిడిలార్డర్ కుప్పకూలింది. మికిల్ జైస్వాల్ (0), ప్రతీక్ రెడ్డి (1), తనయ్ త్యాగరాజన్ (9) విఫలమయ్యారు. చివర్లో మిలింద్ (19; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడినా హైదరాబాద్ జట్టును గట్టెక్కించలేకపోయాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో కుమార్ కార్తికేయ, కమల్ త్రిపాఠి చెరో 3 వికెట్లు తీశారు. మొత్తం 8 జట్లున్న గ్రూప్ 'ఎ'లో 6 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ జట్టు రెండింటిలో గెలిచి,


మిలింద్

నాలుగింటిలో ఓడిపోయి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. గురువారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో మిజోరంతో హైదరాబాద్ తలపడనుంది.

స్కోరు వివరాలు

మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్: సుబ్రాంషు సేనాపతి (సి) రాహుల్ బుద్ధి (బి) నితిన్ సాయి యాదవ్ 42; హర్ష్ గావ్లి (సి) తన్మయ్ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 51; రజత్ పాటిదార్ (సి) రోహిత్ రాయుడు (బి) నితిన్ సాయి యాదవ్ 36; హర్‌ప్రీత్ సింగ్ (సి) తిలక్ వర్మ (బి) మిలింద్ 12; వెంకటేశ్ అయ్యర్ (సి) తనయ్ త్యాగరాజన్ (బి) మిలింద్ 22; అనికేత్ వర్మ (బి) మిలింద్ 0; రాహుల్ బాథమ్ (సి) నితిన్ సాయి యాదవ్ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 5; కమల్ త్రిపాఠి (సి) తిలక్ వర్మ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 1; కుమార్ కార్తికేయ (నాటౌట్) 0; అవేశ్ ఖాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-92, 2-105, 3-142, 4-151, 5-151, 6-163, 7-165, 8-177. **బౌలింగ్:** రవితేజ 4-0-42-0; మిలింద్ 4-0-33-3; అజయ్ దేవ్ గౌడ్ 4-0-20-3; తనయ్ 4-0-51-0; నితిన్ సాయి 4-0-29-2.

హైదరాబాద్ ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) కమల్ త్రిపాఠి (బి) కార్తికేయ 47; రోహిత్ రాయుడు (సి) హర్ష్ (బి) అవేశ్ ఖాన్ 8; తిలక్ వర్మ (సి) అనికేత్ వర్మ (బి) కమల్ త్రిపాఠి 46; రాహుల్ బుద్ధి (సి) అనికేత్ వర్మ (బి) కార్తికేయ 20; మికిల్ జైస్వాల్ (సి) రజత్ (బి) కార్తికేయ 0; ప్రతీక్ రెడ్డి (సి అండ్ బి) కమల్ త్రిపాఠి 1; తనయ్ త్యాగరాజన్ (సి) కార్తికేయ (బి) కమల్ త్రిపాఠి 9; అజయ్‌దేవ్ గౌడ్ (సి) పాటిదార్ (బి) అవేశ్ ఖాన్ 12; మిలింద్ (సి) అనికేత్ వర్మ (బి) రాహుల్ బాథమ్ 19; రవితేజ (నాటౌట్) 1; నితిన్‌సాయి యాదవ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-31, 2-87, 3-125, 4-125, 5-127, 6-128, 7-143, 8-167, 9-168. **బౌలింగ్:** అవేశ్ ఖాన్ 4-0-31-2; ఖెజ్రోలియా 2-0-30-3; రాహుల్ 3-0-27-1; కమల్ 4-0-31-3; వెంకటేశ్ అయ్యర్ 3-0-24-0; కార్తికేయ 4-0-25-3.

సూర్య, దూబే మెరుపులు


సూర్య దూబే

సర్వీసెస్‌పై ముంబై ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (46 బంతుల్లో 70; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దుమ్మురేపాడు. గ్రూప్ 'ఈ'లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో మంగళవారం సర్వీసెస్‌తో జరిగిన పోరులో ఈ ముంబైకర్ అర్ధశతకంతో సత్తా చాటాడు. ఫలితంగా ముంబై జట్టు 39 పరుగుల తేడాతో సర్వీసెస్‌ను చిత్తు చేసింది. సూర్యకుమార్‌తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శివమ్ దూబే (37 బంతుల్లో 71 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) కూడా అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ముస్తాక్ అలీ టోర్నీ తాజా సీజన్‌లో సూర్యకుమార్‌కు ఇదే తొలి మ్యాచ్ కాగా... గత కొంత కాలం నుంచి గాయంతో ఆటకు దూరమైన శివమ్ దూబే పునరాగమనంలో భారీ షాట్లతో కట్టిపడేశాడు. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం సర్వీసెస్ జట్టు ఛేదనలో 19.3 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మోహిత్ అహ్లావత్ (40 బంతుల్లో 54; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 4, షమ్స్ ములానీ మూడు వికెట్లు పడగొట్టారు. గత మ్యాచ్‌లో ఏకంగా 69 పరుగులు సమర్పించుకున్న శార్దుల్ ఈ మ్యాచ్‌లో 4 వికెట్లతో రాణించాడు.

శ్రేయస్ 'హ్యాట్రిక్' వృథా


శ్రేయస్ గోపాల్

ఇండోర్: దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో కర్ణాటక లెగ్‌స్పిన్నర్ శ్రేయస్ గోపాల్ 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. బరోడాతో జరిగిన ఈ పోరులో అతను 19 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అయితే అతని బౌలింగ్ ప్రదర్శన కర్ణాటకను గెలిపించలేకపోయింది. మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో బరోడా 4 వికెట్ల తేడాతో కర్ణాటకపై నెగ్గింది. కర్ణాటక నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని బరోడా 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శాశ్వత్ రావత్ (37 బంతుల్లో 63; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), భాను పనియా (24 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును గెలిపించారు. బరోడా ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ తొలి మూడు బంతుల్లో వరుసగా శాశ్వత్, హార్దిక్ పాండ్యా (0), కృనాల్ పాండ్యా (0)లను గోపాల్ అవుట్ చేసి విజయంపై ఆశలు రేపాడు. అయితే విష్ణు సోలంకి (28 నాటౌట్), శివాలిక్ శర్మ (22 నాటౌట్) ఆరో వికెట్‌కు 49 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. ముందుగా కర్ణాటక 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అభినవ్ మనోహర్ (34 బంతుల్లో 56 నాటౌట్; 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా...ఆర్.స్మరణ్ (35 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు.

ఉర్విల్ ధనాధన్

- మరో సెంచరీ బాదిన గుజరాత్ కీపర్
- 41 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్స్‌లతో 115 నాటౌట్



ఇండోర్: వారం రోజుల క్రితం టి20 ఫార్మాట్‌లోనే అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కిన గుజరాత్ వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్... మరో శతకంతో కదంతొక్కాడు. ఈసారి 38 బంతుల్లో మూడంకెల స్కోరు చేసి అదరగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో భాగంగా ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉర్విల్ పటేల్ (41 బంతుల్లో 115 నాటౌట్; 8 ఫోర్లు, 11 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫలితంగా గుజరాత్ జట్టు 8 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తరాఖండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. సమర్థ్ (39 బంతుల్లో 54; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆదిత్య తారె (26 బంతుల్లో 54; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. అనంతరం ఉర్విల్ పటేల్ మెరుపులు మెరిపించడంతో గుజరాత్ 13.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 185 పరుగులు చేసింది.

అజిత్ సూపర్ రెయిడింగ్


అజిత్

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో యు ముంబా జట్టు తమ ఖాతాలో తొమ్మిదో విజయం జమ చేసుకుంది. సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన యు ముంబా మంగళవారం జరిగిన పోరులో 43-29 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్‌ను బోల్తా కొట్టించింది. యు ముంబా తరఫున అజిత్ చవాన్ 12 పాయింట్లతో సత్తా చాటగా... సునీల్ కుమార్, మన్‌జీత్, సోమ్‌బీర్ తలా 5 పాయింట్లు సాధించారు. పుణేరి పల్టన్ తరఫున పంకజ్ మోహిత్ 9 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో యు ముంబా 20 రెయిడ్ పాయింట్లు సాధించగా... పల్టన్ 14 పాయింట్లకే పరిమితమై పరాజయం వైపు నిలిచింది. తాజా సీజన్‌లో 15 మ్యాచ్‌లాడి 9 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 51 పాయింట్లు ఖాతాలో వేసుకున్న యు ముంబా మూడో స్థానానికి ఎగబాకింది. మరోవైపు 16 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 6 పరాజయాలు, 3 'టై'లతో 47 పాయింట్లు సాధించిన పుణేరి పల్టన్ ఆరో స్థానంలో ఉంది. బెంగళూరు బుల్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన పోరు 34-34 పాయింట్లతో 'టై'గా ముగిసింది. బెంగళూరు బుల్స్ తరఫున నితిన్ 7 పాయింట్లు సాధించగా... ప్రదీప్ నర్వాల్, సుశీల్ చెరో 6 పాయింట్లు సాధించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున రాకేశ్ 7 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. బుధవారం జరగనున్న మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), హరియాణా స్టీలర్స్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

విజయంతో భారత్ ముగింపు


స్నేహిత్


చెంగ్డూ (చైనా): అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) మిక్స్‌డ్ టీమ్ ప్రపంచకప్‌ను భారత జట్టు విజయంతో ముగించింది. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన గ్రూప్-1 చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 8-6తో గెలిచింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో జీత్ చంద-ప్రీతా వర్తికర్ జోడీ 8-11, 3-11, 11-8తో ఫిన్ లు-జియాన్ ఫాంగ్ లే (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో యశస్విని 11-13, 12-10, 6-11తో కాన్‌స్టంటీనా సిహోగియోస్ చేతిలో పరాజయం పాలైంది. మూడో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ 11-6, 9-11, 11-7తో నికోలస్ లుమ్‌ను ఓడించాడు. నాలుగో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో స్నేహిత్-జీత్ చంద్ర ద్వయం 11-8, 10-12, 11-9తో ఫిన్ లు-నికోలస్ లుమ్ జంటను ఓడించింది. ఐదో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో ప్రీతా వర్తికర్-యశస్విని జంట 11-8, 11-7తో జియాన్ ఫాంగ్ లే-సిహోగియోస్ జోడీపై గెలువడంతో భారత విజయం ఖరారైంది. తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో వరుసగా అమెరికా, చైనా చేతిలో టీమిండియా ఓడిపోయి నాకౌట్ చేరే అవకాశాన్ని కోల్పోయింది.

వచ్చే ఏడాది భారత్‌లో మహిళల
అంధుల టి20 ప్రపంచకప్

'హైబ్రిడ్ మోడల్'లో టోర్నీ నిర్వహణ • పాక్ మ్యాచ్‌లు నేపాల్ లేదా శ్రీలంకలో

న్యూఢిల్లీ: మహిళల విభాగంలో తొలిసారిగా భారత్ అంధుల టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నీలో పాకిస్తాన్ ఆడే మ్యాచ్‌ల్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. భారత్‌లో ఆడేందుకు మహిళల పాకిస్తాన్ అంధుల జట్టుకు ఏమైనా వీసా సమస్యలు వస్తే... నేపాల్ లేదంటే శ్రీలంకలో వారి మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మేరకు ప్రపంచ అంధుల క్రికెట్ మండలి (డబ్ల్యూబీసీసీ) తమ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో నిర్ణయించింది. ముల్తాన్‌లో జరిగిన ఈ ఏజీఎంలో 11 సభ్య దేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. భారత్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ బోర్డుల ప్రతినిధులు వర్చువల్ (ఆన్‌లైన్)గా పాల్గొన్నారు. పురుషుల విభాగంలో అంధుల టి20 ప్రపంచకప్‌ను 2027లో నిర్వహించనున్నారు. వేదిక, తేదీలను వచ్చే ఏడాది జరిగే ఏజీఎంలో ఖరారు చేస్తారు. గతేడాదే ఆతిథ్య హక్కుల్ని భారత్‌కు కట్టబెట్టారని భారత అంధుల క్రికెట్ సంఘం (సీఏబీఐ) అధ్యక్షుడు జీకే మహంతేశ్ తెలిపారు. తటస్థ వేదికపై పాక్ ఆడితే ఇందుకు సంబంధించిన ఖర్చులన్నీ భారత బోర్డు భరిస్తుందని ఆయన వెల్లడించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లకు సీఏబీఐ అనుబంధ సంఘం కాదు. ఇది పూర్తిగా ప్రపంచ అంధుల క్రికెట్ మండలి (డబ్ల్యూబీసీసీ) గొడుగుకింద పనిచేస్తుంది.

ఆస్ట్రేలియన్ టెన్నిస్ గ్రేట్ ఫ్రేజర్ మృతి




మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టెన్నిస్ దిగ్గజం నీల్ ఫ్రేజర్ మంగళవారం కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో 91 ఏళ్ల ఫ్రేజర్ మృతి చెందారు. తమ దేశం ఓ మేటి దిగ్గజాన్ని కోల్పోయిందని టెన్నిస్ ఆస్ట్రేలియా (టీఏ) తెలిపింది. 24 ఏళ్ల సుదీర్ఘ టెన్నిస్ కెరీర్‌లో ఫ్రేజర్ మూడు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లతో పాటు ప్రతిష్టాత్మక డేవిస్ కప్ టోర్నీలో వరుసగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాను గెలిపించాడు. 1960లో జరిగిన వింబుల్డన్ ఫైనల్లో తమ దేశానికే చెందిన దిగ్గజం రాడ్ లేవర్‌ను ఓడించి టైటిల్ చేజిక్కించుకున్నారు. ఆ ఏడాది ఏకంగా 11 మేజర్ టైటిల్స్ (పురుషుల డబుల్స్) సాధించారు. అంతకుముందు ఏడాది (1959) యూఎస్ ఓపెన్‌లో టైటిళ్ల క్లీన్‌స్వీప్ చేశారు. సింగిల్స్, పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మూడు ట్రోఫీలు కైవసం చేసుకున్నారు. టెన్నిస్‌లో విజయవంతమైన, విశేష కృషి చేసిన ఆయన్ని అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) 1984లో 'టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్'లో చేర్చింది. 2008లో టెన్నిస్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుగా అభివర్ణించే 'ఫిలిప్ చాట్రియెర్' అవార్డును ఫ్రేజర్‌కు ప్రదానం చేసింది.

హరియాణాకు మధ్యప్రదేశ్ షాక్



సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో సంచలనం చోటు చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ హరియాణా జట్టు క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్ జట్టు 3-2 గోల్స్ తేడాతో హరియాణా జట్టును బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మధ్యప్రదేశ్ తరఫున రూబీ రాథోడ్ రెండు గోల్స్, సల్లూ పుఖ్‌రంబమ్ ఒక గోల్ చేశారు. హరియాణా జట్టు తరఫున దీక్ష, దుర్గా ఒక్కో గోల్ సాధించారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్ 12-0 గోల్స్‌తో మహారాష్ట్ర జట్టుపై, ఒడిశా 3-0 గోల్స్‌తో ఢిల్లీ జట్టుపై, మిజోరం 1-0 గోల్‌తో ఉత్తరప్రదేశ్ జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. బుధవారం విశ్రాంతి దినం. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో మిజోరం జట్టుతో మధ్యప్రదేశ్; ఒడిశాతో జార్ఖండ్ తలపడతాయి. మొత్తం 28 జట్లు పోటీపడ్డ ఈ టోర్నమెంట్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టుతో ఆంధ్రప్రదేశ్ జట్టు గ్రూప్ దశలోనే వెనుదిరిగాయి.


భారత స్క్వాష్ దిగ్గజం రాజ్ మన్‌చందా కన్నుమూత



న్యూఢిల్లీ: భారత దిగ్గజ స్క్వాష్ క్రీడాకారుడు బ్రిగేడియర్ రాజ్‌కుమార్ మన్‌చందా కన్నుమూశారు. ఆయన వయస్సు 79 ఏళ్లు కాగా... అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు మంగళవారం కుటుంబ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో విశేషంగా రాణించి భారత్‌కు పతకాలు అందించిన ఆయన స్క్వాష్‌లో విఖ్యాత ఆటగాడిగా ఎదిగారు. 33 ఏళ్ల వయసులో తొలిసారి జాతీయ చాంపియన్‌గా నిలిచిన ఆయన 1977 నుంచి 1982 వరకు వరుసగా టైటిళ్లను నిలబెట్టుకున్నారు. రాజ్ తన కెరీర్‌లో ఓవరాల్‌గా 11 టైటిళ్లు సాధించారు. ఆసియా చాంపియన్‌షిప్ సహా పలు అంతర్జాతీయ టోర్నీలలో సత్తా చాటుకున్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 1983లో 'అర్జున అవార్డు'ను అందజేసింది. 1980 దశకాన్ని శాసించిన జహంగీర్ ఖాన్‌ను 1981లో ఎదుర్కొన్న ఆయన పలు అంతర్జాతీయ టోర్నీలకు భారత స్క్వాష్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. కరాచీలో 1981లో జరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ రజత పతకం సాధించింది. 1984 ఆసియా చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ఆయన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కాగా... ఆ ఈవెంట్‌లో టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం గెలుచుకుంది.

టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో...

- మహిళల జూనియర్ ఆసియా కప్ టోర్నీ బరిలోకి భారత జట్టు
- 7 నుంచి మస్కట్‌లో టోర్నీ



బెంగళూరు: జూనియర్ ఆసియా కప్ టైటిల్ నిలబెట్టుకునేందుకు భారత మహిళల హాకీ జట్టు మంగళవారం ఒమన్‌కు బయల్దేరింది. ఒమన్ రాజధాని మస్కట్‌లో ఈ నెల 7 నుంచి 15 వరకు ఆసియా టోర్నీ జరుగుతుంది. ఇందులో రాణించి టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు వచ్చే ఏడాది జూనియర్ ప్రపంచకప్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో భారత అమ్మాయిల జట్టు సన్నద్ధమై వెళ్లింది. మస్కట్ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతక విజేతలు (టాప్-3 జట్లు) శాంటియాగో (చిలీ)లో జరిగే ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తారు. ఆసియా కప్ ఈవెంట్‌లో భారత్ పూల్ 'ఎ'లో ఉంది. ఈ పూల్‌లో భారత్‌తో పాటు చైనా, మలేసియా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ జట్లున్నాయి. పూల్ 'బి'లో దక్షిణ కొరియా, జపాన్, చైనీస్ తైపీ, హాంకాంగ్, శ్రీలంకలు పోటీపడతాయి. జ్యోతి సింగ్ నేతృత్వంలోని భారత జట్టులో పలువురు ప్రతిభావంతులు నిలకడగా రాణిస్తున్నారు. వైష్ణవి విఠల్ ఫాల్కే, సునేలిత టొప్పో, ముంతాజ్ ఖాన్, దీపిక, బ్యూటీ డుంగ్‌డుంగ్‌లకు సీనియర్లతో కలిసి ఆడిన అనుభవం ఉంది. ఈ జట్టుకు భారత మాజీ కెప్టెన్ తుషార్ ఖండేకర్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఒమన్‌కు బయలుదేరే ముందు మీడియాతో కెప్టెన్ జ్యోతి సింగ్ మాట్లాడుతూ జట్టు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైందని, కొన్ని నెలలుగా జట్టు సన్నాహాల్లో చెమటోడ్చుతుందని తెలిపింది. అక్కడే ఉన్న పురుషుల జట్టు నాకౌట్‌కు చేరడం ఆనందంగా ఉందని, మేం కూడా వారి లాగే రాణిస్తామని ఆశాభావం వ్యక్తం చేసింది.



‘సేవాదార్’ సుఖ్‌బీర్

- శిక్ష అనుభవించిన అకాలీ నేత
- ధిండ్సా, చీమా తదితరులు కూడా

అమృత్‌సర్: అకాలీదళ్ అగ్ర నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన సుఖ్‌దేవ్‌సింగ్ ధిండ్సా, బిక్రంసింగ్ మజీతియా, దల్జీత్‌సింగ్ చీమా తదితర నేతలు మంగళవారం మతపరమైన శిక్షలు అనుభవించారు. వాటిలో భాగంగా అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయ ప్రవేశద్వారం వద్ద బాదల్, ధిండ్సా గంటపాటు సేవాదార్‌గా విధులు నిర్వర్తించారు. ఆరోగ్య, వయోసంబంధ కారణాలతో వారు వీల్‌చైర్‌లో కూర్చునే శిక్షలు అనుభవించారు. చీమా మరుగుదొడ్లు శుభ్రపరిచగా ఇతర నేతలు పాత్రలు తోమడం వంటి పనులు చేశారు. 2007 నుంచి 2017 దాకా పంజాబ్‌లో అకాలీదళ్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో పాల్పడ్డ తప్పిదాలకు గాను సిక్కుల అత్యున్నత మత సంస్థ అకల్ తక్త్ వారికిలా మతపరమైన శిక్షలు విధించింది. ఈ సందర్భంగా నేతలంతా తాము చేసిన నేరాలను వివరించే బోర్డులను మెడలో ధరించారు.



వైరస్‌లపై పరిశోధనలో

జేఎన్‌యూ శాస్త్రవేత్తల ముందడుగు

వైరస్ వృద్ధికి సాయపడే పోషకాన్ని కనుగొన్న అధ్యయనకారులు

- దానిని ప్రతిగా మరో పోషకాన్ని అభివృద్ధిచేసిన సైంటిస్టులు
- కోవిడ్, మలేరియా చికిత్సకు పనికొచ్చే ఛాన్స్

న్యూఢిల్లీ: పరిమాణువులపై పరిశోధన చేస్తున్న జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయ పరిశోధకులు గొప్ప ముందడుగు వేశారు. ముందులకు లొంగకుండా వైరస్‌లు ‘వ్యాధి నిరోధకత’ను సంతరించుకుంటున్న పరిస్థితికి చెక్‌పెట్టే దిశగా పరిశోధకులు కీలక విజయం సాధించారు. రష్యన్ శాస్త్రవేత్తలతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఒక పరిశోధనలో జేఎన్‌యూ సైంటిస్టులు హెచ్‌ఎస్‌పీ70 అనే మానవ ప్రోటీన్‌ను కనుగొన్నారు. మానవల్లో కోవిడ్, మలేరియా వంటి వైరస్‌కారక వ్యాధులు ప్రబలడంలో హెచ్‌ఎస్‌పీ70 కీలకపాత్ర పోషిస్తోందని గుర్తించారు. వ్యాధికారక వైరస్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి హెచ్‌ఎస్‌పీ70 ప్రోటీన్ పరోక్షంగా సాయపడుతుంది. వ్యాధికారక ప్రోటీన్ జాడ తెలియడంతో ఈ ప్రోటీన్ చర్య, అభివృద్ధిని కట్టడిచేసే మరో ప్రోటీన్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా అభివృద్ధిచేశారు. జేఎన్‌యూలో స్పెషల్ సెంటర్ ఫర్ మాలిక్యులార్ మెడిసన్ విభాగ అధ్యయనకారులు ఈ కృత్రిమ ప్రోటీన్‌ను అభివృద్ధి చేశారు. ఇది హెచ్‌ఎస్‌పీ70 పనితీరును క్షీణింపజేస్తుంది. దాంతో అది వ్యాధికారక వైరస్‌లకు పూర్తిస్థాయిలో సాయపడటంతో విఫలమవుతుంది. దాంతో మానవశరీరంలో వ్యాధి విజృంభణ ఆగుతుంది. చికిత్సకు, మందులకు లొంగకుండా వైరస్ కనబరిచే ‘వ్యాధినిరోధకత’సామర్థ్యమూ తగ్గుతుంది.

హీట్‌షాక్ ప్రోటీన్

హీట్‌షాక్ ప్రోటీన్‌కి పొట్టిరూపమే హెచ్‌ఎస్‌పీ. వ్యాధికారక వైరస్ ప్రబలినప్పుడు కణాల్లో అవి క్షణాల్లో రెండింతలు, మూడింతలు, ఇలా కోట్ల రెట్లు పెరిగేందుకు హెచ్‌ఎస్‌పీ ప్రోటీన్ సాయపడుతుంది. శరీరాన్ని వేడెక్కేలా చేసి వైరస్‌ల సంఖ్య పెరగడానికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. వైరస్ తనలాంటి లక్షలాది వైరస్‌లను తయారుచేయడంలో, అచ్చం అలాగే ఉండటంలో, రెట్టింపు ప్రక్రియలో తప్పులు దొర్లకుండా హెచ్‌ఎస్‌పీ ప్రోటీన్ చూసుకుంటుంది. ఇంతటి కీలక ప్రోటీన్ జాడను కనిపెట్టి జేఎన్‌యూ పరిశోధకులు ఘన విజయం సాధించారు. ఈ పరిశోధనా వివరాలు ప్రఖ్యాత బయోలాజికల్ మైక్రోమాలిక్యూల్స్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కోవిడ్ కారక సార్స్ కోవ్-2 వైరస్‌లోని కొమ్ములతో, మానవ కణంలోని ఏస్2 గ్రాహకాలకు మధ్య హెచ్‌ఎస్‌పీ అనుసంధానకర్తలా వ్యవహరిస్తోందని పరిశోధనలో తేలింది. కణాల్లోకి వైరస్ చొరబడాలంటే ఏస్2 రిసెప్టార్లదే కీలక పాత్ర. హెచ్‌ఎస్‌పీను నిలువరించడం ద్వారా వైరస్‌ల సంఖ్య పెరగడాన్ని అడ్డుకోగలిగామని జేఎన్‌యూ ప్రొఫెసర్లు ఆనంద్ రంగనాథన్, శైలజా సింగ్ చెప్పారు. ‘‘హెచ్‌ఎస్‌పీని అడ్డుకునేలా పీఈఎస్–సీఏ అనే కొత్త ప్రోటీన్‌ను అభివృద్ధిచేశాం. దీనిని సార్స్–కోవ్2 సోకిన కణాల్లోకి జొప్పించాం. దీంతో సార్స్–కోవ్2 కణాల రెట్టింపు ప్రక్రియ గణనీయస్థాయిలో మందగించింది. సాంప్రదాయక ఔషధాలు నేరుగా వైరస్‌లపై దాడిచేస్తాయి. కానీ వైరస్‌లకు ఆతిథ్యమిచ్చే కణాలను లక్ష్యంగా చేసుకోవడం వంటి కొత్త రకం విధానాల ద్వారా వ్యాధుల వ్యాప్తిని గణనీయంగా అడ్డుకోవచ్చు. కోవిడ్ సంక్షోభం ముగియడంతో జనం దాదాపు కరోనా గురించి మర్చిపోయారు. కానీ పరిశోధనా ప్రపంచం ఎప్పుడూ రాబోయే కొత్త రకం వైరస్‌ల గురించి అప్రమత్తంగానే ఉంటుంది’’అని పరిశోధకులు అన్నారు. ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని డాక్టర్ ప్రమోద్ గార్గ్, పీహెచ్‌డీ స్కాలర్ ప్రేరణ జోషి సైతం ఈ పరిశోధనలో పాలుపంచుకున్నారు. హఠాత్తుగా పుట్టుకొచ్చి విజృంభించే కొత్త రకం వైరస్‌ల కట్టడికి ఈ విధానం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ప్రేరణ జోషి అన్నారు. అంతర్జాతీయంగా ఆరోగ్య సంక్షోభం తలెత్తినప్పుడు శాస్త్రసాంకేతి రంగం ఏ స్థాయిలో నూతన చికిత్సా విధానాలు, ఆవిష్కరణలతో సంసిద్ధంగా ఉండాలనే అంశాన్ని తాజా పరిశోధన మరోసారి నిరూపిస్తోంది.

ఉక్రెయిన్‌కు 72.5 కోట్ల డాలర్ల ప్యాకేజీ

కొత్త ప్యాకేజీ ప్రకటించిన అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్‌కు 72.5 కోట్ల డాలర్ల నూతన సైనిక సహాయ ప్యాకేజీని అమెరికా సోమవారం ప్రకటించింది. మందుపాతరలు, యాంటీ ఎయిర్, యాంటీ ఆర్మర్ ఆయుధాలు తదితరాలున్నాయి. రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్ తనను తాను కాపాడుకోవడానికి ఈ ప్యాకేజీ తోడ్పడుతుందని విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సాయాన్ని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తప్పుబడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టాక ఉక్రెయిన్‌కు సాయం సందేహాస్పదంగా మారింది. దాంతో అధ్యక్షుడు జో బైడెన్ తాను వైదొలగడానికి ముందే ఉక్రెయిన్‌కు వీలైనంత సాయం అందించే పనిలో పడ్డారు. 2022లో రష్యా దురాక్రమణ మొదలైన నాటినుంచీ ఉక్రెయిన్‌కు అమెరికా కీలక సైనిక సాయం అందిస్తూ వస్తోంది. ఆయుధాలు, మందుగుండు సామగ్రి తదిరాల కోసం ఇప్పటికే ఏకంగా 60 బిలియన్ డాలర్లకు పైగా సాయం చేసింది.

ఐరాస తలుపు తడతా: ఇమ్రాన్

ఆయనతో పాటు బుష్రా తదితరులపై వారెంట్

లాహోర్/ఇస్లామాబాద్: పీటీఐ పిలుపు మేరకు జరిగిన ‘చలో ఇస్లామాబాద్’ కార్యక్రమంపై పాకిస్తాన్ ప్రభుత్వం దమనకాండను ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్తానని పార్టీ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు. ‘‘జలియన్ వాలాబాగ్‌లో డయ్యర్‌ను తలపిస్తూ పాలకులు అమాయకులపై కర్కశంగా కాల్పులకు దిగారు. ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారు. దీన్ని ఐరాసతో పాటు అన్ని అంతర్జాతీయ వేదికలపైనా లేవనెత్తుతాం’’ అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇమ్రాన్ వాదనను పంజాబ్ సీఎం మరియం నవాజ్ తిప్పికొట్టారు. పీటీఐ కార్యకర్తలే పోలీసులపై కాల్పులకు తెగబడ్డారని ఆరోపించారు. వాటిలో నలుగురు సిబ్బంది చనిపోయారన్నారు. ఈ ఉదంతానికి సంబంధించి ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ, ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ గండాపూర్‌తో పాటు 93 మందిపై తాజాగా అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి.

యూకే రాయబారిగా స్టీఫెన్స్

వాషింగ్టన్: బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా బిలియనీర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ వారెన్ స్టీఫెన్స్‌ను కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంపిక చేశారు. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి స్టీఫెన్స్ భారీగా నిధులు సమకూర్చారు. అయితే 2016లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వంలో ట్రంప్ నెగ్గకుండా చూసేందుకు ప్రయత్నించినట్టు ఆయనపై ఆరోపణలున్నాయి. ట్రంప్ తన తొలి హయాంలో కూడా ఎన్నికల ప్రచారానికి దన్నుగా నిలిచిన సంపన్న వ్యాపారవేత్త వుడీ జాన్సన్‌ను బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా నియమించారు.

చిన్మయ్ బెయిల్‌పై విచారణ జనవరికి వాయిదా

ఆయన తరఫున వాదించేందుకు ముందుకు రాని లాయర్లు

ఢాకా: దేశ ద్రోహం ఆరోపణలపై అరెస్టయి చట్టోగ్రామ్ జైల్లో ఉన్న హిందూ మత పెద్ద చిన్మయ్ కృష్ణ దాస్ బెయిల్ పిటిషన్‌పై విచారణను కోర్టు జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది. రాజకీయ పార్టీతో సంబంధాలున్న లాయర్ల గ్రూపొకటి బెదిరింపులకు దిగడంతో కోర్టులో దాస్ తరఫున వాదించేందుకు న్యాయవాదులెవరూ ముందుకు రాలేదని దాస్ సారథ్యంలోని సమ్మిళిత సనాతని జాగరణ్ జోత్ సంస్థ నాయకుడొకరు తెలిపారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా మంగళవారం చట్టోగ్రామ్‌లోని కోర్టు వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటైంది. బార్ అసోసియేషన్ సభ్యులు కొందరు ప్లకార్డులు చేబూని కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. నవంబర్ 25వ తేదీన దాస్ అరెస్ట్, బెయిల్ నిరాకరణను నిరసిస్తూ జరిగిన ఆందోళనల సందర్భంగా ప్రభుత్వ సహాయ ప్రాసిక్యూటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చంపేశారు. దాస్ అరెస్ట్‌తో భారత్–బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి.

భారత్ టీవీ ఛానెళ్లను నిషేధించాలి

బంగ్లాదేశ్‌ను గురించి రెచ్చగొట్టేలా వార్తలను ప్రసారం చేస్తున్న భారత్‌కు చెందిన జీ బంగ్లా, రిపబ్లిక్ బంగ్లా, స్టార్ జల్సా, స్టార్ ప్లస్ తదితర అన్ని టీవీ ఛానెళ్లపై నిషేధం విధించాలంటూ కోరుతూ ఆ దేశ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ ఛానెళ్లపై ఎటువంటి నియంత్రణ లేదని పిటిషనర్, లాయర్ ఎఖ్లా సుద్దీన్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సంస్కృతిని అవమానిస్తూ ఈ టీవీల్లో ప్రసారమవుతున్న కార్యక్రమాలతో యువత పెడదారి పడుతోందని ఆరోపించారు.

బంగ్లాదేశీయులకు ప్రవేశం లేదు

అగర్తలా: బంగ్లాదేశ్ నుంచి వచ్చే అతిథులకు తమ హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు ఆల్ త్రిపుర హోటల్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మన జాతీయ పతాకాన్ని అవమానించిన ఘటనకు నిరసనగా సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సైకత్ తెలిపారు.

దాస్ తరఫు లాయర్లకు భద్రత కల్పించాలి

బంగ్లాదేశ్ యంత్రాంగానికి ఇస్కాన్ వినతి

కోల్‌కతా: హిందూ మత పెద్ద చిన్మయ్ దాస్ తరఫున వాదించేందుకు ముందుకు వచ్చే న్యాయవాదులకు తగు భద్రత కల్పించాలని కోల్‌కతా ఇస్కాన్ విభాగం బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. దాస్ బెయిల్ పిటిషన్‌పై వాదించేవారు లేక విచారణను కోర్టు వచ్చే జనవరికి వాయిదా వేయడంపై ఇస్కాన్ ప్రతినిధి రాధారమణ్ దాస్ స్పందించారు. దాస్ లాయర్ రామెన్ రాయ్‌పై ఆయన ఇంట్లోనే ఇస్లామిక్ అతివాదులు దాడి చేశారన్నారు. మొదటగా వాదించిన లాయర్‌పైనా దాడి జరిగిందన్నారు. ఈ భయంతోనే దాస్ పక్షాన వాదించేందుకు లాయర్లెవరూ ముందుకు రావడం లేదని వివరించారు.



వాన్స్ ‘థాంక్స్ గివింగ్’!

వైరలవుతున్న పార్టీ ఫొటో

అమెరికా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన జేడీ వాన్స్ ‘థాంక్స్ గివింగ్’పార్టీ ఫొటో వైరల్‌గా మారింది. వాన్స్, ఆయన భార్య ఉషా చిలుకూరి కుటుంబం, సన్నిహితులతో కూడిన ఈ ఫొటోను సిలికాన్ వ్యాలీకి చెందిన వెంచర్ కేపిటలిస్ట్ ఆశా జడేజా మొత్వానీ షేర్ చేశారు. వాన్స్ దంపతులతో పాటు దాదాపు 21 మంది కుటుంబ సభ్యులు ఫొటోలో ఉన్నారు. దానిపై ఇంటర్నెట్‌లో స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉషా చిలుకూరి తెలుగింటి అమ్మాయన్నది తెలిసిందే. – సాక్షి, నేషనల్ డెస్క్

ఫెంగల్ బాధితుల ఆగ్రహం..
మంత్రిపై బురదతో దాడి


సాక్షి, చెన్నై: ఇటీవలి ఫెంగల్ తుపానుతో తమిళనాడులోని విల్లుపురం, కడలూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలు తీవ్ర నష్టాన్ని చవి చూశాయి. దీనికి తోడు, తిరువణ్ణామలైలోని సాత్తనూరు డ్యాం నుంచి స్వల్ప వ్యవధిలోనే 1.60 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో అనేక గ్రామా లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అంతంత మాత్రంగానే సాయం అందడంతోపాటు భారీగా వరద నీటిని విడుదల చేసి ఇక్కట్లకు గురిచేసిందటూ ప్రజలు పలుచోట్ల నిరసనలకు దిగారు. మంగళవారం విక్రంవాడి వద్ద నిరసన తెలుపుతున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసిన మంత్రి పొన్ముడిపై కొందరు బురద విసిరారు. దీంతో, పోలీసులు ఆయన్ను అక్కడి నుంచి సురక్షితంగా బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటనల నేపథ్యంలో సీఎం స్టాలిన్ వరద బాధితులకు సాయం వివరాలను ప్రకటించారు.

సైనికుడి భార్యకు పింఛను వ్యవహారం
కేంద్రానికి సుప్రీం రూ.50 వేల పెనాల్టీ



న్యూఢిల్లీ: సైనికుడి భార్యకు పింఛను మంజూరు చేస్తూ ప్రత్యేక ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు రూ.50 వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని బాధితురాలికి రెండు నెలల్లోగా చెల్లించాలని ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తూ నాయక్ ఇందర్‌జీత్ సింగ్ అనే జవాను ప్రాణాలు విడిచారు. పెట్రోలింగ్ చేస్తుండగా తీవ్ర శీతల వాతావరణం కారణంగా ఆయన గుండెపోటుకు గురైనందున యుద్ధ క్షేత్రంలో తుదిశ్వాస విడిచారన్న అధికారులు ఆ తర్వాత శారీరక కారణాలతో ఆయన చనిపోయారంటూ రికార్డుల్లో పేర్కొన్నారు. సింగ్ భార్యకు అధికారులు ఇతర బెనిఫిట్స్‌తోపాటు స్పెషల్ ఫ్యామిలీ పెన్షన్‌ను కూడా మంజూరు చేశారు. లిబరలైజ్డ్ పింఛనును మాత్రం నిలిపివేశారు. దీనిపై సింగ్ భార్య సైనిక బలగాల ప్రత్యేక ట్రిబ్యునల్‌కు వెళ్లగా ట్రిబ్యునల్ లిబరలైజ్డ్ పింఛన్‌ను కూడా మంజూరు చేయాలని ఆదేశించింది. దీనిపై ఆర్మీ, కేంద్రం సుప్రీంకోర్టుకు వెళ్లాయి. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం.. కోర్టు ఖర్చుల కింద బాధితురాలికి రూ.50 వేల మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపు



ఆగ్రా: చారిత్రక కట్టడం తాజ్‌మహల్‌ను బాంబులతో పేల్చేస్తామంటూ వచ్చిన బెదిరింపు కలకలం రేపింది. ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాంతీయ కార్యాలయానికి అందిన ఈ మెయిల్ బెదిరింపు వట్టిదేనని తేలిందని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. తాజ్‌మహల్ వద్ద భద్రతా విధులు చేపట్టే ఏసీపీ సయ్యద్ అరీబ్ అహ్మద్ సారథ్యంలోని పోలీసు బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ఇతర బృందాలు తాజ్‌మహల్ లోపల, ప్రధాన వేదిక, గార్డెన్స్‌తోపాటు చెత్తకుండీలు, ఇంకా పరిసరాల్లో క్షుణ్నంగా తనిఖీలు చేపట్టి, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని తేల్చాయి. ఘటనపై దర్యాప్తు చేపట్టి, మెయిల్ పంపిన వారిని ఆచూకీ కనిపెట్టే పనిలో ఉన్నామని ఏసీపీ అరీబ్ అహ్మద్ చెప్పారు.

భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు 40 ఏళ్లు..
న్యాయం చేయాలంటూ బాధితుల ర్యాలీ



భోపాల్: ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక విపత్తుగా భావించే భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు 40 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రమాద బాధితులు మంగళవారం భోపాల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. అంతకుముందు వారంతా సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక బర్కతుల్లా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ మత పెద్దలతోపాటు మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించి, ప్రమాద బాధితులకు నివాళులర్పించారు. ప్రస్తుతం మూతబడి ఉన్న యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్లకార్డులు చేబూని ర్యాలీ చేపట్టారు. 1984 డిసెంబర్ 2,3 తేదీల్లో అమెరికాకు చెందిన సంస్థ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ విషవాయువులు వెదజల్లడంతో చుట్టుపక్కల నివసించే 5,479 మంది ప్రాణాలు కోల్పోగా మరో ఐదు లక్షల మంది వికలాంగులుగా మారడం తెలిసిందే.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై..
అంతర్గత కమిటీలు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ప్రభుత్వ శాఖలు, సంబంధిత విభాగాల్లో జరిగే లైంగిక వేధింపులపై ఫిర్యాదుల విచారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)లను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. పని ప్రదేశాల్లో మహిళపై లైంగిక వేధింపులు(నివారణ, నిషేధం, ఫిర్యాదు)(పోష్)చట్టం –2013ను తప్పనిసరిగా అమలు చేయాలంటూ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎస్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోగా ప్రతి జిల్లాకు ఒక అధికారిని నియమించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. ఈ అధికారులు 2025 జనవరి 31లోగా స్థానిక ఫిర్యాదు కమిటీని, తాలూకా స్థాయి నోడల్ కమిటీలను ఏర్పాటు చేస్తారంది. ప్రైవేట్ కంపెనీల్లోనూ ఐసీసీలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఇందుకు గాను వచ్చే మార్చి 31ని తుది గడువుగా పేర్కొంది. గోవా యూనివర్సిటీ మాజీ విభాగాధిపతి ఫెర్నాండెజ్ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

నేరచట్టాలు చండీగఢ్‌లో సంపూర్ణంగా అమలు

ఈ చట్టాలు పౌరహక్కులకు రక్షణ కవచాలు

- చండీగఢ్‌లో మోదీ వ్యాఖ్యలు

చండీగఢ్: మూడు నూతన నేర చట్టాలను దేశంలోనే తొలిసారిగా పూర్తిస్థాయిలో అమలుచేస్తున్న తొలి కార్యనిర్వాహణ కేంద్రంగా చండీగఢ్ ఖ్యాతి సాధించిందని ప్రధాని మోదీ శ్లాఘించారు. మంగళవారం చండీగఢ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఎగ్జిబిషన్ హాల్‌లో పంజాబ్ పోలీసులు నేరానికి సంబంధించిన సాక్ష్యాధారాలను ఎలా సాంకేతికసాయంతో సేకరిస్తారో, దర్యాప్తు ఎలా చేస్తారో, కొత్త చట్టంలోని సెక్షన్లను ఎలా ఆపాదిస్తారో ప్రధాని మోదీకి వివరించారు. తర్వాత మోదీ మాట్లాడారు. ‘‘పౌరులందరికీ ప్రయోజనం చేకూర్చాలనే సమున్నత ఉద్దేశ్యంతో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆలోచనలకు వాస్తవరూపమిచ్చేందుకు వేసిన గొప్ప ముందడుగే ఈ కొత్త నేర చట్టాలు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 వసంతాలు పూర్తిచేసుకున్న వేళ వికసిత్ భారత్ ప్రతిజ్ఞతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో భారతీయ న్యాయసంహిత చట్టాన్ని అమల్లోకి తెచ్చాం. ఈ చట్టాలు పౌరహక్కులకు రక్షణ కవచాలు. వలసపాలన నాటి చట్టాలకు చరమగీతం పాడామని ఈ చట్టాలు మరోసారి గుర్తుకు తెస్తున్నాయి’’అని మోదీ అన్నారు.

చండీదేవి స్మరణకు వస్తుంది

‘‘చండీగఢ్ పేరు వినగానే శక్తిస్వరూపిణి చండీదేవి జ్ఞప్తికి వస్తుంది. సత్యం, న్యాయానికి నిలువెత్తు నిదర్శనం చండీమాత. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టాలకు చండీమాతే స్ఫూర్తి. చండీగఢ్‌కు వచ్చాకే ఈరోజు నేను ప్రత్యక్షంగా చట్టాల అమలును చూశా. కొత్త చట్టాల రూపకల్పనకు ఎంతో మంది మహానుభావులు అహర్నిశలు శ్రమించారు. ఈ క్రతువులో పాలుపంచుకున్న సర్వోన్నత న్యాయ స్థానం, హైకోర్టుల న్యాయమూర్తులు, చట్టాల నిపుణులకు నా ప్రత్యేక ధన్యవాదాలు’’అని మోదీ అన్నారు.



విశేషమైన రోజు ఇది : అమిత్ షా

కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం మాట్లాడారు. ‘‘భారతీయ నేర న్యాయ వ్యవస్థలో ఈ రోజు ప్రత్యేకమైన దినం. ప్రపంచంలోనే అత్యంత అధునాతన నేరన్యాయ వ్యవస్థల్లో మనదీ ఒకటి కావడం గర్వకారణంగా ఉందని ఆయన అన్నారు. నేరానికి సంబంధించిన ఘటనాస్థలిలో దర్యాప్తు ఎలా చేస్తారనే విషయాలను ప్రధాని మోదీకి చండీగఢ్ సీనియర్ ఎస్పీ కన్వర్‌దీప్ కౌర్ ప్రత్యక్షంగా విడమరచి చెప్పారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ గులాబ్‌చంద్ కటారియా, చండీగఢ్ డీజీపీ సురేంద్ర పాల్గొన్నారు.

లష్కరే తోయిబా ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని గగన్‌గిర్ టన్నెల్ వద్ద అక్టోబర్‌లో జరిగిన దాడితో సంబంధమున్న లష్కరే తోయిబా ఉగ్రవాదిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు సోమవారం రాత్రి దాచిగామ్ ఎగువ ప్రాంతంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు బలగాలపైకి కాల్పులకు దిగారు. ప్రతిగా బలగాలు కాల్పులు జరిపాయి.మంగళవారం ఉదయం కూడా కాల్పులు కొనసాగాయి. ఘటనలో జునైద్ అహ్మద్ భట్ అనే ఉగ్రవాది హతమయ్యాడని పోలీసులు తెలిపారు. ఇతడు లష్కరే తోయిబాకు చెందిన ఏ కేటగిరీ ఉగ్రవాది అని చెప్పారు. అక్టోబర్ 20వ తేదీన ఒక డాక్టర్, ఆరుగురు స్థానికేతర కార్మికులను కాల్చి చంపిన ఘటనలో ఇతడు పాల్గొన్నాడన్నారు. ఇతర ఘటనలతోనూ ఇతడికి సంబంధముందని చెప్పారు.

సిద్ధరామయ్య భార్యపై కేసులో
ఆధారాలున్నాయ్

- ముడాలో వెయ్యికి పైగా అక్రమ కేటాయింపులు
- లోకాయుక్తకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ/బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) నుంచి సీఎం సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి 14 స్థలాల కేటాయింపులో చోటుచేసుకున్న పలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆధారాలు దొరికాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. బినామీ, తదితర ఇతర మార్గాల్లో రూ.700 కోట్ల విలువైన మొత్తం 1,095 సైట్లను ముడా అక్రమంగా కేటాయించినట్లు కూడా తేలిందని కర్ణాటక లోకాయుక్తకు రాసిన లేఖలో ఈడీ పేర్కొంది. పార్వతికి భూ కేటాయింపుల్లో అనుచిత లబ్ధి, ఫోర్జరీ, ట్యాంపరింగ్ వంటి ఉల్లంఘనలు జరిగాయని తెలిపింది. ఇందుకు బదులుగా ఖరీదైన కార్లు, నగదు, స్థిరాస్తులను ముడా మాజీ కమిషనర్ జీటీ దినేశ్ కుమార్ అందుకున్నారని ఆరోపించింది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలుకుబడిన కలిగిన వ్యక్తులేనని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో సిద్ధరామయ్య వ్యక్తిగత సహాయకులు ఎస్‌జీ దినేశ్ కుమార్ అలియాస్ సీటీ కుమార్ మితిమీరిన జోక్యాన్ని కూడా గుర్తించామని పేర్కొంది. ముడా వ్యవహారంలో సీఎం భార్య పార్వతి, బావ మరిది మల్లికార్జున స్వామిపై ఈడీ మనీలాండరింగ్ కేసు చేయడం తెలిసిందే.

‘నవనగర స్వామి’ అనే బిరుదు ఎవరిది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

శాతవాహనుల కంటే ముందే ‘దక్కన్’ను వివిధ రాజులు పరిపాలించారు. విదర్భలో గోబద లేదా గోబధ రాజు ఉన్నట్లు పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అజయ్‌మిత్ర శాస్త్రి పేర్కొన్నారు. కోటిలింగాలలో కంవాయ, సమగోప, నరన తదితర రాజుల నాణేలు లభ్యమయ్యాయి. పైఠాన్ లేదా ప్రతిష్ఠానపురాన్ని సూర్యమిత్ర, భూమిపుత్ర, సత్యభద్ర అనే రాజులు పరిపాలించారు. సూర్యపుత్రుని నాణేలపై శాతకర్ణి తన గుర్తును ముద్రించాడు. సాతానికోట (కర్నూలు)లో శక్తికుమారుని నాణేలు లభ్యమయ్యాయి. ఇతడి కాలంలోనే అశోకుడు కర్నూలులోని ‘ఎర్రగుడి’ ప్రాంతంలో శాసనం వేయించినట్లు తెలుస్తోంది.

శాతవాహనుల రాజకీయ చరిత్ర

‘మత్స్యపురాణం’లో శాతవాహనుల రాజకీయ చరిత్ర గురించి వివరాలు ఉన్నాయి. దీని ప్రకారం ఈ వంశంలోని రాజులు...

శ్రీముఖుడు

ఇతడినే చిముఖుడు, సిముఖుడిగా పేర్కొంటారు. ఇతడే శాతవాహన వంశ స్థాపకుడు. ఇతడి నాణేలు విదర్భలోని అకోలా, పుణేలోని శన్నార్, అహ్మద్‌నగర్‌లోని నేవసలో లభించాయి. వీటి ద్వారా ఇతడు ‘మౌర్యులకు సామంతుడి’గా ఉన్నట్లు తెలుస్తోంది. (మౌర్యులు భారతదేశంలో గొప్ప రాజులు. వీరిలో అశోకుడు చాలా ప్రసిద్ధుడు. ఉత్తర భారతదేశంలో ‘నంద వంశం’ తర్వాత మౌర్యులు రాజ్యానికి వచ్చారు. మౌర్యుల జన్మస్థలం పింప్రవనం. వీరి సామంతులే శాతవాహనులు.)

సామంతులు అంటే..

1. వీరికి స్వయం నిర్ణయాధికారాలు ఉండవు.
2. సొంతంగా నాణేలు ముద్రించుకోలేరు. తమకు తాముగా సార్వభౌమాధికారులుగా ప్రకటించుకోలేరు.
3. వీరు ‘అశ్వమేధ యాగాలు’ చేయకూడదు.

పైన పేర్కొన్న లక్షణాలున్న రాజ్యపాలకులను సామంతులుగా పేర్కొంటారు. విదర్భ, పుణే, అహ్మద్‌నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో శాతవాహనుల నాణేలు లభించాయి. ఇవన్నీ మహారాష్ట్రలో ఉండటం వల్ల వీరి తొలి రాజధాని ‘పైఠాన్’ లేదా ‘ప్రతిష్ఠానపురం’ అని శ్రీనివాస అయ్యర్ పేర్కొన్నారు.

తెలంగాణలోని కోటిలింగాల, సంగారెడ్డి, పటాన్‌చెరు, కొండాపూర్ మొదలైన ప్రదేశాల్లో వీరి నాణేలు లభించాయి. కాబట్టి వీరి తొలి రాజధాని ‘కోటి లింగాల’ అని బార్నేట్, వి.ఎ. స్మిత్ మొదలైన చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. శ్రీముఖుడు ‘33 ఏళ్లు’ రాజ్యపాలన చేసినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. ఇతడు తెలంగాణలోని ‘కోటి లింగాల’ రాజధానిగా రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలన చివర్లో రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. దీంతో రాజ్యాన్ని ఉత్తర దిశగా విస్తరించడానికి రాజధానిని ‘కోటిలింగాల’ నుంచి మహారాష్ట్రలోని ‘జున్నార్’కు మార్చాడని అజయ్ మిత్ర అభిప్రాయం. నానాఘాట్ శాసనం శ్రీముఖుడిని ‘రాయనిముఖ శాతవాహనో సిరిమతో’గా అభివర్ణించింది. శ్రీముఖుడు జైన మతస్థుడు.

కృష్ణుడు (కన్హుడు)

శ్రీముఖుని తర్వాత అతడి సోదరుడైన కృష్ణుడు సింహాసనం అధిష్ఠించాడు. మత్స్య, వాయు, బ్రహ్మాండ పురాణాల్లో ఇతడు 18 ఏళ్లు రాజ్యపాలన చేసినట్లు పేర్కొన్నారు. నాసిక్‌లో లభ్యమైన బ్రాహ్మి శాసనంలో కృష్ణుడిని సమణమహామాత (శ్రమణ మహామాత్ర)గా పేర్కొన్నారు. శ్రమణుల (బౌద్ధ భిక్షువులు) బాగోగులు చూడటానికి కృష్ణుడు నియమించిన మహామాత్రుడు (ఉన్నతాధికారి) గుహను తొలిపించాడు.

కృష్ణుడు తన అన్న మీద గౌరవంతో ఆయన పేరు మీద శాతవాహన వంశాన్ని ప్రారంభించాడు. కృష్ణుడు భాగవత మతాన్ని దక్కన్‌లో విస్తరించినప్పటికీ, బౌద్ధాన్ని కూడా ఆదరించాడు. (భాగవత మతాన్ని ఉత్తర భారతదేశంలో వాసుదేవుడు స్థాపించాడు. ఈ మతస్థులు శ్రీకృష్ణుడిని తమ ఆరాధ్య దైవంగా కొలుస్తారు)

మొదటి శాతకర్ణి

పురాణాల్లో ఇతణ్ని ‘మల్లకర్ణి’గా పేర్కొన్నారు. ఇతడు పదేళ్లు పరిపాలించాడు. శాతవాహన ‘నిజమైన స్థాపకుడు’ ఇతడే. ఈయన పూర్వీకులైన శ్రీముఖుడు, కృష్ణుడు మౌర్యులకు సామంతులు. కానీ మొదటి శాతకర్ణి తనకు తానుగా ‘సార్వభౌముడి’గా ప్రకటించుకొని స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. అశ్వమేధ యాగాలు నిర్వహించాడు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రదుణ్ని అతడి సేనాని పుష్యంగ మిత్రుడు హతమార్చి ‘శుంగ’ వంశాన్ని స్థాపించాడు. మౌర్యుల పతనంతో శాతకర్ణి స్వతంత్రుడిగా ప్రకటించుకునేందుకు అవకాశం లభించింది. మొదటి శాతకర్ణి తన రాజ్య విస్తరణకు ‘మహారధి త్రణకైయిరో’ కుమార్తె ‘దేవి నాగానిక’ను వివాహమాడి తెలంగాణతో పాటు మహారాష్ట్రను పాలించాడు. ‘కళింగాధిపతి’ అయిన మహామేఘ వాహన ఖారవేలుడు శాతకర్ణి రాజ్యంపైకి పెద్ద సంఖ్యలో త్రివిధ దళాలను పంపాడు. ‘కణ్ణబెణ్ణ’ నది వరకు ఇతడి సైన్యాలు వెళ్లగలిగాయి. విదర్భలో ప్రవహించే కణ్ణబెణ్ణ నదినే ప్రాచీన మరాఠా సాహిత్యంలో ‘గోదావరి నది’గా పేర్కొన్నారు. నాగ్‌పూర్‌కి ఈశాన్యంలో వెణ్ణ (చెణ్ణ), వైన్‌గంగా నదితో కలిసి ప్రవహిస్తోంది. ఈ రెండు నదులను కలిపి కణ్ణబెణ్ణ అని పిలిచేవారు. భిక్షురాజుగా ప్రసిద్ధి చెందిన ఖారవేలుడు రాజ్యపాలన చేపట్టిన రెండో ఏట శాతవాహన రాజ్యంతో యుద్ధం చేశాడు.

అసిక నగరం (నాగ్‌పూర్ జిల్లాలోని ఆడం సమీపంలో అసిక జనపద ముద్రిక ఒకటి లభించింది) వరకు ఇతడి సైన్యాలు విజృంభించాయని నానాఘాట్ శాసనం ద్వారా తెలుస్తోంది.

ఖారవేలుడు తన సైన్యంతో నల్గొండ జిల్లాలోని వాడపల్లి వద్ద కృష్ణానదిని దాటాడు. ‘పితుండా’ (గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు) నగరాన్ని ధ్వంసం చేసి గాడిదలతో దున్నించాడు.

మొదటి శాతకర్ణి సూర్యమిత్రుని నాణేలపై తన ముద్రను వేయించాడు. సూర్యమిత్రుని

రాజ్యాలైన మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌తో పాటు ‘విదిశ’ ప్రాంతాలను కూడా శాతకర్ణి ఆక్రమించుకున్నాడు. మొదటి శాతకర్ణి మరణించిన తర్వాత అతడి భార్య నాగానిక (నాగవరదాయిని) నానాఘాట్ శాసనం వేయించింది. ఈ శాసనంలో మొదటి శాతకర్ణిని ‘ఏకవీర’గా పేర్కొన్నారు.

వేదసిరి

వేదసిరి మొదటి శాతకర్ణి కుమారుడు. ఇతడు నానాఘాట్ శాసనంలో తన పూర్వీకులైన శ్రీముఖుడు, కన్హుడి ప్రతిమలను చెక్కించాడు. ఈ శాసనంలో తన సోదరులైన కుమార భాయ, కుమార హకుసిరి, కుమార శాతవాహన ప్రతిమలను కూడా వేదసిరి చెక్కించాడు. తన కుటుంబానికి సహకరించిన త్రణకైయిరో, ఇతర బంధువుల బొమ్మలను కూడా వేదసిరి చెక్కించాడు. ఇతడి తర్వాత వరుసగా.. .పూర్ణోత్సంగ, స్కందస్తంభి, రెండో శాతకర్ణి రాజ్యాన్ని పాలించారు. తర్వాత లంబోదర (క్రీ.పూ. 78–60), అప్పిలక రాజ్యాధికారాన్ని చేపట్టారు.

రెండో శాతకర్ణి (క్రీ.పూ.134-78)

ఇతడు దాదాపు 56 ఏళ్లు రాజ్యాన్ని పాలించాడు. ఇతడు కళింగ, పాటలీపుత్ర రాజ్యాలను జయించాడని ఆనందుడు అనే కవి పేర్కొన్నాడు.

అప్పిలక (క్రీ.పూ. 60-44)

మధ్యప్రదేశ్‌లోని భిలాస్‌పూర్‌లో ఇతడి నాణేలు లభించాయి. మేఘస్వాతి (క్రీ.పూ.44–30), స్వాతి (క్రీ.పూ.30–12), స్కంద స్వాతి



(క్రీ.పూ.12–5) కొద్ది కాలం పాటు రాజ్యాన్ని పాలించారు. వీరి తర్వాత మృగేంద్రుడు క్రీ.పూ. 5–2 మధ్య కాలంలో రాజ్యాన్ని పాలించాడు.

కుంతల శాతకర్ణి (క్రీ.పూ. 2 - క్రీ.శ. 5)

ఇతడు మహారాష్ట్రలోని దక్షిణ ప్రాంతాలను, కర్ణాటకలోని ఉత్తర ప్రాంతాలను జయించాడు. ఈ రెండు రాజ్యాలను కలిపి ‘కుంతల’ దేశమనే పేరుతో పాలించాడు. అందువల్ల ఇతడికి కుంతల శాతకర్ణి అనే పేరు వచ్చింది. వాత్స్యాయనుడి కామశాస్త్రం, యశోధరుడి జయమంగళం గ్రంథాల్లో ఇతడి ప్రస్తావన ఉంది. వాత్స్యాయనుడు కుంతల శాతకర్ణి ఆస్థానంలో ఉండేవాడు. మలయవతి రాణిని శృంగారంలోని ‘కర్తిర’ అనే రతి క్రీడలో కుంతల శాతకర్ణి చంపినట్లు వాత్స్యాయనుడు చెప్పాడు. (కామశాస్త్రాన్ని దాదాపు ‘58’ భాషల్లోకి అనువదించారు).

కుంతల శాతకర్ణి తర్వాత రాజ్యానికి వచ్చిన వారు వరుసగా...

1. **స్వాతి కర్ణుడు:** ఇతడు క్రీ.శ.5–6 మధ్య పాలించాడు.
2. **పులోమావి -1**(క్రీ.శ.6–41): ఉత్తర భారతదేశంలోని మగధపై దాడిచేసి కణ్వ వంశస్థుడైన సుశర్మ రాజును హతమార్చాడు.
3. **గౌర విష్ణుడు:** ఇతడు క్రీ.శ. 41 –66 మధ్య రాజ్యాన్ని పరిపాలించాడు. తర్వాత ‘హాలుడు’ రాజ్యానికి వచ్చాడు.

హాలుడు (క్రీ.శ. 66-71)

ఇతడు 17వ రాజు. హాలుడి పాలనా కాలంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇతడు ఒకే సంవత్సరం పరిపాలించాడని తెలుస్తుండగా, ఆరేళ్లు రాజ్యపాలన చేశాడని పురాణాలు తెలుపుతున్నాయి. హాలుడు ‘గాథాసప్తశతి’ (సప్తసాయి)ని రచించాడు. ‘మహారాష్ట్ర ప్రాకృతం’లో ఉన్న ఈ గ్రంథం 700 గ్రామీణ శృంగార కథల సమాహారం. హాలుడికి ‘కవి వత్సలుడు’ బిరుదు ఉంది. ఇతడి కాలంలో కర్ణాటకలోని కళ్యాణి రేవు పట్టణం వద్ద విదేశీ పడవలకు రక్షణ లేకుండా పోయిందని ‘పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సి’ గ్రంథంలో పేర్కొన్నారు. ఈ గ్రంథాన్ని ఒక గ్రీకు నావికుడు రచించినట్లు చెబుతున్నారు.

హాలుని ఆస్థానంలోని ప్రసిద్ధ కవులు:

1. **గుణాఢ్యుడు:** ఇతడు ‘బృహత్‌కథ’ గ్రంథాన్ని ‘పైశాచిక’ ప్రాకృతంలో రచించాడు. ఇతడు తొలి తెలంగాణ కవి.
2. **శర్వ వర్మ:** ‘కాతంత్ర్య వ్యాకరణం’ గ్రంథకర్త. సులభపద్ధతిలో సంస్కృతం నేర్చుకోవడానికి ఈ గ్రంథం ఉపయోగపడుతుంది. ఇతడి తర్వాత మాండూలకుడు, పురీంద్రసేనుడు, సుందర స్వాతికర్ణి, చకోర స్వాతికర్ణి, శివ స్వాతికర్ణి వరుసగా రాజ్యానికి వచ్చారు.

గౌతమీపుత్ర శాతకర్ణి (క్రీ.శ. 110-134)

ఇతడు 23వ రాజు. గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చిన సమయం కచ్చితంగా తెలియదు. ఇతడు నహపాణుడిని ఓడించి క్షహారాట వంశాన్ని నిర్మూలించాడు. ‘జోగల్‌తంబి’ లో దొరికిన రూపాణుని వెండి నాణేలు, నాసిక్, కార్లే, జున్నార్ శాసనాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. మరత్వాడి ప్రాంతం కూడా గౌతమీపుత్ర శాతకర్ణి ఆధీనంలో ఉన్నట్లు ‘బోర్డన్’ తవ్వకాల్లో దొరికిన ‘రాగి’ నాణేల ద్వారా తెలుస్తోంది. గౌతమీపుత్ర శాతకర్ణి సింహాసనాన్ని అధిష్ఠించే సమయానికే కర్ణాటక, విదర్భ, దక్షిణ మహారాష్ట్ర శాతవాహన రాజ్యంలో భాగంగా ఉన్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి జయించిన రాజ్యాలు...

1. అసిక లేదా అస్మక (తెలంగాణ)
2. ములక (మహారాష్ట్ర)
3. సౌరాష్ట్ర (గుజరాత్)
4. అపరాంత (కొంకణ్)
5. అనూప (విదర్భ)
6. నేతగిరి (శ్రీ పర్వతం)
7. నీలిగిరి (తమిళనాడు)
8. మహేంద్రగిరి (ఒడిశా)

గౌతమీపుత్ర శాతకర్ణికి ‘త్రిసముద్రతోయ పీత వాహన’, ‘దక్షిణాపథపతి’ అనే బిరుదులు ఉన్నాయి. ఇతడి తల్లి గౌతమి బాలశ్రీ నాసిక్ శాసనాన్ని వేయించింది. ఇందులో గౌతమీపుత్ర శాతకర్ణిని ‘శాతవాహనకుల యశ ప్రతిష్ఠాపనాకర’గా అభివర్ణించారు (గౌతమీపుత్ర శాతకర్ణి మరణించిన 19 ఏళ్ల తర్వాత ఈ శాసనాన్ని చెక్కించారు). ‘ఏక బ్రాహ్మణ’, ‘క్షత్రీయదర్పమాణ’ అనేవి ఇతడి ఇతర బిరుదులు. బెణకటకం నగరాన్ని నిర్మించి బెణగటక స్వామిగా ప్రసిద్ధి చెందాడు.

వాసిష్టిపుత్ర పులోమావి

ఇతడు 24వ రాజు. గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుడు. 28 ఏళ్లు (క్రీ.శ.134–162) పరిపాలించాడు. తన బొమ్మలతో కూడిన వెండి నాణేలను ముద్రించాడు. ఇతడికి ‘దక్షిణాపథేశ్వరుడు’ బిరుదు ఉంది. నాసిక్ ప్రాంతంలో గోవర్ధన, పైఠాన్ నగరాలను నిర్మించాడు. ‘నవనగర స్వామి’ అనే బిరుదు పొందాడు. మహాక్షాత్రపరాజైన ‘చేష్టనుడు’ ఇతడి సమకాలీనుడు.

వాసిష్టిపుత్ర శాతకర్ణి

ఇతడు 25వ రాజు, పులోమావి సోదరుడు. మహాక్షాత్రపుడైన రుద్రదామని అల్లుడు (సంస్కృతంలో శాసనాలు ముద్రించిన తొలి భారతీయ రాజు రుద్రదమనుడు). ఇతడు ‘కన్హేరి’ శాసనాన్ని సంస్కృతంలో వేయించాడు.(శాతవాహనుల కాలంలో వచ్చిన శాసనాలన్నీ ప్రాకృతంలోనే ఉన్నాయి. కానీ ‘కన్హేరి’ శాసనం మాత్రమే సంస్కృతంలో ఉంది).

మాదిరి ప్రశ్నలు

1. గౌతమీపుత్ర శాతకర్ణికి సంబంధించి కిందివాటిలో సరికాని అంశం ఏది?
ఎ) క్షహారాట వంశం నిర్మూలించడం
బి) మాతృ సంజ్ఞలు పాటించడం
సి) జోగల్‌తంబిలో ఇతడి నాణేలు లభించలేదు
డి) దక్షిణా సముద్రాధిపతిగా ప్రసిద్ధి
1) ఎ మాత్రమే 2) బి, సి మాత్రమే
3) బి, డి మాత్రమే 4) సి, డి మాత్రమే
2. శాతవాహనుల కాలంనాటి స్త్రీలకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1)రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు
2) మత విషయాల్లో జోక్యం చేసుకునేవారు
3) దాతృత్వం, దాన ధర్మాలు, సంక్షేమ విషయాల్లో కీలకంగా వ్యవహరించేవారు
4) పైవన్నీ
3. బౌద్ధ మతస్థులకు అభయం ఇస్తున్నట్లు ఉన్న మాందాతా శిల్పం ఎక్కడుంది?
1) నాగార్జున కొండ 2) ఏలేశ్వరం
3) జగ్గయ్యపేట 4) చేజెర్ల
4. కిందివాటిలో సరికాని జత ఏది?
1) పూర్వ శైలి – అమరావతి
2) అపరశైలి – శ్రీ పర్వతం
3) ఉత్తర శైలి – గుడివాడ
4) రాజగిరిక – గుంటుపల్లి
5. శాతవాహన నిజమైన రాజ్య స్థాపకుడు?
1) సిముఖుడు
2) గౌతమీపుత్ర శాతకర్ణి
3) మొదటి శాతకర్ణి
4) యజ్ఞశ్రీ శాతకర్ణి

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 3 5) 3

విద్య, ఉద్యోగ సమాచారం

సీఈఎల్, ఘజియాబాద్‌లో 19 పోస్టులు

ఘజియాబాద్(యూపీ)లోని సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(సీఈఎల్).. టెక్నికల్ రెగ్యులర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–12, టెక్నీషియన్ బి–07.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ(ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్ /మెషినిస్ట్), డిప్లొమా/బీఎస్సీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** 25 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.22,250 నుంచి రూ.75,000. టెక్నీషియన్–బి పోస్టుకు రూ.19,000 నుంచి రూ.60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్/ప్రాక్టికల్ ఎగ్జామినేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.12.2024.
» **వెబ్‌సైట్:** https://celindia.net

గోవా షిప్‌యార్డ్‌లో 12 పోస్టులు

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్(జీఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ప్రొడక్షన్ కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **విభాగాలు:** హెచ్‌యూఎల్ఎల్, మెకానికల్, వెపన్స్, పవర్, జీటీ మెషినరీ కంట్రోల్స్.
» **అర్హత:** ఇంజనీరింగ్ డిప్లొమా లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 31.10.2024 నాటికి 65 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్(హెచ్ఆర్–ఏ), డా.బీఆర్ అంబేద్కర్ భవన్, గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, వాస్కోడగామా, గోవా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.12.2024.
» **వెబ్‌సైట్:** https://goashipyard.in

ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మార్చేది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్ - ఎస్ఏ కంటెంట్

ఆమ్లాలు - క్షారాలు - లవణాలు

- అలోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు ఆమ్లాలు ఏర్పడతాయి.
- ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ నీటితో చర్య జరిపి ఫాస్ఫారిక్ ఆమ్లాన్ని ఏర్పరుస్తుంది.
$P_2O_5 + H_2O \rightarrow 2H_3PO_4$
- ఎక్కువ భాష్పశీల ఆమ్లాల నుంచి తక్కువ భాష్పశీల ఆమ్లాలను తయారు చేయవచ్చు.
$2NaCl + H_2SO_4 \rightarrow Na_2SO_4 + 2HCl$
- లోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు క్షారాలు ఏర్పడతాయి.
$Na_2O + H_2O \rightarrow 2\,NaOH$
- ఆమ్లాలు నీలి లిట్మస్‌ను ఎరుపుకు మారుస్తాయి.
- ఆమ్లాలు నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచిక రంగును ఎరుపు రంగుకు మారుస్తాయి.
- Zn, Mg మొదలైన లోహాలతో ఆమ్లాలు చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.
ఉదా: $Zn + H_2SO_4 \rightarrow ZnSO_4 + H_2$
- ఆమ్లాలు, క్షారాలతో చర్య పొంది నీటిని, లవణాలను ఏర్పరుస్తాయి.
$HCl + NaOH \rightarrow NaCl + H_2O$
- కార్బొనేట్‌లు, బై కార్బొనేట్‌లతో ఆమ్లాలు చర్య పొంది CO_2 వాయువును విడుదల చేస్తాయి.
$Na_2CO_3 + 2HCl \rightarrow 2NaCl + CO_2 + H_2O$
- క్షారాలు ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మారుస్తాయి.
- క్షారాల నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను పసుపు రంగుకు మారుస్తాయి.
- క్షారాలను వేడిచేస్తే లోహ ఆక్సైడ్‌లను, నీటిని ఏర్పరుస్తాయి.
- ఆమ్ల, క్షారాల జల ద్రావణాలు విద్యుత్ వాహకతను ప్రదర్శిస్తాయి.
- 1887లో స్వీడన్ దేశస్థుడైన అర్హీనియస్ అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ పదార్థాల్లో ఆమ్లాలు, క్షారాలు కూడా ఉన్నాయి.
- అర్హీనియస్ సిద్ధాంతం ప్రకారం జల ద్రావణంలో H^+ అయాన్లు ఇచ్చేవి ఆమ్లాలు.
$HCl \rightarrow H^+ + Cl^-$
- జల ద్రావణంలో OH^- అయాన్‌లను ఇచ్చే పదార్థాలు క్షారాలు.
$NaOH \rightarrow Na^+ + OH^-$
- స్వచ్ఛమైన నీరు మంచి విద్యుద్వాహకం కాదు.
- నీరు అతి తక్కువ పరిమాణంలో అయనీకరణం చెంది H^+, OH^- అయాన్‌లను ఇస్తుంది.
$H_2O \rightleftharpoons H^+ + OH^-$ (సమతాస్థితి)
- ఒక మోల్ నీటిలో గల $[H^+]$, $[OH^-]$ అయాన్‌ల గాఢతల లబ్ధాన్ని నీటి అయానిక లబ్ధం అంటారు. దీన్ని K_wతో సూచిస్తారు.
$K_w = [H^+] \times [OH^-] = 1 \times 10^{-14}$ (25^0C వద్ద)
- ఉష్ణోగ్రత పెరుగుదలతో అయనీకరణం, దానితోపాటు K_w విలువ కూడా పెరుగుతుంది.
- నీటి అయానిక లబ్ధానికి ప్రమాణాలు మోల్.అయాన్^{2}/లీ^{2}
- P^H పదాన్ని సొరెన్‌సేన్ పరిచయం చేశారు.
$P^H = -\log_{10}[H^+]$
- ఆమ్ల ద్రావణాలకు $[H^+] > 10^{-7}$; $P^H < 7$ తటస్థ ద్రావణాలకు $[H^+] = 10^{-7}$; $P^H = 7$
క్షార ద్రావణాలకు $[H^+] < 10^{-7}$; $P^H > 7$
- సంపూర్ణంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలమైన ఆమ్లాలు. పాక్షికంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలహీనమైన ఆమ్లాలు.

HCl (బలమైన ఆమ్లం) $\rightarrow H^+ + Cl^-$ (100% అయనీకరణం)
CH_3COOH(బలహీన ఆమ్లం) $\rightleftharpoons$ $CH_3COO^- + H^+$(<100% అయనీకరణం)

- సంపూర్ణంగా అయనీకరణం చెందే క్షారాలు బలమైన క్షారాలు. పాక్షికంగా అయనీకరణం చెందే క్షారాలు బలహీన క్షారాలు.
$NaOH$(బలమైన క్షారం) $\rightarrow Na^+ + OH^-$ (100% అయనీకరణం)
NH_4OH(బలహీన క్షారం) $\rightleftharpoons NH_4^+ + OH^-$ (<100% అయనీకరణం)
- ఒక మోల్ బలమైన ఆమ్లం, ఒక మోల్ బలమైన క్షారంతో చర్య పొంది వెలువడే ఉష్ణాన్ని తటస్థీకరణోష్ణం అంటారు.
$H^+ + OH^- \rightarrow H_2O + 13.7$ K.Cal / Mole
- బలమైన ఆమ్ల, క్షారాల మధ్య జరిగే చర్యకు తటస్థీకరణోష్ణం 13.7 KCal / Mole
$NaOH + HCl \rightarrow NaCl + H_2O + 13.7$ KCal / Mole
- బలహీన ఆమ్లం, బలమైన క్షారం మధ్య తటస్థీకరణోష్ణం జరిగినప్పుడు విడుదలయ్యే ఉష్ణం = 13.7 KCal / Mole కంటే తక్కువగా ఉంటుంది.
$CH_3COOH + NaOH \rightarrow CH_3COONa + H_2O + 13.4$ KCal / Mole

మాదిరి ప్రశ్నలు

1. ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మార్చేవి?
1) ఆమ్లాలు 2) క్షారాలు
3) లవణాలు 4) పైవన్నీ
2. నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను ఎరుపు రంగుకు మార్చేవి?
1) ఆమ్లాలు 2) క్షారాలు
3) లవణాలు 4) అన్నీ
3. అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?
1) లూయిస్ 2) అర్హీనియస్
3) ఆస్వాల్డ్ 4) సొరెన్‌సేన్
4. తటస్థ ద్రావణాల P^H విలువ?
1) 6 2) 5
3) 9 4) 7
5. క్షార ద్రావణాల్లో ఫినాఫ్తలీన్ సూచిక రంగు?
1) పసుపు 2) ఆకుపచ్చ
3) గులాబీ 4) నారింజ
6. నిమ్మ రసం P^H విలువ?
1) 1–2 2) 2–4
3) 2 4) 5–6
7. P^H అనే పదాన్ని ఎవరు పరిచయం చేశారు?
1) మోస్లే 2) అర్హీనియస్
3) సొరెన్‌సేన్ 4) లూయిస్
8. రక్తం గుణం?
1) ఆమ్లం 2) క్షారం
3) తటస్థం 4) ఏదీ కాదు
9. 25^0C వద్ద నీటి అయానిక లబ్ధం విలువ____ మోల్ / అయాన్^{2}/లీ^{2}
1) 0.4×10^{-14} 2) 1.0×10^{-14}
3) 1.4×10^{-15} 4) 1×10^{-12}
10. మిథైల్ ఆరెంజ్ సూచిక గల ఆమ్ల ద్రావణ రంగు?
1) ఎరుపు 2) పసుపు
3) ఆకుపచ్చ 4) నీలం
11. 0.001 M HCl ద్రావణ P^H విలువ?
1) 2 2) 4
3) 3 4) 1
12. ఆమ్ల ఆక్సైడ్‌కు ఉదాహరణ?
1) Na_2O 2) Mgo
3) Cao 4) SO_2
13. Na_2CO_3, $NaHCO_3$లతో ఆమ్లాలు చర్య జరపగా ____ వాయువు వెలువడుతుంది?
1) O_2 2) H_2
3) CO_2 4) Co
14. వీటిలో ఆమ్లం కానిదేది?
1) HNO_3 2) H_2SO_4
3) CH_3COOH 4) KoH
15. క్షారాలు నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను ____ రంగుకు మారుస్తాయి?
1) ఎరుపు 2) నీలం
3) నలుపు 4) పసుపు
16. ఎసిటికామ్లాన్ని అయనీకరణం చెందించేందుకు ఎంత ఉష్ణం ఉపయోగపడుతుంది?
1) 0.1 KCals 2) 0.2 KCal
3) 0.3 KCal 4) ఏదీకాదు
17. లోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి ఏర్పర్చే పదార్థాలు ఏ వర్గానికి చెందుతాయి?
1) ఆమ్లం 2) క్షారం
3) లవణం 4) తటస్థ ద్రావణం
18. ఆమ్ల స్వభావం కలిగి నీటిలో కరగనిది?
1) SiO_2 2) HCl
3) Na_2CO_3 4) ఏదీకాదు
19. హైడ్రోనియం అయాన్____
1) H_3O 2) H^+
3) OH^- 4) H_2O_2
20. $NaCl$ ద్రావణ P^H విలువ?
1) 3 2) 7 3) 8.9 4) 12

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 3; 6) 2; 7) 3; 8) 2; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 3; 14) 4; 15) 4; 16) 3; 17) 2; 18) 1; 19) 1; 20) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 0.001 M HCl ద్రావణం P^H విలువ? (డీఎస్సీ - 2003)
1) 4 2) 3 3) 2 4) 1
2. ఒక బలమైన ఆమ్లం, మరొక బలమైన క్షారంతో చర్య జరిపినప్పుడు వెలువడే తటస్థీకరణోష్ణం విలువ? (డీఎస్సీ - 2006)
1) 13.7 KCal / Mole
2) 13.4 KCal / Mole
3) 0 KCal / Mole
4) 0.3 KCal / Mole
3. $P^H = 8$గా గల ద్రావణంలో $[H^+]$ అయాన్‌ల గాఢత ఎంత? (డీఎస్సీ - 2006)
1) 10^8 2) 10^{-8}
3) 8 4) $\log 10^{-8}$
4. ఆమ్ల ద్రావణంలో మిథైల్ ఆరంజ్ సూచిక రంగు? (డీఎస్సీ - 2006)
1) పసుపు 2) ఆకుపచ్చ
3) నారింజ 4) ఎరుపు
5. ఫాస్ఫారిక్ ఆమ్లం, సోడియం హైడ్రాక్సైడ్‌తో చర్య పొంది సోడియం ఫాస్ఫేట్ ఏర్పడే చర్యలో ఒక అణువు ఫాస్ఫారిక్ ఆమ్లంతో కలిసే సోడియం హైడ్రాక్సైడ్ అణువుల సంఖ్య? (డీఎస్సీ - 2008)
1) 3 2) 4 3) 1 4) 2
6. ఏ లోహం H_2SO_4తో చర్య జరపదు? (డీఎస్సీ - 2008)
1) Zn 2) Cu 3) Au 4) Pb
7. $[H^+] = 10 \times 10^{-4}$ M గాఢత గల ద్రావణం P^H విలువ? (డీఎస్సీ - 2012)
1) 1 2) 2 3) 3 4) 4

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 1; 6) 3; 7) 3.


సాక్షి ప్లస్
బుధవారం। 4-12-2024

జయక్‌వాడీ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ



భారతదేశం - బహుళార్థ సాధక ప్రాజెక్టులు

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అని భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్న మాట నాటికి, నేటికీ అక్షర సత్యం. మన దేశ ప్రగతిని సరికొత్త మలుపు తిప్పినవి బహుళార్థ సాధక ప్రాజెక్టులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి దేశంలో మొదటి పంచవర్ష ప్రణాళిక(1951) నుంచి వివిధ ప్రాంతాల్లో పలు బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించారు.

- ఒకటి కంటే ఎక్కువ సదుపాయాల కల్పనకు ఉద్దేశించి నిర్మించిన ప్రాజెక్టునే బహుళార్థ సాధక ప్రాజెక్టు అంటారు.
- భారతదేశంలో వ్యవసాయ నీటిపారుదల, గృహ, పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా, విద్యుదుత్పాదన, వరద నివారణ, స్థానిక రవాణా, భూ సంరక్షణ, మత్స్య పరిశ్రమ అభివృద్ధి, విహారయాత్ర, కృత్రిమ వనాల పెంపకం మొదలైన అనేక ప్రయోజనాల కోసం ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.
- బెంగాల్‌లో 1948లో వరదలను, వాటిఅనుబంధ సమస్యలను నివారించడానికి దామోదర్ నదీ, దాని ఉపనదులపైన ప్రాజెక్టులు కట్టడం కోసం మొట్టమొదటి నదీలోయ ప్రాజెక్టు సంస్థను ఏర్పాటు చేశారు.
- ఈ సంస్థను అమెరికాలోని టెన్నిస్ వేలీ అథారిటీ (టీవీఏ) నమూనా ఆధారంగా ఏర్పాటు చేశారు.
- 1948 ఫిబ్రవరి 18న భారత పార్లమెంట్ ఈ సంస్థను ఆమోదించడంతో ఇది దామోదర్ లోయ కార్పొరేషన్ (డీవీసీ)గా వాస్తవ రూపం దాల్చింది.
- డీవీసీ ఏర్పడక ముందు వరదలతో బెంగాల్ దుఃఖదాయినులుగా దామోదర్, దాని ఉపనదులున్నాయి. తర్వాత వాటిపై ప్రాజెక్టులు నిర్మించడంతో బెంగాల్ వరదాయినులుగా ఉన్నాయి.
- భారతదేశంలో నీటి పారుదల ప్రాజెక్టులను మూడు రకాలుగా విభజించవచ్చు.
  అవి...
  1) భారీ నీటిపారుదల పథకాలు
  2) మధ్య తరహా నీటి పారుదల పథకాలు
  3) చిన్న తరహా నీటి పారుదల పథకాలు
- ప్రాజెక్టు కల్పించే నీటి పారుదల విస్తీర్ణాన్ని బట్టి ప్రాజెక్టులను విభజించారు.

1. **భారీ నీటిపారుదల పథకాలు**
- 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలను భారీ నీటిపారుదల పథకాలు అంటారు.
- వీటిని ప్రధానంగా నదులపై నిర్మిస్తారు.

2. **మధ్య తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 నుంచి 10,000 హెక్టార్ల వరకు ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలు.
- వీటిని నదులపై, ఉపనదులపై నిర్మిస్తారు.

3. **చిన్న తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 హెక్టార్ల కంటే తక్కువ ఆయకట్టు గల పథకాలు.
- భూగర్భ జల పథకాలు, ఉపరితల జల పథకాలు ఈ తరహా పథకాల్లోకి వస్తాయి.

భూగర్భ జల పథకాలు: సాధారణ బావులు, గొట్టపు బావులు.

ఉపరితల జల పథకాలు: చెరువులు, జలాశయాల నుంచి నీటిని మళ్లించే పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు.

ఆయకట్టు ప్రాంత అభివృద్ధి పథకం

- నీటిపారుదల ఆవశ్యకత, ఉత్పత్తి, వినియోగాల మధ్య అంతరాన్ని పూడ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1974-75లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- భారతదేశంలో 1990లో జాతీయ జల మండలిని ఏర్పాటు చేశారు.
- 2008 నవంబర్ 4న గంగానదిని 'జాతీయ నది'గా ప్రకటించారు.

దేశంలో కొన్ని ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులు

1. **భాక్రానంగల్ ప్రాజెక్టు**
- దేశంలో నిర్మించిన మొట్టమొదటి ప్రాజెక్టు, అన్నిటికంటే పెద్దది.
- దీన్ని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962 అక్టోబర్ 22న జాతికి అంకితం చేశారు.
- ఈ ప్రాజెక్టు పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల ఉమ్మడి పథకం. వీటితోపాటు హిమాచల్ ప్రదేశ్ కూడా లబ్ధి పొందుతోంది.
- సట్లేజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లో భాక్రా అనే ప్రాంతంలో భాక్రా ఆనకట్ట (226 మీటర్లు), పంజాబ్‌లోని నంగల్ ప్రాంతం వద్ద నంగల్ ఆనకట్ట(29 మీటర్లు)ను నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 1204 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తుంది.

2. **హీరాకుడ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టును ఒడిశాలో మహానదిపై నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 4801 మీటర్ల పొడవుతో ప్రపంచంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది.
- దీన్ని విద్యుదుత్పాదన, నీటిపారుదల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారు.

3. **నాగార్జున సాగర్ ప్రాజెక్టు**
- తెలంగాణలోని నల్గొండ జిల్లాలో నందికొండ గ్రామ సమీపంలో కృష్ణానదిపై నిర్మించారు.
- ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణఉమ్మడి రాష్ట్రాల పథకం.
- దీనికి భారత తొలి ప్రధాని నెహ్రూ 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేశారు.
- ఈ ప్రాజెక్టు 1450 మీటర్ల పొడవుతో, రాతి కట్టడపు ఆనకట్టల్లో ప్రపంచంలోనే ప్రథమ స్థానం పొందింది.
- దీని కుడి కాలువను జవహర్ కాలువ అంటారు. ఈ కాలువ 204 కి.మీ. పొడవు ఉంది. ఇది గుంటూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందిస్తుంది.
- దీని ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువ అంటారు. ఈ కాలువ 179 కి.మీ. పొడవుతో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నీటిని సరఫరా చేస్తోంది.
- ఈ ప్రాజెక్టు పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది.

4. **దామోదర్ నదీలోయ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం బెంగాల్ ప్రాంతాన్ని.. దామోదర్ నది, దాని ఉపనదుల వల్ల వచ్చే వరదల నుంచి కాపాడడం.
- ఈ పథకంలో భాగంగా తిలయ్యా, మైథాన్ ఆనకట్టలు - బరాకర్ నదిపై, పంచట్‌హిల్ ఆనకట్ట - దామోదర్ నదిపై, కోనార్ ఆనకట్ట- కోనార్ నదిపై నిర్మించారు.

5. **బియాస్ పథకం**
- ఇది పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఇది బియాస్ జలాలను సట్లేజ్ జలాలతో కలుపుతుంది.
- బియాస్ నదిపై 'పోంగ్' వద్ద ఈ ఆనకట్టను నిర్మించారు.

6. **కోసి ప్రాజెక్టు**
- దీన్ని బీహార్-నేపాల్ సరిహద్దులోని హనుమాన్‌నగర్ సమీపంలో 'కోసి' నదిపై నిర్మించారు.
- ఇది అంతర్జాతీయ పథకం

7. **గండక్ పథకం**
- దీన్ని బీహార్‌లోని వాల్మీకినగర్ వద్ద గండక్ నదిపై నిర్మించారు.
- ఇది బీహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్‌ల ఉమ్మడి పథకం.

8. **చంబల్ పథకం**
- ఇది మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని చంబల్ నదిపై నిర్మించారు.
- ఈ పథకంలో మూడు ఆనకట్టలున్నాయి.
  అవి ...
  1) గాంధీసాగర్ ఆనకట్ట
  2) రాణా ప్రతాప్‌సాగర్ ఆనకట్ట
  3) జవహర్ సాగర్ ఆనకట్ట

9. **తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, ఢిల్లీ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని 'భాగీరథి' నదిపై హిమాలయ ప్రాంతం (ఉత్తరాఖండ్)లోని భూకంపాలు సంభవించే ప్రదేశంలో నిర్మించడం వల్ల ఇది వివాదాస్పదమైంది.
- తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిన వ్యక్తి - సుందర్‌లాల్ బహుగుణ.

10. **ఇందిరాసాగర్ ప్రాజెక్టు**
- ఇది నర్మద నదిపై ఉంది.
- దీన్ని గుజరాత్‌లోని పూర్ణసా ప్రాంతంలో నిమొరి జిల్లాలో నిర్మించారు.
- ఇది మధ్యప్రదేశ్, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు

11. **సర్దార్ సరోవర్ ప్రాజెక్టు**
- దీన్ని నర్మద నదిపై, గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో బడగావ్ అనే ప్రాంతంలో నిర్మించారు.
- ఇది రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మేధాపాట్కర్ చేపట్టిన ఉద్యమమే- నర్మదా బచావో.

మరికొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

ప్రాజెక్టు పేరు	నది	రాష్ట్రాలు	ఇతర అంశాలు
1. బాగ్లీహార్ ప్రాజెక్టు	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	భారత్, పాకిస్తాన్‌ల మధ్య వివాదాస్పదమైంది
2. ధూల్‌హస్తి	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	-
3. నాథ్‌పాజాక్రి	సట్లేజ్	హిమాచల్ ప్రదేశ్	-
4. రిహాండ్	రిహాండ్	ఉత్తరప్రదేశ్	-
5. రామ్‌గంగా	రామ్‌గంగా	ఉత్తరప్రదేశ్	ఢిల్లీ నగరానికి 200 క్యూసెక్కుల నీటి సరఫరా
6. సువర్ణరేఖ	సువర్ణరేఖ	బీహార్	-
7. ఫరక్కా	హుగ్లీ	పశ్చిమ బెంగాల్	-
8. మయూరాక్షి	మురళీ	పశ్చిమ బెంగాల్	-
9. జయక్‌వాడీ	గోదావరి	మహారాష్ట్ర	-
10. బాబ్లీ	గోదావరి	మహారాష్ట్ర	-
11. అల్మట్టి	కృష్ణా	కర్ణాటక	-
12. ఇదుక్కి	పెరియార్	కేరళ	-
13. శబరిగిరి	పంప	కేరళ	-
14. మెట్టూరు	పైకారా	తమిళనాడు	పైకారా నది కావేరి నదికి ఉపనది
15. ఉకాయ్	తపతి	గుజరాత్	-
16. కాక్రపార	తపతి	గుజరాత్	-
17. శ్రీరాంసాగర్	గోదావరి	తెలంగాణ	దీని కాలువ కాకతీయ కాలువ. దీన్ని నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద నిర్మించారు.
18. సుంకేసుల	తుంగభద్ర	ఆంధ్రప్రదేశ్	కర్నూలు జిల్లాలో ఉంది
19. పులిచింతల	కృష్ణానది	ఆంధ్రప్రదేశ్	గుంటూరు జిల్లాలో ఉంది. దీని పేరు కెఎల్.రావు సాగర్
20. జంఝావతి	జంఝావతి నది	ఆంధ్రప్రదేశ్	విజయనగరం
21. ఎల్లంపల్లి(శ్రీ పాదసాగర్)	గోదావరి	తెలంగాణ	కరీంనగర్

మాదిరి ప్రశ్నలు

1. 'మెట్టూరు జల విద్యుత్ కేంద్రం' ఏ నదిపై ఉంది?
   1) తుంగభద్ర 2) మహానది
   3) కావేరి 4) గోదావరి
2. కిందివాటిలో 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'లో భాగాలైన ఆనకట్టలు ఏవి?
   1) తిలైయా 2) మైథాన్
   3) పంచట్ 4) పైవన్నీ
3. భారతదేశ జాతీయ నది?
   1) గోదావరి 2) గంగా
   3) కృష్ణా 4) నర్మద
4. అల్మట్టి ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?
   1) గోదావరి 2) కృష్ణా
   3) పెన్‌గంగా 4) పూర్ణ
5. దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు ఒక?
   1) జలవిద్యుత్ 2) నీటిపారుదల
   3) బహుళార్థ సాధక
   4) ఏదీకాదు
6. కింది వాటిలో ఏ జల విద్యుత్ కేంద్రం ఉత్తరప్రదేశ్‌లో ఉంది?
   1) మయూరాక్షి 2) రిహాండ్
   3) కంగ్సబతి 4) హీరాకుడ్
7. అత్యధిక ప్రాజెక్టులను ఏ నదిపై నిర్మించారు?
   1) గోదావరి 2) గంగా
   3) నర్మద 4) కావేరి
8. భారతదేశంలో అత్యంత ఎత్తైన ప్రాజెక్టు?
   1) నాథ్ ప్రాజెక్టు 2) భాక్రా ప్రాజెక్టు
   3) నాగార్జున ప్రాజెక్టు
   4) హీరాకుడ్ ప్రాజెక్టు
9. కిందివాటిలో అంతర్జాతీయ ప్రాజెక్టు?
   1) కోసి 2) చంబల్
   3) తెహ్రీడ్యామ్ 4) మయూరాక్షి
10. ప్రపంచంలో అతి పెద్ద రాతికట్టడపు ఆనకట్ట ఏది?
   1) భాక్రానంగల్ 2) హీరాకుడ్
   3) నాగార్జున సాగర్ 4) కోసి
11. భారతదేశంలో జాతీయ జల మండలిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1975 2) 1948
   3) 1951 4) 1990

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 2; 9) 1; 10) 3; 11) 4.


గతంలో వచ్చిన ప్రశ్నలు

1. 'సుంకేసుల' ప్రాజెక్టును ఏ నదిపై నిర్మిస్తున్నారు? (కానిస్టేబుల్-2012)
   1) గోదావరి 2) నాగావళి
   3) తుంగభద్ర 4) పెన్నా
2. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో జంఝావతి రబ్బర్ డ్యాం ఉంది?
   (కానిస్టేబుల్-2009)
   1) వరంగల్ 2) శ్రీకాకుళం
   3) విశాఖపట్నం 4) విజయనగరం
3. పులిచింతల ప్రాజెక్టు ఎవరి పేరుతో నిర్మించారు?
   (కానిస్టేబుల్-2009)
   1) డి. సంజీవయ్య 2) కె.ఎల్.రావు
   3) కోట్ల విజయభాస్కర్ రెడ్డి
   4) జె. చొక్కారావు
4. ఇందిరాసాగర్ ఆనకట్టను ఏ నదిపై నిర్మించారు?
   (కానిస్టేబుల్-2013)
   1) మహానది 2) చంబల్
   3) నర్మద 4) యమున
5. జపాన్ సహాయంతో పూర్తి చేసిన పైథాన్ (జయక్‌వాడీ) జల విద్యుత్ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?
   (కానిస్టేబుల్ - 2013)
   1) గంగ 2) గోదావరి
   3) నర్మద 4) కావేరి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2.

Command that fixes the minor errors..



BANK EXAMS

COMPUTER AWARENESS

1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
   a) Pulse code modulation
   b) Pulse stretcher
   c) Query processing
   d) Queue management
   e) None of these
2. The most important or powerful computer in a typical network is:
   a) desktop b) network client
   c) network server
   d) network station
   e) my computer
3. In MS word what is the short curt of Ctrl + L?
   a) Left Align b) Left Indent
   c) Increase Left Margin
   d) Decrease Left Margin
   e) None
4. Which of the following can NOT be used to create parallel style column?
   a) Format Tabs
   b) Table Insert Table
   c) Insert Textbox
   d) Format Columns
   e) None of these
5. An Internet standard for transferring files is known as:
   a) IRC b) Telnet c) FTP
   d) WAIS e) None of these
6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
   a) Cybercast and analog cash
   b) Digital cash and cybercom
   c) Carders and cybercom
   d) Cybercast and digital cash
   e) None of these
7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
   a) B2C b) C2C c) G2C
   d) B2B e) None of these
8. The command that fixes the minor errors of the disk:
   a) Error.fix b) Scandisk
   c) Chkdsk d) Defrag
   e) None of these
9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
   a) Peer-to-peer model
   b) Client/server model
   c) P-to-p model
   d) Ring network e) None
10. If a computer has a(n) ______ port, it does not need a NIC.
   a) Internet b) Ethernet
   c) Intranet d) Broad band
   e) None of these
11. Microprocessors as switching devices are used for which generation computers?
   a) First Generation
   b) Second Generation
   c) Third Generation
   d) Fourth Generation
   e) None of these
12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
   a) Extended Binary Coded Decimal Interchange Code
   b) Extended Bit Code Decimal Interchange Code
   c) Extended Bit Case Decimal Interchange Code
   d) Extended Binary Case Decimal Interchange Code
   e) None of these
13. Storage capacity of magnetic disk depends on:
   a) Tracks per inch of surface
   b) Bits per inch of tracks
   c) Disk pack in disk surface
   d) All of abovee) None of these
14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
   a) Memory b) Buffer
   c) Accumulator d) Address
   e) None of these
15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ________.
   a) Internal modem
   b) External modem
   c) PC Card modem
   d) Wireless modem e) None
16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
   a) ISDN b) Microwave
   c) Cable modem d) DSL
   e) None of these
17. The rules for exchanging data between computers are called
   a) Interconnections
   b) Synchronous packages
   c) Protocols
   d) Data transmission synchronization
   e) None of these
18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
   a) Protocol b) Bandwidth
   c) Reformatting d) Identification
   e) None of these
19. Relocation bits used by relocating loader are specified (generated) by
   a) Relocating loader itself
   b) Linker
   c) Assembler or translator
   d) Macro processor
   e) None of these
20. Which of the following scheduling objectives should be applied to the following: the system should admit jobs to create a mix that will keep most devices busy
   a) to be fair
   b) to balance resource utilization
   c) to obey priorities
   d) to be predictable e) none
21. A task in a blocked state
   a) is executable
   b) is running
   c) must still be placed in the run queues
   d) is waiting for same temporarily unavailable resources
   e) none of these
22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
   a) Upgradability
   b) Upward mobility
   c) Universality
   d) upward compatibility
   e) none of these
23. IP address is currently
   a) 4 bytes long
   b) available in plenty
   c) 6 bytes long
   d) not assigned as it is all used up
   e) none of these
24. Internet data is broken up as
   a) Fixed length packets
   b) Variable length packets
   c) Not packetized
   d) 64 bytes packets
   e) None of these
25. The packets of an internet message
   a) take a predetermined path
   b) take a path based on packet priority
   c) go along different paths based on path availability
   d) take the shortest path from source to destination
   e) none of these
26. By an intranet we mean
   a) a LAN of an organization
   b) a Wide Area Network connecting all branches of an organization
   c) a corporate computer network
   d) a network connecting all computers of an organization and using the internet protocol
   e) none of these
27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
   a) Operation code b) Address
   c) Locator d) Flip-Flop
   e) Register
28. Which of the following systems software does the job of merging the records from two files into one?
   a) Security software
   b) Utility program
   c) Networking software
   d) Documentation system
   e) None of these
29. Fork is
   a) The dispatching of a task
   b) The creation of a new job
   c) The creation of a new process
   d) Increasing the priority of a task
   e) None
30. Computer is free from tiresome and boardroom. We call it
   a) Accuracy b) Reliability
   c) Diligence d) Versatility
   e) None of these
31. CD-ROM is a
   a) Semiconductor memory
   b) Memory register
   c) Magnetic memory
   d) All the above
   e) None of these
32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
   a) RGB monitors b) Plotter
   c) Ink-jet printer
   d) Laser printer e) None
33. Which of the following IC was used in third generation of computers?
   a) SSI b) MSI c) LSI
   d) Both a and b
   e) None of these
34. On which of the following sites can you set up your email account:
   a) www.hotmail.com
   b) www.gre.org c) www.linux.org
   d) www.syvum.com e) none
35. The acronym NOS refers to the :
   a) Operating system on the clients
   b) Network order system, or topology
   c) Operating system of the network
   d) network architecture
   e) none of these
36. the most common network strategies are ______
   a) star, ring, bus, hierarchical
   b) terminal, peer-to-peer, client server
   c) topology, protocol, architecture
   d) host, client, terminal
   e) none of these

Answers

1) a; 2) c; 3) a; 4) d; 5) c; 6) d; 7) b; 8) c; 9) b; 10) b; 11) d; 12) a; 13) d; 14) b; 15) c; 16) d; 17) c; 18) c; 19) b; 20) b; 21) d; 22) d; 23) a; 24) b; 25) c; 26) d; 27) a; 28) b; 29) c; 30) c; 31) d; 32) b; 33) d; 34) a; 35) c; 36) a.